అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
www.navatelangana.com
శనివారం 29-03-2025
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 11 | సంచిక : 87 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

కీలక రంగాల మందగమనం



ఫిబ్రవరిలో 2.9 శాతానికి పరిమితం

ఐదు నెలల కనిష్టానికి జారుడు..

న్యూఢిల్లీ : దేశ ఆర్థిక వ్యవస్థలో మందగమనం స్పష్టమవుతోంది. అత్యంత కీలకమైన ఎనిమిది మౌలిక వసతుల రంగాల ఉత్పత్తి పడకేసింది. 2025 ఫిబ్రవరిలో మౌలిక వసతుల రంగాలు ఉత్పత్తి పెరుగుదల ఏకంగా 2.9 శాతానికి పరిమితమయ్యింది. ఇది ఐదు నెలల కనిష్ఠ స్థాయి కావడం గమనార్హం. గతేడాది సెప్టెంబర్‌లో అత్యల్పంగా 2.4 శాతం వృద్ధి చోటు చేసుకుంది. 2024 ఇదే ...13లో



భూ ప్రళయం

వరుస భూకంపాలతో మరుభూమిగా మయన్మార్

నేలతల్లి ప్రకోపించింది. నిమిషాల వ్యవధిలో రెండు మహా విలయాలు.. కాళ్ల కింద ఉన్న భూమి ఒక్కసారిగా కదిలిపోయింది. చూస్తుండగానే భవనాలు పేకమేడల్లా కుప్పకూలాయి. మృత్యువు వికటాట్టహాసం చేసింది. బాధితుల రోదనలు మిన్నంటాయి. మయన్మార్, థాయిలాండ్‌లలో శుక్రవారం నిముషాల వ్యవధిలో రెండు శక్తివంతమైన భూకంపాలు సంభవించడంతో మహా విధ్వంసం చోటుచేసుకుంది. మయన్మార్‌లో కనీసం 200 మంది పైగా మరణించారు. 800 మందికి పైగా గాయపడ్డారు. థాయిలాండ్‌లోనూ నలుగురు చనిపోయారు. కాగా శిథిలాల కింద అనేక మంది చిక్కుకొని ఉండటంతో మృతులు, క్షతగాత్రుల సంఖ్య అంతకంతకూ పెరుగుతూనే ఉన్నది. ఇరు దేశాలూ అత్యయిక పరిస్థితి ప్రకటించి.. అంతర్జాతీయ సాయం కోసం అర్థించాయి.

థాయిలాండ్‌లోనూ పెను విధ్వంసం

తీవ్రత రిక్టర్ స్కేలుపై 7.5, 6.4, 7.3లుగా నమోదు

మయన్మార్‌లో 200 మందికి పైగా మృతి

800 మందికి పైగా క్షతగాత్రులు


బ్యాంకాక్‌లో మరో నలుగురు మృతి

వేయి పడకల ఆస్పత్రి సహా పేకమేడల్లా కూలిన భవనాలు

శిథిలాల కింద ఇంకెందరో !



నెపిడా, బ్యాంకాక్ : మయన్మార్, థాయిలాండ్‌లలో తీవ్ర భూకంపాలు సంభవించాయి. వీటి తీవ్రత రిక్టర్ స్కేలుపై వరుసగా 7.7, 6.4గా నమోదవగా.. థాయిలాండ్‌లోని బ్యాంకాక్‌లో 7.3గా నమోదైంది. మయన్మార్‌లో మిట్ట మధ్యాహ్నం 12.50 ప్రాంతంలో మొదటిసారి భూమి తీవ్రంగా కంపించింది. తర్వాత వరుసగా ఆరు సార్లు ప్రకంపనలు సంభవించాయి. భూమి తీవ్రంగా కంపించడంతో భవనాల్లోని అలారమ్‌లు మోగాయి. భయాందోళనలతో వేలాదిమంది ప్రజలు రోడ్లపైకి వచ్చారు. మయన్మార్‌లో కనీసం 200 మంది పైగా మరణించారని స్థానిక మీడియా పేర్కొంది. శిథిలాల కింద చిక్కినవారి అచూకీ తెలియకపోవటంతో మృతుల సంఖ్య భారీగా ఉండే అవకాశమున్నది. మయన్మార్, థాయిలాండ్‌లలో అత్యవసర పరిస్థితి విధించారు. బ్యాంకాక్ నగరాన్ని విపత్తు ఏరియాగా ప్రకటించారు. రోడ్లు, వంతెనలు, భవనాలు పెద్ద సంఖ్యలో ధ్వంసమయ్యాయి. డ్యామ్‌ల పరిస్థితి పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది. మొదటిసారి ప్రకంపనలు రాగానే మెట్రో రైలు వ్యవస్థతో సహా మొత్తంగా రవాణా వ్యవస్థనంతటినీ నిలిపివేశారు. గ్రేటర్ బ్యాంకాక్ ఏరియాలో కోటీ 70 లక్షల మందికి పైగా నివసిస్తుంటారు. వీరిలో చాలామంది బహుళ అంతస్తుల భవంతుల్లోనే జీవిస్తుంటారు. స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో బ్యాంకాక్‌లో ప్రకంపనలు సంభవించాయి. ఈ భూకంపాల కారణంగా బ్యాంకాక్‌లో నిర్మాణంలో వున్న 30 అంతస్తుల భవనం పేకమేడలా కుప్పకూలింది. ఈ సంఘటనలో ముగ్గురు మరణించగా, 90 మంది గల్లంతయ్యారని థాయిలాండ్ రక్షణ మంత్రి తెలిపారు. భవన శిథిలాల కింద 80 మంది వరకు చిక్కుకుని వుండవచ్చనే ఆందోళనలు ...13లో



ఆ ప్లేట్ల కదలికలే కారణం

నెపిడా, బ్యాంకాక్ : శుక్రవారం సంభవించిన శక్తివంతమైన భూకంపాలు మయన్మార్, బ్యాంకాక్‌లను కుదిపేశాయి. తీవ్ర స్థాయిలో ఆస్తి నష్టం సంభవించింది. మృతుల సంఖ్య కూడా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అసలు భూకంపం ఎందుకు వస్తుందనే ప్రశ్న వేసుకుంటే..భూ వైజ్ఞానిక పరిశోధనల ప్రకారం..భూగర్భంలో గల టెక్టానిక్ ప్లేట్ల కదలిక కారణంగా భూ గర్భం నుంచి ఒక్కసారిగా విపరీతమైన ...6లో



సీసీఐ భూములను రియల్ ఎస్టేట్‌గా మార్చే కుట్ర

సంపదను కార్పొరేట్ సంస్థలకు బీజేపీ అప్పగిస్తోంది

పరిశ్రమను తెరిపించాలి.. లేదంటే ఎంపీలు రాజీనామా చేయాలి

ఎన్నికల్లో ఇచ్చిన హామీని కేంద్రం నెరవేర్చాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

సీసీఐ సాధన సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట బహిరంగ సభ

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదిలాబాద్ జిల్లా కేంద్రం సమీపంలో మూతపడిన సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) భూములను రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మార్చే కుట్ర జరుగుతోందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. సంపదను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన మూతపడిన సిమెంట్ పరిశ్రమను సందర్శించారు. ఈ సందర్భంగా సీసీఐ సాధన కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో కన్వీనర్ దర్శనాల మల్లేష్ అధ్యక్షతన కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన బహిరంగ సభలో జాన్‌వెస్లీ మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వస్తే సీసీఐని తెరిపిస్తామని స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ హామీనిచ్చారని గుర్తు చేశారు. ఎన్నికల అనంతరం ఈ అంశాన్ని విస్మరించారని విమర్శించారు. సీసీఐకి చెందిన సంపదను అదానీకి కట్టబెట్టడంతోపాటు 700 ఎకరాల భూములను అన్యాక్రాంతం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. పరిశ్రమ పెడతామంటే ఆనాడు రైతులు కేవలం రూ.3వేలకు ఎకరం చొప్పున భూములు ఇచ్చారని, ఇప్పుడు వాటి ధర రూ.కోట్లు పలుకుతున్నాయని తెలిపారు. అలా పోగుపడిన సీసీఐ సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడమే కాకుండా స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ కలిసి ...13లో

సన్నబియ్యంతోపాటు నిత్యావసర సరుకులిస్తాం

ఉగాది రోజున హుజూర్‌నగర్‌లో ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి



3.5 కోట్ల మంది పేదలకు ప్రయోజనం

ఒక్కొక్కరికీ 6 కిలోలు పంపిణీ

బీపీఎల్ కుటుంబాలకు త్రివర్ణ రంగులతో తెల్లరేషన్ కార్డులు

కార్డు లేని అర్హులకూ సన్నబియ్యం పంపిణీ

త్వరలో 30 లక్షల కొత్త తెల్లరేషన్‌కార్డుల మంజూరు : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ప్రజలకు సన్నబియ్యం పంపిణీ చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం విప్లవాత్మకమైందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖమంత్రి కెప్టెన్ ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. నిరుపేదలందరికి సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం భారతదేశంలోనే సరికొత్త అధ్యాయాన్ని ఆవిష్కరించబోతుందని చెప్పారు. తెల్ల రేషన్‌కార్డు లేని పేదలకు కూడా సన్నబియ్యం పంపిణీ చేస్తామన్నారు. ఉగాది పండుగ రోజున హుజూర్‌నగర్ నియోజకవర్గ కేంద్రంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. శుక్రవారం సాయంత్రం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 84 శాతానికిపైగా ప్రజలకు ఆహార భద్రత కల్పించడం స్వతంత్ర భారత దేశంలోనే ఇదే ప్రప్రథమం కావచ్చని అన్నారు. సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభోత్సవ వేదికకు మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ప్రాంగణంగా నామ కరణం చేశామన్నారు. సన్న బియ్యం పంపిణీతో 3.5 కోట్ల మంది లబ్దిదారులకు ...5లో

భావ ప్రకటనా స్వేచ్ఛ ప్రజాస్వామ్యంలో అంతర్భాగం

దాన్ని రక్షించడం కోర్టుల బాధ్యత : సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

కాంగ్రెస్ ఎంపీపై దాఖలైన ఎఫ్ఐఆర్ కొట్టివేత



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

భావ ప్రకటనా స్వేచ్ఛ ప్రజాస్వామ్యంలో అంతర్భాగమని, దాన్ని రక్షించడం కోర్టుల బాధ్యతని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఒక వ్యక్తి అభిప్రాయాలను ఎక్కువ మంది వ్యతిరేకించినా సరే, ఆ వ్యక్తి భావ ప్రకటనా హక్కును తప్పనిసరిగా గౌరవించాల్సిందేనని సుప్రీంకోర్టు పునరుద్ఘాటించింది. గుజరాత్‌కు చెందిన కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్‌గర్హి ఎక్స్‌లో పోస్టు చేసిన వీడియోపై కేసు నమోదు అయింది. ఈ కేసును కొట్టివేయాలని దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా శుక్రవారం సుప్రీం కోర్టు భావ ప్రకటనా స్వేచ్ఛపై కీలక వ్యాఖ్యలు చేసింది. వాక్ స్వాతంత్ర్యం అనేది ప్రజాస్వామ్య సమాజంలో ఒక అంతర్భాగమని.. దాన్ని రక్షించడం కోర్టుల విధి అని స్పష్టం చేసింది.గుజరాత్‌కు చెందిన కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్‌గర్హి గతేడాది డిసెంబర్‌లో తన ట్విట్టర్ ఖాతాలో 46 సెకన్ల ఓ వీడియోను పోస్ట్ చేశారు. ఇమ్రాన్ ఓ పెండ్లి వేడుకకు హాజరైన సందర్భంగా తీసిన వీడియో అది. దానిలో ఇమ్రాన్.. పెండ్లి వేడుక మధ్యలో నుంచి నడిచి వస్తుండగా.. ఆయనపై పూల వర్షం కురిపిస్తారు. ఇక బ్యాగ్రౌండ్‌లో ఓ పద్యం కూడా వినిపిస్తుంది. అయితే ఈ పద్యంలోని పదాలు.. మత విశ్వాసాలు, జాతి ఐక్యతను దెబ్బ తీసేలా ఉన్నాయని ఆరోపిస్తూ ఇమ్రాన్‌పై కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో తనపై నమోదైన కేసును కొట్టివేయాల్సిందిగా కోరుతూ ఇమ్రాన్ గుజరాత్ కోర్టును ఆశ్రయించారు. ఆయన పిటిషన్‌ను విచారించిన కోర్టు తిరస్కరించింది. దీన్ని సవాల్ చేస్తూ ఇమ్రాన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తాజాగా జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ నేతృత్వంలోని ధర్మాసనం ఇమ్రాన్ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా గుజరాత్ పోలీసుల తీరుపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ఎలాంటి నేరం లేకపోయినా అత్యుత్సాహం ప్రదర్శించారని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా వాక్ స్వాతంత్ర్యంపై ...13లో



ఆరోపణలు నిరాధారం

పినరయి విజయన్, ఆయన కుమార్తెపై పిటిషన్‌ల కొట్టివేత

కేరళ హైకోర్టు తీర్పు

తిరువనంతపురం: సీఎంఆర్ఎల్- ఎక్సలాజిక్ లావాదేవీలపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, ఆయన కుమార్తెపై దర్యాప్తు కోరుతూ దాఖలైన పిటిషన్లను శుక్రవారం కేరళ హైకోర్టు కొట్టివేసింది. సీఎం కుమార్తె టి. వీణ యాజమాన్యంలోని ఎక్సలాజిక్ సొల్యూషన్స్ లిమిటెడ్ (ప్రస్తుతం పనిచేయని) , కొచ్చిన్ మినరల్స్ అండ్ రూటైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్)ల మధ్య ఆర్థిక లావాదేవీలు జరిగాయన్న ఆరోపణలపై విజయన్, ఆయన కుమార్తెలపై దర్యాప్తు చేపట్టాలంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే మాథ్యూ కుజల్నాథన్, ఆర్‌టీఐ కార్యకర్త గిరీష్‌బాబు (లేటు) పిటిషన్లు దాఖలు చేశారు.కాంగ్రెస్ ఎమ్మెల్యే కుజల్నాదన్ దాఖలు చేసిన పిటిషన్‌పై ముఖ్యమంత్రి విజయన్, ఆయన ...13లో

కేంద్ర ఉద్యోగులకు డీఏ 2 శాతం



పెంపునకు క్యాబినెట్ ఆమోదం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వంలోని ఉద్యోగులకు డియర్‌నెస్ అలవెన్స్ (కరవు భత్యం), పింఛన్‌దారులకు డియర్‌నెస్ రిలీఫ్ (డీఆర్)ను 2 శాతం పెంపునకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో జనవరి 1 నుంచి చెల్లించాల్సిన డియర్‌నెస్ ...13లో

డబ్ల్యూటీఓకు ట్రంప్ షాక్



నిధులకు కత్తెర..

శ్వేతసౌధం: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరో సంచలన నిర్ణయం తీసుకొన్నారు. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో)కు అమెరికా నుంచి వెళ్లే నిధులకు ఆయన బ్రేక్ వేశారు. ఈ విషయాన్ని ఓ ఆంగ్ల వార్తా సంస్థ వెల్లడించింది. ట్రంప్ ...13లో



మహిళలపై ఏఐ

అతివలే టార్గెట్‌గా డీప్‌ఫేక్

ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానంలో ఆధునిక ఆవిష్కరణలు జరుగుతున్నాయి. ప్రతిరోజూ కొత్త మార్పులు సంతరించుకుంటున్నాయి. ఇందులో భాగంగా వచ్చినవే కృత్రిమమేధ(ఏఐ), డీప్‌ఫేక్. పలు కంపెనీలు, సంస్థలు ఈ ఏఐ వినియోగం వైపునకు మళ్లేందుకు ప్రయత్నిస్తున్నాయి. తమ పనిని సులువు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. మరోపక్క, ఏఐ, డీప్‌ఫేక్‌లతో కొత్త సమస్యలూ వస్తున్నాయి. ముఖ్యంగా, మహిళలను టార్గెట్‌గా చేసుకుంటూ మోసాలు పెరిగిపోతున్నాయి. భారత్‌లో ఇప్పటికే పలువురు మహిళలు దీని బారిన పడ్డారు.మోసగాళ్లు ఏఐ, డీప్‌ఫేక్‌లను దుర్వినియోగం చేస్తూ మహిళల గౌరవాన్ని ప్రమాదంలో పడేస్తున్నారు. ఏఐకి అనుబంధమైన డీప్‌ఫేక్ సహాయంతో కల్పిత చిత్రాలు, వీడియోలు, ఆడియోలు సృష్టిస్తూ వారి ప్రతిష్టను దిగజార్చుతున్నారు.

పెరుగుతున్న మోసాలు

ఎన్నికల తర్వాత తీవ్రం

ఢిల్లీ హైకోర్టుకు కేంద్రం వెల్లడి

న్యూఢిల్లీ : సోషల్ మీడియాలో ఈ తీరు విపరీతంగా పెరిగిపోతున్నది. బాధితుల్లో సాధారణ మహిళల నుంచి హీరోయిన్లు, రాజకీయ ప్రముఖుల వరకూ ఉంటున్నారు. కేంద్రం కూడా ఇదే విషయాన్ని చెప్తున్నది. ఏఐను ఉపయోగించే స్కాం కంటెంట్ పెరుగుతున్నదని పేర్కొన్నది. ఇటీవల ఎన్నికల తర్వాత ఇది పెరిగిపోయిందని వివరించింది. ఈ మేరకు ఢిల్లీ హైకోర్టుకు కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ (ఎంఈఐటీవై) స్టేటస్ రిపోర్ట్‌ను సమర్పించింది. మహిళలను లక్ష్యంగా చేసుకుంటూ ఎన్నికలలో డీప్‌ఫేక్‌లు పెరిగిపోయాయి. ఇది కొంత మంది వ్యక్తుల విషయంలో తీవ్రమైంది. "డీప్‌ఫేక్ అనేది ఫేస్‌స్వాప్, వాయిస్ క్లోన్ వంటిది కావచ్చు. దానికి ఒక నిర్దిష్టమైన నిర్వచనం లేదు" అని తన నివేదికలో కేంద్రం వివరించింది. ఇలాంటి కేసులలో ఆడియోను గుర్తించటమూ సవాలుగా ఉంటుందని పేర్కొన్నది. డీప్‌ఫేక్ గుర్తించటం, అర్థం చేసుకోవటం గురించి యూజర్లలో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాల్సిన అవసరమున్నదని స్పష్టం చేసింది.

దేశంలో డీప్‌ఫేక్ టెక్నాలజీ, ఏఐపై నియంత్రణ లేకపోవటాన్ని సవాలు చేస్తూ ఇప్పటికే పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ నేపథ్యంలో కేంద్రం నుంచి ఇలాంటి అభిప్రాయాలు వెలువడ్డాయి. ఏఐ ప్రయోజనాలతో మనం ఉత్సుకతతో ఉన్నప్పటికీ.. దాని వల్ల కలిగిగే ప్రమాదాలపై మనం దృష్టిని కోల్పోతున్నామని న్యాయ నిపుణులు ముంతాజ్ భల్లా తెలిపారు. ఇందుకు ప్రస్తుతమున్న చట్టాలు సరిపోవనీ, ఎందుకంటే డీప్‌ఫేక్‌లు, ఏఐల గురించి ఆలోచించని రోజుల్లో వాటిని రూపొందించారని అన్నారు. దేశంలో మహిళలను ఫేస్‌లను మార్చుతూ, ఆర్టిస్టుల వర్క్‌ను హరిస్తూ కల్పిత కంటెంట్ తయారవుతున్నదనీ, ఈ విషయంలో తప్పక నియంత్రణ అవసరమని అన్నారు. ఇప్పుడిది ప్రపంచ సమస్యగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి కంటెంట్ ఎవరైనా చేస్తే సదరు మహిళ, ఆర్టిస్ట్ నుంచి సమ్మతి తప్పనిసరి అని పిటిషనర్లలో ఒకరి తరఫున వాదిస్తున్న లాయర్ చెప్పారు. డీప్‌ఫేక్‌పై గతేడాది డిసెంబర్‌లో నిర్వహించిన తొలి సమావేశంపు అంశాలను నివేదిక వివరించింది. సమాచార రక్షణ చట్టాలు, డీప్‌ఫేక్‌ల విషయంలో సమ్మతి మార్గదర్శకాలు, కంటెంట్ మోడరేషన్ వంటి అంశాలపై దృష్టిపెట్టినట్టు పేర్కొన్నది. సంప్రదింపుల ప్రక్రియలో భాగంగా ఫ్యాక్ట్‌చెకర్లు, టెక్‌సంస్థలు, డీప్‌ఫేక్ బాధితులను ఆహ్వానించినట్టు వివరించింది. బాధితుల ప్రొఫైల్‌లు, లక్ష్యంగా చేసుకునే ఆబ్జెక్టివ్‌లు వంటి నమూనాల గుర్తింపు కోసం నేర సమాచార విశ్లేషణను ఉపయోగించాలన్న సూచన వచ్చిందని నివేదిక పేర్కొన్నది. ఐటీ రూల్స్, డీపీడీపీ యాక్ట్ వంటి ప్రస్తుతం ఉనికిలో ఉన్న లీగల్ ఫ్రేమ్‌వర్క్‌ను పున:సమీక్షించటం, అదనపు ప్రతిపాదనల పైనా సమావేశంలో చర్చించినట్టు వివరించింది. అలాగే, ఈ ఏడాది జనవరిలోనూ కమిటీ మరొక సమావేశమూ జరిగింది. అందులో సర్వీసు ప్రొవైడర్లు, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ నుంచి వచ్చిన సలహాలు, సూచనలను తీసుకున్నట్టు నివేదిక పేర్కొన్నది.

గతంలో ఆదేశం

డీప్‌ఫేక్‌లు, ఏఐల విషయంలో దాఖలైన పిటిషన్ల విషయంలో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని ఢిల్లీ హైకోర్టు గతేడాది నవంబర్‌లో సంబంధిత మంత్రిత్వ శాఖను ఆదేశించింది. పిటిషనర్లు చేసిన సూచనలనూ పరిశీలించాలని వివరించింది. యూరోపియన్ యూనియన్ వంటి దేశాలలోని చట్టబద్ధమైన ప్రక్రియ, నిబంధనలను పరిగణలోకి తీసుకోవాలని సదరు కమిటీని న్యాయమూర్తులు జస్టిస్ తుషార్ రావ్ గెడెల, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశించింది.





కనీస పెన్షన్ రూ.9వేలకు పెంచాలి

- ప్రభుత్వాల వైఖరితో పెన్షనర్ల ఇబ్బందులు
- తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.కృష్ణమూర్తి
- ఈపీఎఫ్ కార్యాలయం వద్ద పెన్షనర్ల మహాధర్నా

నవతెలంగాణ-అంబర్‌పేట

ఈపీఎస్ పెన్షనర్ల కనీస పెన్షన్ రూ.9వేలకు పెంచాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరితో పెన్షనర్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ బర్కత్‌పురలోని ఈపీఎఫ్ కార్యాలయం వద్ద పెన్షనర్లు మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పి.కృష్ణమూర్తి మాట్లాడుతూ.. ఈపీఎస్ -95 పెన్షనర్ల కనీస పెన్షన్ రూ.9వేలు డీఏతో కలిపి చెల్లించాలన్నారు. హయ్యర్ పెన్షన్‌పై అభ్యంతరాలు లేకుండా అందరికీ సమానంగా అమలు చేయాలని కోరారు. ఈపీఎస్-95 పెన్షనర్లకు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య సదుపాయం కల్పించాలని, సీనియర్ సిటిజన్లకు రైలు ప్రయాణం రాయితీలు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రిటైర్డ్ పెన్షన్ నిధులను దగ్గర ఉంచుకొని కొర్రీలు పెడుతూ ఇబ్బందులకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు పెన్షనర్స్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఎం.నరహరి, ఎంటీ చారి, నాగేశ్వర్‌రావు, జనార్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నపై మండలి చైర్మెన్ ఆగ్రహం

- తీరు మార్చుకోకుంటే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరిక
- నిబంధనల ప్రకారమే స్కూల్ నడుపుతున్నా : ఏవీఎన్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్


ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తీరు మార్చుకోకుంటే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాసనమండలిలో గురువారం బీజేపీ సభ్యుడు ఏవీఎన్ రెడ్డి పిటిషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం తీన్మార్ మల్లన్న తనపై ఆరోపణలు చేశారని అన్నారు. తాను నడుపుతున్న ప్రయివేటు పాఠశాలలో నర్సరీకి రూ.41,975 ఫీజును తీసుకుంటున్నారని అన్నారని గుర్తు చేశారు. అయితే అడ్డగోలుగా ఫీజులను వసూలు చేస్తున్నారంటూ చెప్పడం సరైంది కాదన్నారు. శాసనమండలి డిప్యూటీ చైర్మెన్ బండ ప్రకాశ్ ఆయన మనవడి కోసం నర్సరీలో చేర్పించేందుకు ఓ ప్రయివేటు పాఠశాలను సంప్రదిస్తే రూ.మూడు లక్షలు అడిగారంటూ వివరించారని అన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులను వసూలు చేస్తాయని వివరించారు. తాను నడిపే పాఠశాలల్లో అడ్డగోలుగా ఫీజులను వసూలు చేయడం లేదన్నారు. అయితే కొన్ని ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యావ్యాపారం చేస్తుండొచ్చునీ, కొందరు అధిక ఫీజులను వసూలు చేస్తుండొచ్చని అన్నారు. శ్రీచైతన్య, నారాయణ విద్యాసంస్థలు అలా చేస్తున్నాయని వివరించారు. తాను జీవో నెంబర్ ఒకటి ప్రకారం సొసైటీని ఏర్పాటు చేసుకుని ప్రయివేటు పాఠశాలలను నిబంధనల ప్రకారం నడుపుతున్నానని అన్నారు. తన పేరును ప్రస్తావించి, అడ్డగోలుగా ఫీజులను వసూలు చేస్తున్నారంటూ తీన్మార్ మల్లన్న వ్యాఖ్యానించడం సరైంది కాదన్నారు. విద్యాకమిషన్ నివేదిక ఆధారంగా ఫీజుల నియంత్రణ కోసం ప్రభుత్వం చట్టం చేస్తే దాన్ని పాటిస్తామని అన్నారు. దాన్ని అతిక్రమించి అధిక ఫీజులను వసూలు చేస్తే అప్పుడు తన గురించి మాట్లాడాలని చెప్పారు. దీనిపై తీన్మార్ మల్లన్న అభ్యంతరం వ్యక్తం చేశారు. సభలో ఉన్న సభ్యులు ప్రయివేటు విద్యాసంస్థలను నడుపుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని ఎలా పరిరక్షిస్తారని ప్రశ్నించారు. చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కల్పించుకుని సభలోని సభ్యుల పేర్లను ప్రస్తావించడం సరైంది కాదన్నారు. ఆ పేర్లను రికార్డుల నుంచి తొలగించామని అన్నారు. భవిష్యత్తులోనూ సభ్యుల పేర్లను ప్రస్తావించొద్దని సూచించారు. తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ రికార్డుల నుంచి వారి పేర్లను తొలగించొద్దని అన్నారు. ఈ వైఖరి సరైంది కాదని తీన్మార్ మల్లన్నపై చైర్మెన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరిగి సమాధానం ఇచ్చేందుకు ఆయన ప్రయత్నిస్తే ఇలాగే వ్యవహరిస్తే భవిష్యత్తులో క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సి వస్తుందని చైర్మెన్ హెచ్చరించారు. తీసుకోండి అని మల్లన్న అనడం గమనార్హం.

ఉపాధి పనిప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలి

- టెంట్, తాగునీళ్లు అందుబాటులో ఉంచాలి : వ్యకాస

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో గ్రామీణ ఉపాధి హామీ పని ప్రదేశాల్లో చట్ట ప్రకారం కనీస సౌకర్యాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవాలనీ, నీడ కోసం టెంట్, దాహార్తిని తీర్చుకునేందుకు తాగునీటిని అందుబాటులో ఉంచాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.నాగయ్య, ఆర్.వెంకట్రాములు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో పగటిపూట ఉష్ణోగ్రతలు 38 నుండి 42 డిగ్రీల మధ్య నమోదవుతుండటంతో పనిప్రదేశాల్లో కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఎండల నేపథ్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను, ప్రాథమిక చికిత్స కోసం మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచాలని కోరారు. దూరపు ప్రాంతాల పనికి వెళ్లి రావడానికి కూలీలకు లోకల్ ఆటో కిరాయిలు ఇవ్వాలని చట్టం చెబుతున్నప్పటికీ పాలకులు పట్టించుకోకపోవడాన్ని తప్పుబట్టారు. ఇటీవల జహీరాబాద్ నియోజకవర్గం ఝరాసంగ్ మండలంలో చాంద్‌బి అనే ఉపాధి కూలీ రవాణా సౌకర్యం లేక పనిప్రదేశానికి నడుచుకుంటూ వెళ్లే క్రమంలో కుప్పకూలిపోయిన అంశాన్ని ప్రస్తావించారు. ఉపాధి కూలీలకు పనిప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రాజెక్ట్ అధికారులకు ఎండీఓలకు మార్గదర్శకాలు జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.



సైబర్ భద్రతాపై విస్తృత చర్చలు

- ట్రాయ్ ప్రత్యేక వర్క్‌షాప్‌లో అధికారులు

నవతెలంగాణ - హైదరాబాద్

టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయంలో టెలికం వినియోగదారుల సంస్థల సామర్థ్య పెంపుదలపై వర్క్‌షాప్ జరిగింది. శుక్రవారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సైబర్ భద్రతా అవగాహనపై వివరణాత్మక చర్చలు జరిగాయి. టెలి కమ్యూనికేషన్స్, ప్రసార నియమాలు, వినియోగదారుల హక్కులు, ట్రాయ్ నిబంధనలు, సంప్రదింపులు, సైబర్ భద్రత తదితర అంశాలపై పలు ప్రభుత్వ, ప్రయివేటు రంగ సంస్థల అధికారులు ప్రసంగించారు. ట్రాయ్ సంయుక్త సలహాదారు విఎస్ రాజు స్వాగతోపన్యాసం చేయగా.. తమిళనాడు, కర్నాటక, కేరళ, మహారాష్ట్రలకు చెందిన భారతీ ఎయిర్‌టెల్, బిఎస్ఎన్ఎల్, జియో, వొడాఫోన్ ఐడియా ప్రతినిధులు పాల్గొని పలు అంశాలపై ప్రజెంటేసన్లు ఇచ్చారు. 'సైబర్ మోసాలు, భద్రత అవగాహనలోనే ఉంది' అనే అంశంపై ఆర్‌బీఐ హైదరాబాద్ ఏజీఎం, డీఓఎస్ తేజదీప్త బెహెరా పలు ఆచరణాత్మక కేసులతో వివరించారు. సైబర్ మోసాలను ఎలా నివారించవచ్చునో అనేదానిపై డీఓటీ డీడీజీ సెక్యూరిటీ హేమంత్ రథ్వే ప్రజెంటేషన్ ఇచ్చారు.

శాంతికుమారితో కేంద్ర వాణిజ్య శాఖ అధికారుల భేటి

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై చర్చ



నవతెలంగాణ-హైదరాబాద్

భారత ప్రభుత్వ పరిశ్రమ, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక శాఖ ఉన్నతాధికారి సుకృతి లిఖి నేతృత్వంలో ఉన్నతస్థాయి అధికారుల బందం శుక్రవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఇతర సీనియర్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై చర్చించారు. సులభతర వ్యాపార విధానాన్ని అమలు చేయడంలో తెలంగాణ రాష్ట్రం అగ్రగామిగా ఉందని సీఎస్ వారికి వివరించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో వేగవంతమైన వాణిజ్య, వ్యాపారాభివద్ధికి అనువైన వాతావరణాన్ని సష్టిస్తున్నామని చెప్పారు.

ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యాపార రంగానికి అనువైన వాతవరణాన్ని సష్టించడంతో పాటు నాణ్యమైన ఉత్పత్తి విధానం, ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడంపై దష్టి సారించామన్నారు. వాణిజ్య వ్యాపార రంగాన్ని మెరుగుపరిచేందుకు ఇప్పటికే సంస్కరణలు చేపట్టామని పేర్కొన్నారు. వాణిజ్య అవసరాలకు నిర్మించే బిల్డింగ్ ప్లాన్ అనుమతులను వేగవంతం చేయడానికి 'బిల్డ్ నౌ', భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి 'భూ భారతి' వంటి కొత్త వ్యవస్థలు అమలులోకి తెచ్చామన్నారు. పారిశ్రామిక వేత్తల నుంచి ప్రభుత్వ విధానాలపై ప్రశంసలు అందుతున్నాయని సీఎస్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలు సమర్థవంతంగా అమలు పరిచేందుకు నిరంతర ఉన్నత స్థాయి అధికారుల పర్యవేక్షణ ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వలన హైదరాబాద్ ప్రధాన ఆర్థిక శక్తి కేంద్రంగా ఎదిగిందని గుర్తు చేశారు. అటవీశాఖ, వణ్యప్రాణుల చట్టాల అనుమతులు ఆలస్యమవుతున్నాయనీ, వాటి వలన అభివద్ధి కార్యకలాపాలకు అడ్డంకులు ఏర్పడుతున్నాయనే విషయాన్ని సీ ఎస్ కేంద్ర ప్రభుత్వ అధికారుల దష్టికి తీసుకువచ్చారు. అటవీ ప్రాంత పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తూనే అనుమతులు వేగవంతం చేసే దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సీఎస్ అభిప్రాయపడ్డారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలులో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో నిలిచిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రధాన సంస్కరణలు, కార్యక్రమాలు భాగున్నాయంటూ సుకతి లిఖి రాష్ట్ర ప్రభుత్వ అధికారులను అభినందించారు. పరిశ్రమలు ఏర్పాటు చేసెందుకు వీలుగా భూమి లభ్యత కోసం జిఐఎస్ డేటాబేస్ కలిగి ఉండటం, పారిశ్రామిక, వాణిజ్య ప్లాట్‌ల కోసం ఫ్లోర్ ఏరియా నిష్పత్తిని తొలగించడం, భవనాల అనుమతులు, ఉమ్మడి తనిఖీలలో థర్డ్ పార్టీల ఎంప్యానెల్‌మెంట్, భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికేషన్, విద్యుత్, నీటి కనెక్షన్‌లు, ఫ్యాక్టరీ ట్రేడ్ లైసెన్సుల ఆమోదం, పునరుద్ధరణ వంటి అనేక రంగాలలో తెలంగాణ ప్రభుత్వ విధానాలు సమర్థవంతంగా ఉన్నాయని ఆమె కితాబునిచ్చారు.

ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేష్ రంజన్, రవిగుప్తా, సంజయ్ కుమార్, పీసీసీఎఫ్ డోబ్రియాల్, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, ఫైర్ సర్వీసెస్ డీజీ నాగిరెడ్డి, సీడీఎంఏ అధికారి టీకే శ్రీదేవి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కార్మికులకు, ఉద్యోగులకు రేవంత్‌రెడ్డి మోసం

సర్కారు నమ్మకాన్ని కోల్పోయింది : బీఆర్‌టీయూ సమావేశంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కార్మికులను, ఉద్యోగులను సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేశారనీ, అందుకే కాంగ్రెస్ సర్కారు నమ్మకాన్ని కోల్పోయిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్(బీఆర్టీయూ) రాష్ట్ర అధ్యక్షులు జి.రాంబాబు యాదవ్ అధ్యక్షతన ఆ యూనియన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పల్లారాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ..ప్రతిరంగాన్ని కేసీఆర్ లోతుగా అధ్యయనం చేసి కార్మికులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించారనీ, జీతాలను పెద్ద ఎత్తున పెంచారని గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి మాత్రం కార్మికులకు, ఉద్యోగులకు ఎన్నో హామీలిచ్చి వాటిని విస్మరించారని విమర్శించారు. సమావేశంలో మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, బీఆర్టీయూ రాష్ట్ర నాయకులు పి.నారాయణ, ఎల్.రూప్‌సింగ్, బి.దానకర్ణాచారి, నగేశ్‌యాదవ్, అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.భారతి, ఆశా యూనియన్ అధ్యక్షులు ఆర్.సంతోష, నాయకులు కాశిరెడ్డి, సునీత, బాబాయమ్మ, మచ్చ నర్సింహులు, సిలివేరు ప్రభాకర్, తిరుపతి, నిర్మలారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో 23 తీర్మానాలను చేశారు. అందులో ముఖ్యమైనవి ఇలా..ఉపాధి హామీ పనులను 150 రోజులకు పెంచి రూ.350 వేతనం హామీని అమలు చేయాలి. పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలి. పంచాయతీ సిబ్బందికి కనీస వేతన హామీని నెరవేర్చాలి. ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్ డీఏలను విడుదల చేసి 12వ పీఆర్సీని అమలు చేయాలి. ఆశాలు, అంగన్‌వాడీలు, ఫీల్డు అసిస్టెంట్లకు వెంటనే వేతనాలు పెంచాలి. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి రెండు పీఆర్సీలను విడుదల చేయాలి. ఆటో, హమాలీ, అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి. ఆటో డ్రైవర్లకు ఏటా రూ.12 వేలు ఇవ్వాలి. అసంఘటిత కార్మికుల సామాజిక భద్రత కోసం చట్టం తేవాలి. బీడీ కార్మికులకు చేయూత పెన్షన్ ఇవ్వాలి. హ్యాకర్లకు గుర్తింపు కార్డులిచ్చి బ్యాంకు ద్వారా వడ్డీలేని రుణ సదుపాయాన్ని కల్పించాలి. ప్రతి మండల కేంద్రంలోనూ హమాలీనగర్, పట్టణ కేంద్రంలో ఆటోనగర్‌ను ఏర్పాటు చేయాలి. గల్ఫ్‌కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి.

జలమండలి, మెడికల్, హెల్త్ విభాగంలో పనిచేసే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలను పెంచాలి. 73 షెడ్యూల్ ఎంప్లాయిామెంట్స్‌లో కనీస వేతనాలను సవరించాలి. భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి. రాష్ట్రంలో కేంద్రం తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయొద్దు. యూనివర్సిటీల్లో బోధనేతర సిబ్బంది వేతనాలను పెంచాలి. ప్రయివేటు పరిశ్రమలకు 24 గంటల కరెంట్ ఇవ్వాలి. మున్సిపాల్టీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు తగ్గిస్తూ తీసుకొచ్చిన జీవోను ఉపసంహరించుకోవాలి. బాసర ఐఐటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు చట్టపరంగా జీతాలివ్వాలి. హోటల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి. 108,104, బస్తీ దవాఖానా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి.

కేంద్రం దృష్టికి టీడబ్ల్యూజేఎఫ్ వినతి

జర్నలిస్టుల రైల్వేపాస్‌ల పునరుద్ధరణపై రాజ్యసభలో ఎంపీ వద్దిరాజు ప్రస్తావన : మంత్రి అశ్వనీవైష్ణవ్‌కు వినతి




నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఖమ్మం జిల్లా కమిటీ విజ్ఞప్తిని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర రాజ్యసభ దృష్టికి గురువారం తీసుకెళ్లారు. రైల్వేలో కరోనా ముందు వరకు జర్నలిస్టులకు ఇచ్చిన 50 శాతం రాయితీని పునరుద్ధరించాల్సిందిగా ఎంపీ కోరారు. ఈ మేరకు టీడబ్ల్యూజేఎఫ్ ఈనెల 24వ తేదీన రాజ్యసభ, లోక్‌సభ ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, రామసహాయం రఘురాంరెడ్డికి ఆన్‌లైన్‌లో వినతిపత్రాలు పంపింది. ఈ విషయమై పార్లమెంటులో ప్రస్తావించడంతో పాటు రైల్వేశాఖ మంత్రి దృష్టికి సైతం తీసుకువెళ్లాల్సిందిగా టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీ ఫోన్‌లో విన్నవించింది. దీనిపై ఇరువురు ఎంపీలు సానుకూలంగా స్పందించారు. కచ్చితంగా పార్లమెంటు దృష్టికి జర్నలిస్టుల రైల్వేపాస్‌ల విషయాన్ని తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు వద్దిరాజు రవిచంద్ర రాజ్యసభలో గురువారం ప్రస్తావించారు. ఆ వెంటనే రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు తన చాంబర్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. గతంలో అక్రిడేటెడ్ జర్నలిస్టులకు రైల్వేలో 50% రాయితీపై ప్రయాణించే సౌకర్యం ఉండేదనీ, దానిని కోవిడ్ లాక్‌డౌన్ సందర్భంగా నిలిపివేశారని తెలిపారు. తిరిగి రైలు రాయితీని పునరుద్ధరించాలని కోరారు. జర్నలిస్టులలో చాలా వరకు పేద, మధ్య తరగతి ఆదాయ వర్గాలకు చెందిన వారేననీ, తమ విధి నిర్వహణలో భాగంగా నిత్యం రైళ్లలో ప్రయాణాలు చేస్తుంటారన్నారు. కోవిడ్ కారణంగా రద్దుచేసిన రాయితీ పథకాన్ని తిరిగి పునరుద్ధరించి వారిపై ఆర్థిక భారం పడకుండా సాయం చేయాల్సిందిగా రైల్వే మంత్రిత్వ శాఖను కోరారు. రైలు ప్రయాణాల సందర్భంగా గతంలో మాదిరిగా 50 శాతం రాయితీని పునరుద్ధరించాల్సిందిగా పాత్రికేయులు, వారి సంఘాలు మూడేండ్లుగా కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేస్తుండడాన్ని ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు గుర్తు చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగో స్థంభంగా సమాజానికి తమ విలువైన సేవలందిస్తున్న జర్నలిస్టులకు రైల్వే టిక్కెట్లలో 50 శాతం రాయితీ కల్పించడమనేది సమంజసం, సముచితమని ఎంపీ రవిచంద్ర చెప్పారు. అలాగే, రాజ్యసభలో మాట్లాడిన తర్వాత ఎంపీ వద్దిరాజు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను పార్లమెంటులోని ఆయన ఛాంబర్‌లో కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంటనే సానుకూలంగా స్పందిస్తూ అధికారులకు తగు ఆదేశాలిచ్చారు.

రైతు ఉద్యమ అణచివేతను సహించం

కేంద్రానికి ఎస్‌కేఎం హెచ్చరిక



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పంజాబ్ రైతు ఉద్యమంపై అణచివేతను సహించబోమని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) కేంద్రాన్ని హెచ్చరించింది. రైతు ఉద్యమంపై పోలీసుల అణచివేత ధోరణిని నిరసిస్తూ శుక్రవారం హైదరాబాద్‌లోని ఎస్‌వీకే వద్ద ఎస్‌కేఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. గతంలో రైతాంగానికి ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమానికి తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎస్‌కేఎం రాష్ట్ర కన్వీనర్లు టి.సాగర్, పశ్యపద్మ, జక్కుల వెంకటయ్య, మండల వెంకన్న, మామిడాల బిక్షపతి, నాగిరెడ్డి, ప్రసాదన్న మాట్లాడుతూ 350 మంది అన్నదాతలను జైలుపాలు చేశారని విమర్శించారు. ఖనోరి, శంభు సరిహద్దులలో శాంతియుతంగా ఆందోళన, పోరాటాలు నిర్వహిస్తున్న రైతాంగంపై దాడులు, దౌర్జన్యాలు, నిర్బంధాలకు గురి చేయడమేంటని ప్రశ్నించారు. కార్పొరేట్లపై ఉన్న ప్రేమ అన్నం పెట్టే అన్నదాతపై కేంద్ర ప్రభుత్వానికి లేదని విమర్శించారు. రైతులు నిర్మించుకున్న టెంట్లు, వేదికలను బుల్డోజర్లతో కూల్చివేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రాక్టర్లు, ట్రాలీలను పోలీసు బలగాలతో బలవంతంగా తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. పంజాబ్, చండీగఢ్, ఢిల్లీ సరిహద్దుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రమైన అణచివేతకు పాల్పడుతున్నాయని విమర్శించారు. ప్రజా స్వామ్యాన్ని కాపాడాలనీ, రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఇప్పటికైనా ఆయా ప్రభుత్వాలు బేషజాలకు పోకుండా ఎస్‌కేఎం కేంద్ర నాయకత్వంతో చర్చలు జరపాలనీ, తద్వారా రైతాంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు లెల్లెల బాలకృష్ణ, బి. రాము, బి.ప్రసాద్, బి.పద్మ, జి. ఝాన్సీ, సూర్యం, అరుణ, అనురాధ, మహేష్, నాగరాజు, ఆసిఫ్, శివబాబు, నాగరాజు, జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏఐసీసీ డ్రాఫ్టింగ్ కమిటీ భేటికా హాజరైన భట్టి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో వచ్చేనెల 8, 9 తేదీల్లో ఏఐసీసీ కీలక సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో కాంగ్రెస్ వ్యూహాలు, విధానాలను, రాజకీయ నిర్ణయాలను రూపొందించేందుకు ఏఐసీసీ ఏర్పాటు చేసిన డ్రాఫ్టింగ్ కమిటీలో సభ్యుడైన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సభ్యులుగా నియమించింది. 15 మంది సభ్యులతో కూడిన ఈ డ్రాఫ్టింగ్ కమిటీ శుక్రవారం న్యూఢిల్లీ అక్బర్‌రోడ్‌లోని ఏఐసీసీ కార్యాలయంలో సమావేశమైంది. గతేడాది డిసెంబర్‌లో కర్ణాటకలోని బెల్గామ్‌లో జరిగిన 'నవ సత్యాగ్రహం' సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకనుగుణంగా ఈ సమావేశంలో నిర్ణయాలుంటాయని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వెల్లడించారు.

సమ్మెలో కూడా నిరంతర ఎల్పీజీ సరఫరా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సమ్మెలో కూడా ఎల్పీజీని ప్రజలకు నిరంతర సరఫరా చేస్తామని ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు (ఐఓసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్) ఒక ప్రకటనలో తెలిపాయి. సదరన్ రీజియన్ బల్క్ ఎల్పీజీ ట్రాన్స్‌పోర్ట్ ఓనర్స్ అసోసియేషన్‌కు చెందిన రవాణాదారుల సమ్మె నేపథ్యంలో ముందస్తు చర్యలు తీసుకున్నట్టు పేర్కొన్నారు. వినియోగ దారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ప్రస్తుతం ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల బాట్లింగ్ ప్లాంట్లలో బల్క్ ఎల్పీజీ నిల్వలు తగినంత ఉన్నాయనీ, పంపిణీ కేంద్రాలు యథావిధిగా పని చేస్తాయని పేర్కొన్నారు. ఆయిల్ కంపెనీలు రవాణా దారుల కోసం చేపట్టిన చర్యలను కాదని కొంతమంది సమ్మెకు పిలుపునిచ్చారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సహకారంతో నిరంతర సరఫరా కొనసాగిస్తామని పేర్కొన్నారు.

సివిల్ సర్వెంట్ల 'నియంత్రణ' సంస్థలు

అధిపతులుగా నియామకాల్లో వారికే ప్రాధాన్యత

- ఆయా రంగాల నిపుణులకు సన్నగిల్లుతున్న అవకాశాలు
- సంస్థాగత స్వాతంత్ర్యం నీరు గారే ప్రమాదం : రాజ్యాంగ నిపుణుల హెచ్చరిక



న్యూఢిల్లీ : భారత్‌లో నియంత్రణ సంస్థల (రెగ్యులేటరీ బాడీస్)కు మంచి ప్రాధాన్యతే ఉన్నది. ఆయా రంగాలకు సంబంధించి వీటి పని తీరు చాలా ముఖ్యం. అయితే, ఈ సంస్థల అధిపతుల నియామకాలను కొందరు నిపుణులు ప్రశ్నిస్తున్నారు. సివిల్ సర్వెంట్లకే ప్రాధాన్యతనివ్వటాన్ని వారు లేవనెత్తుతున్నారు. ప్రభుత్వ, ప్రయివేటు రంగాలలోని నిపుణులకు అవకాశమున్నా.. వారిని నియమించకపోవటాన్ని నిపుణులు ప్రశ్నిస్తున్నారు. దీంతో నియంత్రణ సంస్థల స్వతంత్రత, లక్ష్యం నీరుగారిపోతుందని హెచ్చరిస్తున్నారు.

ముఖ్యంగా, ఐఏఎస్‌లతో పాటు ఆ పదవిని చేపట్టి పదవీ విరమణ చేసిన వారు వీటికి అధిపతులుగా నియమితులవుతూ, వాటిని నియంత్రిస్తూ అధికారాన్ని చలాయిస్తున్నారు. ఫలితంగా నియంత్రణ సంస్థల అసలు స్ఫూర్తి దెబ్బ తింటున్నదని రాజ్యాంగ నిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియంత్రణ సంస్థలపై సివిల్ సర్వెంట్ల ఆధిపత్యం ఇలాగే కొనసాగితే వాటి సంస్థాగత స్వాతంత్ర్యానికే ముప్పు వాటిల్లే ప్రమాదమున్నదని వారు హెచ్చరిస్తున్నారు.

వాస్తవానికి దేశంలో ఆర్థికం, ప్రజా జీవనం, ఆరోగ్యం, ఆహార భద్రత, పర్యావరణం.. ఇలా కొన్ని ప్రత్యేక రంగాలకు సంబంధించి పలు నియంత్రణ సంస్థలు ఉంటాయి. ఉదాహరణకు ఆర్థిక రంగానికి సంబంధించి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ), సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ), ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్‌డీఏఐ) వంటివి, ఫుడ్ సేఫ్టీకి సంబంధించి ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ), ఆరోగ్య సంరక్షణకు సంబంధించి సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్‌సీఓ) వంటివి ఉంటాయి. ఇవన్నీ ప్రభుత్వ రంగ సంస్థలు, ఏజెన్సీలు. ఇవి సంబంధిత రంగాల్లో ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని పారదర్శకతకు పెద్ద పీట వేస్తూ భద్రత, నాణ్యతలే లక్ష్యంగా పని చేస్తుంటాయి. ప్రజా ప్రయోజనాలను కాపాడటంలో ఇవి కీలక పాత్రను వహిస్తాయి.

ఇలాంటి నియంత్రణ సంస్థలకు స్వయం ప్రతిపత్తిని, స్వాతంత్ర్యాన్ని కల్పించటానికి, ప్రభుత్వ జోక్యం నుంచి రక్షించటానికి, కీలక సిబ్బందిని నియమించుకోవటానికి ప్రతిభావంతుల సమూహాన్ని విస్తరించారు. సంబంధిత రంగాలలోని నిపుణులు, ప్రయివేటు రంగ నిపుణులు, న్యాయవ్యవస్థలోని పదవీ విరమణ చేసిన సభ్యులు.. వీరిని ఈ రెగ్యులేటరీ ఇన్‌స్టిట్యూషన్‌లను నడిపేందుకు నియమించవచ్చు. ఈ నియంత్రణ సంస్థలు ప్రభుత్వ సంస్థలు, ఏజెన్సీలే అయినా.. వాటిలో ప్రభుత్వ జోక్యం పరిమితం మాత్రమే. ఎలా అంటే.. ప్రభుత్వాలు విధానాలు మాత్రమే రూపొందిస్తాయి. వాటిని నియంత్రణ సంస్థలు అమలు చేస్తాయి. ఈ విధంగా నియంత్రణ సంస్థలు స్వతంత్రంగా పని చేస్తాయి.

ఈ విధంగా సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ తొలి చైర్‌పర్సన్‌గా ఒక ఆర్థికవేత్త నియమితులయ్యారు. అలాగే, టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్).. ఒక రిటైర్డ్ జడ్జి చైర్మెన్‌షిప్‌లో ఏర్పాటు చేశారు. ఆ తర్వాత చైర్‌పర్సన్‌గా మాజీ బ్యాంకర్ నియమితులయ్యారు. సీసీఐ పూర్తిస్థాయి చైర్‌పర్సన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి నియమితులయ్యారు. ఈ విధంగా ఒక ప్రభుత్వ, ప్రయివేటు రంగానికి చెందిన నిపుణులను నియంత్రణ సంస్థల హెడ్‌లుగా నియమించటం జరుగుతోంది. ఈ సంస్థలకు కొంత మంది సివిల్ సర్వెంట్లు నాయకత్వం వహిస్తున్నప్పటికీ.. రాజకీయ జోక్యం నుంచి రక్షించాలనే వాదనలూ ఉన్నాయి. ఇందులో భాగంగా నియంత్రణ సంస్థ అధిపతిగా నియమితులైనవారికి భవిష్యత్తులో ప్రభుత్వ వ్యవస్థలో ఎలాంటి ఉద్యోగానికీ అర్హులు కారు. దీంతో ప్రభుత్వ, ప్రయివేటు రంగాల నుంచి ఎలాంటి ప్రయోజనాన్ని ఆశించకుండా పని చేసేందుకు ఇది వీలు కల్పిస్తుంది. అయితే, నియంత్రణ సంస్థల హెడ్‌లుగా ఐఏఎస్‌లు, పని చేసి పదవీ విరమణ పొందినవారికే ఎక్కువ ప్రాధాన్యత దక్కుతున్నది. వివిధ రంగాల్లోని నిపుణులకు ప్రాధాన్యత తగ్గుతున్నది. గత కొన్నేండ్లుగా చూస్తే ఇదే పరిస్థితి కనిపిస్తున్నది. అయితే, ఉన్నతాధికారులుగా విధులు నిర్వర్తించేవారు కూడా రాజకీయ ఒత్తిళ్ళ, ప్రభావానికి గురవుతున్నారని నిపుణులు చెప్తున్నారు.





ముగిసిన ప్రజా చైతన్య పాదయాత్ర

సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం :సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు

రామన్నపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

నవతెలంగాణ-రామన్నపేట

రామన్నపేట మండల సమగ్ర అభివృద్ధి, ప్రజా సమస్యలు పరిష్కారం అయ్యే వరకు సీపీఐ(ఎం) పోరాటం ఆపదని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. సీపీఐ(ఎం) యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కమిటీ ఆధ్వర్యంలో మండల సమగ్రాభివృద్ధి, ప్రజా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆరు రోజుల పాటు 24గ్రామాల్లో నిర్వహించిన ప్రజా చైతన్య పాదయాత్ర శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ లాల్ బహదూర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చెరుపల్లి మాట్లాడుతూ.. రామన్నపేట పాత నియోజక వర్గంగా, పాత తాలూకాగా విరాజిల్లి ఇప్పుడు మండలంగా మాత్రమే ఉండి అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. నూతనంగా ఏర్పాటయ్యే నియోజకవర్గాల పునర్విభజనలో రామన్నపేటను నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. శిథిలావస్థకు చేరిన ప్రభుత్వాస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా మారుస్తామని దశాబ్ద కాలంగా ప్రభుత్వం చెబుతూ కాలమెళ్లదీస్తోందని విమర్శించారు. రెండు దశాబ్దాలు గడుస్తున్నా పిలాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి కాలువలు పూర్తి కావడం లేదని, కాలువలను పూర్తిచేసి రైతుల భూములకు సాగు నీరందించాలన్నారు. ఇప్పటికీ మండలంలో ఏ గ్రామానికీ కనీసం బస్సు సౌకర్యం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

పాదయాత్ర సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమ కార్యాచరణ కొన సాగుతూనే ఉంటుందని చెప్పారు. రామన్నపేట శాసనసభ నియోజక వర్గం కావాలంటే పోరాటం చేయా ల్సిం దేనన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షులు మేక అశోక్‌రెడ్డి, పాదయాత్ర సారథి జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డు పల్లి వెంకటేశం, మండల కార్యదర్శి వర్గ సభ్యులు బోయిని ఆనంద్, కందుల హనుమంతు పాల్గొన్నారు.

వాగ్దానాల అమలు బాధ్యత

కాంగ్రెస్ ప్రభుత్వానిదే

కేంద్రం నుంచి రావాల్సిన నిధుల కోసం పోరాడాలి : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వం పోరాటం చేయాలని కోరారు. శుక్రవారం హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జాగ్రత్తగా ఉండాల్సిన అవసరముందని సూచించారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను తిరిగి చేయకుండా సజావుగా పాలన సాగించాలని కోరారు. బీఆర్ఎస్ అప్పులు చేసిందంటూ చెప్పే కాలం ముగిసిందన్నారు. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తున్నదనే దానిపై దృష్టి పెట్టాలని చెప్పారు. 2025-26 వార్షిక బడ్జెట్ పేదలకు అనుకూలమైన బడ్జెట్ కాదన్నారు. అప్పులు ఎక్కువగా ఉన్నాయనీ, హామీలు కూడా ఎక్కువగానే ఉన్నాయని వివరించారు. ఎన్నికల్లో వాగ్దానాలను విపరీతంగా చేశారనీ, వాటిని నెరవేర్చడానికి తిప్పలు పడుతున్నారని అన్నారు. రైతు రుణమాఫీ గుదిబండగా మారిందని, సాంకేతిక కారణాల వల్ల చాలామందికి మాఫీ జరగలేదని వివరించారు. సాంకేతిక సమస్యలను పరిష్కరించి, రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఆసరా పెన్షన్లను రూ.నాలుగు వేలకు పెంచాలనీ, మహిళలకు నెలకు రూ.2,500 చెల్లించాలనీ, కళ్యాణలక్ష్మి కింద ఆడపిల్లల పెండ్లికి రూ.లక్ష నగదుతోపాటు తులం బంగారం ఇవ్వాలని కోరారు. బడ్జెట్‌లో కేటాయించిన నిధులను పూర్తిగా ఖర్చు చేయాలని సూచించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులవాటాను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. ఒకవేళ ఇవ్వకుంటే కలిసి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈసారి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు బాగా జరిగాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సర్వీసుల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సుమారు 4.50 లక్షల మంది పనిచేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో రెండు కోట్ల మంది కార్మికులున్నారనీ, వారికి కనీస వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

జర్నలిస్టులను పేదల కేటగిరిలో పరిగణించాలి

జర్నలిస్టులను పేదల కేటగిరిలో పరిగణించాలనీ, వారికి సంక్షేమ పథకాలను అమలు చేయాలని కూనంనేని సూచించారు. వారికి కూడా కనీస వేతనం అమలు చేయాలని కోరారు. సుప్రీంకోర్టు చెప్పిందనే పేరుతో జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వకుండా ఉండటం మంచిది కాదనీ, పేదల కేటగిరిలో వారికి ఇండ్ల స్థలాలను మంజూరు చేయాలని సూచించారు. జర్నలిస్టుల ఆరోగ్య బీమా తదితర సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు జర్నలిస్టుల కోసం పాలసీ తేవాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. ఏ ఈజం లేదనీ, టూరిజం మాత్రమే ఉందని చంద్రబాబు అనేవారని గుర్తు చేశారు. అందుకే తమకు కోపం వచ్చేదన్నారు. కానీ పెట్టుబడి లేనిది టూరిజమనీ, లాభాలు వస్తాయనీ, ఉపాధి కల్పించేందుకు అవకాశముంటుందనీ, టూరిజంను అభివృద్ధి చేయాలని తాను రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలు చేశానని అన్నారు. దీన్ని కొందరు దురుద్దేశంతో ప్రచారం చేస్తున్నారని చెప్పారు. ఆయన చెప్పింది నిజమని నమ్మడానికి కమ్యూనిస్టులకు 30 ఏండ్లు పట్టిందంటూ చంద్రబాబు వ్యాఖ్యానించారని అన్నారు. మనిషి ఉన్నంత కాలం కమ్యూనిజం ఉంటుందని చెప్పారు. కమ్యూనిజాన్ని, టూరిజాన్ని వేరువేరుగా చూడాలన్నారు. చైనా కూడా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తుందని గుర్తు చేశారు.

తెలంగాణకు కేంద్రం అన్యాయం : నెల్లికంటి సత్యం

పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వకుండా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తెలంగాణకు అన్యాయం చేస్తున్నదని సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం విమర్శించారు. తెలంగాణ పట్ల కేంద్రం సవతి తల్లి ప్రేమను చూపిస్తోందని అన్నారు. రాష్ట్రంలో వడగండ్ల వాన, ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్యపద్మ, బాగం హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ జీఏడీ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్

సిబ్బందిని కొనసాగించాలి

- తెలంగాణరాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర సచివాలయంలో సాధారణ పరిపాలనా శాఖ(డీఏడీ)లో పనిచేస్తున్న ఆపరేటర్లు, డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ల గడువు ఈ నెల 31 ముగిస్తున్న నేపథ్యంలో వారిని కొనసాగిస్తూ ఉత్తర్వులివ్వాలనీ, ఆయా విభాగాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని కూడా కొనసాగించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.వెంకటేశ్, కె.కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు పద్మశ్రీ, కార్యదర్శి కె.కుమారస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి వినతిపత్రం అందజేశారు. సచివాలయంలోని జీఏడీలో 20 ఏండ్లుగా 100 మందికిపైగా ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నిబద్ధతతో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి తక్షణం కొనసాగింపు ఉత్తర్వులు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. వారికి ప్రతినెలా జీతాలు ఆలస్యంగా అందుతున్నాయనీ, చట్టబద్ధ సౌకర్యాలు కల్పించట్లేదని ఎత్తిచూపారు. కనీస వేతనాలు సకాలంలో పెరగడం లేదని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. సచివాలయంతో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి కొనసాగింపు ఉత్తర్వులు తక్షణం ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రైతు ఉద్యమంపై నిర్బంధాన్ని ఆపాలి

హామీల అమలు కోసం ఐక్య ఉద్యమాలు : ఎస్‌కేఎం రాష్ట్ర కన్వీనర్ టి.సాగర్ పిలుపు



రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు

నవతెలంగాణ- మహబూబ్‌నగర్/ విలేకరులు

పంజాబ్ రాష్ట్రంలో రైతు ఉద్యమంపై నిర్బంధాన్ని ఆపాలి.. అరెస్టు చేసిన రైతులను విడుదల చేయాలి.. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నూతన జాతీయ వ్యవసాయ మార్కెట్ విధాన పత్రం ఉపసంహరించుకోవాలి.. వ్యవసాయ ఉత్పత్తుల కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలి..' అని డిమాండ్ చేస్తూ.. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక వ్యవసాయ విధానాలకు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా దేశవ్యాప్త పిలుపులో భాగంగా శుక్రవారం రాష్ట్రంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. రైతాంగానికి రాత పూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) రాష్ట్ర కన్వీనర్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐక్య ఉద్యమాలకు రైతాంగం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో చేపట్టిన నిరసనలో ఆయన ప్రసంగించారు. భగవంత్‌సింగ్ మాన్ నేతృత్వంలోని పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు.. పోలీసులు జగ్జీత్ సింగ్ దల్లెవాల్, శ్రవాన్ సింగ్ పాంధర్ సహా 350 మంది రైతు నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేసి జైలులో పెట్టారని తెలిపారు. ఖనౌరి, శంభు సరిహద్దులలో ఆందోళన చేస్తున్న రైతుల టెంట్లు, వేదికలను బుల్డోజర్లతో కూల్చివేసి, ట్రాక్టర్ ట్రైర్లు, ట్రాలీలు ఇతర ఉపకరణాలను బలవంతంగా తొలగించడం ప్రజాస్వామ్య వ్యవస్థలో సరైనది కాదన్నారు. ఈనెల 3, 4 తేదీలలో పంజాబ్ అంతటా ఇలాంటి అణచివేత కొనసాగిందని తెలిపారు. మార్చి 5 నుంచి చండీగఢ్‌లో ప్రకటించిన నిరసన ప్రదర్శన, వారం రోజుల ధర్నాను అడ్డుకోవడానికి రైతు నాయకులు బల్బీర్‌సింగ్ రాజేవాల్, రుల్దు సింగ్ మాన్సా వంటి నాయకులు సహా 800 మందికి పైగా కార్యకర్తలను అరెస్టు చేసి జైలులో పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి వరుస పోలీసు అణచివేతలపై నిరసనలు తెలుపుతున్నట్టు చెప్పారు. దేశంలో ప్రతిరోజూ 31 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నందున, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించడం ద్వారా రైతుల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు.

సంయుక్త కిసాన్ మోర్చా నాగర్‌కర్నూల్ జిల్లా కన్వీనర్ ఎం.శ్రీనివాసులు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిరసన తెలిపారు. రైతాంగానికి గిట్టుబాటు ధర ఇవ్వాలంటూ నారాయణపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన రాతపూర్వకమైన ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని వైయస్సార్ చౌక్‌లో నిరసన తెలిపారు.

ఖమ్మం కలెక్టరేట్ ఎదుట రైతులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్, అఖిల భారత ఐక్య కిసాన్ సంఘం జిల్లా అధ్యక్షులు మలీదు నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, అఖిల భారత ఐక్య కిసాన్ సంఘం రాష్ట్ర నాయకులు గుర్రం అచ్చయ్య మాట్లాడారు. రైతాంగానికి కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ మూడ్ శోభన్ డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ఎస్‌కెఎంఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. నిర్మల్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఏఐడబ్ల్యూఏ జిల్లా కార్యదర్శి నూతన్‌కుమార్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.

అరెస్టు చేసిన పంజాబ్ రైతులను విడుదల చేయాలి

అరెస్టు చేసిన పంజాబ్ రైతులను విడుదల చేయాలని ఎస్‌కేయం నిజామాబాద్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. నిజామాబాద్ ఎన్టీఆర్ చౌరస్తాలో ధర్నా చేశారు. దీనికి తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ అధ్యక్షత వహించారు.

ఆకలికి అందం ఉండదు


'ఆకలికి అందం ఉంటుందా, రామ...రామ..' అంటాడు ఆత్రేయ ఒక సినిమా పాటలో. ఆయన చెప్పలేదు కానీ ఆకలికి కులం, మతం, దేశం అంటూ కూడా ఉండదు. అంతే కాదు తినే ఆహార పదార్థాలను వ్యర్థం చేయడంలో కూడా ఇవేవి అడ్డురాలేదంటున్నది ఐక్యరాజ్యసమితి నివేదిక.

ప్రపంచంలో 78 కోట్ల మంది ప్రజలు ఆకలితో అల్లాడుతుంటే ,ఆహార పదార్థాలలో ఐదో వంతు డ్రయినేజీలోకి పోతున్నాయి. ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన ఫుడ్ వేస్ట్ ఇండెక్స్ రిపోర్టు, 2024లో ఈ విషయాలు ప్రస్తావించింది. ప్రపంచంలో పారబోస్తున్న ఆహారపదార్థాలు 1.05 బిలియన్ టన్నులు. ఇది మొత్తం ఆహారపదార్థాలలో 19 శాతం.

ఇంత ఆహారం వ్యర్థం ఎక్కడి నుంచి అవుతున్నది అని ప్రశ్నించుకుంటే, ప్రధానంగా కుటుంబాలలోని వంటిళ్ళు కారణంగా చెపుతున్నది ఈ నివేదిక. స్టార్ హొటల్స్, రెస్టారెంట్లది తరువాతి స్థానం అంటున్నది. ఆహారపదార్థాలు వ్యర్థం చేయటంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య కూడా తేడా వున్నది. గ్రామీణ ప్రాంతాలలో తక్కువగాను, పట్టణ ప్రాంతాలలో ఎక్కువగాను ఈ వ్యర్థం జరుగుతున్నది. అంతేగాక, ఆహారపదార్థాల రవాణాలో కూడా 13శాతం ఉపయోగపడకుండా పోతున్నది.

ఇక భారతదేశాన్ని దష్టిలో పెట్టుకుంటే మన దేశానిది రెండో స్థానం. 78 లక్షల టన్నుల ఆహారపదార్థాలు దేశంలో వ్యర్థంగా పోతున్నాయి. ప్రతి ఏటా తలసరి 55 కిలోల ఆహారం వధా అవుతున్నది. ఈ వధా దేశంలోని ప్రజలందరి కడుపు నిండిన తరువాత పరిస్థితి కాదు. దాదాపు 20 కోట్ల మంది ఆహారం లభించక పస్తులతో రోజులు వెళ్ళబుచ్చుతున్నారు.

ఆ నివేదిక ఇండియాను, చైనాను ఈ విష యంలో వేలెత్తి చూపిందో కానీ, అమెరికాలో ఈ దేశాల కంటే ఎక్కువగా ఏడాదికి తలసరి 73 కిలోల ఆహారం పారబోస్తున్నారు. ఆహారం ఎందువల్ల వ్యర్థం అవుతున్నదో కూడా ఈ నివేదిక పరిశీలనగా చెప్పింది. అవసరానికి మించి వండటం, రిఫ్రిజిరేటర్ లాంటి ఆహారం నిల్వచేసే సదుపాయాలు లేకపోవటం వంటి వాటిని నివేదికలో పేర్కొంది.



ఇటువంటి వ్యర్థాలను తగ్గించటానికి జీరో హంగర్ ఇండెక్స్, రిటైల్, వినియోగదారుల స్థాయిలో ఈ వ్యర్థాన్ని తగ్గించే ఎస్‌డీజీ 12.3 వంటి కార్యక్రమాలను యూఎన్ఓ తీసుకుంటున్నది.

ఓలా, ఉబర్‌కు షాక్

కేంద్రం 'సహకార్ ట్యాక్సీ' యాప్

త్వరలో అందుబాటులోకి : కేంద్ర హోంమంత్రి అమిత్‌షా



న్యూఢిల్లీ : ప్రయివేటు ట్యాక్సీ సంస్థలైన ఓలా, ఉబర్‌లకు పోటీగా కేంద్రం సహకార్ ట్యాక్సీ పేరుతో కొత్త తరహా యాప్‌ను అందుబాటు లోకి తీసుకువచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది. ఈ సహకార్ ట్యాక్సీ యాప్ గురించి కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా పార్లమెంటు వేదికగా ఒక ప్రకటన చేశారు. ఓలా, ఉబర్‌లకు చెక్ పెట్టి.. డ్రైవర్లకు లాభం చేకూర్చేందుకు ఈ యాప్‌ను తీసుకురాబోతున్నట్టు అమిత్ షా చెప్పారు. ఈ సహకార్ ట్యాక్సీ యాప్ కూడా ఓలా, ఉబర్ సంస్థల లాగే ప్రయాణికులకు సర్వీసులు అందిస్తుందన్నారు. బైక్‌లు, ట్యాక్సీలు, ఆటోలు నడిపే డ్రైవర్లు.. ఈ సహకార్ యాప్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చని అమిత్ షా వెల్లడించారు. ఈ సహకార్ ట్యాక్సీ యాప్.. మిగిలిన ట్యాక్సీ సర్వీసుల లాగా డ్రైవర్ల దగ్గరి నుంచి ఎలాంటి ఛార్జీలూ వసూలు చేయదన్నారు. ప్రయాణికులు చెల్లించిన మొత్తం డబ్బు డ్రైవర్లకే అందుతుందని తెలిపారు. తమ నినాదం సహకార్ సే సమృద్ధి అనీ, దానిని కచ్చితంగా అమలు చేసేందుకు ప్రయత్నిస్తు న్నామని అమిత్ షా చెప్పారు. ఈ సహకార్ యాప్ తయారీ కోసం.. కేంద్రం గత మూడున్నరేండ్లుగా కృషి చేసిందనీ, డ్రైవర్లకు లాభాలు అందించే ఈ యాప్‌ను త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు.

సహకార్ యాప్‌ను స్వాగతిస్తున్నాం : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఊబర్, ఓలా, రాపిడో, మొదలైన వాటికి ప్రత్యామ్నాయంగా సహకార్ యాప్‌ను ప్రారంభించబోతున్నట్టు పార్లమెంట్‌లో హోంమంత్రి అమిత్‌షా ప్రకటన చేయడాన్ని స్వాగతిస్తున్నట్టు తెలంగాణ పబ్లిక్, ప్రయివేటు రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్- సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.శ్రీకాంత్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతిపాదిత యాప్ ప్రారంభంలోనే డ్రైవర్లు, ప్రయాణీకుల కష్టాలను, లోపాలను పరిష్కరించి, గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలను కూడా యాప్‌లో చేర్చాలని కోరారు. అలాంటి యాప్‌ను అభివృద్ధి చేయాలని ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ ఎనిమిదేండ్లుగా పోరాటం చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈనెల 24న నిర్వహించిన చలో పార్లమెంట్ కార్యక్రమంలో అది కూడా ఒక ప్రధాన డిమాండ్ అని తెలిపారు. సహకార్ యాప్ ప్రారంభం సీఐటీయూ విజయమేనని పేర్కొన్నారు. ఏఐఆర్‌టీ డబ్ల్యూఎఫ్ దీనిపై దేశవిదేశ సాంకేతిక నిపుణులతో సంప్రదింపులు జరిపిందనీ, 8 ఏండ్ల కిందట నాగ్‌పూర్‌లో జాతీయ స్థాయి వర్క్‌షాపును కూడా నిర్వహించిన విషయాన్ని గుర్తుచేశారు. ఆ తర్వాత కేరళ ప్రభుత్వం కేరళ రాష్ట్ర మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ద్వారా "సవారి" అనే యాప్‌ను అభివృద్ధి చేసిందని తెలిపారు. ప్రయివేటు యాప్ ఆధారిత కంపెనీలు డ్రైవర్ల రక్తాన్ని పీల్చుతూ, ప్రయాణీకులను వివిధ విధాలుగా దోపిడీ చేస్తున్నాయని పేర్కొన్నారు. కంపెనీల దోపిడీ, వేధింపులకు వ్యతిరేకంగా, ఆ కంపెనీలకు అనుబంధంగా ఉన్న డ్రైవర్లు ఢిల్లీతో సహా అనేక నగరాల్లో గతంలో సమ్మెలు చేశారనీ, కొంతమంది డ్రైవర్లు ఆత్మహత్యలు కూడా చేసుకున్నారని ప్రస్తావించారు. డ్రైవర్లు, ప్రయాణీకుల ప్రయోజనం కోసం యాప్‌ను ఎలా అభివృద్ధి చేయాలనే దానిపై కేంద్రానికీ, ప్రధానికి అన్ని విషయాలతో ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ వినతిపత్రాలను కూడా ఇచ్చిందని తెలిపారు. ఎట్టకేలకు సహకార్ యాప్‌ను ప్రారంభించడాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు.



31లోపు జీఎస్టీ చెల్లించిన వారికి

పన్ను మినహాయింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈ నెల 31లోపు మదింపు చేసిన పన్ను మొత్తాన్ని చెల్లించిన వారికి అపరాధ రుసుం, పన్ను మినహాయింపు ఇస్తున్నట్టు కస్టమ్స్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ సందీప్ ప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. 2018 నుంచి 20 వరకు జీఎస్టీ పన్ను చెల్లింపుల్లో ఏర్పడ్డ వ్యత్యాసాలకు ఈ మినహాయింపు వర్తిస్తుందని తెలిపారు. అప్పీలేట్ అథారిటీ, కోర్టులో ఛాలెంజ్ చేసిన మదింపు ఉత్తర్వులకు కూడా ఈ పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు. పన్ను పెద్ద సంఖ్యలో పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు తమ పరిధిలోని వాణిజ్య పన్నుల అధికారులను సంప్రదించాలని సూచించారు.

సంపాదకీయం

నల్ల సముద్రంలోకి ఒప్పందం?

నల్ల సముద్ర ప్రాంతంలో నౌకల స్వేచ్ఛా రవాణా, ఇంథన వ్యవస్థలపై అమెరికా, రష్యా, ఉక్రెయిన్ మధ్య కుదిరిన ఒప్పందం ఇబ్బందుల్లో పడిందా? అంటే వస్తున్న వార్తలు దాన్నే సూచిస్తున్నాయి. పరస్పరం ఇంథన వ్యవస్థల మీద దాడులు చేసుకోకూడదనేది దీనిలో ప్రధానాంశం. దీన్ని ఉల్లంఘించినట్లు రెండు దేశాలు బుధవారం నాడు పరస్పరం ఆరోపించుకున్నప్పటికీ అమెరికా రంగంలోకి దిగితే పరిస్థితి చక్కపడవచ్చు. అయితే తమ వ్యవసాయ, ఎరువుల ఎగుమతి లావాదేవీలకు సంబంధించి తమ రిజర్వు, వ్యవసాయ బాంకులు, ద్రవ్యసంస్థల మీద ఉన్న ఆంక్షలను ఎత్తివేస్తేనే తమవైపు నుంచి ఒప్పందం అమలు జరుగుతుందని అంటూనే మార్చి 18 నుంచి తాము ఎలాంటి దాడులు చేయలేదని రష్యా అంటోంది. అదంతా నిజం కాదు, ఆరోజు నుంచి ఇప్పటికి ఎనిమిది ఇంథన వసతులపై దాడి చేసినట్లు ఉక్రెయిన్ ప్రత్యారోపణ చేయగా క్రిమియాలోని గ్యాస్ నిల్వలతో సహా తమ పైప్‌లైన్ల మీద జెలెన్‌స్కీ సేనలు దాడి చేసినట్లు పుతిన్ యంత్రాంగం ప్రకటించింది. మధ్యవర్తిగా ఉన్న అమెరికా వైపు నుంచి ఇది రాసిన సమయానికి ఎలాంటి స్పందన, ప్రకటన వెలువడలేదు. ఈ ఒప్పందంతో ఐరోపా యూనియన్‌కు ఎలాంటి ప్రమేయం, పాత్ర లేదు. రష్యా సైనిక చర్యకు ప్రతిగా అమెరికాతో పాటు ఐరోపా దేశాలు కూడా ఆంక్షలు అమలు జరుపుతున్నాయి. బేషరతుగా ఉక్రెయిన్ నుంచి పుతిన్ సేనలు వైదొలిగితేనే తాము వాటి ఎత్తివేత గురించి ఆలోచిస్తామని ఐరోపా యూనియన్ ఇప్పటికే ప్రకటించింది.దీని గురించి అమెరికా నుంచి ఎలాంటి ప్రతిపాదన వెలువడలేదు. అందువలన ఏం జరుగుతుంది, ఒప్పందం ఎలా అమలు జరుగుతుందనేది ఎవరూ చెప్పలేని స్థితి. ఇంథన వ్యవస్థలపై పరస్పరం దాడులు జరుపుకున్నాయా లేదా అన్నదాన్ని పక్కన పెడితే మిగిలిన దాడులు యధాప్రకారం కొనసాగుతూనే ఉన్నాయి.




> ఉక్రెయిన్‌లో శాంతిస్థాపనకు పశ్చిమ దేశాల దళాలను నియోగించాలన్న ప్రతిపాదనకు చైనా మద్దతు తెలిపినట్లు చెప్పటానికి ఆధారాలేమిటో తెలియదు. ఈ సంక్షోభం త్వరగా పరిష్కారం కావాలని చైనా గతంలోనే బహిరంగంగా ప్రకటించింది తప్ప ఎవరికీ మద్దతు ఇవ్వలేదు, ఖండించనూ లేదు. అయితే పశ్చిమదేశాల ఆంక్షలను ఖాతరు చేయకుండా రష్యా నుంచి చమురు, ఇతర ఉత్పత్తులను దిగుమతి చేసుకున్నది, అదే భారత్ కూడా చేసింది. శాంతి స్థాపక వ్యవహారాల చొరవలో తమ ప్రమేయం గురించి షీ జిన్‌పింగ్ వాకబు చేస్తున్నట్లు జర్మన్ పత్రిక ఒకటి రాసిన ఆధారం లేని వార్తను బట్టి చైనా వైఖరి మారుతున్నట్లు

అలాగే ఉక్రెయిన్‌లో శాంతికి సుముఖంగా ఉన్న కూటమి పేరుతో గురువారం నాడు పారిస్‌లో సమావేశమైన దేశాల వైఖరి ఏమిటన్నది తెలియాల్సి ఉంది. రష్యా కొత్త డిమాండ్లను ముందుకు తెచ్చిందని, ఉక్రెయిన్ ప్రతిపాదించిన ముప్పయి రోజుల కాల్పుల విరమణ గురించి స్పందించలేదని సమావేశం జరగక ముందే ఫ్రెంచి అధ్యక్షుడు మక్రాన్ ధ్వజమెత్తాడు. ఉక్రెయిన్‌కు మరో రెండు బిలియన్ల యూరోల మిలటరీ సహాయాన్ని ఫ్రాన్సు ప్రకటించింది. ఆయుధాలను వేగంగా తరలించటానికి నిర్ణయించింది. ఇది అగ్నికి ఆజ్యం పోసే వ్యవహారం తప్ప మరొకటి కాదు. బ్రిటన్, ఫ్రాన్సు దేశాల చొరవతో జరుగుతున్న పారిస్ సమావేశం ఉక్రెయిన్‌లో శాంతి స్థాపక దళాల ఏర్పాటు గురించి చర్చించనుంది. అక్కడ నాటో దళాలకు అలాంటి పాత్రను అంగీకరించేది లేదని రష్యా ముందుగానే స్పష్టం చేసింది. తాజా దాడులను ఉటంకిస్తూ మాస్కో వైపు నుంచి నిజమైన శాంతికి ప్రయత్నాలు లేవని అందువలన కొత్త ఆంక్షలు అమలు జరపాలని పారిస్ సమావేశానికి వెళ్లే ముందు జెలెన్‌స్కీ చెప్పాడు. ఉక్రెయిన్‌లో యుద్ధం ముగిసిన వెంటనే రష్యాతో పశ్చిమ దేశాల సంబంధాలు సాధారణ స్థితికి రావటానికి దశాబ్దాలు పడుతుందని, ఎందుకంటే విశ్వాసం లేకపోవటమే అన్న నాటో ప్రధాన కార్యదర్శి మార్క్ రూటే వ్యాఖ్య పరిస్థితి సంక్లిష్టతను వెల్లడిస్తున్నది. అలాంటి ఐరోపా దేశాలు అమెరికా మాటలను నమ్మి పుతిన్‌తో రాజీకి వస్తాయా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఈ పూర్వరంగంలో పారిస్ సమావేశం పరిస్థితిని సమీక్షించటం తప్ప వెంటనే నూతన కార్యాచరణను చేపట్టే అవకాశాలు పరిమితం.

ఇదిఇలా ఉండగా ఉక్రెయిన్ పోరులో రష్యా అతిపెద్ద భాగస్వామిగా ఉన్న చైనా వైఖరి మార్చుకుంటున్నట్లు కొంతమంది ఊహాగానాలతో మీడియా వార్తలను నింపుతున్నారు. భారత్, చైనా తటస్థంగా ఉన్నాయి తప్ప రష్యాకు మద్దతు ఇచ్చాయనటమే పెద్ద వక్రీకరణ. రాజకీయాల్లో ఏమైనా జరగవచ్చు. అమెరికా-రష్యా రాజీపడి దగ్గరైతే ఐరోపా దేశాలు చైనాకు దగ్గర కావచ్చని గతంలోనే జోశ్యాలు వెలువడ్డాయి. ఉక్రెయిన్‌లో శాంతిస్థాపనకు పశ్చిమ దేశాల దళాలను నియోగించాలన్న ప్రతిపాదనకు చైనా మద్దతు తెలిపినట్లు చెప్పటానికి ఆధారాలేమిటో తెలియదు. ఈ సంక్షోభం త్వరగా పరిష్కారం కావాలని చైనా గతంలోనే బహిరంగంగా ప్రకటించింది తప్ప ఎవరికీ మద్దతు ఇవ్వలేదు, ఖండించనూ లేదు. అయితే పశ్చిమదేశాల ఆంక్షలను ఖాతరు చేయకుండా రష్యా నుంచి చమురు, ఇతర ఉత్పత్తులను దిగుమతి చేసుకున్నది, అదే భారత్ కూడా చేసింది. శాంతి స్థాపక వ్యవహారాల చొరవలో తమ ప్రమేయం గురించి షీ జిన్‌పింగ్ వాకబు చేస్తున్నట్లు జర్మన్ పత్రిక ఒకటి రాసిన ఆధారం లేని వార్తను బట్టి చైనా వైఖరి మారుతున్నట్లు చిత్రిస్తున్నాయి. ఐరోపా వ్యవహారాల్లో చైనా ప్రమేయానికి అమెరికా అంగీకరిస్తుందా? దాని అనుయాయులుగా ఉన్న పశ్చిమ ఐరోపా ధనిక దేశాలు సరేనంటాయా? ఇప్పటికైతే ఊహాజనితమే, అదే జరిగితే ప్రపంచ రాజకీయ చిత్రపటమే మారిపోతుంది !

ప్రజాస్వామ్య పరిరక్షణ - లౌకిక కూటమి ఏర్పాటు ఆవశ్యకం



రామ్ పునియానీ

అనేక దేశాల్లో ప్రజాస్వామ్యంలోని దాదాపు అన్ని అంశాలు మెరుగుపడడంకంటే మరింత అధ్వాన్నంగా మారుతున్నాయనే అంశాన్ని, వీ.డెమ్ (ప్రభుత్వ నాణ్యతను అధ్యయనం చేసే స్వీడన్‌కు చెందిన సంస్థ) భారతదేశం గురించిన నివేదికను హిందూపత్రిక ప్రచురించింది.నిరంకుశ దేశాల్లో అత్యంత ఘోరమైన ప్రభావానికి గురైన అంశాలుగా భావప్రకటనా స్వేచ్ఛ, స్వచ్ఛమైన ఎన్నికల నిర్వహణ, పౌరస్వేచ్ఛల గురించి ఆ నివేదిక ప్రత్యేకంగా పేర్కొంది.ఆ నివేదిక భారతదేశంలో నెలకొన్న వాస్తవాల్ని క్లుప్తంగా తెలియజేస్తుంది.అన్నిటినీ మించి అత్యంత దారుణమైన విషయం ఏమిటంటే, నేడు భారతదేశం తన మైనార్టీల పట్ల వ్యవహరిస్తున్న దారుణమైన తీరును కండ్లారా చూస్తుంది.రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్-భారతీయ జనతా పార్టీ(ఆరెస్సెస్-బీజేపీ) కూటమి, మైనార్టీల్ని బెదిరించడానికి ఈ మధ్యకాలంలో హిందూ పండుగలు, మతపరమైన సమావేశాల్ని సాధనాలుగా ఉపయోగించు కుంటుంది. శ్రీరామనవమి, హోలీ ఉత్సవాల్లో, కుంభమేళాల్లో ఈ ధోరణి స్పష్టంగా కనిపించింది.

గత పదేండ్లకాలంగా నిరంకుశ పాలనా ధోరణి, అనేక అంతర్గత వైరుధ్యాలు ఉన్నప్పటికీ ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసి 'ఇండియా కూటమి'గా ఏర్పడ్డానికి ప్రధానమైన కారకంగా మారింది. కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ పాల్గొన్న భారత్ జోడో యాత్ర, భారత్ జోడో న్యాయ యాత్రల మొత్తం ప్రభావం,ఎద్దులు కర్నాటక, భారత్ జోడో అభియాన్ లాంటి సామాజిక గ్రూపులు ఏర్పాటు చేసిన వేదికలతో 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై ప్రభావం పడి, 400 స్థానాల లక్ష్యాన్ని ఏర్పరచుకున్న బీజేపీ ఆశలు పటాపంచలయ్యాయి. రాష్ట్ర శాసనసభ ఎన్నికల కోసం వేదికను ఏర్పాటు చేయడంలో ఇండియా కూటమి పురోగతి ఆశించిన స్థాయిలో సాగలేదనే మాట వాస్తవం. మహారాష్ట్ర, హర్యానా శాసనసభలకు జరిగిన ఎన్నికల్లో ఇండియా కూటమి భాగస్వామ్యపార్టీలకు ఎదురుదెబ్బ తగలడానికి గల కారణాలలో ఇదొక కారణం.ఆరెస్సెస్‌కు చెందిన అన్ని అనుబంధ సంస్థలు, బీజేపీ కోసం పనిచేయడానికి తిరిగి చేసిన ప్రయత్నం,కూటమి భాగస్వామ్యపార్టీల ఓటమికి అదనపు కారణం. బీజేపీకి స్వంతంగా గెలవగలిగే సత్తా ఉంది కాబట్టి తమ పార్టీకి ఆరెస్సెస్ సహాయం



అవసరం లేదనే విషయాన్ని బీజేపీ అధ్యక్షుడు జే.పీ.నడ్డా వ్యాఖ్యానించినప్పటికీ, ఇది కొత్తదైన విషయమేమీ కాదు.

లోక్‌సభ ఎన్నికల తర్వాత ఇండియా కూటమి తనను తాను బలోపేతం చేసుకోవాల్సిన ముఖ్యమైన అవసరాన్ని పరిగణనలోకి తీసుకోనట్టు కనపడుతుంది.ఈ కూటమిలో భావజాలపరంగా బలంగా ఉన్న భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) లేక సీపీఐ(ఎం) ఈ విషయంపై రెండో ఆలోచనను కలిగి ఉండడం గమనించదగ్గ విషయం."ప్రతిపక్ష ఇండియా కూటమి లోక్‌సభ ఎన్నికల కోసం ఏర్పడింది, రాష్ట్రాల ఎన్నికల కోసం ఏర్పడలేదని" సీపీఐ(ఎం) సమన్వయకర్త ప్రకాశ్‌కారత్ వ్యాఖ్యానించాడు.ఆయన లౌకిక ప్రతిపక్ష పార్టీల విశాల వేదిక కోసం పిలుపునిచ్చాడు.ఈ కూటమిని విశాలమైన దృష్టికోణం నుండి చూడాలనీ, అది కేవలం ఎన్నికల రాజకీయాల ద్వారా మాత్రమే అది నిలిపివేయ బడదని కూడా కారత్ అన్నాడు.

బీజేపీ కచ్చితంగా ఒక ఫాసిస్ట్ పార్టీ కాదని అనేకమంది వామపక్ష మేధావులు భాష్యాలు చెపుతున్నారు."నయా ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థ "ఫాసిస్ట్ ఉనికిని" సృష్టిస్తుంది.ఇది, మితవాద నిరంకుశ ఉద్యమాలు, విదేశీయులపై ద్వేషభావం, తీవ్ర జాతీయతా భావం,ప్రజాస్వామిక నిబంధనల తుడిచివేతలో వ్యక్తం చేయబడుతుంది.ఇది, 1930లలో వలె పూర్తిస్థాయిలో "ఫాసిస్ట్ రాజ్యాల" కోసం పరిస్థితుల్ని తిరిగి సృష్టించడం జరగదని" ఆర్థికవేత్త ప్రభాత్‌పట్నాయక్ అంటారు. పెరుగుతున్న హిందూత్వ జాతీయవాదం, నయా ఫాసిజం, ప్రోటో ఫాసిజం,ఛాందసవాద రాజకీయాలకు అనేక పదాల్ని ఉపయోగిస్తుండగా, ఏ రాజకీయ దృగ్విషయం(ఫినామినన్)కూడా అదే రీతిలో పునరావృతం కాదు.నేడున్న హిందూత్వ జాతీయవాదానికి ఫాసిజానికి దగ్గరగా ఉండే అనేక లక్షణాలు ఉన్నాయి. ఇది ఆరెస్సెస్ వ్యవస్థాపకులకు ముఖ్యంగా ఎం.ఎస్.గోల్వాల్కర్‌కు ప్రారంభంలో ప్రేరణగా నిలిచింది.

"జాతిని,దాని సంస్కృతిని స్వచ్ఛంగా కొనసాగించడానికి జర్మనీ సెమిటిక్ జాతులను అంటే యూదులను దేశంలో లేకుండా చేయడం ద్వారా జర్మనీ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది.ఇక్కడ జాత్యహంకారం అత్యున్నత స్థాయిలో వ్యక్తమైంది. మూలాల్లో తేడాలున్న జాతులు, సంస్కృతులు ఐక్యం కావడం ఎంత అసాధ్యమో జర్మనీ కూడా చూపించింది. హిందుస్థాన్‌లో ఇది మనం నేర్చుకొని,లాభం పొందవలసిన పాఠం" అని గోల్వాల్కర్ తన "వియ్ ఆర్ అవర్ నేషన్ హుడ్" రచనలో పేర్కొన్నాడు. భారతదేశంలో "గత వైభవం",అఖండ భారత్ వంటి ఆకాంక్ష మైనార్టీలను లక్ష్యంగా చేసుకొని, వారిని మన "దేశానికి శత్రువులు"గా చూపించడం, నిరంకుశత్వం, పెద్ద వ్యాపారాల్ని ప్రోత్సహించడం, భావ ప్రకటనా స్వేచ్ఛను అణచివేయడం, సామాజిక ఆలోచనలపై ఆధిపత్యం చెలాయించడం లాంటి అనేక ఫాసిస్ట్ లక్షణాలను మనం చూస్తున్నాం.ఇటీవలి కాలంలో మహాత్మాగాంధీ ముని మనవడైన తుషార్ గాంధీ, స్వేచ్ఛగా తన భావాల్ని వ్యక్తం చేసిన సందర్భంలో ఆయన పట్ల అసహనాన్ని ప్రదర్శించిన విషయం మనకు తెలిసిందే. ఆ సందర్భంలో తుషార్ గాంధీ ఇలా అన్నాడు-

"ఆరెస్సెస్ విష పూరితమైనది.వారు దేశ అస్తిత్వాన్ని నాశనం చేసే ప్రయత్నం చేస్తున్నారు.దేశం తన అస్తిత్వాన్ని కోల్పోతే,సర్వం కోల్పోయినట్లే, కాబట్టి దాని గురించి మనం అప్రమత్తంగా ఉండాలి". తుషార్ గాంధీ క్షమాపణలు చెప్పి,తన మాటల్ని వెనక్కి తీసుకోవాలని అన్నారు. కానీ ఆయన ఆ రెండు పనులూ చెయ్యలేదు, ఇప్పుడు ఆయన్ను చంపుతామని బెదిరిస్తున్నారు. వందల సంఖ్యలో ఉన్న తన అను బంధ సంస్థలు, వేల సంఖ్యలో తన ప్రచారక్‌లు,లక్షల సంఖ్యలో తన కార్యకర్తలతో ఆరెస్సెస్ విస్తృతంగా వ్యాపిచెందుతూ స్వాతంత్ర్య ఉద్యమం నుండి ఉద్భవించిన "భారతదేశ భావన"కు అది ముప్పు కలిగిస్తుంది. స్వాతంత్ర్యోద్యమ విలువలు మన రాజ్యాంగంలో వ్యక్తీకరించబడ్డాయి.మన రాజ్యాంగం పౌరులందరి సమాన హక్కులపై ఆధారపడి ఉంటుంది. స్వాతంత్ర్యోద్యమ విలువలకు,భారత రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉన్న తన భావజాలాన్ని ఆరెస్సెస్ తన పెరుగుతున్న నెట్‌వర్క్‌తో దేశంలో నాటింది.

> "ఆరెస్సెస్ విష పూరితమైనది.వారు దేశ అస్తిత్వాన్ని నాశనం చేసే ప్రయత్నం చేస్తున్నారు.దేశం తన అస్తిత్వాన్ని కోల్పోతే,సర్వం కోల్పోయినట్లే, కాబట్టి దాని గురించి మనం అప్రమత్తంగా ఉండాలి". తుషార్ గాంధీ క్షమాపణలు చెప్పి,తన మాటల్ని వెనక్కి తీసుకోవాలని అన్నారు. కానీ ఆయన ఆ రెండు పనులూ చెయ్యలేదు, ఇప్పుడు ఆయన్ను చంపుతామని బెదిరిస్తున్నారు. వందల సంఖ్యలో ఉన్న తన అను బంధ సంస్థలు, వేల సంఖ్యలో తన ప్రచారక్‌లు,లక్షల సంఖ్యలో తన కార్యకర్తలతో ఆరెస్సెస్ విస్తృతంగా వ్యాపిచెందుతూ స్వాతంత్ర్య ఉద్యమం నుండి ఉద్భవించిన "భారతదేశ భావన"కు అది ముప్పు కలిగిస్తుంది. స్వాతంత్ర్యోద్యమ విలువలు మన రాజ్యాంగంలో వ్యక్తీకరించబడ్డాయి.మన రాజ్యాంగం పౌరులందరి సమాన హక్కులపై ఆధారపడి ఉంటుంది. స్వాతంత్ర్యోద్యమ విలువలకు,భారత రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉన్న తన భావజాలాన్ని ఆరెస్సెస్ తన పెరుగుతున్న నెట్‌వర్క్‌తో దేశంలో నాటింది.

> లోక్‌సభ ఎన్నికల తర్వాత ఇండియా కూటమి తనను తాను బలోపేతం చేసుకోవాల్సిన ముఖ్యమైన అవసరాన్ని పరిగణనలోకి తీసుకోనట్టు కనపడుతుంది.ఈ కూటమిలో భావజాలపరంగా బలంగా ఉన్న భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) లేక సీపీఐ(ఎం) ఈ విషయంపై రెండో ఆలోచనను కలిగి ఉండడం గమనించదగ్గ విషయం."ప్రతిపక్ష ఇండియా కూటమి లోక్‌సభ ఎన్నికల కోసం ఏర్పడింది, రాష్ట్రాల ఎన్నికల కోసం ఏర్పడలేదని" సీపీఐ(ఎం) సమన్వయకర్త ప్రకాశ్‌కారత్ వ్యాఖ్యానించాడు.ఆయన లౌకిక ప్రతిపక్ష పార్టీల విశాల వేదిక కోసం పిలుపునిచ్చాడు.ఈ కూటమిని విశాలమైన దృష్టికోణం నుండి చూడాలనీ, అది కేవలం ఎన్నికల రాజకీయాల ద్వారా మాత్రమే అది నిలిపివేయ బడదని కూడా కారత్ అన్నాడు.

సంఘ్ తొలినాళ్లలో చరిత్రను దుర్వినియోగం చేయడం ద్వారా ముస్లింల పట్ల ద్వేష భావాల్ని సృష్టించింది.ప్రస్తుతం మహారాష్ట్రలో ఔరంగజేబు సమాధిని కూల్చివేయాలనే డిమాండ్ అధికార బీజేపీకి మొదటి ప్రాధాన్యతగా ఉంది. ప్రస్తుతం స్వాతంత్ర్యోద్యమ ముఖ్య నాయ కుడైన గాంధీజీని లక్ష్యంగా చేసుకొని, స్వాతంత్ర్య సాధనలో ఆయన ఎలాంటి పాత్ర పోషించ లేదని బీజేపీ ప్రచారం చేస్తుంది. గాంధీజీ స్వాతంత్ర్యోద్యమాన్ని ధ్వంసం చేశాడని చెప్పేవరకు సామాజిక మాధ్యమాల్లో వారి ప్రచారం సాగుతోంది.జాబితా చాలా పెద్దదిగానే ఉంది.నేటి మన కర్తవ్యం ఏమిటి? విశాల ప్రాతిపదికన ఒక లౌకిక వేదికను ఏర్పాటు చేయాలన్న కారత్ ప్రతిపాదన సరైనది.ఈ ప్రయాణంలోని మొదటి అడుగుగా ఇండియా కూటమి ఏర్పాటు జరిగింది.ఈ కూటమిని ఇంకా బలోపేతం చేసి,ఈ కూటమిలోని కొన్ని చిక్కుల్ని సరిచేయాల్సిన అవసరం ఉంది. కూటమి భాగస్వాములలో కొన్ని వైరుధ్యాలు ఉన్నప్పటికీ కూడా ఒక మిలియన్‌కు పైగా సభ్యులు గల సీపీఐ(ఎం), ఈ కూటమిని మరింత బలోపేతం చేయడంలో ప్రధానమైన పాత్రను పోషించగలదు.కొన్ని పెద్ద లక్ష్యాల కోసం, చిన్నచిన్న త్యాగాలు తప్పకుండా చేయాల్సిన అవసరం ఉంటుంది.

దీనికి మద్దతుగా 2024 లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సామాజిక గ్రూపులు కూడా తమ పనిని కొనసాగించాల్సిన అవసరం ఉంటుంది.ఈ పనిని జాతీయ లౌకిక కూటమి కూడా మొదలు పెట్టవచ్చు.ప్రస్తుత పాలకవర్గం కచ్చితమైన స్వభావం ఫాసిస్ట్ లేదా "ఫాసిస్ట్ లక్షణాలు గల" లేక ఇంకేదైనా, భారతదేశంలో వ్యూహం విశాల ప్రాతిపదికన, మరింత బలోపేతం గా, చైతన్యవంతంగా,2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో మనం చూసిన విధంగా ఉండాలి.

("న్యూస్ క్లిక్" సౌజన్యంతో)

అనువాదం: బోడపట్ల రవీందర్, 9848412451

మౌలిక రంగాలకు మరిచిన సర్కార్

రాష్ట్రంలో ప్రజల నెలవారి ఖర్చుల్లో ముప్పావు శాతం విద్యా,వైద్యరంగాలకే ఖర్చవుతుంది. అద్దె ఇండ్లలో నివసించే వారైతే అప్పులు చేస్తే తప్ప పూటగడవని స్థితి. ఇలాంటి ప్రాధాన్యత కలిగిన విద్యా,వైద్య రంగాలపై ప్రభుత్వం తగినంత శ్రద్ధ పెట్టలేదనే తెలుస్తున్నది. అరొకర బడ్జెట్ కేటాయింపుల ఆ నిర్లక్ష్యాన్ని బట్టబయలు చేస్తున్నది. ప్రస్తుతమున్న అప్పులు, ఆర్థిక పరిస్థితి నేపథ్యంలో దీర్ఘకాలిక, మౌలిక అంశాల్లో ప్రధానమైనటువంటి వాటి పట్ల సరైన ఆలోచన, తగిన కార్యచరణ చేయాల్సి ఉన్నా ఈ అసెంబ్లీ సమావేశాల్లో అలాంటిదేమీ కనిపించలేదు. ప్రతిపక్షం, అధికార పక్షం తప్పు మీదంటే మీదేనని చెబుతున్నా వాస్తవంగా రాష్ట్రాన్ని అప్పుల నుంచి బయటపడేసి కనీస సదుపాయాలను ప్రజలకు అందించే చర్యల గురించి ప్రస్తావించకపోవడం బాధాకరం. బడ్జెట్‌లో ఆరుగ్యారంటీల అమలుకు నిధులు కేటాయించడం మంచిదే. కానీ, అందులో ఖర్చు పెడతారా అనే నమ్మకం లేకుండా పోయింది. ఆరు గ్యారంటీల అమలుకై ఈ బడ్జెట్లో నిధులు కేటాయించారు. సంక్షేమానికి బాటలు వేస్తామని చెబుతున్న సర్కార్ ఆ సంక్షేమం ప్రజలకు ఎలా అందిస్తుందో స్పష్టమైన విధానం ప్రకటించ లేదు.

వ్యవసాయానికి, పంచాయతీరాజ్‌కు కేటాయింపులు బాగానే చేసినా రైతులు అప్పులపాలవుతూనే ఉన్నారు. వారిని అందులో నుంచి బయటపడే మార్గాన్ని ముందు అన్వేషించాలి. కౌలు రైతుల పరిస్థితి దినదిన గండంగానే ఉంది. పంచాయతీ ఎన్నికలే వాయిదా వేసిన సర్కార్ ఆ శాఖకు రూ.31వేల కోట్ల చిల్లర కేటాయించింది. ఇదంతా అధికారగణమే ఖర్చు చేస్తుందా? పాలకవర్గాలు ఉంటే గ్రామసభల ద్వారా ఆ నిధుల్ని ఖర్చు చేసే అవకాశం



ఉంటుంది.అన్నింటికంటే ముఖ్యమైన రంగాల్లో విద్యా,వైద్యం చాలా కీలకం. వైద్యరంగానికి ఈ బడ్జెట్లట రూ.12393 కోట్లు కేటాయింపులు చేశారు. గతేడాదితో పోల్చుకుంటే పెరుగుదల చాలా స్వల్పం. మానవ అభివృద్ధి సూచికలో ప్రధాన భూమిక పోషించే విద్యా,వైద్య రంగాలపై చిత్తశుద్ధి లేదనే తెలుస్తున్నది. విద్యపై పెట్టుబడిన సొమ్మును భవిష్యత్తుకి రాబడిగా చూడాలి. విద్యారంగంపై సర్కార్ చిన్నచూపు కేటాయింపుల్లో కనిపిస్తున్నది. గతేడాదికంటే ఈ ఏడాది విద్యకు మొత్తం బడ్జెట్‌లో కేటాయించింది 7.57శాతం మాత్రమే. అంకెల్లో రూ 1816 కోట్లు పెరిగినట్టు కనిపించినా శాతాల్లో చూస్తే గతేడాదికంటే తగ్గింది.

దేశంలో ఈశాన్య రాష్ట్రాలు కూడా విద్యకు దాదాపు 12 నుంచి13 శాతం వరకు బడ్జెట్ కేటాయింపులు చేస్తున్నాయి. తెలంగాణ బడ్జెట్‌లో విద్యారంగానికి రూ.23108 కోటుల (7.57శాతం) మాత్రమే కేటాయించింది.దేశంలోని టాప్ ఇరవై రాష్ట్రాల్లో తెలంగాణ రాష్ట్రమే అతితక్కువగా కేటాయించింది. ఢిల్లీ, కర్నాటక, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు విద్య రంగానికి అధిక నిధులు కేటాయిస్తూ ప్రభుత్వ విద్య పరిరక్షణకు పాటుపడు తున్నాయి. ఆ రాష్ట్రాలతో పోల్చుకుంటే తెలంగాణ చాలా వెనుకబడి ఉన్నది.విద్యకు పదిహేను శాతం నిధులు బడ్జెట్‌లో కేటాయించి, ప్రభుత్వ బడులను పటిష్టం చేసి రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యనందిస్తామని వాగ్దానం చేసిన కాంగ్రెస్ ఆ దిశగా ముందుకు సాగడం లేదని ఈ బడ్జెట్‌ను చూస్తేనే అర్థమవుతున్నది.యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్‌కి రూ.2900 కోట్లు ఈ కేటాయింపుల్లో చూపింది. విద్యాశాఖ పరిధిలో ఉన్న 26067 పాఠశాలలను గాలికొదిలేసి, రెసిడెన్షియల్, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ గురించి మాత్రమే ప్రభుత్వం మాట్లాడుతున్నది. గురుకులాల్లో చదివేది 5.5 లక్షల మంది మాత్రమే.వీరి సంక్షేమం గురించి నిధులిస్తే అభినందించాల్సిందే. కానీ ప్రభుత్వ, జిల్లాపరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో చదివే విద్యార్థులు పదహారు లక్షలు. వారి సంగతేంటి? వారిలో అత్యధికులు బడుగు బలహీన వర్గాల వారు, బాలికలు. వీరికి నాణ్య మైన విద్య అందించడానికి ఈ కేటాయింపులు ఏమాత్రం సరిపోవనే బడ్జెట్ ప్రవేశపెట్టినప్పటినుంచి విద్యావంతులు, మేధావులు చర్చిస్తున్నారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసేలోపు విద్యా,వైద్య రంగాలపై ఒక ప్రతిష్టాత్మకమైన కార్యచరణ రూపొందిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేసినప్పటికీ సర్కార్ ఆ విధంగా చర్చించలేదు.రాష్ట్ర ప్రజానీకానికి ఒక భరోసా ఇవ్వలేదు.

విద్యాశాఖ పరిధిలోని పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు, మెరుగైన మధ్యాహ్నభోజనం అందించేందుకు, నాణ్యమైన విద్యను అందించడానికి కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా విద్యకు కనీసం పదిహేను శాతం నిధులు కేటాయిస్తే తప్ప ప్రభుత్వ విద్య బలోపేతమవుతుంది. లేదంటే ఎక్కడ వేసిన గొంగళి అక్కడేఅన్న చందంగానే ఉంటుంది. మానవాభివృద్ధి సూచికలో 2022 లెక్కల ప్రకారం తెలంగాణ రాష్ట్రం దేశంలో 22వ స్థానంలో ఉంది. విద్య వైద్యానికి పెద్ద పీట వేసిన రాష్ట్రాలు కేరళ, గోవా, ఢిల్లీ అభివృద్ధి సూచికలో ముందు వరుసలో ఉన్నాయి. ప్రజల జీవన ప్రమాణాలు పెరిగేలా సంక్షేమ పథకాల రూపొందిస్తూ విద్యా,వైద్య రంగాలకు సరైన కేటాయింపులు మరింత పెంచాల్సిన అవసరం ఉంది. అప్పుడే మానవ అభివృద్ధి సూచికలో రాష్ట్రం మరింత ముందుకెళ్తుంది.

- పాకాల శంకర్ గౌడ్,
9848377734

ప్రగతిభవన్ కంచెలు తీసి.. నేరుగా ప్రజల ఇండ్లకే వేసి...



కూరపాటి రమేష్
9490098048

బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కోట్ల రూపాయలు ఖర్చు చేసి, సకల సౌకర్యాలతో ప్రగతి భవన్‌ని నిర్మించి, అక్కడి నుండే ముఖ్యమంత్రి పరిపాలన సాగించారు. ముఖ్యమంత్రి క్యాంప్ ఆఫీస్ అయిన ప్రగతి భవన్ చుట్టూ శత్రుదుర్భేద్యమైన కంచెను ఏర్పాటు చేసుకున్నారు. ప్రజల బాధలను ప్రగతిభవన్‌కు వినపడకుండా పదేండ్లపాటు నియంతృత్వాన్ని ప్రదర్శించారు. బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రజలు అనేక ఆందోళనలు చేశారు. కార్మికులకు కనీస వేతనాలు, కార్మిక చట్టాల అమలు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, దళితబంధు, దళితులకు మూడెకరాల భూమి, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని చేస్తున్న పోరాటాల్ని పోలీసులతో అణిచేశారు. ఆందోళనలు, పోరాటాలకు వేదికైన ధర్నాచౌక్ (ఇందిరా పార్క్ వద్ద)ను ఎత్తేశారు. అంతేకాదు ఎక్కడ ఆందోళన జరిగినా కార్మికులను, ప్రజలను నిర్బంధించడం, భయభ్రాంతులకు గురిచేయడం, అక్రమంగా కేసులు పెట్టి జైలుకు పంపించారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని పోరాడుతున్న క్రమంలో ఆ గళానికి వేదికైన ధర్నాచౌక్ కోసం కార్మిక, ప్రజా, సామాజిక సంఘాలు, రాజకీయ పార్టీలు కలిసి పోరాటం చేయాల్సిన పరిస్థితి కల్పించారు. ప్రజాస్వామ్యంలో ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడానికి ధర్నాచౌక్‌ని కొనసాగించాలని అనేక ఆందోళనలు, పోరాటాలు చేసి ఆనాడు ధర్నాచౌక్‌ను తిరిగి సాధించుకున్నది తెలిసిందే. ఆ తర్వాత కూడా ధర్నాలకు అనుమతులివ్వకుండా పాలకులు అనేక ఇబ్బందులు పెట్టారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు అనేక వాగ్దానాలనిచ్చింది. పెరిగిన ధరలకనుగుణంగా కనీస వేతనాలను నిర్ణయించి అమలు చేస్తామని చెప్పింది. మహిళలకు రూ.2,500ల నగదు, ఇండ్లు లేని వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు, రూ.4వేల పెన్షన్ అందిస్తామని భరోసా నిచ్చింది. గ్రామ పంచాయతీ, మున్సిపల్, ఆశా, అంగన్‌వాడీ సిబ్బందికి ఉద్యోగ భద్రత, కనీస వేతనం ఇస్తామని పేర్కొంది. విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళా సాధికారత లాంటి అనేక వాగ్దానాలతో పాటు ప్రగతిభవన్ ముందున్న ఇనుప కంచెను కూడా తొలగిస్తామని, ప్రజలు స్వేచ్ఛగా తమ సమస్యలు చెప్పుకునేలా చూస్తామని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. చెప్పినట్టే ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెంటనే ప్రగతి భవన్ చుట్టూ ఉన్న ముండ్ల కంచెను తొలగించి, ప్రజాభవన్‌గా పేరు మార్చింది. ప్రతిరోజూ ముఖ్యమంత్రి, మంత్రులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని ప్రకటించింది. అంతవరకూ బాగానే ఉంది. కానీ ఒకటి, రెండు రోజులు ముఖ్యమంత్రి ప్రజాభవన్‌కి వచ్చి ప్రజల నుండి వినతులు తీసుకున్నారు. మరికొన్ని రోజులు మంత్రులు వినతులను స్వీకరించారు. ఆ తర్వాత అధికారులను నియమించారు. ఇప్పుడు వారే అవారానికి రెండు రోజులు ప్రజల నుండి వినతులను తీసుకుంటున్నారు. కార్మిక, ప్రజా సమస్యలను పరిష్కరించాలని కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు అనేక సందర్భాల్లో వినతిపత్రాలందజేశారు. సమస్యలు పరిష్కారమయ్యాయా? అంటే అది కూడా అంతంతే.

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా కార్మికులు, ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎవరైనా కోరుకుంటారు. ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి ధర్నాలు చేస్తారు, నిరసనలు తెలుపుతారు. ఇది ప్రజాస్వామ్యంలో ప్రజల కనీస హక్కు. కానీ ఈ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా పోలీసులు వ్యవహరించే తీరు గత ప్రభుత్వం మాదిరిగానే ఉంది. ధర్నాలు, నిరసనలపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ, హమాలీ, ట్రాన్స్‌పోర్ట్, బీడీ, భవన నిర్మాణ కార్మికులు, విద్యుత్ ఆర్టిజన్స్, మున్సిపల్, విఆర్ఏల సమస్య లపై ప్రభుత్వానికి తమ నిరసన తెలిపేందుకు అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నారు. అలాగే యూని వర్సిటీ నాన్‌టీచింగ్ ఎంప్లా యీస్, ఆశా, ఐకెపి విఓఏ, మధ్యాహ్న భోజనం, మార్కెట్ సెక్యూరిటీ గార్డ్స్ కార్మికులు తమ వ్యవసాయ సమస్యలు పరిష్కరిం చాలని ధర్నాలు చేసే అనుమతి కావాలని కోరారు. కానీ, పర్మిషన్ ఇవ్వడానికి అనేక ఇబ్బందులు పెట్టారు. మహిళలైన ఆశా వర్కర్లపై పోలీసులు వ్యవహరించిన తీరు అత్యంత దుర్మార్గం. అర్థరాత్రి ఇంటికి వెళ్లిన పోలీసులు ఆశా వర్కర్లు నైటీలో ఉన్నా కూడా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కి తరలించారు. మహిళల పట్ల వ్యవహరించిన తీరు సమంజ సమేనా? ఆరోగ్య శాఖ కమిషనర్ ఆఫీస్ ముందు ధర్నా చేయడానికి వచ్చినవారు ధర్నా చేయ కుండా, ఆశావర్కర్లను అరెస్టు చేస్తున్న సందర్భంలో పోలీసులు అమాను షంగా వ్యవహరించారు. ఎంతో మంది ఆశాలకు గాయాలయ్యాయి. ఆసుపత్రుల్లో చేరారు. షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌లో కనీస వేతనాలు సవరించి గతంలో విడుదల చేసిన జీవో నెం.21, 22, 23, 24, 25 లను గెజిట్ చేయాలని కేంద్ర, రాష్ట్ర కార్మిక సం ఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాల్లో పోలీస్ పర్మిషన్ ఇచ్చి జిల్లా నుండి కార్మికులు హైదరాబాద్‌కు రాకుండా అరెస్టు చేసి నిర్బంధించారు.

ఇందిరా పార్క్ వద్ద ఉన్న ధర్నా చౌక్‌ను కొనసాగించాలని జరిగిన పోరాటంలో ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పాల్గొన్నది. అదే పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రగతి భవన్ చుట్టూ ఇనుప కంచెను తొలగించింది. కానీ, సమస్యలతో ఉన్న ప్రజలకు ఈ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ధర్నాకు వస్తుంటే కార్మికుల, ప్రజలను ఇంటి వద్దే అడ్డుకుంటున్నది. అరెస్ట్ చేసి ఉద్యమాల్లో పాల్గొనకుండా భయభ్రాంతకులకు గురిచేస్తున్నది. కొంతమంది అడ్డంకులను అధిగమించి ధర్నాకు వచ్చినా వారిని కూడా నిర్బంధించింది. కార్మిక సంఘాల కార్యాలయాల ముందు నాయకులను, కార్మికులను కూడా అరెస్టు చేసింది.ఇది ప్రజాపాలన అంటారా? గత సర్కార్ మాదిరిగానే రేవంత్ ప్రభుత్వం సాగుతుందని చెప్పడానికి ఇంతకన్నా నిదర్శనం ఏంకావాలి?

ధర్నాలు చేసుకోవడానికి పోలీసులు పర్మిషన్ ఇచ్చి ఆ ధర్నాలకు కార్మికులను, ప్రజలను రాకుండా నిర్బంధించడం ఇదేం న్యాయం? కొన్ని ధర్నాలకు అసలు పోలీసులు పర్మిషనే ఇవ్వలేదు. పర్మిషన్ ఇచ్చిన వాటికి ధర్నాకు కొన్ని గంటల ముందు పర్మిషన్ రద్దు చేసి ఇబ్బంది పెట్టారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని, రాష్ట్రాల హక్కులను కాలరాస్తుందని అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న తీరుకు ఢిల్లీలో, మన ముఖ్యమంత్రి, మంత్రులు, కాంగ్రెస్ నాయకులతో సహా ధర్నాలు, నిరసనలు చేశారు. మరి ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒక న్యాయం, కార్మికులకు-కర్షకులకు, ప్రజలకు మరో న్యాయమా? ప్రజాపాలన అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యం కల్పించిన ధర్నా, నిరసన చేసే హక్కును కాలరాయడం అన్యాయం. ప్రగతి భవన్ కంచెను తీసి ప్రజల ఇండ్లకే కంచెలు వేయడం సబబేనా? ప్రజాస్వామ్యాన్ని మనం కాపాడితే, మనల్ని ప్రజాస్వామ్యం కాపాడుతుంది. ఇది మరిచిన గత పాలకులకు ప్రజలు ఎలా జవాబు చెప్పారో చూశాము. ఈ సర్కార్ కూడా అలగే వ్యవహరిస్తే సందర్భమొచ్చినప్పుడు ప్రజలే బుద్ధి చెప్తారు. ఇది చరిత్ర చెప్పిన సత్యం.



> ఇందిరా పార్క్ వద్ద ఉన్న ధర్నా చౌక్‌ను కొనసాగించాలని జరిగిన పోరాటంలో ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పాల్గొన్నది. అదే పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రగతి భవన్ చుట్టూ ఇనుప కంచెను తొలగించింది. కానీ, సమస్యలతో ఉన్న ప్రజలకు ఈ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ధర్నాకు వస్తుంటే కార్మికుల, ప్రజలను ఇంటి వద్దే అడ్డుకుంటున్నది. అరెస్ట్ చేసి ఉద్యమాల్లో పాల్గొనకుండా భయభ్రాంతకులకు గురిచేస్తున్నది. కొంతమంది అడ్డంకులను అధిగమించి ధర్నాకు వచ్చినా వారిని కూడా నిర్బంధించింది. కార్మిక సంఘాల కార్యాలయాల ముందు నాయకులను, కార్మికులను కూడా అరెస్టు చేసింది.ఇది ప్రజాపాలన అంటారా? గత సర్కార్ మాదిరిగానే రేవంత్ ప్రభుత్వం సాగుతుందని చెప్పడానికి ఇంతకన్నా నిదర్శనం ఏంకావాలి?

నా డిపార్టుమెంట్.. నా ఇష్టం..!

పేరుకే 'డిస్ట్రిక్ లెవల్ ఔట్ సోర్సింగ్ కమిటీ'

కొందరు జిల్లా అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగ నియామకాలను 'డిస్ట్రిక్ లెవల్ ఔట్ సోర్సింగ్ కమిటీ'కి తెలియకుండానే చేపడు తున్నారు. ఆయా శాఖల నుంచి నేరుగా కలెక్టర్‌కు ఫైల్ పంపించి రిక్రూట్‌మెంట్ చేపడుతు న్నారు. దీంతో ఆయా ఏజెన్సీలు ఔట్ సోర్సింగ్ సిబ్బందికి సకాలంలో వేతనాలు చెల్లించకుండా నెలలుగా పెండింగ్‌లో ఉంచుతుండటంతో ఇబ్బందులు ఎదురవుతు న్నాయి. కొందరు అధికారులు ఆయా ఏజెన్సీలతో కుమ్మక్కై కమీషన్లు దండుకోవడానికే ఇలా చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

కన్వీనర్‌కు తెలియకుండానే ఉద్యోగ నియామకాలు

ఆయా ఏజెన్సీలతో కొందరు అధికారుల కుమ్మక్కు..!

సకాలంలో వేతనాలు అందక చిరుద్యోగుల ఇబ్బందులు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో కొత్త నిబంధనావళి

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రతి జిల్లాలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకాల కోసం 'డిస్ట్రిక్ లెవల్ ఔట్ సోర్సింగ్ కమిటీ' ఉంటుంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోనూ ఉంది. ఈ కమిటీకి చైర్మెన్‌గా జిల్లా కలెక్టర్, కన్వీనర్‌గా జిల్లా ఉపాధి కల్పన అధికారి, కమిటీ సభ్యులుగా జిల్లా కార్మికశాఖ ఉప కమిషనర్, జిల్లా ట్రెజరర్ వ్యవహరిస్తారు. సభ్యులు నామమాత్రంగా ఉన్నా.. చైర్మెన్, కన్వీనర్ మాత్రం కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుంది. కానీ మేడ్చల్ జిల్లాలో అలా జరగడం లేదు. కమిటీ కన్వీనర్‌కు తెలియకుండానే, సంబంధిత నోటీస్ పంపకుండానే, డేటా సమాచారం ఇవ్వకుండానే నేరుగా కమిటీ చైర్మెన్‌కు ఫైల్‌ను పంపి అనుమతులు తీసుకుని తమకు అనుకూలమైన ఏజెన్సీల నుంచి ఉద్యోగులను రిక్రూట్‌మెంట్ చేసుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఆయా శాఖల జిల్లా అధికారులను అడిగితే ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని దాట వేస్తున్నారు. మరికొందరు అధికారులు ఏజెన్సీలతో మాట్లాడుతున్నాం.. త్వరలోనే వస్తాయని చెబుతున్నారు.



కమిటీ చైర్మెన్‌కే ఫైల్..!

కలెక్టరేట్‌లో దాదాపు 50 వరకు డిపార్టుమెంట్లు ఉన్నాయి. ఆయా డిపార్టుమెంట్‌ల పరిధిలో ప్రస్తుతం 570 మంది వరకు ఔట్ సోర్సింగ్ సిబ్బంది పని చేస్తున్నారు. దాదాపు 50 వరకు ఏజెన్సీలు అందుబాటులో ఉండగా.. ఇందులో 9 ఏజెన్సీలకు మాత్రమే మ్యాన్ పవర్‌ను సమకూర్చే అవకాశం ఉంది. కలెక్టరేట్ పరిధిలోని ఏదైనా డిపార్టుమెంట్‌లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగ నియామకం చేపట్టాలంటే 'డిస్ట్రిక్ లెవల్ ఔట్‌సోర్సింగ్ కమిటీ'కి సమాచారంతో కూడిన నోటీస్ చేయాల్సి ఉంటుంది. ఈ నోటీసులో ఏ ఏజెన్సీ నుంచి ఎంత మంది ఉద్యోగులను నియమించుకుంటున్నారో డేటా కూడా ఇవ్వాల్సి ఉంటుంది. కానీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఇదేమీ జరగడం లేదు. కొందరు ఆయా శాఖల జిల్లా అధికారులే నేరుగా కమిటీ చైర్మెన్‌కు ఫైల్ పంపించి అనుమతులు తీసుకుని రిక్రూట్‌మెంట్ చేపడుతున్నారు. దీంతో వేతనాల చెల్లింపులో జాప్యం జరుగుతుండటంతో చిరు ఉద్యోగులు 'డిస్ట్రిక్ లెవల్ ఔట్ సోర్సింగ్ కమిటీ'ని ఆశ్రయిస్తున్నారు. దీంతో 'మీరు ఎప్పుడు జాయిన్ అయ్యారు..? ఎన్ని రోజులుగా వేతనాలు రావడం లేదు..? ఏ ఏజెన్సీ పరిధిలో ఉన్నారు..? అని కమిటీ కన్వీనర్ వివరాలు తెలుసుకుని ఆశ్చర్యపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొందరు ఆయా శాఖల జిల్లా అధికారులే నేరుగా చైర్మెన్‌కు ఫైల్ పంపించి రిక్రూట్‌మెంట్ చేపడుతుండటం పలు అనుమానాలకు తావిస్తోంది. వారికి నచ్చిన ఏజెన్సీల నుంచి ఉద్యోగులను నియమించుకుంటూ, వారి నుంచి కమీషన్లు తీసుకుంటున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. కమిటీ చైర్మెన్ సైతం లైట్ తీసుకుంటుండటం ఆశ్చర్యానికి గురి చేస్తోంది.

అత్యంత శక్తిమంతుల జాబితాలో సీఎంరేవంత్‌రెడ్డి

వంద మంది శక్తిమంతుల్లో 28వ స్థానం

2025 ఏడాదికి ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ జాబితా విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



పరిపాలనా నైపుణ్యం.. ప్రభావంతమైన రాజకీయంతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత శక్తిమంతమైన నాయకునిగా నిలిచారు. ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ 2025 సంవత్సరానికి సంబంధించి దేశంలోని వివిధ రంగాల్లో అత్యంత శక్తిమంతులైన 100 మంది ప్రముఖుల జాబితాను విడుదల చేసింది. ఇందులో రేవంత్ 28వ స్థానం దక్కించుకున్నారు. 2024 సంవత్సరపు జాబితాలో 39 స్థానంలో ఉన్న ఆయన ఏడాది కాలంలోనే ఏకంగా 11 స్థానాలు ఎగబాకి 28వ స్థానానికి చేరుకున్నారు. దేశంలోని రాజకీయ, వ్యాపార, క్రీడా, వినోద రంగాల్లో అత్యంత ప్రభావవంతమైన వ్యక్తులు ఈ జాబితా లో ఉన్నారు. తెలంగాణలో తీసుకువచ్చిన మార్పులు, వ్యూహాత్మక రాజకీయ కార్యకలాపాలు, దేశవ్యాప్తంగా ఇండియా కూటమిలో పోషిస్తున్న ప్రముఖమైన పాత్రతో ఈ గుర్తింపు లభించింది. తనదైన శైలిలో భారత రాజకీయాల్లో ఆయన చూపుతున్న ప్రభావం, నాయకత్వ లక్షణాలతో ఆయన ర్యాంకు మెరుగుపడింది. ఒక ప్రాంతీయ నాయకుడినే కాకుండా దేశంలోనే అత్యంత శక్తిమంతమైన, చురుకైన ముఖ్యమంత్రుల్లో ఒకరిగా నిలిచారు. ప్రాంతీయ అవసరాలను జాతీయ ప్రాధాన్యతలతో సమన్వయం చేయగలిగిన మేధో సంపత్తి, వ్యూహాత్మక దృక్పథం రేవంత్‌ను కీలక నాయకునిగా నిలిపేలా చేశాయి. శక్తిమంతులైన వంద మంది జాబితాలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మొదటి 10 స్థానాల్లో ఉన్నారు.

సుపరిపాలనకు అద్దం: మహేశ్‌కుమార్‌గౌడ్

పారదర్శకమైన పాలన, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కట్టుబడినందుకే ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ అత్యంత శక్తిమంతుల జాబితా-2025లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గుర్తింపు లభించిందని పీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఈ గుర్తింపుతో ప్రజల పట్ల ముఖ్యమంత్రి బాధ్యతను మరింత పెంచిందని ఆయన పేర్కొన్నారు. ప్రాంతీయ నేతలు జాతీయ విధానాల రూపకల్పనలో మరింత ప్రభావం చూపుతున్నారనడానికి ఇదే నిదర్శనమని పేర్కొన్నారు.

సన్నబియ్యంతోపాటు నిత్యావసర సరుకులిస్తాం


(ఫైల్)

(మొదటి పేజీ తరువాయి)

ప్రయోజనం కలుగుతుందని వివరించారు. సన్నబియ్యం పంపిణీపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.10,655 కోట్లు ఖర్చు పెడుతున్నాయని అన్నారు. అందులో రాష్ట్రం వాటా రూ.5,175 కోట్లు, కేంద్రం వాటా రూ.5,485 కోట్లు అని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించ నున్న ఉచిత సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంతో రాష్ట్ర ప్రభుత్వంపై అదనంగా రూ.2,858 కోట్ల భారం పడుతుందన్నారు. అయినా పేదల కడుపు నింపేందుకు ఉద్దేశించ బడిన ఈ పథకం ఎంత ఖర్చయినా భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్దంగా ఉందని అన్నారు. కేవలం సన్నబియ్యంతో సరిపెట్టకుండా ఇతర నిత్యావసర సరుకులను కూడా ప్రభుత్వం చౌక ధరల దుకాణాల ద్వారా అందించనుందన్నారు. తెల్ల రేషన్ కార్డు ఎక్కడ ఉన్నా లబ్ధిదారులకు అన్ని చౌక ధరల దుకాణాల్లో సన్న బియ్యం అందిస్తామని అన్నారు. సన్నాలను ప్రోత్సహించిందే పేదలకు నాణ్యమైన సన్న బియ్యం పంపిణీ కోసమని ఆయన చెప్పారు. అందుకే ఖరీఫ్ సీజన్ 2024-25లో రికార్డు స్థాయిలో 24 లక్షల సన్న ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. రాష్ట్ర చరిత్రలోనే ఇది అరుదైన రికార్డు అని వివరించారు. అర్హులైన నిరుపేదలం దరికీ తెల్ల రేషన్ కార్డుల మంజూరికు త్వరలోనే ముహూర్తం ఖరారు చేయనున్నట్టు చెప్పారు. కొత్తగా 30 లక్షల మందికి లబ్ధి జరుగుతుందనీ, తద్వారా తెల్ల రేషన్ కార్డులు కోటికి చేరడంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 3.10 కోట్ల మంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరనుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ ముఖ్య కార్యదర్శి డీఎస్ చౌహాన్‌తోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

అన్ని రకాల విత్తనాలను అందుబాటులో ఉంచుతాం



మంత్రి తుమ్మల

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వానాకాలం సీజన్‌కు అన్ని రకాల విత్తనాలను ముందుగానే రైతులకు అందుబాటులో ఉంచుతామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. విత్తనోత్పత్తి చేసే రైతుల ప్రయోజనాలను కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో వానాకాలం -2025 పంటలకు కావల్సిన విత్తనాలు, సరఫరా, లభ్యతపై మంత్రి సమీక్షించారు. నాణ్యమైన విత్తనాల ఎంపికలో, కొనుగోళ్ళలో రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. వరి సాగు చేస్తున్న రైతుల నుంచి బెరుకులు ఎక్కువగా రావడం, తొందరగా కంకి రావడం లాంటి ఫిర్యాదులు వస్తున్నాయని వివరించారు. నాణ్యమైన విత్తనాన్ని రైతులకు అందుబాటులో ఉంచేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొన్నిసార్లు విత్తనోత్పత్తి చేస్తున్న రైతులు నష్టపోతున్నారని తెలిపారు. విత్తన కంపెనీలకు, రైతులకు మధ్య వారధిగా ఉన్న ఆర్గనైజర్లలో కొంత మంది రైతులకు దక్కాల్సిన ధరను, ఇవ్వాల్సిన డబ్బులను చెల్లించకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. సీడ్ మెన్ అసోసియేషన్, కంపెనీ ప్రతినిధుల మధ్య విత్తనోత్పత్తి ఒప్పందాలు కుదిరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా కంపెనీలపై ఫిర్యాదులు వస్తే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. విత్తనాల ఎంపిక, కొనుగోళ్లలో పాటించాల్సిన విషయాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి మాట్లాడుతూ వానాకాలం 2025లో 66.80 లక్షల ఎకరాల్లో వరి, ఆరు లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, 50 లక్షల ఎకరాల్లో పత్తి, తొమ్మిది లక్షల ఎకరాల్లో సోయా చిక్కుడు సాగు అవుతుందని అంచనా వేశామని తెలిపారు. 16.70 లక్షల క్వింటాళ్ళ వరి విత్తనాలు, 0.48 లక్షల మొక్కజొన్న, 89 లక్షల పత్తి ప్యాకెట్లు, 1.35 లక్షల క్వింటాళ్ళ సోయాచిక్కుడు సాగవుతాయని తెలిపారు. ఈసారి సన్న వరి సాగు పెరిగే అవకాశం ఉందనీ, పెద్ద మొత్తంలో అందుబాటులో ఉంచుతామని చెప్పారు. పత్తి కోసం 2.4 కోట్ల విత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లాల వారీగా, ప్రాంతాల వారీగా డిమాండ్ ఉన్న పత్తి రకాలను అవసరం కంటే అధిక మొత్తంలో తెప్పించి రైతులకు అందుబాటులో ఉంచేందుకు కంపెనీలకు ఆదేశాలు ఇచ్చినట్టు తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలను కూడా ఏప్రిల్ మాసంలోనే సరఫరా చేస్తామన్నారు. సమావేశంలో వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్ రావు, టీజీ సీడ్స్ చైర్మెన్ సుంకేట అన్వేష్ రెడ్డి, సీడ్స్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, సీడ్ మెన్ అసోసియేషన్ ప్రతినిధులు, వివిధ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కొత్త ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లకు లైన్ క్లియర్

ఏప్రిల్ ఒకటి నుంచి ప్రారంభం

హైదరాబాద్‌లో 13, వరంగల్ అర్బన్‌లో ఒకటి

ప్రస్తుత ఎస్‌హెచ్‌ఓలే ఇన్‌చార్జీలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 14 కొత్త ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లకు సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వీటిని ఏప్రిల్ ఒకటిన ప్రారంభించాలని నిర్ణయించారు. హైదరాబాద్‌లో 13, వరంగల్ అర్బన్‌లో ఒకటి ఏర్పాటు కానున్నాయి. కొత్త స్టేషన్ల నిర్వాహణకు ఎస్‌హెచ్‌ఓలు, కానిస్టేబుళ్లను ప్రభుత్వం కేటాయించింది. బంజారాహిల్స్ చిక్కడపల్లి, గండిపేట, కొండాపూర్, పెద్ద అంబర్‌పేట్, కూకట్‌పల్లి, అమీన్‌పూర్, హసన్‌పర్తి మొదలగు తొమ్మిది స్టేషన్లు అద్దె భవనాల్లో ప్రారంభం కానున్నాయి. అద్దె భవనాలు దొరకని మారేడ్‌పల్లి, మీర్‌పేట్, కొంపల్లి, కాప్రా, నాచారం, అల్వాల్ స్టేషన్లను సికింద్రాబాద్, సరూర్‌నగర్, కుతుబ్‌ల్లాపూర్, ఘట్‌కేసర్, ఉప్పల్, మల్కాజి గిరి ప్రాంతాల్లోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లలోని ప్రత్యేక గదుల్లో ఇవి ఏర్పాటు కానున్నాయి.

కేసులు, స్వాధీన సొత్తు బదులాయింపు

కొత్తగా ఏర్పాటు కానున్న ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్లకు కేటాయించిన ప్రాంతాలకు సంబంధించిన కేసుల రికార్డులు, స్వాధీనం చేసుకున్న గంజాయి, డ్రగ్స్, వాహనాలు, బెల్లం, ఎన్‌డీపీఎల్ మద్యం బాటిళ్లను బదిలీ చేస్తూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. వీటి ఇన్‌చార్జిలుగా పాత స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలే ప్రస్తుతం కొనసాగునున్నారు. అలా సాధ్యం కాకపోతే స్టేషన్లలో వాటికి కేటాయించిన సీనియర్ ఎక్సైజ్ ఎస్సైలే ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వహించనున్నారు.

నవచిత్రం

'రాబిన్‌హుడ్'కి అద్భుతమైన స్పందన




వెంకీ కుడుముల, వై. రవిశంకర్

'మా 'రాబిన్ హుడ్' సినిమాకి ప్రేక్షకుల నుంచి అద్భుతమైన రెస్పాన్స్ రావడం చాలా ఆనందంగా ఉంది. మేము సినిమాని థియేటర్స్‌లో చూసి వచ్చాం. ఆడియన్స్ అందరూ చాలా బాగా ఎంజాయ్ చేస్తున్నారు' అని నిర్మాత వై. రవిశంకర్ చెప్పారు.

నితిన్, శ్రీలీల జంటగా నటించిన చిత్రం 'రాబిన్‌హుడ్'. వెంకీ కుడుముల దర్శకుడు. మైత్రి మూవీ మేకర్స్ నిర్మించింది. శుక్రవారం ఈ చిత్రం రిలీజై, హౌస్‌ఫుల్ కలెక్షన్స్‌తో సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోంది.

ఈ సందర్భంగా డైరెక్టర్ వెంకీ కుడుముల మాట్లాడుతూ, 'నితిన్ పెర్ఫార్మెన్స్‌తో పాటు వెన్నెల కిషోర్, రాజేంద్రప్రసాద్ ట్రాక్‌ని హిలేరియస్‌గా ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తున్నారు. అలాగే క్లైమాక్స్‌లో వచ్చే ఎమోషన్, ట్విస్ట్‌ల గురించి గొప్పగా మాట్లాడుతున్నారు. చిన్నపిల్లలు కూడా చాలా ఎంజాయ్ చేస్తున్నారు. వార్నర్ క్యామియోకి కూడా చాలా అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ ఉగాదికి చాలా మంచి ఫ్యామిలీ ఎంటర్టైనర్ అవుతుంది' అని అన్నారు.

'ఈ సినిమా సమ్మర్‌కి క్లీన్ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా నిలుస్తుంది. ప్రతి షోకి కలెక్షన్స్ పెరుగుతూ వెళ్తున్నాయి. గ్రాడ్యువల్‌గా ఈ సినిమా పెరుగుతూ వెళుతుందని గట్టిగా నమ్ముతున్నాం. డిస్ట్రిబ్యూటర్స్ అందరు కాల్ చేసి చాలా బాగుందని ఫీడ్ బ్యాక్ ఇస్తున్నారు' అని నిర్మాత వై.రవిశంకర్ తెలిపారు.



కళ్యాణ్ రామ్

'నాయాల్ది..' పక్కా మాస్ సాంగ్

కళ్యాణ్ రామ్ నటిస్తున్న నూతన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. ఈ చిత్రంలో విజయశాంతి పవర్ ఫుల్ పాత్రలో కనిపిస్తున్నారు. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్‌లపై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మిస్తున్నారు. తాజాగా మేకర్స్ మ్యూజిక్ ప్రమోషన్స్‌ని స్టార్ట్ చేయబోతున్నారు.

ఈ సినిమా ఫస్ట్ సింగిల్ 'నాయాల్ది..' సాంగ్‌ని ఈనెల 31న రిలీజ్ చేస్తున్నారు. కళ్యాణ్ రామ్ స్టన్నింగ్ క్లాస్ లుక్‌లో, ఉగ్రరూతలూగించే మాస్ డ్యాన్స్ చేస్తూ కనిపించిన పోస్టర్ అదిరిపోయింది. బ్యాక్ డ్రాప్‌లో కార్నివాల్ వాతావరణం, డ్యాన్స్ ట్రూప్ పండుగ వైబ్‌ని పెంచుతోంది. 'నాయాల్ది..' మాస్ డ్యాన్స్ నెంబర్ అని పోస్టర్ సూచిస్తోంది. ఈ సినిమా కోసం అజనీష్ లోక్‌నాథ్ బ్లాక్ బస్టర్ ఆల్బమ్ కంపోజ్ చేశారు. సోహైల్ ఖాన్, సాయి మంజ్రేకర్, శ్రీకాంత్, యానిమల్ పృథ్వీరాజ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా రిలీజ్ డేట్ ని మేకర్స్ త్వరలో అనౌన్స్ చేస్తారు.

ఆ.. విషయంలో విజయం సాధించాం

'మా 'మ్యాడ్ స్క్వేర్' సినిమా తెలుగు రాష్ట్రాలలో ఉదయం 8 గంటల షోతో మొదలై, సూపర్ హిట్ టాక్ సొంతం చేసుకుంది' అని సమర్పకులు సూర్యదేవర నాగవంశీ చెప్పారు.

బ్లాక్ బస్టర్ చిత్రం 'మ్యాడ్'కి సీక్వెల్‌గా రూపొందిన చిత్రం 'మ్యాడ్ స్క్వేర్'. నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ ప్రధాన పాత్రలు పోషించారు. కళ్యాణ్ శంకర్ దర్శకత్వం వహించారు. శ్రీకర స్టూడియోస్‌తో కలిసి సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మించారు. ఈ చిత్రానికి సూర్యదేవర నాగవంశీ సమర్పకులు. ఈ సినిమా శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చి, మంచి విజయాన్ని సొంతం చేసుకుంది.

ఈ నేపథ్యంలో నిర్వహించిన సక్సెస్‌మీట్‌లో సమర్పకులు సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ, 'భారీ ఓపెనింగ్స్ వస్తున్నాయి. కొన్ని ఏరియాల్లో 'మ్యాడ్' క్లోజింగ్ కలెక్షన్స్, మొదటిరోజే దీనికి వచ్చే అవకాశం ఉంది. మేము ముందు నుంచి చెబుతున్నట్టు, ప్రేక్షకులను నవ్వించడమే లక్ష్యంగా ఈ సినిమాని రూపొందించాం. ఆ విషయంలో విజయం సాధించాం. ఈ వేసవిలో ప్రేక్షకులు మా సినిమా చూసి బాగా నవ్వుకోవాలని కోరుకుంటున్నాం. కుటుంబ ప్రేక్షకులకు కూడా ఈ సినిమా బాగా నచ్చుతుంది' అని అన్నారు.



నిర్మాత హారిక సూర్యదేవర మాట్లాడుతూ, 'మా సినిమాని ఆదరిస్తున్న ప్రేక్షకులకు ముందుగా కృతజ్ఞతలు. మా కష్టానికి తగ్గ ఫలితం దక్కడం చాలా సంతోషంగా ఉంది. కాలేజ్ స్టూడెంట్స్ మాత్రమే కాకుండా, ఫ్యామిలీ ఆడియన్స్ కూడా సినిమాకి వస్తున్నారు. సినిమా చూస్తూ అందరూ నవ్వుతూనే ఉన్నారు. అన్ని థియేటర్లలోనూ ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. నిర్మాతగా ఇలాంటి మరిన్ని మంచి సినిమాలు అందించాలని ఉంది' అని తెలిపారు.

'సీక్వెల్ కదా మొదటి భాగంతో పోలుస్తారనే టెన్షన్‌తోనే థియేటర్‌కి వెళ్ళాం. ప్రేక్షకులంతా ఎంజాయ్ చేస్తుంటే, దీనికోసమే కదా మనం సినిమా తీసింది అనే ఫీలింగ్ వచ్చింది' అని దర్శకుడు కళ్యాణ్ శంకర్ చెప్పారు.

ఆటలు

17 ఏండ్ల నిరీక్షణకు తెరపడింది. చెపాక్ స్టేడియంలో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ ఎట్టకేలకు ఓ విజయం సాధించింది. చెన్నై సూపర్‌కింగ్స్‌ను బ్యాట్‌తో, బంతితో చిత్తు చేసిన బెంగళూర్ 50 పరుగుల తేడాతో ఘన విజయం నమోదు చేసింది. 2008 ఐపీఎల్ తర్వాత చెపాక్‌లో సూపర్‌కింగ్స్‌పై రాయల్ చాలెంజర్స్‌కు ఇదే తొలి విజయం.

17 ఏండ్ల నిరీక్షణ ముగిసే!

- చెపాక్‌పై చెన్నై బెంగళూర్ ఘన విజయం
- ఛేదనలో చేతులెత్తేసిన సూపర్ కింగ్స్



నవతెలంగాణ-చెన్నై

రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ పంజా విసిరింది. ఐపీఎల్18 సీజన్లో వరుసగా రెండో విజయం సాధించింది. 17 ఏండ్లుగా సవాల్ విసురుతున్న చెపాక్ కోటను శుక్రవారం బద్దలుకొట్టింది. బ్యాట్‌తో, బంతితో మెరుగైన ప్రదర్శనతో సూపర్‌కింగ్స్ అదిరే విజయం సాధించింది. 197 పరుగుల ఛేదనలో చెన్నై సూపర్‌కింగ్స్ 146/8 పరుగులే చేసింది. ఓపెనర్ రచిన్ రవీంద్ర (41, 31 బంతుల్లో 5 ఫోర్లు), ఎం.ఎస్ ధోని (30, 16 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), రవీంద్ర జడేజా (25, 19 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) మెరిసినా.. సూపర్‌కింగ్స్‌కు పరాజయం తప్పలేదు. బెంగళూర్ బౌలర్లలో పేసర్ జోశ్ హాజిల్‌వుడ్ (3/21), యశ్ దయాల్ (2/18), లియాం లివింగ్‌స్టోన్ (2/28) వికెట్లు పడగొట్టారు. తొలుత బ్యాటింగ్ చేసిన రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 196 పరుగులు చేసింది. కెప్టెన్ రజత్ పాటిదార్ (51, 32 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీతో మెరువగా.. టిమ్ డెవిడ్ (22 నాటౌట్, 8 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు) స్లాగ్ ఓవర్లలో మూడు సిక్సర్లతో రాయల్ చాలెంజర్స్‌కు మంచి స్కోరు అందించాడు. సూపర్‌కింగ్స్ స్పిన్నర్ నూర్ అహ్మద్ (3/36), మతీశ పతిరణ (2/36) రాణించారు. చెన్నై సూపర్‌కింగ్స్‌కు సీజన్లో ఇదే తొలి పరాజయం.

క్రీడలతోనే ఆరోగ్య సమాజం!

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

నవతెలంగాణ-హైదరాబాద్

క్రీడలతోనే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమని, క్రీడలను ప్రోత్సహించటం అంటే భవిష్యత్ తరాలను నిర్మించటమేనని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న 4వ కెఐఓ కరాటే జాతీయ చాంపియన్‌షిప్ పోటీలకు మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, శాట్ చైర్మెన్ కే. శివసేనా రెడ్డితో కలిసి ఆయన శుక్రవారం హాజరయ్యారు. యువత వ్యసనాలకు దూరం ఉంటూ.. మైదానాలకు చేరువ కావాలని స్పీకర్ పిలుపునిచ్చారు. బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. 'సీఎం రేవంత్‌రెడ్డికి క్రీడలకు ఆసక్తి ఎక్కువ. క్రీడల ద్వారానే యువతలో, సమాజంలో మార్పు తీసుకురావచ్చని ఆయన ఆలోచన. అందుకు అనుగు ణంగానే రాష్ట్ర ప్రభుత్వం క్రీడాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని' అన్నారు. 'తెలంగాణలో గ్రామస్థాయి నుంచి ఆదరణ ఉన్న క్రీడ కరాటే. మండల కేంద్రాల్లోనూ శిక్షణ కేంద్రాలు ఉన్నాయి. జాతీయ స్థాయి పోటీలకు దిగ్విజయంగా



ఆతిథ్యం ఇస్తోన్న హైదరాబాద్.. భవిష్యత్ లో ఆసియా స్థాయి కరాటే పోటీలకు సైతం వేదికగా నిలవాలని' ఎమ్మెల్సీ, పీసీసీ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. శాట్ చైర్మెన్ కే. శివసేనారెడ్డి మాట్లాడుతూ..' జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడా ఈవెంట్లకు హైదరాబాద్ వేదికగా నిలుస్తోంది. ప్రపంచ శ్రేణి మౌళిక సదుపాయాలు, సౌకర్యాలు మన దగ్గర ఉన్నాయి. జాతీయ క్రీడా సమా ఖ్యలు ముఖ్యమైన టోర్నమెంట్ల నిర్వహణకు హైదరాబాద్ వైపు చూస్తున్నాయి. హైదరాబాద్‌ను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దు తామని' పేర్కొన్నారు. కరాటే పోటీలను తిలకించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్‌లు వేదికపైనే కరాటే మాస్టర్స్‌గా మారిపోయారు. బ్లాక్‌బెల్ట్ ధరించిన స్పీకర్, మంత్రి కరాటే నైపుణ్యం చాటి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. స్పీకర్, మంత్రికి కరాటే ఇండియా ఆర్గనైజేషన్ (కెఐఓ) గౌరవ ధ్రువపత్రాలు అందించింది.

ఫైనల్లో పెగులా, సబలెంక

- సెమీస్‌లో జకోవిచ్, టేలర్
- మయామి ఓపెన్ 2025

బెలారస్ భామ, మహిళల సింగిల్స్ టాప్ సీడ్ అరినా సబలెంక మయామి ఓపెన్ ఫైనల్లోకి ప్రవేశించింది. అమెరికా అమ్మాయి జెస్సికా పెగులా సైతం టైటిల్ పోరుకు చేరుకుంది. పురుషుల సింగిల్స్‌లో అగ్రశ్రేణి ఆటగాడు నొవాక్ జకోవిచ్ సెమీఫైనల్లోకి ప్రవేశించాడు.

మయామి (యుఎస్‌ఏ) : అరినా సబలెంక (బెలారస్) అదరగొట్టింది. టాప్ సీడ్‌గా బరిలోకి దిగిన బెలారస్ భామ మహిళల సింగిల్స్‌లో జోరు చూపిస్తోంది. మయామి ఓపెన్‌లో శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో ఇటలీ అమ్మాయి జాస్మిన్ పావొలినిపై వరుస సెట్లలో విజయం సాధించింది. 6-2, 6-2తో అలవోక విజయం నమోదు చేసిన సబలెంక.. మహిళల సింగిల్స్ ఫైనల్లోకి ప్రవేశించింది. ఆరో సీడ్ పావొలిని నుంచి ఆశించిన ప్రతిఘటన ఎదురు కాలేదు. మూడు ఏస్‌లు కొట్టిన పావొలిని.. ఒక్క బ్రేక్ పాయింట్ కూడా సాధించలేదు. ఆరు ఏస్‌లతో మెరిసిన సబలెంక నాలుగు బ్రేక్ పాయింట్లతో సత్తా చాటింది. పాయింట్ల పరంగా 66-44తో సబలెంక ఆధిపత్యం చెలాయించింది. ఓవరాల్‌గా సబలెంక 12 గేమ్ పాయింట్లు సాధించగా.. జాస్మిన్ పావొలిని నాలుగు గేమ్ పాయింట్లతోనే సరిపెట్టుకుంది. మహిళల సింగిల్స్ మరో సెమీఫైనల్లో నాల్గో సీడ్, అమెరికా అమ్మాయి జెస్సికా పెగులా మెరిసింది. ఫిలిప్పీన్స్ నయా సంచలనం అలెగ్జాండ్ర ఈయాలపై మూడు సెట్ల సమరంలో పైచేయి సాధించింది. 7-6(7-3), 5-7, 6-3తో పెగులా పైచేయి సాధించింది. వరుసగా గ్రాండ్‌స్లామ్ విజేతలను మట్టికరిపిస్తూ సెమీఫైనల్స్‌కు చేరుకున్న ఆసియా యంగ్‌స్టర్ అలెగ్జాండ్ర.. తొలి సెట్‌ను టైబ్రేకర్‌లో కోల్పోయింది.



పంటలకు మద్దతు ధరల చట్టం చేయాలి

- అన్ని రకాల వడ్లకూ మద్దతు ధర ఇవ్వాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి
- నల్లగొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా

నవతెలంగాణ -నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

రైతులు పండించిన పంటలకు మద్దతు ధరల చట్టం చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే, రాష్ట్రంలో అన్ని రకాల వడ్లనూ మద్దతు ధరకు కొనుగోలు చేసి బోనస్ చెల్లించాలని కోరారు. ప్రజాసమస్యల పరిష్కారం కోరుతూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో శుక్రవారం నల్లగొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా జరిగింది. ధర్నాలో రంగారెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయోత్పత్తులకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు రైతాంగ ఆత్మస్థైర్యాన్ని కుంగదీసే విధంగా ఉన్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరలు పుండు మీద కారం చల్లినట్టుగా ఉందన్నారు.

ఉత్పత్తి ఖర్చులకు 50 శాతం కలిపి మద్దతు ధరలు నిర్ణయించాలన్న ప్రతిపాదనను తుంగలో తొక్కి ఉత్పత్తి ఖర్చులకే 21 శాతం తగ్గించి ఎంఎస్‌పిని నిర్ణయించటం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నిధులను సాగుచేస్తున్న రైతులందరికీ విడుదల చేయాలని, రెండు లక్షల రూపాయల రుణమాఫీని మిగిలిన వారందరికీ వెంటనే చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు రెండు కోట్ల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని అన్నారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన రేషన్‌కార్డులు, పింఛన్లు, ఇందిరమ్మ ఇండ్లు ఎప్పటి వరకు ఇస్తారో నిర్దిష్టమైన కాలపరిమితి ప్రకటించాలన్నారు. ఎండిపోయిన పంటలను పరిశీలించి నష్టపరిహారం చెల్లించాలని, ధాన్యం కేంద్రాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు నాగార్జున అధ్యక్షత నిర్వహించిన ఈ ధర్నాలో రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నారి అయిలయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండ శ్రీశైలం, సయ్యద్ హాషం, పాలడుగు ప్రభావతి, సిహెచ్.లక్ష్మినారాయణ, వి.వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు గంజి మురళీదర్, పి.నర్సిరెడ్డి, మల్లం మహేష్, దండెంపల్లి సత్తయ్య, రవి, శశిధర్‌రెడ్డి, వినోద్, శ్రీను, సరోజ, అనురాధ, శంకర్, చంద్రమౌళీ, ఆనంద్, నగేష్, వెంకులు, వెంకన్న, సైదులు, బయ్యన్న, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్లు వేగవంతం చేయాలి

- బేస్‌మెంట్ పూర్తయిన ఇండ్లకు తక్షణమే చెల్లింపులు జరపాలి
- ఏ గ్రామంలోనూ తాగునీటి సమస్య రావొద్దు
- జూన్ నాటికి వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పూర్తి కావాలి
- మడికొండ డంపింగ్ యార్డుకు శాశ్వత పరిష్కారం : గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పైలట్ ప్రాజెక్టు గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. బేస్‌మెంట్ పూర్తయిన ఇండ్లకు తక్షణమే చెల్లింపులు జరపాలని ఈ సందర్భంగా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో వరంగల్ స్మార్ట్ సిటీ పనులు, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, తాగునీరు, ఇందిరమ్మ ఇండ్లు తదితరాంశాలపై పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లాల ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, అధికారులతో మంత్రి సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఈ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత అంశమని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని కలెక్టర్లు పని చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ప్రభుత్వం నాలుగు విడతల్లో చెల్లింపులు చేస్తోందని తెలిపారు. బేస్‌మెంట్‌లెవెల్ పూర్తయిన ఇండ్లకు మొదటి విడతలో లక్ష రూపాయిలు ఇస్తామన్నారు. ఇంటి స్థలం లేని అర్హత కలిగిన లబ్దిదారులకు రెండుగదుల ఇండ్లను కేటాయించాలనీ, అలాగే మొండి గోడలతో ఉన్న ఇండ్లను పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్ ముందుకు రాని పక్షంలో లబ్దిదారులే ఆ ఇండ్లను పూర్తి చేసుకోవడానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వమే చెల్లిస్తోందని తెలిపారు. లబ్దిదారులను ఎంపిక చేసి ఇండ్లను కేటాయించాలని సూచించారు. వేసవి కాలంలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధానంగా జిల్లా కలెక్టర్లు ఈ అంశానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జిల్లా అధికారులతో సమన్వయం చేసుకుని వారంలో మూడు రోజులపాటు గ్రామాల్లో పర్యటించాలని తెలిపారు. వచ్చే మూడు నెలలు చాలా కీలకమనీ, ప్రజలకు తాగునీటి సమస్య ఉంటుందన్నారు. నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయాలనీ, చెడిపోయిన బోర్లు, హ్యాండ్ పంప్‌లను తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ భవన నిర్మాణ పనులను రెండు నెలల్లో పూర్తిచేసి ఆ తర్వాత మరో నెలరోజుల్లో వైద్య సేవలకు అవసరమైన పరికరాలను అమర్చి జూన్ చివరినాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఆస్పత్రి అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణ ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు.

మడికొండ డంపింగ్ యార్డు సమస్యకు వారం రోజుల్లో తాత్కాలిక పరిష్కారం చూపించి ఆ తర్వాత శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. దీనికి సంబంధించి సీడీఎంఏ డైరెక్టర్ శ్రీదేవిని స్వయంగా అక్కడ పర్యటించి పరిష్కార మార్గాలను సూచించాలని ఆదేశించారు. వరంగల్, కరీంనగర్ రహదారి ప్రాంతంలో శాశ్వత డంపింగ్ యార్డు కోసం 150 నుంచి 200 ఎకరాల భూమిని సేకరించాలని కలెక్టర్లను ఆదేశించారు. వరంగల్ భద్రకాళి చెరువు పూడికతీత పనులను ఎట్టి పరిస్థితులలోను వర్షాకాలం ప్రారంభమయ్యేలోపు పూర్తిచేయాలన్నారు. వరంగల్ స్మార్ట్ సిటీ పనుల విషయంలో అధికారులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని మంత్రి సూచించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, యశస్విని రెడ్డి, దొంతి మాధవరెడ్డి, నాగరాజు, మురళీనాయక్, రామచంద్ర నాయక్, రేవూరి ప్రకాష్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణ, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య వరంగల్ మేయర్ గుండు సుధారాణి, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, ఆర్అండ్‌బీ సెక్రెటరీ హరిచందన, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.

సన్న బియ్యం సాధ్యమేనా..!



- ఏడాది అవసరాలకు సరిపడని ఖరీఫ్ ధాన్యం
- రూ.500 బోనస్ ఇచ్చినా పెరగని సన్నాల సాగు విస్తీర్ణం
- మొదటి ఆరునెలలకు సరిపడా సన్న బియ్యం నిల్వలు
- ఉగాది కానుకగా రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీకి శ్రీకారం
- కొత్త రేషన్‌కార్డుల కోసం 10 లక్షల దరఖాస్తులు పెండింగ్

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఉగాది పండగ సందర్భంగా పేదలందరికీ సన్న బియ్యం పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్దమవుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆహార భద్రతా కార్డుదారులందరికీ ఏప్రిల్ 1 నుంచి దొడ్డు బియ్యం బదులు సన్న బియ్యాన్ని పంపిణీ చేయనున్నట్టు ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఆ మేరకు ఖరీఫ్ సీజన్‌లో సేకరించిన సన్న ధాన్యాన్ని మరాడించి బియ్యం నిల్వల్ని గోదాముల్లో సిద్ధం చేస్తున్నారు. ఏడాదికి సరిపడినన్ని సన్న బియ్యం లేనందున యాసంగిలో సాగైన సన్న ధాన్యాన్ని సేకరించేందుకు పౌర సరఫరాల శాఖ ఏర్పాట్లు చేస్తోంది. సన్న బియ్యం పంపిణీ ప్రక్రియ ఎంతో మేలు చేసేది అయినప్పటికీ రాష్ట్ర అవసరాల మేరకు సన్న వరి సాగు కావట్లేదు. ఖరీఫ్, యాసంగి రెండు సీజన్లలో



యాసంగిలో సన్నాల సాగు తక్కువే

కలిపి కూడా రాష్ట్రానికి సరిపడినన్ని సన్న బియ్యం లభ్యమయ్యే పరిస్థితి లేదు. ప్రభుత్వం సన్న ధాన్యం మద్దతు ధరకు అదనంగా క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లిస్తున్నా రైతులు మాత్రం వాతావరణ పరిస్థితులు, పంట కాలం, పెట్టుబడులు, దిగుబడుల రీత్యా ఆశించిన మేరకు సన్న వరి సాగు వైపు మొగ్గట్లేదు. రాష్ట్రంలో కొత్తగా 10 లక్షల కుటుంబాలు కొత్త రేషన్‌కార్డుల కోసం ఎదురు చూస్తున్నాయి. వారందరికీ సన్న బియ్యం అందాలంటే కార్డుల్ని మంజూరు చేయాల్సి ఉంది.



ఉగాది నుంచి సన్న బియ్యం పంపిణీ షురూ

ఎన్నికల్లో చెప్పిన విధంగా రేషన్‌కార్డు దారులందరికీ సన్న బియాన్ని పంపిణీ చేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. రాష్ట్రంలో 89.96 లక్షల ఆహార భద్రతా కార్డులున్నాయి. వీటిల్లో 2.81 కోట్ల మంది లబ్దిదారులు నమోదై ఉన్నారు. ఏప్రిల్ నుంచి రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రేషన్‌కార్డుల దరఖాస్తుదారులకు కూడా కొత్తగా మంజూరు చేస్తామంటున్నారు. సుమారు 10 లక్షల కుటుంబాలకు కొత్త కార్డులివ్వాల్సి ఉంటుంది. వాటిల్లో మరో 30 లక్షల మంది వరకు లబ్దిదారులు చేరే అవకాశముంది. వీరందరికి ప్రభుత్వం సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తామని చెబుతోంది. ఉగాది పండగ రోజున సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు పథకాన్ని ప్రారంభించనున్నారు.

అవసరాలకు సరిపడని సన్న వరి సాగు

రాష్ట్రంలో ఉన్న రేషన్‌కార్డుదారులందరికీ సన్న బియ్యాన్ని పంపిణీ చేయాలంటే ఏడాదికి 23 నుంచి 24 లక్షల టన్నుల బియ్యం అవసరముంటుందని పౌర సరఫరాల శాఖ అంచనా వేసింది. ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన సన్న రకం ధాన్యాన్ని 24 లక్షల టన్నుల మేరకు సేకరించారు. సేకరించిన ధాన్యాన్ని మిల్లర్లకు అలాట్‌మెంట్ చేశారు. ఖరీఫ్ ధాన్యాన్ని మర ఆడించే పనులు వేగంగా సాగుతున్నాయి. ఖరీఫ్ ధాన్యాన్ని బియ్యంగా మారిస్తే 15 నుంచి 16 లక్షల టన్నుల మేరకు బియ్యం అందుబాటులోకి వచ్చే అవకాశముంది. అంటే ఈ ఏడాదికి కావాల్సిన 24 లక్షల టన్నుల బియ్యం ఖరీఫ్ ధాన్యం నుంచి చేతికందే పరిస్థితి లేదు. మొదటి ఆరు నెలలకు మాత్రం కొరత లేకుండా ఉంటుంది. మిగతా కాలానికి కావాల్సిన సన్న బియ్యాన్ని యాసంగి సీజన్‌లో సాగు చేసిన సన్న ధాన్యాన్ని సేకరించాలని పౌర సరఫరాల శాఖ బావిస్తుంది. 7 లక్షల టన్నుల బియ్యాన్ని సిద్ధం చేసుకోవాల్సి ఉండగా.. యాసంగిలో సాగైన సన్న వరి పరిమితంగానే ఉంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో 2050 రేషన్ దుకాణాలున్నాయి. 9,03,709 రేషన్‌కార్డులున్నాయి. వీటికి ప్రతి నెలా 15,929 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో 3.10 లక్షల రేషన్‌కార్డుల్లో నమోదైన 8,95,457 మందికి 5 వేల టన్నుల సన్న బియ్యం అవసరముంటుంది. ఈ జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో కేవలం 3 వేల క్వింటాళ్ల సన్న ధాన్యాన్నే సేకరించారు. యాసంగిలోనూ 3101 ఎకరాల్లోనే సన్న వరి సాగు చేశారు. సిద్దిపేట జిల్లాలో 3.78 లక్షల రేషన్‌కార్డులుండగా వీటిల్లో 12.33 లక్షల మంది లబ్దిదారులున్నారు. 7 వేల టన్నుల బియ్యం పంపిణీ చేయాలి. మెదక్ జిల్లాలో 2,14,155 రేషన్‌కార్డులుండగా వీటిల్లో 6.84 లక్షల మంది లబ్దిదారులున్నారు. 4367 టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఈ రెండు జిల్లాల్లోనూ ఖరీఫ్, యాసంగి కలిపి సన్న రకం వరి సాగు జిల్లా అవసరాలకు సరిపడా లేవు.

రీసైక్లింగ్ దందా ఆగేనా..?

సన్న బియ్యం పంపిణీ ద్వారా దొడ్డు బియ్యం రీసైక్లింగ్ దందాకు తెర పడుతుందని ప్రభుత్వం చెబుతోంది. దొడ్డు బియ్యాన్ని రేషన్‌షాపుల్లో పంపిణీ చేస్తున్నారు. అట్టి బియ్యాన్ని బ్లాక్‌కు తరలించే మిల్లర్లు తర్వాత రీసైక్లింగ్ చేసి సన్న బియ్యంగా మారుస్తున్నారు. దొడ్డు బియ్యాన్నే సన్న బియ్యంగా మార్చి సీఎంఆర్ బియ్యంగా ఇస్తూ లాభాలు గడిస్తున్నారు. సన్న బియ్యం పంపిణీ చేసేందుకు అట్టి బియ్యాన్ని మిల్లర్ల నుండే సేకరించారు. సన్న ధాన్యం ఇచ్చి బియ్యాన్ని తీసుకుంటారు. అప్పుడు దొడ్డు రకం బియ్యాన్ని సన్నాలుగా మార్చి సీఎంఆర్ కింద ప్రభుత్వానికి ఇచ్చే ప్రమాదం లేకపోలేదని పలువురు పేర్కొంటున్నారు.

సన్న బియ్యం పంపిణీకి సిద్ధం: అంబదాస్ రాజేశ్వర్, సివిల్ సప్లయ్ మేనేజర్

ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్‌కార్డులున్న వారికి ఏప్రిల్ నుంచి సన్న బియ్యం పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఖరీఫ్ సీజన్‌లో సేకరించిన సన్న రకం ధాన్యాన్ని మర ఆడించే ప్రక్రియ పూర్తికావస్తుంది. సేకరించిన సన్న బియ్యాన్ని జిల్లాలోని స్టాక్ పాయింట్లలో నిల్వ చేశాం. యాసంగిలోనూ సన్న వడ్ల సేకరణకు ఏర్పాట్లు చేస్తున్నాం.

ఎంఎల్ఎస్ పాయింట్లకు చేరిన సన్నబియ్యం

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆయా జిల్లాల కలెక్టర్లు, జిల్లా పౌర సరఫరా అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఎంఎల్ఎస్ పాయింట్లకు సన్నబియ్యం చేరింది. డీలర్లు వారి కోటాను తీసుకున్నారు. గత ప్రభుత్వం రేషన్‌షాపులు, హాస్టళ్లలో సన్నబియ్యం పంపిణీ చేశామని ప్రచారం చేసినా ఆచరణలో అమలు చేయలేదు. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేసిన ప్రకటనలో భాగంగా ఇప్పటికే అన్ని జిల్లాల్లో సన్నబియ్యం పంపిణీకి ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. గతంలో దొడ్డు బియ్యం పంపిణీ చేసేవారు.

సన్నబియ్యం పంపిణీకి అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేయడం పట్ల పేదల్లో హర్షాతిరేకం వ్యక్తమవుతున్నది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, హన్మకొండ జిల్లాల్లో ఇప్పటికే 9,052.189 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం పంపిణీకి సిద్దంగా ఉంది. ఈ రెండు జిల్లాల్లో 4,94,596 రేషన్ కార్డులుండగా, 923 రేషన్ షాపులు ఉన్నాయి.

ఉగాదికి పస్తులేనా?

- 3,874 మంది కాంట్రాక్టు ఉద్యోగుల ఎదురుచూపులు
- పర్మినెంట్ ఫైలూ పెండింగ్‌లోనే
- చెల్లించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్కకు వినతి

'ఉపాధి' ఉద్యోగులకు 3 నెలలుగా అందని జీతాలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఉపాధి హామీ చట్టంలో పనిచేసే కూలీలకే కాదు ఉద్యోగులకూ సర్కారు వేతనాలివ్వడం లేదు. ఒకటెండ్రు కాదు మూడు నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో పడుతున్న వ్యథలు అన్నీఇన్నీ కావు. జీతాలు అందకున్నా..అప్పులు చేసుకుని మరీ బతుకులు వెళ్లదీస్తున్నారు. 19 ఏండ్ల నుంచి పనిచేస్తున్న తమను రాష్ట్ర సర్కారు ఎప్పటికైనా పర్మినెంట్ చేయకపోతుందా? అనే చిన్న ఆశతో 3,874 మంది కాంట్రాక్టు కార్మికులు కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. 'జీతాలివ్వకుంటే ఎట్ల బతకాలి? ఉగాదికి పస్తులుండాల్సిందేనా?' అంటూ ఆ కాంట్రాక్టు కార్మికులు వాపోతున్నారు. జీతాలిప్పించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క)ను చేతులెత్తి వేడుకుంటున్నారు.

ఉపాధి హామీ చట్టంలో గ్రామాల్లో కూలీలకు పనులు గుర్తించి ఫైనల్ చేయడం, బిల్లులు క్లియర్ చేయడం ఎస్ఆర్‌డీఎస్ కింద కాంట్రాక్టు పద్ధతిలో 3,874 మంది ఉద్యోగులు 19 ఏండ్ల నుంచి పనిచేస్తున్నారు. వారిలో 396 మంది అడిషనల్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు 2072 మంది, ఇంజినీరింగ్ కన్సల్టెన్సీలు, జూనియర్ ఇంజినీర్లు 356 మంది, కంప్యూటర్ ఆపరేటర్లు/అకౌంట్స్ అసిస్టెంట్లు 887 మంది, ప్లాంటేషన్ సూపర్‌వైజర్లు 27 మంది, కోర్సు డైరెక్టర్-సీఎల్ఆర్‌సీ 18 మంది, అడిషనల్ డీఆర్‌పీ 14 మంది, మేనేజర్ హెచ్/డీబీటీ/అకౌంట్స్‌లో 23 మంది, అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్లు పది మంది, ప్లాంటేషన్ మేనేజర్లు ముగ్గురు, కోర్సు డైరెక్టర్లు-డీఎల్ఆర్‌సీలు నలుగురు, ప్రాజెక్టు ఆఫీసర్లు 23 మంది, స్టేట్ ప్రోగ్రామింగ్ మేనేజర్లు ముగ్గురు, ఒక లా ఆఫీసర్, ఎంఐఎస్/ఐటీ మేనేజర్లు ఇద్దరు, ఫైనాన్స్ అకౌంట్ మేనేజర్ ఒకరు, ఈజీఎస్ ప్రోగ్రామ్ మేనేజర్ ఒకరు, ప్రాజెక్టు ఎగ్జిక్యూటీవ్‌లు ఇద్దరు, ఏటీఈ (ఎన్ఆర్ఎం) ఒకరు, ఏటీఈ (ఎంఐఎస్/ఐటీ) ఒకరు, అడ్మినిస్ట్రేషన్ సీనియర్ ఆఫీసర్ ఒకరు, అసిస్టెంట్ ప్రాజెక్టు ఎగ్జిక్యూటీవ్‌లు ఏడుగురు, డాటా ప్రాసెసింగ్ ఆఫీసర్లు ఎనిమిది మంది, కంప్యూటర్ ఆపరేటర్లు/డీఈఓలు 11 మంది, జూనియర్ అసిస్టెంట్లు ఒకరు, డిస్పాచర్ కమ్ ఆఫీస్ సబార్డినేటర్ ఒకరు ఉన్నారు. వీరంతా ఉపాధి హామీ కూలీలతో పనులను చేయించడంలో, బిల్లింగ్ చేయడంలో, కూలీలకు వేతనాలు అందించడంలో జరిగే అన్ని ప్రక్రియల్లోనూ పాలు పంచుకుంటారు. ఉపాధి హామీ పనులను క్రమం తప్పకుండా చేయిస్తూ కేంద్రం నుంచి వీలైనంత మేరకు ఎక్కువ నిధులను రప్పించడంలో వీరే కీలక భూమిక పోషిస్తున్నారు. ఉపాధి హామీ పనులు, హరితహారం, రైతు వేదికలు, శ్మశాన వాటికలు, డంపింగ్ యార్డులు, నీటి నిల్వ పనులు, పండ్ల తోటల పెంపకం, మల్బరీ తోటల పర్యవేక్షణ, నర్సరీల నిర్వహణ, ఇలా 220 రకాల పనులను పర్యవేక్షిస్తున్నారు. 16 శాఖలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఇంత పని చేస్తున్న వీరికి జీతాలు మాత్రం సకాలంలో అందట్లేదు. రాష్ట్ర సర్కారు డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించిన వేతనాలను పెండింగ్‌లో పెట్టింది. రెండు రోజులైతే మార్చి నెల కూడా పూర్తవుతుంది. ఈ నెల 31న ఉగాది పండుగ ఉన్న విషయం విదితమే. వేతనాల గురించి ఆఫీసర్ల చుట్టూ తిరుగుతున్నా ఎవ్వరూ పట్టించుకోని పరిస్థితి. 'మూడు నెలల నుంచి జీతాలివ్వకపోతే ఎలా బతకాలి? ఉగాదికి పస్తులుం డాల్సిందేనా? సీతక్కా దండం పెడుతున్నాం వెంటనే వేతనాలను ఇప్పించండి' అంటూ వారు వేడుకుంటున్నారు.

పర్మినెంట్ హామీని విస్మరించిన కాంగ్రెస్ సర్కార్

బీఆర్ఎస్ ప్రభుత్వం 2014 కంటే ముందు నుంచి పలుశాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేసింది. గ్రామీణాభివృద్ధి శాఖలో ఉపాధి హామీ చట్టం నిర్వహణలో పనిచేస్తున్న 3,874 మంది ఉద్యోగులను మాత్రం విస్మరించింది. 19 ఏండ్ల నుంచి పనిచేస్తున్న పర్మినెంట్ చేయలేదన్న అంశాన్ని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఒక అస్త్రంగా మార్చుకున్నది. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పర్మినెంట్ చేస్తామనీ, పేస్కేలు అమలు చేస్తామని హామీనిచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం వచ్చిన తొలినాళ్లలో వీరి పర్మినెంట్ విషయంపై కొంత హడావిడి నడిచింది. ఆ తర్వాత ఏమైందో ఏమోగానీ ఉద్యోగుల పర్మినెంట్ ఫైలు ఉన్నతస్థాయి అధికారుల దగ్గర పెండింగ్‌లో పడిపోయింది. ఏడాదిగా ఒక్కడుగు కూడా ముందుకు పడలేదు.



తాగునీటిపై అప్రమత్తంగా ఉండాలి

మంత్రి సీతక్క ఆదేశం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

వేసవి నేపథ్యంలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. వారంలో నాలుగు రోజులు గ్రామీణ ప్రాంతాల్లోనే ఉండాలని స్పష్టం చేశారు. శుక్రవారం మిషన్ భగీరథ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసమావేశానికి ఆయా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మండలాన్ని యూనిటీగా తీసుకుని ఎంపీడీవో, ఇంట్రా ఎఈ, గ్రిడ్ ఎఈ, మండల స్పెషల్ ఆఫీసర్‌లతో కమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కమిటీలు సమన్వయంతో పనిచేసి ఎక్కడ తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని చెప్పారు. వరుసగా పండుగలు వస్తున్నాయనీ, ప్రజలంతా ఊర్లలోనే ఉంటారని వివరించారు.మూడు రోజుల పాటు తాగు నీటి సరఫరాకు ఇబ్బందులు రావద్దని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో వినియోగించుకునే విధంగా ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయిస్తున్నామని అన్నారు. పంచాయతీరాజ్ రోడ్లు, ఆర్ అండ్ బీ రోడ్లు, విద్యుత్ పనులతో మిషన్ భగీరథ పైపులు దెబ్బతినకుండా చూడాలని చెప్పారు. జిల్లా కలెక్టర్లు, వర్క్ ఇన్స్పెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని వివరించారు. స్థానికంగా నీటి వనరులు అందుబాటులో ఉన్నచోట బోర్లను అద్దెతీసుకుని నీటిని అందించాలని చెప్పారు. గత పదేండ్లల్లో వేల సంఖ్యలో బోర్లను పట్టించుకోలేదని గుర్తు చేశారు. ఎమ్మెల్యేలతో మిషన్ భగీరథ అధికారులు సమావేశం కావాలనీ, వారి సలహాలు, సూచనలు పాటించాలని చెప్పారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఇంజినీర్ ఇన్ చీఫ్ జి కృపాకర్‌రెడ్డి, సీఈ చెన్నారెడ్డి, ఎస్ఈ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భగీరథ బోర్డు పునరుద్ధరణ

మిషన్ భగీరథ డైరెక్టర్లతో కూడిన బోర్డు సమావేశం శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. తాగునీటితోపాటు 23 అంశాలపై బోర్డు చర్చించింది. కొత్త బోర్డును ఏర్పాటు చేశారు. చైర్మెన్‌గా మంత్రి సీతక్క, డైరెక్టర్లుగా డిఎస్ లోకేష్‌కుమార్, టికె శ్రీదేవి, ఇ సృజన, జి కృపాకర్‌రెడ్డి, జి అనిల్‌కుమార్, పి. వెంకటేశ్వర్‌రావు, పి. శ్రీనివాసరెడ్డి, జే మధుబాబు ఉన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా చలివేంద్రాలు

రాష్ట్రవ్యాప్తంగా ఎండాకాలం కారణంగా 4818 చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్టు మంత్రి సీతక్క తెలిపారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ వీటిని అందుబాటులోకి తెచ్చినట్టు చెప్పారు. ఆయా పనుల నిమిత్తం బయటకు వచ్చిన వారి కోసం చలివేంద్రాల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నటు చెప్పారు.

ఆఫ్లేట్ల కదలికలే కారణం



(మొదటిపేజీ తరువాయి)

శక్తి విడుదలై భూ ఉపరితలంపైకి వస్తుంది. భూమి యొక్క వెలుపలి కవచమైన లిథోస్పియర్ పెద్ద పెద్ద పలకలుగా విభజించబడి వుంటుంది. ఈ పలకలు చాలా నెమ్మదిగా కదులుతుంటాయి. ఇవి ఒకదానిని మరొకటి ఢీ కొన్నపుడు లేదా దూరంగా జరిగినపుడు, రెండు పలకలు రాసుకున్నపుడు పెద్ద మొత్తంలో శక్తి ఉద్భవిస్తుంది. ఈ శక్తి భూకంప తరంగాలుగా విడుదలవుతుంది. దాంతో భూమి ఒక్కసారిగా కంపిస్తుంది. అయితే సహజమైన ఈ కారణాలతో పాటు మానవ కార్యకలాపాలు కూడా భూ లోపలి పొరలపై తీవ్రమైన ఒత్తిడి రాజేసి ప్రకంపనలకు కారణమవుతున్నారని భూ విజ్ఞాన శాస్త్రవేత్తలు తెలిపారు. భారీ నీటి నిల్వ ప్రాజెక్టులు, గనుల తవ్వకాలు వంటివి వీటిలో ముఖ్యపాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు.

సాగింగ్ ఫాల్ట్ అంటే...

ఇండియన్ ప్లేట్, బర్మా మైక్రో ప్లేట్ మధ్య గల ప్రధాన సరిహద్దు పాయింట్ అయిన సాగింగ్ ఫాల్ట్ పొడవునా మయన్మార్ ప్రాంతం వుంది. భూమి పొరల అమరికలో లోపాలు వుండడాన్నే ఫాల్ట్ అని పిలుస్తారు. అందువల్లనే ఇక్కడ భూకంపాలు ఎక్కువగా సంభవిస్తూంటాయి. 1200 కిలోమీటర్ల పొడవునా గల ఈ ఫాల్ట్ కారణంగా మయన్మార్ అంతటా భూమిలోపల సెస్మిక్ యాక్టివిటీ ఎక్కువగా జరుగుతూ వుంటుంది. ఈ ప్లేట్లు ఏడాదికి 11 మిల్లీమీటర్లు నుండి 18 మిల్లీమీటర్ల చొప్పునే కదులుతూ వుంటాయి. కాలక్రమంలో నిరంతరంగా ప్లేట్ల కదలిక వల్ల ఒత్తిడి గణనీయంగా పేరుకుపోతుంది. అలా పేరుకుపోయిన ఒత్తిడి, ఒక్కసారిగా శక్తి రూపంలో విడులవుతుంది. అప్పుడు భూకంపం సంభవిస్తుంది.

వందేండ్లలో 14 భూకంపాలు

ఈ సాగింగ్ ఫాల్ట్ కారణంగా మయన్మార్‌లో భూకంపాలు ఎక్కువగా సంభవిస్తూ వుంటాయి. అందుకే ఈ ప్రాంతాన్ని రెడ్ జోన్ అంటారు. గత వందేండ్లలో ఈ ప్రాంతంలో 6 కంటే తీవ్రత ఎక్కువగా వున్న భూకంపాలు 14 వరకు వచ్చాయి. 1946లో వచ్చిన భూకంపం తీవ్రత 7.7 కాగా, 1956లో 7.1 తీవ్రత నమోదైంది. 1988లో, 2004ల్లో వచ్చిన భూకంపాల్లో వందలాదిమంది మరణించారు. 2011లో, 2016లో, తాజాగా 2025లో భూకంపాలు వచ్చాయి.



అగ్రకులాలదే ఆధిపత్యం

- హైకోర్టు జడ్జిల నియామకాల్లో వారిదే పైచేయి
- 2018 నుంచి 77 శాతం మంది అపాయింట్
- ఎస్సీలు మూడు శాతం.. ఎస్టీలు 2.2 శాతం
- ఓబీసీలు 12.4 శాతమే : కేంద్ర న్యాయమంత్రిత్వ శాఖ వెల్లడి

న్యూఢిల్లీ : దేశ జనాభాలో అత్యధిక శాతం వాటాను కలిగి ఉన్న ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు న్యాయరంగంలోనూ అన్యాయమే ఎదురవుతున్నది. దేశవ్యాప్తంగా హైకోర్టు వంటి ఉన్నత న్యాయస్థానాల్లో జడ్జిల నియామకాల్లో పెత్తందారీ కులాలకు చెందినవారి ఆధిపత్యమే నడుస్తున్నది. 2018 నుంచి హైకోర్టు జడ్జిలుగా నియమితులైనవారిలో దాదాపు 77 శాతం మంది ఈ వర్గంవారే కావటం గమనార్హం. పార్లమెంటులో సాక్షాత్తూ కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ చెప్పిన గణాంకాలే దీనిని స్పష్టం చేస్తున్నది. ఆర్జేడీ ఎంపీ మనోజ్ కుమార్ ఝా అడిగిన ప్రశ్నకు స్పందించిన సంబంధిత మంత్రిత్వ శాఖ ఈ సమాధానాన్ని వెల్లడించింది.

కేంద్రం సమాచారం ప్రకారం.. నియామకాల విషయంలో కులాలవారీగా సమాచారం అందుబాటులో లేదు. ఎందుకంటే.. సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జిలు రాజ్యాంగంలోని ఆర్టికల్స్ ప్రకారం నియమితులవుతారు. ఇది కుల ఆధారిత రిజర్వేషన్లను కల్పించదు. అయితే, హైకోర్టు జడ్జి స్థానాలకు సిఫారసు చేయబడినవారి సామాజిక నేపథ్యం వివరాలు అందించటం 2018 నుంచి తప్పనిసరైంది. దీంతో కేంద్రం ఈ వివరాలను వెల్లడించిందని కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తెలిపారు.

2018 నుంచి హైకోర్టు జడ్జిలుగా నియమితులైన 715 మందిలో 551 మంది జనరల్ కేటగిరికి చెందినవారే. 22 మంది (మూడు శాతం) ఎస్సీలు, 16 మంది (2.2 శాతం) ఎస్టీలు ఉన్నారు. అలాగే, ఓబీసీ నుంచి 89 మంది (12.4 శాతం) మంది ఉన్నారు. కాగా, ఇదే డేటాను పార్లమెంటు స్టాండింగ్ కమిటీ ఆగస్టు, 2023లో సమర్పించటం గమనార్హం.



మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్‌గుల్ గ్రామంలోని భాగ్యనగర్ రైతు సేవ సహకార సంఘం చైర్మెన్ మర్రి నర్సింహా రెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి రైతు ఋణమాఫీ చేయించాలని కోరుతూ శుక్రవారం జిల్లెలగూడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. వినతి అందజేసిన వారిలో బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి, సీనియర్ నాయకులు భీమిడి జంగారెడ్డి తదితరులు ఉన్నారు.

నవలంగాణ- బడంగ్‌పేట్



ఎమ్మెల్సీ బసవ రాజు సారయ్య రజకుల సమస్యలపై శుక్రవారం శాసన మండలిలో మాట్లాడారు. ఈ సందర్భంగా రజక సంఘం రాష్ట్ర నాయకులు మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ గ్రామానికి చెందిన బాల్ రాజ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీని మర్యాద పూర్వకంగా కలసి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

నవతెలంగాణ- బడంగ్‌పేట్

కలసికట్టుగా ఉంటేనే ఏదైనా సాధించగలం



- వైశ్యులు ఎక్కడ ఉంటే ఆ ప్రాంతం సుభిక్షంగా ఉంటుంది
- మాజీ ఎంపీ టీజీ వెంకటేష్

నవతెలంగాణ-నాగోల్

వైశ్యులు ఎక్కడ ఉంటే ఆ ప్రాంతం సుభిక్షంగా ఉంటుందని, కలిసికట్టుగా ఉంటేనే ఏదైనా సాధించగలం అని మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహా సభ మహిళా విభాగ్ మహాసభ మహిళా మహోత్సవం నాగోల్‌లోని పీఎంఆర్ కన్వెన్షన్‌లో శుక్రవారం ఘనంగా జరిగింది. తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు డా. ఉప్పల శారద, జనరల్ సెక్రటరీ కాచం సుష్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి టీజీ వెంకటేష్, ఎల్బీనగర్ శాసనసభ సభ్యుడు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాడి లక్ష్మీనారాయణ, వి 3ఛానల్, విశ్వంభరా దినపత్రిక, కాచం ఫౌండేషన్ అధినేత కాచం సత్యనారాయణ గుప్త, స్టేట్ ఉమెన్స్ కో-ఆపరేటివ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ బండ్రు శోభారాణి, ఇండియన్ కూచిపూడి ఎక్సోనెంట్ అండ్ మ్యూజిక్ టీచర్ పద్మజా రెడ్డి, ప్రముఖ గాయని కౌసల్య తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటికి ఇల్లాలే అందం, మహిళ బాగుంటేనే సమాజం బాగుంటుందని, సమాజంలో మహిళ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించి ముందుకెళ్లాలని సూచించారు. ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం అన్నట్టుగా.. ఒక మహిళ విద్యావంతురాలై సమాజం కోసం తోడ్పడుతూ అనేక వేల మందిని ప్రోత్సహిస్తూ వారిని అభివృద్ధి పథంలో నడిపించే విధంగా ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగ్ అడిషనల్ జనరల్ సెక్రటరీ సామ్రాజ్యలక్ష్మి, మాజీ ప్రెసిడెంట్ అంబాల లక్ష్మి భవాని, రాయపూడి తిరుమలేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాన్ని పటిష్ట పరిచేందుకు

కృషి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

నవతెలంగాణ-తుర్కయంజాల్

వ్యవసాయ రంగాన్ని పటిష్ట పరిచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. తుర్కయంజాల్‌లోని రైతు సేవా సహకార సంఘం కేంద్ర కార్యాలయంలో టెస్కాబ్ వైస్ చైర్మెన్, డీసీసీబీ చైర్మెన్ కొత్తకుర్మ సత్తయ్య అధ్యక్షతన శుక్రవారం 52వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రంగారెడ్డి హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో రైతు ప్రభుత్వం నడుస్తోందని అన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు అనేక చర్యలు చేపడుతోందన్నారు. మాసాబ్‌చెరువు వ్యవహారంపై అసెంబ్లీలో లేవనెత్తగానే హైడ్రా అధికారులు హుటాహుటిన చెరువులో వేసిన రోడ్డును తొలగిస్తున్నారని అన్నారు. అలాగే కోహెడలో త్వరలోనే ప్రపంచ స్థాయి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ రాబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. సుమారు రూ.4వేల కోట్లతో మార్కెట్ నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నామని అన్నారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పవర్ వీడర్లు మినీ ట్రాక్టర్లు, టార్పాలిన్లు, నూర్పిడి యంత్రాలను సబ్సిడీపై ఇచ్చేందుకు చర్చిస్తాం..

కొత్తకుర్మ సత్తయ్య మాట్లాడుతూ రైతులకు సబ్సిడీపై పవర్‌వీడర్లు మినీ ట్రాక్టర్లు, టార్పాలిన్లు, నూర్పిడి యంత్రాలను ఇచ్చేందుకు డీసీసీబీలో చర్చిస్తామని తెలిపారు. ధాన్యం ఆరబోసుకునేందుకు కల్లాలు ఏర్పాటు చేసుకునే రైతులకు సహాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌సీఎస్ వైస్ చైర్మెన్ కొత్త రాంరెడ్డి, డైరెక్టర్లు వంగేటి లక్ష్మారెడ్డి, శీలం లక్ష్మమ్మ చెక్క లక్ష్మమ్మ చాపల యాదగిరి, సామ సంజీవరెడ్డి, సామ సత్యనారాయణరెడ్డి, కుతాడి నర్సింగరావు, కాంగ్రెస్ నాయకులు గుండ్లపల్లి ధన్‌రాజ్‌గౌడ్, టీపీసీసీ సభ్యులు, కాకుమాను సునీల్, కుంట గోపాల్ రెడ్డి, బీజేపీ నాయకులు కందాడ బలదేవరెడ్డి, ఎలిమినేటి నర్సింహారెడ్డి, బ్యాంకు సీఈవో వై.రాందాస్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



ఉగాది పురస్కారం అందుకున్న ఉత్తమ జర్నలిస్టు



నవతెలంగాణ-హయత్ నగర్

ఉగాది పురస్కారం సందర్భంగా హయత్‌నగర్ సీనియర్ పాత్రికేయుడు దార్ల శ్రీనివాస్‌కు ఉత్తమ జర్నలిస్టుగా అరుదైన గౌరవం దక్కింది. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం అంగడి కుర్మపల్లి గ్రామానికి చెందిన అతను.. ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా హయత్ నగర్‌లో నివసిస్తున్న తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం రంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రెటరీ, ఓ దినపత్రిక రిపోర్టర్ దార్ల శ్రీనివాస్‌కు తెలుగు ఉగాది బిజినెస్ ఇన్ ఫ్లూ యన్సర్స్ అవార్డు-2025 వరించింది. భారత్ టుడే న్యూస్ ఛానల్, ప్రజా జ్యోతి, ఇండియన్ క్రానికల్, యోయో టీవీ, ఎస్ బి ఎం ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో క్లాసిక్ గార్డెన్‌లో తెలుగు ఉగాది పురస్కారాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖ సంఖ్యాశాస్త్ర నిపుణులు దైవజ్ఞ శర్మ జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు, ఓ పత్రిక రిపోర్టర్ దార్ల.శ్రీనివాస్ సేవలను గుర్తించి ఉత్తమ జర్నలిస్టుల కోటాలో ఉగాది పురస్కారాల కమిటీ నిర్వాహకుల చేతుల మీదుగా ఆయనకు ఉగాది పురస్కారాన్ని అందజేశారు. అనంతరం దార్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ఉగాది పురస్కారాల కార్యక్రమంలో తన పేరును చేర్చడం పట్ల నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. తర్వాత చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

కుల ధ్రువీకరణ పత్రాలు వెంటనే ఇవ్వాలి



- డీవైఎఫ్ఐ హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి కృష్ణ నాయక్

నవతెలంగాణ - చంపాపేట్

డీవైఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కుల ధ్రువీకరణ పత్రాలను వెంటనే ఇవ్వాలని బండ్లగూడ మండలం డిప్యూటీ ఎమ్మార్వో రాధికకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి కృష్ణ నాయక్ మాట్లాడుతూ.. విద్యార్థులకు, యువకులకు, నిరుపేదలకు ప్రభుత్వం అందించే స్కాలర్షిప్ రెనువల్స్, రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ఆదాయం, క్యాస్ట్, స్థానిక సర్టిఫికెట్స్ అవసరం అని చెప్పారు. అంతేకాదు ఈ మధ్య ప్రవేశ పెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కులానికి చెందిన వారికి వెంటనే ధ్రువపత్రాలను ఇవ్వాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో డీవైఎఫ్ఐ నాయకులు శ్రీను, రాజేందర్, మహేష్, మురారి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతి,

సాంప్రదాయాలకు నిదర్శనమే వనభోజనాలు



- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు నిదర్శనమే వనభోజనాలు అని మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ నాదర్గుల్ గ్రామంలోని మాజీ సర్పంచ్ సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో మామిడి తోటలో డ్వాక్రా మహిళలందరూ శుక్రవారం ఏర్పాటు చేసిన వనభోజన కార్యక్రమానికి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ సాంప్రదాయాలలో వనభోజనాలు అనగా ప్రకృతిలో సాధారణంగా అడవి లేదా ఉద్యానవనంలో కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా సహచరులతో కలిసి భోజనం చేయడం అని వివరించారు. ఇది ముఖ్యంగా పండుగలు, ప్రత్యేక సందర్భాలు లేదా పర్యాటక యాత్రల సమయంలో ఆచరించే ఆనందదాయకమైన సాంప్రదాయమన్నారు. తెలుగు సంస్కృతిలో వనభోజనాలు ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉందన్నారు. ఉగాది, శ్రీరామనవమి లేదా ఇతర పండుగల సమయంలో కుటుంబ సభ్యులు మరియు స్నేహితులతో కలిసి ప్రకృతిలో సమయాన్ని గడిపి స్వయంగా తయారు చేసిన వంటలతో ఆనందంగా భోజనం చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, డ్వాక్రా మహిళలు, తదితర నాయకులు పాల్గొన్నారు.

ఓవైసీ బ్రదర్స్ మెప్పు కోసం

పని చేసేవి ఆ రెండు పార్టీలే..

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ రెడ్డి



నవతెలంగాణ - మీర్‌పేట్

బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీలు ఎంఐఎం ఓవైసీ బ్రదర్స్ మెప్పు కోసమే పనిచేసే పార్టీలని తెలంగాణ రాష్ట్ర బీజేపీ పార్టీ అధికార ప్రతినిధి రాణి రుద్రమ రెడ్డి విమర్శించారు. పెంచిన ఇంటి పన్నులను తగ్గించాలని బీజేపీ అధ్యక్షులు పసునూరి బిక్షపతి చారి, తులసి ముఖేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో రెండవ రోజు రిలే దీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా రాణి రుద్రమ రెడ్డి, గంగపురం వెంకట్ రెడ్డి మద్దతు తెలియజేస్తూ సాంఘిభావం తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలో ఓవైసీ బ్రదర్స్ మెప్పు కోసం పనిచేసే పార్టీలే తప్ప.. పేద ప్రజల అవసరాలు పట్టించుకునే పార్టీలు కావని విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచేసిందని, ఇప్పుడు రేవంత్ సర్కార్ కూడా అదే పాలన కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. అప్పుల మీద అప్పులు చేస్తూ దాని భారాన్ని పేద ప్రజలపై పన్నుల రూపాన వసూలు చేసి పీడుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి పేద ప్రజల పక్షాన పోరాడాల్సిన బాధ్యతను మరిచారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇంచార్జి అందెల శ్రీరాములు యాదవ్, కన్వీనర్ దేవేందర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్లు, మాజీ కార్పొరేటర్లు, జిల్లా కౌన్సిల్ సభ్యులు, మాజీ ప్రధాన కార్యదర్శులు, పార్టీ సీనియర్ నాయకులు, మహిళా మోర్చా సభ్యులు, బీజేవైఎం నాయకులు, పలు కాలనీవాసులు పాల్గొన్నారు.

గోర్ బోలి భాషను '8వ షెడ్యూల్'లో చేర్చాలి



నవతెలంగాణ-చంపాపేట్

తెలంగాణ రాష్ట్రంలో గోర్ బోలి భాషను అధికార భాషగా గుర్తించి, భారత రాజ్యాంగం 8వ షెడ్యూల్లో చేర్పించాలని భారత్ గోర్ బంజారా సేవ సమితి రాష్ట్ర చైర్మెన్ డాక్టర్ జగన్ నాయక్ విస్లావత్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన 15 కోట్ల బంజారాలు మాట్లాడే భాషా గోర్ బోలి భాషాను అధికార భాషగా గుర్తించి, భారత రాజ్యాంగం 8వ షెడ్యూల్‌లో చేర్చాలని జూపల్లి కృష్ణరావు అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టారని, గౌరవ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆమోదించడాన్ని హర్షం వ్యక్తం చేస్తూ అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

యువకుడు అదృశ్యం



నవతెలంగాణ-నాగోల్

ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లి తిరిగి వచ్చిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నాగోల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ శివనాగ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండలం లక్ష్మీదేవి పల్లి గ్రామానికి చెందిన ఏనుగు రామ్‌రెడ్డి నాగోల్ డివిజన్లోని ఆనంద్ నగర్‌లో కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. సంవత్సరంన్నర కిందట అతని పెద్ద కుమారుడు ఏనుగు నితిన్ రెడ్డి ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లాడు. గత మూడు మాసాల నుండి ఇండియాకు తిరిగి వస్తానని చెప్పి ఈ నెల 25న ఇండియాకు వచ్చాడు. ఇంటికి చేరుకున్న నితిన్ రెడ్డి తిరిగి ఈ నెల 27న ఉదయం 12 గంటల ప్రాంతంలో తన బ్యాగులో బట్టలు పెట్టుకొని తాను కోచింగ్ తీసుకుంటానని చెప్పి ఇంట్లో నుండి వెళ్లిపోయినట్లు పోలీసులు పేర్కొన్నారు. విదేశాల నుండి తిరిగి వచ్చి ఇంటి నుండి వెళ్లిన తమ కొడుకు ఎక్కడికి వెళ్ళాడో తెలియకుండా పోయిందని అతని తండ్రి రామ్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శివ నాగ ప్రసాద్ తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమం

నవతెలంగాణ-హయత్‌నగర్

హయత్‌నగర్ 1,2 డిపోలలో నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమం ఉంటుందని డిపో మేనేజర్లు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సులలో ప్రయాణించే ప్రయాణికులకు ఏమైనా సమస్యలు, సందేహాలు ఉంటే మధ్యాహ్నం 12 గంటల నుండి ఒంటిగంట వరకు తెలియజేయాలని సూచించారు. పూర్తి వివరాలకు 9959 226138, 995922 6419 నెంబర్లను సంప్రదించాలని హయత్ నగర్ 1 డిపో మేనేజర్ విజయ్, 2 డిపో మేనేజర్ శ్రీనివాస్‌లు తెలిపారు.

రైతు సంక్షేమమే లక్ష్యం

- నష్టాల్లో నుంచి లాభల్లోకి తెచ్చాం
- ముమ్ముందు మరింత అభివృద్ధికి కృషి
: చైర్మెన్ భరత్ కుమార్

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

రైతులకు సకాలంలో రుణాలు ఇస్తూ, రైతు సంక్షేమ అభివృద్ధి మరింత వేగవంతం చేస్తామని బాటసింగారం రైతు సేవా సహకార సంఘం చైర్మెన్ చేగూరి భరత్ కుమార్ అన్నారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ మండల కేంద్రంలోని సహకార సంఘం ప్రాంగణంలో చైర్మెన్ అధ్యక్షతన 56వ మహాజన సభను శుక్రవారం నిర్వహించారు. సంఘం వ్యవహారములు, జమాఖర్చుల నివేదికను మేనేజర్ జక్కుల బలేష్ చదివి వినిపించారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ సంవత్సర కాలంలో 324 మంది మొండి బకాయిల ఖాతాలను క్లోజ్ చేయడం జరిగిందన్నారు. దీంతో రూ.8,97,47, 257లను వసూలు చేసి సంఘంలోని ఎన్‌పీఏ ఖాతాలను తగ్గింబడంతో సభ్యులకు డైరీ, పంట, బంగారంపై రూ.22 కోట్ల 49 లక్షల కొత్త రుణాలను ఇచ్చినట్టు పేర్కొన్నారు. పంట రుణాలు ఎకరానికి రూ.32వేల ఉన్న మొత్తాన్ని స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రూ.42 వేలకు పెంచినట్టు తెలిపారు. 1.09.2024 నుండి 28.02.2025 వరకు రూ.3కోట్ల 10లక్షల నికర లాభం వచ్చిందని వెల్లడించారు. అందరి ఆమోదంతో రూ.10లక్షలు ఉన్న రుణ పరిమితిని రూ.15లక్షలకు పెంచినట్టు హర్షం వ్యక్తం చేశారు. తక్కువ కాలంలోనే సంఘాన్ని చాలా అభివృద్ధి చేసినట్టు చెప్పారు. నూతనంగా నిర్మించిన గోదాంను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. వచ్చే సమావేశం వరకు ప్రభుత్వం అవకాశం ఇస్తే అందరి సమన్వయంతో మరింత అభివృద్ధి చేస్తామన్నారు.

సహకార సంఘం ద్వారా రుణాలు పొంది, తిరిగి చెల్లించే విధానంపై రైతులు సభకు వివరించారు. సంఘం చైర్మెన్‌గా చేగూరి భరత్ కుమార్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం రైతు సంక్షేమ అభివృద్ధికి కృషి చేస్తున్నారని రైతులు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎలాంటి అవినీతి అక్రమాలకు తావివ్వకుండా ప్రతి పైసా రైతుల



సంఘం ఆర్థిక పరిమితి బలోపేతం కావడం జరిగిందని తెలిపారు. బకాయిదారుల రుణాలు (వాయిదా మీరిన అప్పులను) 142 మంది సభ్యుల రూ.7,62,78,983లను జిల్లా సహకార అధికారికి వసూలు చేయుటకై నివేధించడం జరిగిందన్నారు. సహకార సంఘ చట్ట ప్రకారం సెక్షన్ (71) నోటీసులను మొండి బకాయిదారులకు ఇవ్వాలని పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానించిందని తెలిపారు. గత సర్వసభ్య సమావేశం నుంచి ఈ సమావేశం వరకు సభ్యుల వాటాధనం 8 7 శాతం, రైతులకు రుణాలు ఇవ్వడంలో 9.98 శాతం వృద్ధి సాధించామన్నారు. ఏడాది కాలంలో సంక్షేమం కోసం ఖర్చు చేస్తున్నారని సభ దృష్టికి రైతులు తీసుకొచ్చారు. రానున్న రోజుల్లో మరింత పారదర్శక అభివృద్ధి సాదించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆపరేటివ్ అస్టెంట్ రిజిస్ట్రార్ విజయ, వైస్ పర్సన్ నార్లకొండ మల్లమ్మ జంగమయ్య మాజీ చైర్మెన్ పురం యాదగిరిరెడ్డి, డైరెక్టర్లు మొగుళ్ళ యాదిరెడ్డి, పగిళ్ళ బాల్రెడ్డి, బిజిలి బాలనర్సయ్య, గంట శ్రీనివాస్ రెడ్డి, ఇటికల మహేందర్ రెడ్డి, కొత్తపల్లి జైపాల్ రెడ్డి, మేకల రాములు, కందాడి మహిపాల్ రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ పనుల పరిశీలన



నవతెలంగాణ-చంపాపేట్

ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ పరిధిలో మాధవ నగర్ కాలనీ 33 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన నూతన కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి శుక్రవారం మున్సిపల్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ చంపాపేట్ డివిజన్ మాధవ నగర్ కాలనీ ప్రజలకు కమ్యూనిటీ హాల్ ఎంతో ప్రయోజకరంగా ఉంటుందని, కమ్యూనిటీ హాల్ నిర్మాణంలో తగు జాగ్రత్తలు పాటిస్తూ, నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. త్వరలోనే మాధవ నగర్ రోడ్ నెంబర్ 3 నుండి లక్ష్మీ గణేష్ నగర్ వరకు సీసీ రోడ్డు పనులు మొదలవుతాయని తెలిపారు. డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీలలో కమ్యూనిటీ హాల్‌లను నిర్మించడం జరిగిందన్నారు. ఈ పర్యవేక్షణలో కాలనీ అధ్యక్షులు హనుమంత్ రెడ్డి, కాలనీ సభ్యులు బెనర్జీ, అనసూయ, చందు నాయక్, శంభూ ప్రసాద్, ముత్యాలు, ప్రేమ్ కుమార్, గోవర్ధన్ రెడ్డి, పాండయ్య, బీజేపీ చంపాపేట్ డివిజన్ అధ్యక్షులు పోరెడ్డి రవీందర్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు లింగాల దశరథ్ గౌడ్, వేణు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టిన్ టవర్ నిర్మాణ పనుల పరిశీలన

నవతెలంగాణ - చంపాపేట్

ఐఎస్ సదన్ డివిజన్‌లో చేపట్టిన టిన్ టవర్ నిర్మాణ పనులను కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్ రెడ్డి శుక్రవారం డిప్యూటీ కమిషనర్ మంగతాయారు, పలు డిపార్ట్మెంట్‌లతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్ రెడి, ఈ ఈ ఏకాంబరం, ఏఈ శిరీష, హెచ్ఎం డబ్ల్యూ ఎస్ఎస్‌బి మేనేజర్ మినాజ్, టౌన్ ప్లానింగ్ రమేష్, బస్తీ తదితరులు పాల్గొన్నారు.



'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' పాదయాత్ర



నవతెలంగాణ-అల్వాల్

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సూచన మేరకు ప్రజాస్వామ్య పరిరక్షణ, మహాత్మా గాంధీ, బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచనా విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిర్వహిస్తున్న 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' కార్యక్రమంలో భాగంగా అల్వాల్ సర్కిల్ 133వ డివిజన్ కౌకూర్ బస్‌స్టాప్ వద్ద పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రకు ముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మైనంపల్లి హనుమంతరావు, ఫుడ్ కార్పొరేషన్ చైర్మెన్ ఎం.ఏ. ఫహీం, 133వ డివిజన్ కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ , ఏ బ్లాక్ అల్వాల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నిమ్మ అశోక్‌రెడ్డి, బీ బ్లాక్ మల్కాజిగిరి కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేశ్ యాదవ్, కో కన్వీనర్ సి.ఎల్. యాదగిరి, లక్ష్మీకాంత్ రెడ్డి, సురేందర్ రెడ్డి, శ్రీశైలం, తదితరులున్నారు.

నవతెలంగాణ

8

సమగ్ర తెలుగు దినపత్రిక

మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్

శనివారం | మార్చి 29 , 2025 | www.navatelangana.com

ప్రజల దాహార్తిని తీర్చడానికే చలివేంద్రం ఏర్పాటు

- పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్



నవతెలంగాణ -శామీర్‌పేట

ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ఉపయోగపడుతుందని అలియాబాద్ గ్రామపంచాయతీ కార్యదర్శి ఎర్రవల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం శామీర్‌పేట మండలం ఆలియాబాద్ గ్రామ ప్రధాన కూడలిలో గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిల్ కలెక్టర్లు కల్పన, సుధాకర్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-కాప్రా

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని, కష్టపడి చదివి సమాజానికి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మీర్‌పేట హౌసింగ్ బోర్డు డివిజన్ పరిధిలోని అన్నపూర్ణ కాలనీలోని శ్రీ నికేతన్ ప్లే స్కూల్‌లో నిర్వహించిన గ్రాడ్యుయేట్ డేకు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని ఆయన తెలిపారు. ఎంబీబీఎస్ సాధించిన వారికి తానే స్వయంగా ఫీజు మొత్తం చెల్లిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మీర్ పేట హౌసింగ్ బోర్డు డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్, మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ నారసింహా, నాయకులు నెమలి రవి, ఉస్మాన్, కాలనీ ప్రెసిడెంట్ నర్సింహా తదితరులు ఉన్నారు.

స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో మాక్సిం గోర్కీ 157వ జయంతి



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో రచయిత మాక్సిం గోర్కీ 157వ జయంతి సందర్భంగా నివాళి కార్యక్రమం కమలానగర్ ఆఫీసులో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, శ్రీమన్నారాయణ మాక్సిం గోర్కీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీమన్నారాయణ మాట్లాడుతూ.. మాక్సిం గోర్కీ రచనలు ప్రపంచాన్ని విప్లవ పథంలో తీసుకువెళ్లడానికి కృషి చేశాయని చెప్పారు. ఆయన రాసిన అమ్మ నవల ప్రపంచంలోనే అన్ని భాషల్లోనూ అనువాదమై అనేక ముద్రణలు జరిగాయని అన్నారు. గోర్కీ కడు పేదరికంలో జన్మించి ఎన్నో కష్టాలు పడ్డారని తెలిపారు. చివరకు నేల మాళిగలలో కార్మికుడిగా పనిచేసి దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించారని చెప్పారు. చివరకు తుపాకితో కాల్చుకొని ఆత్మహత్య కూడా ప్రయత్నించారని తెలిపారు. కానీ గురి తప్పి గుండెకు బదులు ఊపిరితిత్తుల కొంత భాగానికి తగలడం వల్ల బతికి బయటపడ్డారని పేర్కొన్నారు. ఆ తర్వాత వలస కార్మికుడిగా జీవితం సాగించి అనేక కష్టాలతో జీవితాన్ని కొనసాగించాడని అన్నారు. దానివలన ఆత్మనూన్యతకు బదులు చైతన్యం తెచ్చుకొని ప్రజా ఉద్యమాలలో పాల్గొన్నారని చెప్పారు. లెనిన్ పరిచయంతో విప్లవోద్యమాలకు ఆకర్షితుడై సమసమాజ నిర్మాణం కోసం కృషి చేసారని చెప్పారు. 1902లో కార్మిక పోరాటంలో సమ్మె కాలాన్ని దృష్టిలో పెట్టుకొని అమ్మ నవల రచించారని అన్నారు. ఆ పాత్ర సజీవంగా నిలిచి ప్రపంచంలోనే అనేకమంది కమ్యూనిస్టులను తయారు చేసిందన్నారు. వారు చేసిన కృషి ప్రపంచానికి ఎంతో మేలు చేసిందన్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు, గద్దె నరసింహారావు ప్రసంగించారు. అనంతరం మాక్సిం గోర్కీ చిత్రపటానికి సభికులందరూ పూలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శివరామకృష్ణ, శ్రీమన్నారాయణ, గద్దె నరసింహారావు, రుక్కయ్య, వెంకటేశ్వరరావు, ఉమామహేశ్వరరావు, గౌస్య, అంజలి, శోభ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ పార్టీకి ఈశ్వరయ్య రూ.20 వేలు వితరణ



నవతెలంగాణ-కాప్రా

న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ (ఎన్ఎఫ్‌సీ) సంబంధించిన ఏఐటీయూసీ కార్మిక విభాగం నేత కామ్రేడ్ ఈశ్వరయ్య పదవీ విరమణ సందర్భంగా సీపీఐ కాప్రా సమితికి రూ.20 వేలు నగదును సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీ ఎస్ బోస్ సమక్షంలో ఈసీఐఎల్‌లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో దామోదర్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా బోస్ మాట్లాడుతూ ఏఐటీయూసీ, సీపీఐ బలోపేతానికి, కార్మికవర్గ సమస్యలపై ఈశ్వరయ్య ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఈశ్వరయ్య అందించిన నగదు భవిష్యత్ ప్రజా పోరాటాలకు వినియోగిస్తామని చెప్పారు. న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్‌లో ఉద్యోగిగా ఉంటూనే అనేక పోరాటాలలో 35ఏండ్లుగా అంకితభావం, నిబద్ధతతో పనిచేశారని గుర్తు చేశారు. పదవీ విరమణ అనంతరం కూడా ప్రజా పోరాటాలలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జీ.దామోదర్ రెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్. శంకర్ రావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె. ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి టి.సత్య ప్రసాద్, తదితరులున్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం



- హైకోర్టు అడ్వకేట్ రమేష్ యాదవ్

నవతెలంగాణ-నేరేడ్‌మెట్,కాప్రా

చలివేంద్ర ఏర్పాటు అభినందనీయమని హైకోర్టు అడ్వకేట్ రమేష్ యాదవ్ అన్నారు. నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని మధురా నగర్ కాలనీలో శుక్రవారం శ్రీగంగా చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ బీర్రు బాల మల్లయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎండాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీగంగా చారిటబుల్ ట్రస్ట్ వైస్ ప్రెసిడెంట్ కె.ఎల్ నారాయణ రెడ్డి, సభ్యులు ఎస్. అనిల్, భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన అవసరం

- సర్వేజనా ఫౌండేషన్‌తో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు
- సంస్థ సీఈఓ మాజీ ఐఏఎస్ జనార్దన్ రెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

దేశంలోని సుమారు 15 లక్షల పాఠశాలల్లో 26 కోట్ల మంది విద్యార్థులు చదువుతున్నారని, వేలాది కాలేజీల్లో కూడా లక్షలాది మంది విద్యార్థులు కాలేజీ విద్యను అభ్యసిస్తున్నారని, వీరందరికీ రహదారి భద్రత విషయమై అవగాహన తప్పనిసరని మాజీ ఐఏఎస్, సర్వేజనా ఫౌండేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి డాక్టర్ బీ. జనార్దన్ రెడ్డి తెలిపారు. రోడ్ ట్రాఫిక్ రెగ్యులేషన్స్‌పై భారత ప్రభుత్వ ట్రాన్స్ పోర్ట్ అండ్ హై వేస్ శాఖ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో శుక్రవారం నిర్వహించిన ముగింపు సమావేశంలో పాల్గొన్నారు. గుజరాత్, కర్నాటక, కేరళ, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్, ఉత్తర ప్రదేశ్, ఒరిస్సా, రాజస్థాన్, మహారాష్ట్రలోని ఆయా రోడ్డు రవాణా సంస్థల్లోని ఉన్నతాధికారులు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్స్, పోలీస్ శాఖ ట్రాఫిక్ విభాగంలో పనిచేస్తున్న అధికారులకు నాలుగు రోజులుగా ట్రాఫిక్ రెగ్యులేషన్స్ పై జరుగుతున్న శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశంలో మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలు జరగడానికి ప్రధాన కారణాలు హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోవడం, ఓవర్ స్పీడ్‌తో పాటుగా సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, తొందరగా వెళ్లాలని రెడ్ సిగ్నల్స్‌ను అతిక్రమించడం, రాంగ్ రూట్‌లో వెళ్లడం, మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడంతో పాటుగా ర్యాష్ డ్రైవింగ్ కూడా కారణాలన్నారు. మన దేశంలో రోడ్డు ప్రమాదాల వలన ఏటా ఒక లక్ష 40 వేల మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. మనుషుల నిర్లక్ష్యం వల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రపంచంలోనే భారతదేశం రెండో అతిపెద్ద రహదారులున్న దేశమని, 67 లక్షల కిలోమీటర్ల రోడ్ నెట్ వర్క్ కలిగివుండి, 26 కోట్ల ద్విచక్ర వాహనాలు, అయిదు కోట్ల నాలుగు చక్రాల వాహనాలు తిరుగుతున్నాయన్నారు. ప్రపంచంలోని మొత్తం వాహనాల సంఖ్యలో ఇండియాలోని వాహనాల సంఖ్య ఒక్క శాతం అయినప్పటికీ ప్రమాదాల్లో మాత్రం 11 శాతం వుందన్నారు. దేశంలో ప్రతిరోజూ సుమారు 1400 రోడ్డు ప్రమాదాల్లో 474 మంది చనిపోతున్నారని, గంటకు 55 ప్రమాదాలు జరుగుతుంటే 20 మంది చనిపోతున్నారన్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించాలనే లక్ష్యంతో ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ఏ.గురువారెడ్డి ఆధ్వర్యంలో వారి అధ్యక్షతన సర్వేజనా ఫౌండేషన్ ఏర్పాటు చేశామని, గూగుల్ ప్లే స్టోర్ లోని స్టాప్ రోడ్ ఆక్సిడెంట్స్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకుంటే రోడ్డు భద్రతకు సంబంధించిన 24 ప్రశ్నలు వుంటాయని వివరించారు. వాటిల్లో సరియైన సమాధానాలు రాసిన వారికి ప్రతీ నెల ఒక లక్ష రూపాయల నగదు బహుమతిని అందిస్తున్నామని డాక్టర్ జనార్దన్ రెడ్డి అన్నారు. రోడ్డు భద్రతలను పాటించే విషయంలో ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో గతంలో ఎంతో మంది అధికారులకు ఎన్నో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ, ఈసారి స్కూల్, కాలేజ్ విద్యార్థులకు ఏప్రిల్ 19న ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఒక అవగాహనా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కాలేజ్ డైరెక్టర్ డాక్టర్ జీ. రామేశ్వర్ రావు అన్నారు. ట్రాఫిక్ పట్ల విద్యార్థుల్లో అవగాహన ఏర్పడితే ఆ జాగ్రత్తలు వారు జీవితాంతం పాటిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సర్వేజనా ఫౌండేషన్ రోడ్ సేఫ్టీ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ సిద్ధార్థ్, సీఓఓ ప్రవీణ్, సివిల్ అండ్ ట్రాన్స్ పోర్టేషన్ ఇంజనీరింగ్ విభాగం హెడ్ డాక్టర్ బి. వెంకట్ రెడ్డి, భారత రవాణా మంత్రిత్వ శాఖకు చెందిన ఉన్నతాధికారి అరవేంద్ర కుమార భాస్కర్, సి.హెచ్. తిలక్, రవాణా శాఖకు చెందిన వివిధ రాష్ట్రాల అధికారులు, కాలేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు, మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం



నవతెలంగాణ-కాప్రా

కుషాయిగూడ పోలీస్ సిబ్బంది, యాంటీ డ్రగ్ సోల్జర్స్ సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ డిపార్టుమెంట్ సహకారంతో ఈసీఐఎల్‌లోని సాయి సుధీర్ డిగ్రీ, పీజీ కాలేజీలో డ్రగ్స్, మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, మానసిక ప్రభావాలు, సైబర్ నేరాల బారిన పడితే వచ్చే ఆర్థిక సమస్యలు, చట్టపరమైన పరిణామాలు, వాటి ప్రభావాలు, నివారణ చర్యల గురించి అధికారులు వివరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని తమ సందేహాలను అడిగి తెలుసుకున్నారు. మత్తు పదార్థాల వ్యసనానికి గురైన వ్యక్తులను సమాజం నుంచి వేరుచేయకుండా, వారికి మానసిక భరోసా కల్పించి పునరావాసం కల్పించాలని సందేశం అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సుధాకర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, సైబర్ క్రైమ్ రాజు, యాంటీ నార్కోటిక్స్ సోల్జర్స్ సురేష్, మోహన్, ముక్కంటి, శ్రీశైలం, కాలేజీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాల నిర్లక్ష్యంతో కార్మికుల జీవితాలు దుర్భరం



నవతెలంగాణ-మేడ్చల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల కార్మికుల జీవితాలు దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నాయని ఎమ్మెల్యే, బీఆర్టీయూ కార్మిక సంఘం సహాదారులు పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని తెలంగాణ భవన్‌లో బీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు యాదవ్ అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మేడ్చల్ జిల్లా నుండి బీఆర్టీయూ నాయకులు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశిస్తూ పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో కార్మికుల కోసం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసినట్టు తెలిపారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్, బీఆర్టీయూ సహకారంతో పోరాటాలు నిర్వహించి కార్మికులకు వేతనాల పెంపు, ఓటీలు అమలు, ఇన్సురెన్స్, సెలవులు, ఉద్యోగ భద్రత తదితర సమస్యల పరిష్కారానికి ఉద్యమించడానికి అందరి మద్దతు కోరుతూ తీర్మానం చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్టీయూ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సంబు ప్రభాకర్, నాయకులు నారాయణ, రూప్ సింగ్, వేముల మారయ్య రాణి ఇంజన్ వాల్స్ యూనియన్ నాయకులు నర్సింహాచారి, యాదగిరి తదితరులున్నారు.

రాజకీయాలకతీతంగా మల్కాజిగిరి డివిజన్ అభివృద్ధి



- కార్పొరేటర్ శ్రవణ్ సీసీ రోడ్డు పనులను పరిశీలన

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలు, బస్తీలను రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేస్తామని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. డివిజన్ పరిధిలోని భగత్ సింగ్ నగర్‌లో రూ.23లక్షలతో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కోట్ల రూపాయలతో భగత్ సింగ్ నగర్ అభివృద్ధి చేశామని, పార్క్, బస్తీ దావఖానా, భూగర్భ మురుగు లైన్ చేశామన్నారు. రూ.75 లక్షలతో కలవర్టు, వాటర్ వాల్స్, కమ్యూనిటీ హాల్, సీసీ రోడ్డులు, చైన్ లింక్ మెష్ తదితర పనులను ఇప్పటికే పూర్తి చేశామన్నారు. స్థలాల రెగ్యులరైజేషన్ కోసం ఎం. ఆర్. ఓ ను బస్తీకి తెచ్చామన్నారు. నూతన స్ట్రీట్ లైట్స్, కరెంటు పోల్స్‌ను వేయించామన్నారు. పిల్లల ఆట వస్తువులు, మహిళా భవన్ తదితర పనులను కూడ పూర్తి చేస్తామని తెలిపారు. అభివృద్ధిలో రాజకీయాలకు తావు లేదన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ మహేష్, ఏఈ నవీన్, రమేష్, బీజేపీ నాయకులు సంతోష్, శ్రీదేవి, మురళి, నందు, మాధవ్, విమలమ్మ కమల, మరిథోన, వినోద్, బస్తీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల ఉసురు తగులుతది

- బీజేపీ మేడ్చల్ నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఏనుగు సుదర్శన్‌రెడ్డి



నవతెలంగాణ-ఘట్కేసర్

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఉసురు తగిలి నాశనమైపోతదని బీజేపీ మేడ్చల్ నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మేడ్చల్ నియోజకవర్గంలోని ఘట్కేసర్ ఎఫ్ఎస్‌సీఎస్‌లో బ్యాంక్ ఎండీ రాహుల్, సొసైటీ డైరెక్టర్ జిల్లాల పోచిరెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు కొమ్మిడి మహిపాల్ రెడ్డితో కలిసి రైతు రుణమాఫీ సమాచారాన్ని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేడ్చల్ ఎమ్మెల్యే అధికార పార్టీ నేతల అసమర్థత వల్ల మేడ్చల్ నియోజకవర్గం శాపగ్రస్తంగా మారుతున్నదన్నారు. నియోజకవర్గంలోని 32 వేల మంది రైతులలో కేవలం 7000 మందికి మాత్రమే రుణ మాఫీ అయ్యిందని, మిగతా 25 వేల మంది రైతులు రుణమాఫీ కోసం నిరీక్షిస్తున్నారని చెప్పారు. ఎన్నికల్లో అబద్ధపు బూటకపు హామీలు ఇచ్చిన కాంగ్రెస్ రుణ మాఫీ పూర్తి అయిందనడం సిగ్గుచేటన్నారు. స్థానిక శాసనసభ్యులు మల్లారెడ్డి అసమర్థతకు బ్రాండ్ అంబాసిడర్‌గా మారిపోయాడని విమర్శించారు. రుణమాఫీ జరగకపోవడంతో పంట రుణాల రీ షెడ్యూలు జరగక రైతులు పెట్టుబడికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా అరాచక పాలన ఆపి రైతాంగానికి సంపూర్ణ రుణమాఫీ చేయాలన్నారు. లేనియెడల బీజేపీ తరపున ఉద్యమాలు, ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు.

యువతి అదృశ్యం



నవతెలంగాణ - జవహర్ నగర్

తల్లి మందలించిందని తల్లితో గొడవపడి ఓ యువతి అదృశ్యమైన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 27వ తారీఖున బోయని అనుష్క (16) మొబైల్ ఫోన్‌లోని ఇంస్టాగ్రామ్ స్నాప్ చాట్ వంటి మొబైల్ అప్లికేషన్లను అధికంగా ఉపయోగించడంతో బోయిని అనుష్క తల్లి రాణి ఆమెను మందలించింది. దీనికి కోపంతో అనుష్క ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఈ మేరకు అనుష్క ఆచూకీ కోసం తల్లి చుట్టుపక్కల, బంధువుల వెతికినా సమాచారం లభించలేదు. ఈ మేరకు జవహర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తన కుమార్తె క్లాస్ మేట్ అయిన అల్వాల్ నివాసి శ్రావణ్‌తో తరచూ ఇంస్టాగ్రామ్‌లో మాట్లాడుతుందని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఓరెం కిరణ్ కుమార్‌కు డాక్టరేట్



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఉమ్మడి కరీంనగర్ జిల్లా శనిగరం ప్రాజెక్టు నీటి పారుదల నిర్వహణలో జియోగ్రఫీ ఇన్ఫర్మేషన్ సిస్టం, రిమోట్ సెన్సింగ్ ఉపయోగం అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను ఓరెం కిరణ్‌కుమార్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. ఓయూ జియోగ్రఫీ విభాగం ప్రొ.గీతారెడ్డి అనంత్ గైడ్‌గా వ్యవహరించారు. జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్, రిమోట్ సెన్సింగ్ విధానాలను అనుసరించి నీటి లభ్యత, వినియోగం తదితర అంశాలపై కిరణ్‌కుమార్ అధ్యయనం చేశారు. కిరణ్‌కుమార్ హైడ్రాలో శాస్త్రవేత్తగా పని చేస్తున్నారు. డాక్టరేట్ సాధించడం మా అమ్మ కల అని...స్వర్గస్థులు అయిన తన తల్లి అనసూయకు అంకితం చేస్తున్న ట్టు కిరణ్ కుమార్ ప్రకటించారు. ఈ పరిశోధనలో సహకరించిన హైడ్రా అధికారులతో పాటు, ఓయూ జాగ్రఫీ విభాగంలో ఉన్న ప్రొఫెసర్లకు కిరణ్‌కుమార్ కతజ్ఞతలు తెలిపారు.

యువత ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోండి
- కాంగ్రెస్ జవహర్‌నగర్ అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్



నవతెలంగాణ - జవహర్ నగర్

యువత ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి అప్లై చేసుకోండని జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ పిలుపునిచ్చారు. యువత వ్యాపార రంగంలో రాణించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాస పథకం ప్రవేశ పెట్టిందని, ఈ పథకం నిరుద్యోగ యువతకు ఒక వరం లాంటిదని పేర్కొన్నారు. జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని యువత వీలైనంత త్వరగా ఎక్కువ మంది ఏప్రిల్ 5వ తేదీ లోపల ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చెన్నకేశవ స్వామి కల్యాణంలో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-కాప్రా

కాప్రా డివిజన్ పరిధిలోని ఎల్లారెడ్డిగూడ హనుమాన్ దేవాలయంలో శుక్రవారం నిర్వహించిన చెన్నకేశవ స్వామి కల్యాణంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారి ఆశీస్సులు అందరి మీద ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దేవేందర్ రెడ్డి, ప్రభుదాస్, నాయకులు సాయి జెన్ శేఖర్, బైరి నవీన్ గౌడ్ , భాస్కర్ గౌడ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వన్ టైమ్ సెటిల్‌మెంట్ స్కీమ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- కమిషనర్ బట్టు నాగిరెడ్డి



నవతెలంగాణ- మేడ్చల్

ప్రభుత్వం అవకాశం కల్పించిన వన్ టైమ్ సెటిల్‌మెంట్ స్కీమ్ (OTS)ను మేడ్చల్ మున్సిపల్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ నాగిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా 2024-2025 ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను బకాయిల వడ్డీలో 90శాతం రాయితీ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీ చేసిందని పేర్కొన్నారు. ఈ పన్ను రాయితీ మార్చి 31వ తేదీ వరకు మాత్రమే వర్తిస్తుందన్నారు.మేడ్చల్ మున్సిపల్ ప్రజలందరూ ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆస్తి పన్ను బకాయిలు చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

ముస్లింలకు పండ్లు పంపిణీ



- మాజీ కౌన్సిలర్ రామన్నగారి మణికంఠ గౌడ్

నవతెలంగాణ-మేడ్చల్

పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా మేడ్చల్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ రామన్నగారి మణికంఠ గౌడ్ పలు గ్రామాలలోని 11 మసీదులకు పండ్లను పంపిణీ చేశారు. మేడ్చల్‌తో పాటు రైయిలాపూర్, గిర్మాపూర్, అత్వెల్లి కిష్టాపూర్, పూడూరులలోని మసీదులకు పదిరకాల పండ్లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది సైతం ఉపవాస దీక్ష ముగియగానే ముస్లిం సోదరులు తినేందుకు వీలుగా పండ్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు పాషా, రఫిక్, ఇనాయిత్, బారి, ఇషాక్, జమీల్, అష్రాఫ్, అంజాత్ తదితరులు పాల్గొన్నారు.

గోర్బోలి భాషను రాజ్యాంగంలో చేర్చాలి

- ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్ కలిపించాలి
- మాజీ సర్పంచ్ లినానావత్ రూప్ సింగ్ నాయక్



నవతెలంగాణ-ఘట్కేసర్

లంబాడీల మాతృభాష గోర్బోలి భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని తెలంగాణ శాసన సభ తీర్మానించడాన్ని మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మున్సిపల్ నాయకులు, మాజీ సర్పంచ్ లినానావత్ రూప్ సింగ్ నాయక్ లంబాడీ జాతి తరపున రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా జీవో ఎంఎస్ నంబర్ 33 ప్రకారం ఎస్టీలందరికీ 10శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో 700పైగా భాషలు ఉన్నాయని తెలిపారు. గోర్బోలి భాష ప్రధానంగా ఉందని హిందీ తరువాత అత్యధికంగా మాట్లాడే భాష గోర్బోలి అన్నారు. ఎస్టీల భాషపై అసెంబ్లీలో చర్చించటం మంచి పరిణామం అన్నారు. సమాజంలో ఎస్టీలకు గుర్తింపు తేవాలని, ప్రతి రంగంలో వారికి అవకాశం కలిపించాలని కోరారు.

బస్సు ఢీకొని మహిళా మృతి




నవతెలంగాణ-పేట్ బషీరాబాద్

బస్సు ఢీ కొని మహిళ మృతి చెందిన ఘటన పేట్ బాషీరాబాద్‌లో చేటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పేట్ బాషీరాబాద్ పరిధిలోని కొంపల్లి బ్రిడ్జ్ పిల్లర్ నెంబర్ 8 దగ్గర జరిగిన దుర్ఘటనలో బాదాం సుజాత అనే మహిళా (వయసు 40 సం॥రాలు) మృతి చెందారు. యాదాద్రి జిల్లా గుండాల మండలం అంబాల గ్రామానికి చెందిన సదరు మహిళ కొంపల్లి లోని సాయిబాబా నగర్‌లో నివాసం ఉంటున్నారు. శుక్రవారం సుమారు 12.30 ని॥ల సమయంలో స్వగ్రామం నుంచి కొంపల్లిలోని తమ నివాసానికి వెళ్లే క్రమంలో బస్సు దిగి వెళ్తుండగా వెనకాల నుంచి వచ్చిన ప్రయివేటు బస్సు TG08T7616 సదరు మహిళను ఢీ కొట్టి ఆమెపై నుంచి బస్సు వెళ్ళింది. ఈ ఘటనలో మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. బస్సు డ్రైవర్ బస్సుని రోడ్డుపై అక్కడే వదిలేసి పరారయ్యారు. సమాచారం తెలుసుకున్న పేట బషీరాబాద్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని బస్సు డ్రైవర్‌ని అదుపులోకి తీసుకున్నారు. మృతురాలి మృతదేహన్ని పంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు చైతన్య కళానికేతన్‌లో

'ఉగాది' కవి సమ్మేళనం



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

శ్రీ విశ్వావసు నామసంవత్సర 'ఉగాది' కవి సమ్మేళనం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరి గుట్ట డివిజన్ పరిధిలోని మగ్దూం నగర్‌లో గల చైతన్య విద్యానికేతన్ పాఠశాలలో శనివారం మధ్యాహ్నం 2:00 గంటలకు ప్రారంభమవుతుందని ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షు లు శివరాత్రి యాదగిరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరిసర ప్రాంతాల కవులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గత 32 సంవత్సరాలుగా ఈ కవి సమ్మేళన కార్యక్రమాలు నిర్వహిస్తూ కవుల్లోని నైపుణ్యాలను వెలికితీస్తూ వారిని సన్మానించడం జరుగుతుందన్నారు.

విద్యార్థులకు డాక్టర్ సర్టిఫికెట్ల ప్రదానం



నవతెలంగాణ-నిజాంపేట్

బాచుపల్లిలోని మమతా అకాడమీ ఆఫ్ సైన్సెస్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు డాక్టర్ సర్టిఫికెట్ల ప్రదానం జరిగింది. ఈ సందర్భంగా కాళోజీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ నందకుమార్ రెడ్డి మాట్లాడుతూ వైద్య వృత్తి అత్యంత పవిత్రమైందని దానిని దుర్వినియోగం చేయకుండా కాపాడా లని విద్యార్థులకు పిలుపునిచ్చారు. వైద్య కళాశాల అకాడమీ చైర్మెన్ పువ్వాడ అజ య్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం కళాశాల నుంచి వైద్య విద్యార్థుల మొదటి బ్యాచ్ పూర్తి అయిందన్నారు. విద్యార్థులు వైద్య వృత్తిలో వృత్తి ధర్మం మరువద్దని హితవు పలికారు. కార్యక్రమంలో ఎండి. నయీమ్ రాజ్ ప్రసంగించారు. ఈ సందర్భంగా కళాశాల మొదటి కన్వర్వేషన్ డే ను ఘనంగా నిర్వహించారు. కళాశాల నుంచి మొదటి బ్యాచ్‌గా 133 మంది విద్యార్థులకు కళాశాల యాజమాన్యం పట్టా సర్టిఫికెట్లను బహుకరించింది. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళ హత్య కేసులో నిందితుడు రిమాండ్



- వివరాలు వెల్లడించిన డీసీపీ.కే.సురేష్ కుమార్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

మహిళ హత్య కేసులో నిందితుడిని సనత్ నగర్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. రెండు రోజుల క్రితం సంచలనం సృష్టించిన గుర్తు తెలియని మహిళ హత్య కేసును సనత్ నగర్ పోలీసు లు ఛేదించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలు షాపూర్ నగర్‌లోని బాలనగర్ జోన్ డీసీపీ కార్యాల యంలో శుక్రవారం సాయంత్రం డీసీపీ.కే.సురేష్ కుమార్ వివరాలు వెల్లడించారు. ఈనెల 26న రాత్రి సమయంలో గుర్తుతెలియని మహిళ సుమారు 46 సంవత్సరాల మహిళ మృతదేహం ఎర్రగడ్డ, భరత్ నగర్ సమీపంలోని బ్రిడ్జి కింద వివస్త్రగా మృతి చెంది వుంది. కేజియస్ పౌల్ట్రీ ఫార్మ్ సబా రిఫ్రిజిరేటర్ షాపుల ఆవరణలో గుర్తుతెలిని మహిళ మృతదేహం చూసి ఆందోళన చెందిన వారు సనత్ నగర్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సీఐ.కే. శ్రీనివాసులు, ఎస్సై బి.రాధాకృష్ణ, సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ముమ్మరం చేశారు. జనగామ జిల్లా, బచ్చన్న పేట ప్రాంతానికి చెందిన కొమ్మరాజు కనకరాజు (అలి యాస్ రాజు) ఒంటరిగా ఉన్న గుర్తుతెలియని సదరు మహిళను చూసి లైంగిక దాడికి పాల్పడి ఆపై హత్య చేసి పరారయ్యాడని పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా బాలనగర్ సమీపంలోని శోభన కాంప్లెక్స్ రోడ్డు సమీపంలో నిందితుడు రాజు 28న ఉదయం అనుమానాస్పదంగా కనబడడంతో పోలీసులు అదుపు లోకి తీసుకొని విచారించారు. మహిళను తానే లైంగిక దాడి చేసి హత్య చేసినట్టు పోలీసులకు తెలిపాడు. దీంతో కేసు నమోదు చేసుకొని రిమాండ్‌కు తరలిం చారు. రెండు రోజుల వ్యవధిలోనే హత్య కేసు చేదించిన సనత్ నగర్ పోలీసులను డీసీపీని అభినం దించారు. ఈ కార్యక్రమంలో బాలనగర్ జోన్ అదనపు డీసీపీ పి.సత్యనారాయణ, ఏసీపీ.జి. హనుమంతరావు, సనత్ నగర్ సీఐ.కే శ్రీనివాసులు, పోలీస్ సిబ్బంది తదిరులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్య పరిష్కరించాలి

- సీపీఐ(ఎం) కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సూరారం డివిజన్‌లో మంచినీటి సమస్యను పరిష్కరించాలని కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మ ణ్ అన్నారు. సీపీఐ(ఎం) కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో సూరారం డివిజన్‌లో నెలకొన్న సమస్యలపై మార్చ్ 7 నుంచి 20వ తేదీ వరకు సర్వే నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్వేలో ప్రధానంగా సూరారం డివిజన్ పరిధిలోని షాపూర్ నగర్, న్యూ షాపూర్ నగర్, కళావతి నగర్, సంజయ్ గాం ధీ నగర్, మార్కండేయ నగర్, నెహ్రూ నగర్ తదితర బస్తీలలో మంచినీటి సమస్య చాలా తీవ్రంగా ఉందన్నారు. అనంతరం వినతి పత్రాన్ని డీజీఎం రాజుకి అందజేశారు.

బస్తీలలో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోయి ఇండ్లలో ఉన్న బోరు మోటర్లలో నీళ్ల రావడం లేదన్నారు. పూర్తిగా మంచినీళ్లపైనే ఆధార పడవలసి వస్తుందన్నారు. మంచినీళ్ల కూడా వారానికి రెండుసార్లు మాత్రమే గంట లోపే వస్తున్నాయని, గతంలో కొద్దిగా మెరుగ్గా ఉండే దన్నారు. ఎండాకాలం ప్రారంభంలోనే ఇంత ఇబ్బందిగా ఉంటే తర్వాత రోజులు ఊహించుకుంటేనే భయమేస్తుం దని తెలిపారు. నెలకు రూ.1000 ప్రయివేటు ట్యాంకర్స్‌కు పెట్టవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మంచి నీటి విడుదలలో కూడ సమయపాలన పాటించడం లేద న్నారు. డివిజన్‌లో ఉన్న కొన్ని బస్తీలలో కనీసం ట్యాంకర్ కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. మంచి నీళ్ల కోసం ప్రయివేటు డ్యూటీలు వదులుకొని ఎదురు చూడవలసి వస్తుం దని వాపోయారు. మంచినీటి రిజర్వాయర్‌కు కూతవేటు దూరంలో ఉన్న బస్తీలలోనే ఈ సమస్య ఉంటే, మిగతా బస్తీలలో ఎలా ఉందో అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆలోచన చేయాలని అన్నారు. మంచినీటి సమస్య ఈ బస్తీలలో పరిష్కారం కాకపోతే రానున్న కాలంలో సీపీఐ(ఎం) కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జలమండలి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు పసుల అంజయ్య, రావుల స్వాతి, మల్లారెడ్డి , యాదవ రెడ్డి, కే.శీను, కే..సత్యనారాయణ, రమేష్ తదితరులున్నారు.

శ్రీ చైతన్య విద్యా సంస్థలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

శ్రీ చైతన్య విద్యాసంస్థల్లో భాగమైన, వివేకానంద నగర బ్రాంచ్ శ్రీ చైతన్య స్కూల్‌లో 5వ తరగతి విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లోటస్ హాస్పిటల్ గైనకాలజీ డాక్టర్ మౌనిక పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సూర్యకళ మాట్లాడుతూ విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు, వారి ప్రసంగాలు చాలా గొప్పగా ఆకట్టుకున్నాయని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు హాజరై విద్యార్థులను ప్రోత్సహించడం సంతోషంగా ఉందని, ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందించ దగ్గ విషయమని తెలిపారు. లోటస్ హాస్పిటల్ గైనకాలజిస్ట్ డాక్టర్ మౌనిక మాట్లాడుతూ నేటి సమాజంలో బాలబాలికల సంరక్షణకు సంబంధించిన విషయాలను, వారు తీసుకోవలసిన జాగ్రత్తలను విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేసారు. ఈ సమావేశంలో ఏజీఎం శివరామ కృష్ణ, రీజనల్ ఇన్‌చార్జి పద్మజ, కోఆర్డినేటర్ మంగ వేణి, అకాడమిక్ డీన్ రామకృష్ణ, సి బ్యాచ్ ఇన్‌చార్జీ శ్రీకాంత్, ప్రైమరీ ఇన్‌చార్జీ సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

సివిల్ సర్వీస్ అభ్యర్థులకు ఉచిత తరగతులు

- మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లా రెడ్డి



నవతెలంగాణ-మేడ్చల్

సివిల్ సర్వీస్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ తరగతులు 21ఫాస్ట్ సెంచరీ ఐఏఎస్ అకాడమీ నిర్వహించడం అభినందనీయమని మల్లారెడ్డి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూ షన్స్ చైర్మెన్ మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి తెలిపారు. హైదరాబాద్ లోని 21 ఫాస్ట్ సెంచరీ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్, ఇతర విభాగాల విద్యార్థులకు సివిల్ సర్వీసెస్ కోసం నిర్వహిస్తున్న ఉచిత మాస్టర్ క్లాస్ ఒరియంటేషన్ సెషన్లను అభి నందించారు. శుక్రవారం, 21ఫాస్ట్ సెంచరీ అకాడమీ చైర్మెన్ శ్రీ పి. కృష్ణ ప్రదీప్, డైరెక్టర్ డా.భవాని శంకర్ మల్లా రెడ్డి యూనివర్సిటీ క్యాంపస్‌లో ఆయనను కలసి ఈ కార్యక్రమం గురించి వివరించారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్)లో భాగంగా ఈ తరగతులు నిర్వహిస్తున్నట్టు తెలియ జేశారు. ఈ సందర్భంలో మల్లారెడ్డి విద్యార్థులకు సివిల్ సర్వీసెస్ పరీక్షలకు మరింత ప్రోత్సాహం కల్పించేందుకు జూన్‌లో భారీ స్థాయిలో సెమినార్ నిర్వహించనున్నట్టు ప్రకటిం చారు. కేవలం సాఫ్ట్‌వేర్ ఎంఎన్‌సీ ఉద్యోగాలకే పరి మితం కాకుండా, ఐఏఎస్, ఐపీఎస్ స్థాయిలో ఎదగాలని విద్యార్థులు లక్ష్యంగా పెట్టుకోవాల న్నారు. ఈ సమా వేశంలో మల్లా రెడ్డి ఇన్‌స్టిట్యూషన్స్ ఆపరేషన్స్ డైరెక్టర్ శ్రీ ప్రవీణ్ రెడ్డి కూడా పాల్గొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం చేస్తున్న విశేష కృషికి మల్లారెడ్డి శుభాకాంక్షలు తెలియ జేశారు. విద్యారంగానికి అందిస్తున్న మద్దతుకు గుర్తుగా, శ్రీ పి.కృష్ణ ప్రదీప్ ఎమ్మెల్యే చామకూర మల్లా రెడ్డిని సత్కరించారు.

ఆర్థిక భరోసానిచ్చేది సీఎం సహాయనిధి



- బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ఆర్థిక భరోసానిచ్చేది సీఎం సహాయనిధి అని కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకనంద్ అన్నారు. గాజుల రామారం డివిజన్, ఇందిరా నగర్ ప్రాంతానికి చెందిన అల్లుకుటూర్ విజయ్ కుమార్, తండ్రి అల్లుకుటూ ర్ ముత్తు స్వామి ఆరోగ్య పరిస్థితిపై ఎమ్మె ల్యేను ఆశ్రయించారు. వారి ఆర్థిక పరిస్థితి, ఆరోగ్య పరిస్థితిపై చలించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అల్లుకుటూర్ విజయ్ కుమార్ తండ్రి అల్లుకుటూర్ ముత్తు రూ.2లక్షల ఎల్ఓసీ మంజూరు చేయించారు. శుక్రవారం పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాల యంలో ఎమ్మెల్యే లబ్ధిదారునికి ఎల్ఓసీ చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న నిరుపేదలకు ఆర్థిక భద్రతనిచ్చేది, ఆరోగ్య భరోసాని చ్చేది ముఖ్యమంత్రి సహాయనిధి అన్నారు.

ఈ కార్యక్రమంలో జగద్గిరిగుట్ట డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, కుత్బుల్లాపూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, నాయకులు ఎర్వ సాయికిరణ్, ఇమ్రాన్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సేవలు అభినందనీయం..

సీనియర్ సిటిజన్స్ సభ్యుల సేవలు అభినంద నీయమని కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకనంద్ అన్నారు. పేట్‌బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో "కుత్బుల్లాపూర్ సీనియర్ సిటి జన్స్ వెల్ఫేర్ అసోసియేషన్" నూతన కార్యవర్గం సభ్యు లు శుక్రవారం ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కుత్బుల్లాపూర్ గ్రామ సమస్యలను తమ సమస్యలుగా భావించి సమస్యల పరిష్కారం కోసం పనిచేసే సీనియర్ సిటిజన్స్ సభ్యుల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఎస్. నరసింహారెడ్డి, సలహాదారులు జి.బలవంత రెడ్డి, ప్రధాన కార్యదర్శి పెద్ది మల్లేశం, కోశాధికారి ఆర్.ముర ళి గౌడ్, ముఖ్య ఉపాధ్యక్షులు లింగం గౌడ్, ఉపాధ్యక్షులు ఎస్.నాగేష్ కుర్మ తదితరులు పాల్గొన్నారు.



కూకట్‌పల్లి కోర్టు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

కూకట్‌పల్లి కోర్టు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కూకట్‌పల్లి కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షులుగా పి.గోవర్ధన్ రెడ్డి వరుసగా మూడోసారి భారీ మెజార్టీతో గెలుపొందారు. ప్రధాన కార్యదర్శిగా ఏ.సుదర్శన్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా కె.భీమయ్య జాయింట్ సెక్రెటరీగా హర్షవర్ధన్ రెడ్డి, కోశాధికారిగా సైఫుల్ల షరీఫ్‌లు ఎన్నికయ్యారు. మహిళా సెక్రటరీగా ఎం.లావణ్య స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా సురేష్ కమ్మెటలు తమ సమీప ప్రత్యర్థులపై గెలుపొందినట్టు ఎన్నికల అధికారి సీనియర్ న్యాయవాది సుభాష్ గుప్తా తెలిపారు. కార్యవర్గ సభ్యులుగా జె అఖిల రావు, సిహెచ్ అర్చన గౌడ్, కళ్యాణి, తన్నీరు శ్రీకాంత్, పద్మావతి, రామకృష్ణ, భాను ప్రసాద్‌లు ఎన్నికైనట్టు వెల్లడించారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గం ఏప్రిల్ మొదటి వారంలో బాధ్యతలు స్వీకరించనుందన్నారు. నూతన కార్యవర్గం ఏడాది కాలం పదవిలో కొనసాగనుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు న్యాయవాదుల సంక్షేమానికి, కోర్టులో కావాల్సిన సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం



- కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్

నవతెలంగాణ-బాలానగర్

సీఎం సహయనిధి పేదలకు వరం అని కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. మూసాపేటకు చెందిన రఫీయా బేగం, బాలానగర్ డివిజన్‌ల ప్రాంతానికి చెందిన బాతుల చంద్రకళ, గొలుసుల నరసింహారావు, బాలానగర్ ప్రాంతానికి చెందిన పలువురు అనారోగ్యంతో బాధపడుతున్నారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందలేక ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలోని మూసాపేట్ చెందిన గొలుసుల నర్సింగరావుకు రూ.60 వేలు, మూసాపేట్‌కు చెందిన రఫియా బేగంకు రూ.60 వేలు, బాలానగర్‌కు చెందిన బాతుల చంద్రకళకు రూ.60 వేలు మంజూరైయ్యాయి. కూకట్‌పల్లి కాంగ్రె స్ ఇన్‌చార్జి బండి రమేష్ చేతుల మీదుగా బాలానగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం బాధిత కుటుంబాలకు చెక్కులు అందచేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ లక్ష్మయ్య, మాజీ కౌన్సిలర్ కుక్కల రమేష్, సీనియర్ నాయకులు షకీల్, మధు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్దిదారులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, బండి రమేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మహాత్మా గాంధీ, అంబేద్కర్ ఆలోచనలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి



- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి

నవతెలంగాణ-నిజాంపేట

మహాత్మా గాంధీ, బాబాసాహెబ్, అంబేద్కర్ ఆలోచన విధానాలను ప్రజలకు చేరవేసేందుకే జై బాపు ,జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన కుత్బుల్లాపూర్ నియోజక వర్గం నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ సన్నాహక సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. కేంద్ర కాంగ్రెస్ సూచ నలకు అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వ హిస్తున్నట్టు తెలిపారు. ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున కార్గే, లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సూచ నల మేరకు నియోజకవర్గంలోని అన్ని ప్రధాన బస్తీలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు అయిన వివరించారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొలను రాజశేఖర్ రెడ్డి, నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ సీనియర్ నాయకులు, అనుబంధ సంఘాల నేతలు, కార్పొరేషన్ కాంగ్రెస్ నేతలున్నారు.

అభివృద్ధి పనులు

పరిశీలించిన కార్పొరేటర్




నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం ఫతేనగర్ డివిజన్ పరిధిలోని ఎల్‌బిఎస్ నగర్‌లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను జీహెచ్ఎంసీ ఏఈ రాధాకృష్ణ, స్థానిక నాయకులు ప్రజలతో కలిసి కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ పరిశీలించారు. ఈసందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అభివృద్ధి విషయంలో రాజీ లేకుండా నాణ్యత ప్రమాణాలతో అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు. దానికి సహకరిస్తున్న ప్రజలకు కూడా కృతజ్ఞతలు తెలిపారు. ఈ నేపథ్యంలో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమైనందున సంతోషంతో స్థానిక నాయకులు పూలమాలలతో కార్పొరేటర్‌ను, రాష్ట్ర నాయకులు కుతాడి రాములు సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎల్‌బిఎస్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కూతాడి రాములు, శివశంకర్ గౌడ్, శంకర్, ముజ్జు, శ్రీనివాస్, గిరి, ప్రవీణ్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలి





- సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఈ.ఉమామహేష్ డిమాండ్
- జంట సర్కిళ్ల ఉప కమిషనర్లకు వినతిపత్రాలు అందజేత

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్,గాజులరామారం జంటసర్కిళ్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో అనుమతులు లేకుండా ప్రభుత్వ, ప్రయివేటు భూములలో అనేక నిర్మాణాలు వెలుస్తున్నాయని వాటిని గుర్తించి వెంటనే కూల్చివేతలు చేపట్టాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సీపీఐ శ్రేణులతో కలిసి కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ నరసింహకు, గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్ మల్లారెడ్డిలకు వేర్వేరుగా వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి అక్రమ నిర్మాణాల వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండిపడటమే కాకుండా రానున్న రోజుల్లో అనేక సమ స్యలు ఉత్పన్నమవుతాయని అన్నారు. సంబంధిత అధికారులు ఎప్పటి కప్పుడు అప్రమత్తంగా ఉంటూ సర్కిళ్లల్లో అక్రమంగా నిర్మాణం అవుతు న్నటువంటి ఇండ్లను, అదే విధంగా మున్సిపల్ పర్మిషన్ ప్రకారం రెండం తస్తులు కాకుండా ఒక్కొక్కరు నాలుగు, ఐదు బహుళ అంతస్తులను నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా కొంతమంది రోడ్డుపైకి, గల్లీల లోపలికి స్లాబుల నిర్మాణాలు కట్టి అత్యవసర సేవలైన అంబు లెన్సులు,ఫైర్ కంట్రోల్, ఇతరత్రా వాహనాలు లాంటివి రాలేని పరిస్థితి ఏర్పడ్డాయని వినతిలో పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయంలో ఇటు వంటి నిర్మాణాలు రాజకీయ, లేక ప్రజాప్రతినిధుల అండతో వెలిశాయని నేడు కాంగ్రెస్ పాలనలో అదే తంతు కొనసాగుతుందన్నారు. ప్రతి నిత్యం ఏదో ఒక విధంగా మున్సిపల్ సిబ్బంది ఆయా ప్రాంతాలలో పర్యటిసూ ్తనే ఉంటారని అటువంటి సమయంలో వారి దృష్టికి వచ్చినటువంటి అక్రమ నిర్మాణాలను తెలుసుకొని ఎవరు ఫిర్యాదు చేసినా చేయకపోయినా వెంటనే ఆ నిర్మాణదారునికి నోటీసులు పంపించి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఒక వేళ అలాంటి చర్యలు తీసుకోకపోతే ఆ నిర్మాణ దారులతో మున్సిపల్ అధికారులు కుమ్మక్కు అయ్యారని సీపీఐ భావిస్తే మాత్రం దానిపైన మున్సిపల్ జోనల్ కమిషనర్‌కు అధికారుల పైనే ఫిర్యాదు చేయాల్సి వస్తుం దని హెచ్చరించారు. కొంతమంది కింది స్థాయి మున్సిపల్ సిబ్బంది నిర్మాణ దారులతోటి ఫిర్యాదు చేసిన వారి సమాచారాన్ని ఇచ్చి వారితో మాట్లాడుకుని సమస్యలను పరిష్కరించుకో వాలని చెప్పడం వల్ల కొంతమంది దళారులు అదేపనిగా నిర్మాణాల పైన ఫిర్యాదు చేసి ప్రజల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. అందులో కొంత మొత్తం ఆ సిబ్బందికి కూడా ఇస్తున్నారని ప్రజలు భావిస్తున్నారని అటువంటి విషయాలను తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. మున్సిపల్ అధికారులు,సిబ్బందికి అందరికీ సరైన ఆదేశాలు జారీ చేసి అటువంటి అక్రమాలకు పాల్పడకుండా భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని అక్రమ నిర్మాణాలను అరికట్టాలని కోరారు. జిల్లా కార్యవర్గ సభ్యులు వి. హరినాథ్ రావు, కౌన్సిల్ సభ్యులు వంగాల శ్రీనివాస్, గుట్ట శాఖ కార్యదర్శి ఎం.సహదేవ రెడ్డి, ప్రజానాట్యమండలి అధ్యక్షుడు బాబు, సీపీఐ నాయకులు ఇమామ్, ప్రభాకర్, పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి



- బాలానగర్ ట్రాఫిక్ సీఐ సురేష్ కుమార్

నవతెలంగాణ-బాలానగర్

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని బాలానగర్ వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సురేష్ కుమార్ వాహనదారులకు సూచించారు. ఈ నేపథ్యంలో బాలానగర్ ట్రాఫిక్ పరిధిలోని పలువురు ఒడీపీఎల్ కాలనీ ఎదురుగా ఉన్న రెడిమేడ్ జూడియో ఉద్యోగుల సహకారంతో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా రహదారులపై రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు ప్రధానంగా లైసెన్స్, ఆర్సీ బుక్, పొల్యూషన్ సర్టిఫికెట్, హెల్మెంట్, ఇన్సూరెన్స్ వంటివి వారి వెంట ఉంచుకోవాలని తెలిపారు. ప్రయాణంలో వాహన దారులు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. ఈ మేరకు వాహనదారులు వారి సంబంధికులు, కుటుంబ సభ్యులు చొరవ తీసుకుని ప్రాథ మిక లక్ష్యంగా హెల్మెట్‌ల వాడకం, ప్రాముఖ్యత, రహదారి భద్రత కోసం ట్రాఫిక్ నిబంధనలు, నియమాలపై ప్రయా ణికులకు ట్రాఫిక్ పోలీసులు పలు సూచనలను అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా, ద్విచక్ర వాహ నాలు నడుపుతున్నప్పుడు రక్షణాత్మక హెల్మెట్ అవసరాన్ని గుర్తు చేస్తూ, హెల్మెట్ లేని ప్రయాణికులకు హెల్మెట్‌లను పంపిణీ చేశారు. అదనంగా వ్యక్తిగత భద్రతతో పాటు తోటి ప్రయాణికుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ప్రోత్సహించ డానికి కీలకమైన ట్రాఫిక్ నియమ నిబంధనలను తప్పని సరిగా పాటించాలని సూచించారు. అదేవిధంగా సాను కూలమైన ఆకర్షణీయమైన వాతావరణాన్ని కల్పించుకోవడానికి ప్రయాణికులకు చాక్లెట్లు, తాగునీటి బాటిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ సురేష్ కుమార్, భాను ప్రసాద్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

హెూం గార్డుకు ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజ్ సత్కారం



నవతెలంగాణ-కంటోన్మెంట్
మారేడుపల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెూం గార్డ్ 7703, బి.సుధాకర్, ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజ్‌ను శుక్రవారం సన్మానించారు. ఉదయం సుమారు 8.30 గంటల ప్రాంతంలో సికింద్రాబాద్ క్లబ్ ఇన్ గేట్ వద్ద జిగ్ జాగ్ బారిగేటింగ్ విధులు నిర్వర్తించి తిరిగి జేబీ ఎస్ లో ఉన్నా అవుట్ పోస్టుకి సుధాకర్ వెళుతున్న క్రమంలో ఇద్దరు యువకులు జే.బీ.ఎస్. లో సెల్ ఫోనును దొంగిలించి పారిపోవటంను గమనించి వెంటనే వారిని వెంబడించారు. ఆ తర్వాత చాకచక్యంతో జే.బీ.ఎస్. ఇన్ గేట్ వద్ద వారిని పట్టుకొని మారేడుపల్లి లా, ఆర్డర్ స్టేషన్‌లో అప్పగించారు. హెూమ్ గార్డ్ సుధాకర్ ఆఫీసర్ 7703 చేసిన పనిని గుర్తించిన ట్రాఫిక్ ఏసీపీ జి. శంకర్ రాజు, బి.సుధాకర్ ను సిబ్బంది శాలువాతో సత్కరించి అభినందించారు.



ఓవైసి నగర్, అంబర్‌పేట సోను ఆధ్వర్యంలో షకీల్, మక్బుల్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు బీఆర్ఎస్ అంబర్‌పేట డివిజన్ అధ్యక్షులు సిద్దార్థ ముదిరాజ్ హాజరైయ్యారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నజయ్ ముదిరాజ్, నరేంద్ర, దశరథ్, రాజేష్, కాశీ తదితరులు నవతెలంగాణ-అంబర్‌పేట

ఫుట్‌పాత్‌పై వ్యాపారులకు ఆటంకం కలిగించొద్దు

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-బేగంపేట్
ఫుట్‌పాత్ వ్యాపారులు, స్ట్రీట్ వెండర్స్ పట్ల అధికారులు తమ వైఖరిని మార్చుకోవాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం రాంగోపాల్ పేట డివిజన్ లోని మినిస్టర్ రోడ్, పీజీరోడ్, సింధీ కాలనీలకు చెందిన పలువురు ఫుట్‌పాత్ వ్యాపారులు, స్ట్రీట్ వెండర్స్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను వెస్ట్ మారేడ్ పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో కలిసి తమ ఆవేదనను వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ అధికారులు తమ వ్యాపారాలకు అనుమతిస్తున్న కూడా ట్రాఫిక్ సమస్యల పేరుతో తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, తమకు జీవనాధారం లేకుండా చేస్తే మా కుటుంబాలను ఎట్లా పోషించుకోవాలని ఆందోళన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ట్రాఫిక్ పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వ్యాపారులను ఇబ్బందులకు గురి చేయొద్దని ఆదేశించారు. అంతా పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారేనని పేర్కొన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా వ్యాపారులకు అవసరమైన సూచనలు, జాగ్రత్తలు చెప్పాలి కానీ వ్యాపారాలే చేయకుండా అడ్డుకోవడం సరికాదన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మాజీ కార్పొరేటర్ అత్తిలి మల్లికార్జున్ గౌడ్, రాంగోపాల్ పేట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, నాయకులు శ్రీహరి, నాగులు, టౌన్ వెండింగ్ కమిటీ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ తదితరులున్నారు.

మాదిగలకు మంత్రివర్గంలో చోటు కల్పించాలి



నవతెలంగాణ-ఓయూ
తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగలకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో బహుజన విద్యార్థి సంఘాలు మరియు ఓయూ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. త్వరలో జరగబోయే మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు జనాభా దామాషా ప్రకారం రెండు మంత్రి పదవులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన విద్యార్థి సంఘాలు జేఏసీ చైర్మెన్ వేల్పుల సంజయ్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిగలకు తీరని ద్రోహం, తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యంగా తెలుగుదేశం ప్రభుత్వం, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో మాత్రం మాదిగలకు కొంత వరకు న్యాయం జరిగిందన్నారు. రాష్ట్రంలోనే అత్యధిక జనాభా కలిగిన మాదిగ సామాజిక వర్గానికి తగిన విధంగా మంత్రి పదవుల్లో, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, నామినేటెడ్ పదవులలో సముచిత రాజకీయ ప్రాధాన్యం దక్కడం లేదన్నారు. ఇప్పటికైనా సీఎం రాబోయే మంత్రి వర్గ విస్తరణలో మా రాజకీయ వాటా ప్రకారం మాదిగలకు రెండు మంత్రి పదవులు ఇవ్వాలని డిమాండ్ చేయడం జరుగుతుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాదిగల పట్ల చూపే ప్రేమ, అభిమానాలు కేవలం మాటలవరకే కాకుండా మాదిగలకు మంత్రివర్గంలో చోటు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో దరువు రమేష్, లక్ష్మణ్ అంబేద్కర్, అఖిల్ సంపంగి, నరేందర్, రాజేష్, శివ శంకర్, సత్యం, చరణ్, అరుణ్, పాల్గొన్నారు.

'వీనుల విందుగా కవి సమ్మేళనం'



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్
శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖ నిర్వహించిన కవి సమ్మేళనం ఉత్సాహ భరితంగా సాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సూర్యా ధనంజయ్ కవితా పఠనంతో కవి సమ్మేళనాన్ని ప్రారంభించారు. తమ గురుదేవులు జ్ఞానపీఠ పురస్కృతులు డాక్టర్ సి.నారాయణ రెడ్డి స్మృతి పథంలో సాగిన కవిత సినిమా గీతాలకు సాహితీ పరిమళాలని అద్దిన నారాయణరెడ్డి గారి సాహిత్యాన్ని ,రచనలను గుర్తు చేస్తూ సాగింది. ప్రాత:స్మరణీయులైన నారాయణ రెడ్డి సమున్నత వ్యక్తిత్వాన్ని సూర్యా ధనంజయ్ కవిత చక్కగా ఆవిష్కరించింది. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లోక పావని మాట్లాడుతూ ఇటువంటి కవి సమ్మే ళనాలు విద్యార్థినుల బహుముఖీన ప్రజ్ఞను, నైపుణ్యాలను, ఆలోచనలను మెరుగుపరచడానికి అవకాశాన్ని కల్పిస్తాయన్నారు. తెలుగు శాఖ సహాయ ఆచార్యులు, కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి సభ్యులు డాక్టర్ ఎస్. రఘు మాట్లాడుతూ మన జీవితాలలోని సంఘర్షణను ఆవేదనను ప్రకృతిలోని భిన్న అంశాలను మనోనేత్రంతో దర్శించగలిగినప్పుడు కవితా పంక్తులు వాటి అంతట అవే జాలువారుతాయన్నారు. ప్రొఫెసర్ సూర్యా ధనంజయ్ ,తెలుగు శాఖ అధ్యాపకులు డా. గడ్డం మోహన్ రావు, డా. ఎం. దేవేంద్ర, డా. రాజ్ కుమార్, డా.జ్యోతి, డా. వెంకట రామ్ రెడ్డి, డా.పద్మ డా.పద్మజ, డా.అరవింద పాల్గొన్నారు.

అక్కను హింసిస్తున్నాడని బావపై బావమరిది దాడి

- బాధితుడు కిరణ్ ఐటీ ఉద్యోగి


బాధితుడు

నవతెలంగాణ-జూబ్లీహిల్స్
అక్కను హింసిస్తున్నాడని బావపై కత్తితో బావమరిది దాడి చేసిన సంఘటన మధుర నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. మధుర నగర్ పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ బాలరాజ్ తెలిపిన వివరాల ప్రకారం... రహమత్ నగర్‌లోని బంగారు మైసమ్మ గుడి వద్ద విజయ వాడకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కిరణ్ తన భార్యతో నివ సిస్తున్నాడు. భార్య -భర్తలు ఇద్దరు తరచూ గొడవలు పడుతూ తన అక్కను హింసిస్తున్నాడని, విజయ వాడలో ఉంటున్న బావమరిది ముఖేష్ తన అక్క ద్వారా తెలుసు కొని రహమత్ నగర్ లోని బావ ఇంటికి రావడం జరిగింది. అయితే శుక్రవారం ఉదయం మద్యం సేవించిన బావ మరిది ముఖేష్ బావతో గొడవపడి, కూరగాయలు కోసే కత్తితో తన బావపై దాడి చేసి చాతి పైన, కాలు పైన దాడి చేశాడు. వెంటనే తప్పిం చుకున్న బాధితుడు కిరణ్ సమీపంలోని మధురానగర్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయడం జరిగింది. వెంటనే స్పందించిన పోలీసులు నిందితుడు ముఖేష్‌ను అదుపులోనికి తీసుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మధుర నగర పోలీసులు తెలిపారు

బంజారా భాషను 8వ షెడ్యూల్‌లో చేర్చాలని తీర్మానానికి ధన్యవాదాలు



- తెలంగాణ గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షులు శరత్ నాయక్

నవతెలంగాణ-ఓయూ
బంజారా భాషను 8వ షెడ్యూల్‌లో చేర్చాలని తీర్మానం చేసినందుకు తెలంగాణ గిరిజన శక్తి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కాలేజ్ వద్ద సీఎం రేవంత్ రెడ్డికి బంజారా ప్రజా ప్రతినిధులకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు శరత్ నాయక్ మాట్లాడుతూ భారతదేశంలో 12 కోట్లకు పైగా లంబాడి బంజారా ప్రజలు మాట్లాడే గోర్ బోలి భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్ లో చేర్చాలని నిన్న అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపడం జరిగింది. దాని సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి బంజారా ప్రజా ప్రతినిధులకు ధన్యవాదాలు తెలియజేస్తూ పాలాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఈ నిర్ణయం బంజారా భాషను బతికించే విధంగా బంజారా సాంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించే విధంగా ఉన్నదని తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి 40 లక్షల గిరిజన బంజారా ప్రజలు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు తెలిపారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం వెంటనే రాజ్యాంగ సవరణ చేసి గోర్ బోలిని 8వ షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన శక్తి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్బు నాయక్, రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్ రమేష్ రాథోడ్, రాష్ట్ర కోఆర్డినేటర్ నందు నాయక్, రాష్ట్ర నాయకులు హనుమంతు నాయక్,సతీష్ నాయక్, విశ్వనాథ నాయక్, రాజశేఖర్ నాయక్, వంశీ నాయక్, మోహన్ నాయక్, కృష్ణ నాయక్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన బస్తీ వాసులు



నవతెలంగాణ-కంటోన్మెంట్
కంటోన్మెంట్ నియోజకవర్గంలో సీవిల్ ఏవీయేషన్ డిఫెన్స్ లాండ్స్‌లో నివాసం ఉంటున్న బస్తీవాసులు వారి సమస్యలను ఎమ్మెల్యే శ్రీగణేష్ ఇటీవల అసెంబ్లీలో లేవనెత్తినందుకు శుక్రవారం పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చి ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. అనంతరం బస్తీవాసులు మాట్లాడుతూ కంటోన్మెంట్ ప్రాంతంలోని సివిల్ ఏవీయేషన్ డిఫెన్స్ లాండ్స్‌లో దశాబ్దాలుగా నివాసం ఉంటున్నా తమ సమస్యలను ఎవరూ పట్టించుకోలేదని, తమ సొంత ఇంటి కల నెరవేర్చాలని, తమకు మౌలిక వసతులు కల్పించాలని, కనీసం టాయ్‌లెట్లు ఏర్పాటు చేసి గౌరవంగా బతికే అవకాశం కల్పించాలని ఎన్నో ఏండ్లుగా ఎంతో మంది నాయకులకు మొర పెట్టుకున్నా సమస్య పరిష్కారం కాలేదని గుర్తు చేశారు. కానీ ఎమ్మెల్యేగా తమ సమస్యలను పట్టించుకోవడమే కాకుండా అసెంబ్లీలో తమ సమస్యలను లేవనెత్తి ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లారని అభినందించారు. ఈ సందర్భంగా శ్రీ గణేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని పేదలకు ఏ సమస్య ఎప్పుడూ అందుబాటులో ఉంటానని వారి సమస్యలను పరిష్కరించడం తన బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ లోని వివిధ వార్డులకు చెందిన పలు బస్తీల ప్రజలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

అంగవైకల్యం, మానసిక రోగులకు యూడీఐడీ కార్డుల జారీ

- మానసిక రోగులకు మెరుగైన వైద్యమందించాలి
- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ఎర్రగడ్డ మానసిక వైద్యశాలను సందర్శించిన కలెక్టర్



నవతెలంగాణ-సిటీబ్యూరో
జిల్లాలో అంగవైకల్యం, మానసిక రోగులకు యూనిక్ డిజబులిటీ ఐడికార్డ్ (యూడీఐడీ) కారులు అందచేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శుక్రవారం ఎర్రగడ్డ మానసిక వైద్యశాలను డీఆర్వో ఈ.వెంకటాచారితో కలసి కలెక్టర్ సందర్శించారు. ముందుగా ఆస్పత్రిలోని సదరం కేంద్రాన్ని పరిశీలించి కేంద్రంలో సత్వరమే మౌలిక వసతులు కల్పించి అందుబాటులోకి తేవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కేంద్రం ఇకపై యూడీఐడీ కేంద్రంగా పని చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యూడీఐడీ సర్టిఫికెట్లు, జారీ చేయుటకు హైదరాబాద్ జిల్లాకు అయిదు ఆస్పత్రులు ప్రభుత్వం కేటాయించిందని అందులో ఉస్మానియా, ఆర్థోపెటిక్, సరోజినీ, అంధులకు కోటీ, ఈఎన్‌టీ ఆస్పత్రి, చెవిటి, మూగవారికి, నీలోఫర్, పిల్లలకు అలాగే మానసిక రోగులకు ఎర్రగడ్డ ఆస్పత్రులు సంబంధిత సమస్యలతో బాధపడుతున్నవారికి అర్హత మేరకు సర్టిఫికెట్స్, కార్డులు అందించుటకు అందుబాటులో ఉంటాయన్నారు. జిల్లాలోని వివిధ సమస్యలతో ఉన్నవారు ఆన్‌లైన్‌లో యూడీఐడీ ఫోల్డర్‌లో పూర్తి వివరాలు నమోదు చేసుకొని తదుపరి సమాచారం.. సంబంధిత ఆస్పత్రులకు వెళ్లి వైద్యులచే చూయించుకున్న తదుపరి అర్హత మేరకు సర్టిఫికెట్, కార్డు అందుతాయని చెప్పారు. ఆస్పత్రి పరిశీలనలో భాగంగా ఔట్ పేషెంట్, ఇన్ పేషంట్ అలాగే అందుతున్న వైద్య సేవలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పేషంట్స్ వెయిటింగ్ హాల్‌లో తాగు నీరుతో పాటు సీలింగ్ ఫ్యాన్స్ ఏర్పాటు చేయాలని, ఆస్పత్రికి వచ్చే మానసిక రోగులకు మెరుగైన వైద్య సేవలు అందాలని ఈ సందర్భంగా వైద్య అధికారులకు ఆదేశించారు. ఆస్పత్రి సూపర్‌టెండెంట్ ఆస్పత్రిలో నీటి సంపు, అంతర్గత రోడ్లు చేపట్టాలని కోరగా సంబంధిత ప్రతిపాదనలు పంపాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపర్‌టెండెంట్ ఆర్.అనిత, తహసీల్దార్ పద్మ సుందరి, వైద్యాధికారులు తదితరులున్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి



నవతెలంగాణ-బంజారాహిల్స్
నగరంలో కనీస ప్రమాణాలు పాటించకుండా నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకొని నిర్మాణాలు చేస్తున్న వారిని ప్రోత్సహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సామాజిక కార్యకర్త రవికుమార్ విజ్ఞప్తి చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ మహానగరంలో బస్తీలు, కాలనీలు అని తేడా లేకుండా భారీ భవనాలను నిర్మిస్తున్నారన్నారు. 50, 60 గజాలలో కూడా ఐదు నుంచి ఆరు అంతస్తుల భవనాలను నిర్మి స్తున్న ప్రభుత్వ అధికారులు సదరు నిర్మాణాలపై చర్యలు చేపట్ట కపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందన్నారు. బస్తీల పేరుతో అనుమ తులు లేకుండా రోడ్లను సైతం కబ్జాలు చేసి నిర్మాణాలు జరుగు తుంటే టౌన్ ప్లానింగ్ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. మాదాపూర్‌తో పాటు సమీప ప్రాంతాలలో అక్రమ నిర్మాణాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందన్నారు. శేరిలింగంపల్లి మండలం మాదాపూర్‌లో కేవలం వంద గజాల స్థలంలో ఆరు అంతస్తుల భవనాన్ని నిర్మించారని, ఆ భవనంపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని సర్కిలలో టౌన్ ప్లానింగ్ విభాగాన్ని పటిష్టపరిచి అక్రమ నిర్మాణాలను అదుపు చేయాలని డిమాండ్ చేశారు.

ఇఫ్తార్ విందుకు హాజరైన కేటీఆర్, పద్మారావు గౌడ్



నవతెలంగాణ-ఓయూ
సికింద్రాబాద్ నియోజకవర్గంలోని బౌద్ధనగర్ డివిజన్‌లోని వారాసిగూడలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావు, సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఇఫ్తార్ విందులు సర్వ మత సౌభా తృత్వాన్ని చాటుతాయన్నారు. తెలంగాణా రాష్ట్రం అన్ని మతాల ప్రజల సహ జీవనానికి ప్రతీకని చెప్పారు. పద్మారావు గౌడ్ మాట్లాడుతూ ముస్లింలు పవిత్రంగా భావించే రంజాన్ మాసాన్ని ప్రతి ఒక్కరు గౌరవించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కంది శైలజ, సామల హేమ,రాసూరి సునీత,యువ నేత రామేశ్వర్ గౌడ్, నిర్వాహకులు బషీర్, అబ్దుల్, మునావర్, పాల్గొన్నారు.

ముస్లింలకు నిత్యావసర సరుకులు పంపిణీ



నవతెలంగాణ-కంటోన్మెంట్
యువ కాంగ్రెస్ నాయకుడు, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ కుమారుడు ముకుల్ పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకొని శుక్రవారం బాలంరాయిలోని పేద ముస్లింలకు నిత్యావసర సరు కులను పంపిణీ చేశారు. ప్రతి ఏడాది రంజాన్ మాసంలో ఎమ్మెల్యే గణేష్ పేద ముస్లింలకు సరుకులు పంపిణీ చేసేవారు అయితే ఈ ఏడాది అసెంబ్లీ సమావేశాలు, పలు ఇతర కార్యక్రమాలలో ఎమ్మెల్యే బీజీగా ఉండటంతో ఆయన కుమారుడు సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యువ నాయకుడు ముకుల్ బస్తీల వారితో మాట్లాడి వారి కష్టసుఖాలు తెలుసుకున్నారు. తమ కాలనీకి వచ్చి తమ కష్టసుఖాలు తెలుసుకోవడం, పండగ సందర్భంగా సరుకులు పంపిణీ చేయడం పట్ల పలువురు సంతోషం వ్యక్తం చేశారు.

నేడు జర్నలిస్టులు పోలీసుల మధ్య ఫ్రెండ్లీ మ్యాచ్



నవతెలంగాణ-కంటోన్మెంట్
నేడు ఏఓసి లోని ఆర్మీ తాపర్ గ్రౌండ్‌లో కార్ఖానా పోలీస్ జట్టుతో కంటోన్మెంట్ మీడియా ప్రతినిధులు ట్వంటీ20 మ్యాచ్ తలపడనున్నారు. ఈ మ్యాచ్‌లో కంటోన్మెంట్ ప్రాంతానికి చెందిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో వాళ్లు ఒక టీంగా కార్ఖానా పోలీసులు మరొక టీమ్‌గా బరిలో దిగనున్నారు. కంటోన్మెంట్ మీడియా ప్రతినిధులు పలు పోలీస్‌స్టేషన్‌కు చెందిన పోలీసులతో మ్యాచ్ తలపడనున్నారు. ఈ మ్యాచ్‌కు ముఖ్య అతిథిగా కంటోన్మెంట్ శాసన సభ్యులు శ్రీ గణేష్ హాజరుకానున్నారు.

ప్రపంచ పేరుగాంచిన హర్ ఆర్ట్ గ్యాలరీ డాక్యుమెంటరీ

దాశరథి ఫిలిమ్ సొసైటీ అధ్యక్షులు యస్.వినయకుమార్, సంస్కృతి రత్న డా.కె.ధర్మారావు



నవతెలంగాణ-ముషీరాబాద్
హర్ ఆర్ట్ గ్యాలరీ లఘు చిత్రం ప్రపంచవ్యాప్తంగా పేరు గాంచిందని దాశరథి ఫిలిమ్ సొసైటీ అధ్యక్షులు యస్.వినయ కుమార్, నిర్మాత సంస్కృతి రత్న డా.కె. ధర్మారావు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో దాశరథి థియేటర్ ప్రముఖ హస్త కళాకారిణి, 'హస్త కళ శిరోమణి' పి.కమలా ప్రసాదరావు సృష్టించిన, 'హర్ ఆర్ట్ గ్యాలరీ' డాక్యుమెంటరీ చిత్ర ప్రదర్శన "ఆ-మ" లఘుచిత్రం ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రముఖ సినీ దర్శకులు రేలంగి నరసింహారావు దర్శకత్వ పర్యవేక్షణ చేయగా, గౌతమ్ చిత్రీకరణ, యం.వి.ఆర్.యస్.యస్.మూర్తి దర్శకత్వం వహించగా, స్క్రీన్ ప్లే ఎడిటింగ్, నిర్మాత సంస్కృతి రత్న, కె.ధర్మారావు నిర్వహణలో హర్ ఆర్ట్ గ్యాలరీ డాక్యుమెంటరీ చిత్రం ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచి ఎంతగానో ఆకట్టుకుందన్నారు. "ఆ-మ" లఘుచిత్రం నేటి సమాజంలో ట్రాన్స్‌జెండర్ ఆవేదనకు అద్దం పట్టిందన్నారు. టర్టిల్ మీడియా క్రియేషన్స్ నిర్మించిన ఈ "ఆ-మ" చిత్రంలో ప్రధానమైన ట్రాన్స్‌జెండర్ పాత్రలో కింగ్ కరణ్ ఒదిగిపోయారని తెలిపారు. రచన దర్శకత్వం సత్యజిత్ శ్రీకూర్మం, క్రియేటివ్ హెడ్‌గా ఉదయ భాస్కర్, సాంబరాజు వ్యవహరించారని తెలిపారు. ఉత్తమ డాక్యుమెంటరీ లఘు చిత్రాలకు ఎల్లప్పుడూ ప్రజాదరణ ఉంటుందని, ప్రజల్లో చెరగని ముద్ర వేసుకుంటాయని చెప్పారు. అటువంటి కోవలోకే ఈ చిత్రాలు చేరుతాయని, ప్రజల అభిరుచిని దృష్టిలో ఉంచుకొని సామాజిక కోణంలో పలు అంశాలపై ప్రజలకు అవగాహన కలిగించేలా చిత్రాలు ఉండాలని సూచించారు. చిత్ర ప్రదర్శన అనంతరం "హర్ ఆర్ట్ గ్యాలరీ" 'ఆ-మ" చిత్ర బృందాలను సత్కరించి అభినందనలు తెలియ చేశారు.

ఏప్రిల్ నుంచి సన్న బియ్యం సరఫరా

- సర్కిల్-2 అధికారి సురేందర్..

నవతెలంగాణ-ధూల్‌పేట్
పౌర సరఫరా శాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ మాసం నుంచి రేషన్ షాప్ ల ద్వారా సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని సర్కిల్ - 2 పౌర సరఫరా శాఖ అధికారి సురేందర్ అన్నారు. శుక్రవారం పురాని హవేలిలోని ఆయన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. సర్కిల్-2 పరిధిలో 90,828 రేషన్ కార్డులు ఉన్నాయని, 3,45,783 పేర్లు నమోదై ఉన్నాయని తెలిపారు. ఏప్రిల్ మాసంలో 83 రేషన్ షాపులతో ప్రభుత్వం పేద ప్రజలకు సన్న బియ్యం సరఫరా చేయనున్నదని పేర్కొన్నారు. ప్రభుత్వ సరఫరా చేసే రేషన్ సన్న బియ్యం విక్రయించిన దళారులు కొనుగోలు చేసిన తమ స్పెషల్ టీమ్‌లు పట్టుకొని కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం అర్హులైన వారందరికీ ఇస్తుందన్నారు. సర్కిల్ -2లో కొత్త రేషన్ కార్డుల కోసం 32,086 దరఖాస్తులు రాగ ఇప్పటి వరకు 871 దరఖాస్తుల విచారణ జరిగిందన్నారు.



నవతెలంగాణ-ముషీరాబాద్
ముషీరాబాద్ డివిజన్ కుమ్మరి సంఘం మాజీ ఉపాధ్యక్షులు ఆర్.రాములు హఠాత్ మరణంతో కుమ్మర సంఘం ప్రాంతంలో విషాద ఛాయ నెల కొల్పడంతో ఈ విషయాన్ని తెలుసుకున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, రాష్ట్ర నాయకులు ముఠా జై సింహ, ఎడ్ల హరి బాబు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి సంఘం ప్రెసిడెంట్ బండారి గోపాల్, ఉపాధ్య క్షులు టిల్లు, కార్య నిర్వహణ కార్యదర్శి ప్రేమ్ కుమార్, బాసర సీనియర్ నాయకులు పూస గోర ఖ్నాథ్, డివిజన్ అధ్యక్షులు కార్యదర్శులు శ్రీధర్, ఆకుల అరుణ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

పాల వ్యాపారం పేరుతో కోట్లు మోసపోయాం.. ఆదుకోండి




- కొండపల్లి డెయిరీ ఫార్మ్ బాధితులు

నవతెలంగాణ-బంజారాహిల్స్
పాల వ్యాపారంలో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించి సుమారు రూ.20 కోట్ల మోసానికి పాల్పడిన 'కొండపల్లి డెయిరీ ఫార్మ్' బాధితుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. కోకాపేటలో ఉండే వేముల సుబ్బారావు, ఆయన భార్య వేముల లక్ష్మి కుమారి నాలుగేళ్ల క్రితం అజీజ నగర్‌లో 'కొండపల్లి డెయిరీ ఫార్మ్' ఏర్పాటు చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మధు, కేవీ సాంబశివరావు, వెంకటేశ్వరరావు, సురేంద్రలు మాట్లాడారు. మొయినాబాద్ మండలం నాగిరెడ్డిగూడకు చెందిన కీసరి సంజీవరెడ్డి అజీజ్‌నగర్ రెవెన్యూలో వ్యవసాయ భూమిని కరీంనగర్‌కు చెందిన శ్రీనివాసరావుకు తొమ్మిదేళ్లకు లీజుకు ఇచ్చారు. నాలుగేళ్ల క్రితం బంధువైన వేముల సుబ్బారావు, కుమారి దంపతులు అజీజ్ నగర్‌లోని పొలంలో కొండపల్లి డెయిరీ ఫార్మ్ ప్రారంభించారు. సుమారుగా 500 గేదెలను పోషించి రోజుకు 3 వేల లీటర్ల పాలను ఉత్పత్తి చేశారు. లాభాలు బాగానే ఉండగా వ్యాపారంలో అక్రమ మార్గం ఎంచుకున్నారు. పాడి గేదెలపై పెట్టుబడులు పెడితే మంచి లాభాలు చూపిస్తామంటూ ఏపీకి చెందిన రెడ్డప్పను ఆశ్రయించారు. ఆరేడు నెలల క్రితం ఆయన ఓ దినపత్రికలో ప్రకటన ఇచ్చారు. ఆ ప్రకటనను చూసిన హైదరాబాద్‌కు చెందిన 15 మందికి పైగా సుమారు రూ.20 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టారు. పది గేదెలకు రూ.13 లక్షలు పెడితే ప్రతినెలా రూ.3 చొప్పున వడ్డీ చెల్లించడంతోపాటు లాభాలు ఇస్తానంటూ పెట్టుబడులు సేకరించారు. రెండు, మూడు మాసాలు వడ్డీ, లాభాలు ఇచ్చాక అజీజ్‌నగర్‌లోని కొండపల్లి డెయిరీ ఫార్మ్ ఎత్తేశారు. బాధితులు మొయినాబాద్ పోలీసులను ఆశ్రయించగా సైబరాబాద్ ఆర్థిక నేరాల (ఈవోడబ్ల్యూ) విభాగంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

తీర్పును ధిక్కరిస్తారా?

- చింతల్ బస్తీ గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు పి.వేణుగోపాల్ గౌడ్



నవతెలంగాణ-బంజారాహిల్స్
తీర్పును ధిక్కరిస్తారా? కాలయాపనకు హద్దులున్నాయని చింతల్ బస్తీ గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు పి.వేణుగోపాల్ గౌడ్ అన్నారు. సహకారశాఖ నిబంధనలను తుంగలో తొక్కి నిర్వహించిన చింతల బస్తీ కల్లుగీత సహకార సొసైటీ ఎన్నిక రద్దు చేస్తూ సహకారశాఖ ట్రిబ్యునల్ తీర్పును వెల్లడించి మూడునెలలు గడిచినా ఇప్పటిదాకా అబ్కారీ శాఖ అధికారులు సరైన చర్యలు తీసుకోకపోవడం లేదని ఆరోపించారు. శుక్రవారం బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ.. చింతల బస్తీ కల్లుగీత సహకార సొసైటీకి చెందిన నిజమైన సభ్యుల ఓట్లను గల్లంతు చేసి బోగస్ ఓట్లతో 2022 జూన్ 6న నిర్వహించిన ఎన్నిక చెల్లదంటూ తాను సహకారశాఖ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించానన్నారు. సొసైటీ ఓటర్ జాబితాలో జరిగిన అవకతవకలను తాను ట్రిబ్యునల్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. మూడునెలల క్రితం చీఫ్ ప్రమోటర్ కే.సుగుణమ్మతో పాటు ఇతర పాలక మండలి ఎన్నికను రద్దు చేస్తూ తీర్పు ఇచ్చిందని, 15రోజుల్లోగా షోకాజ్ నోటీస్ జారీ చేసి కమిటీని రద్దు చేయాల్సిన జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులతో పాటు సహకారశాఖ అధికారులు ఉద్దేశపూర్వకంగా తాత్సారం చేస్తున్నారన్నారు. చింతల్ బస్తీ సొసైటీకి చెందిన చీఫ్ ప్రమోటర్ సుగుణమ్మతో పాటు పాలకమండలి మీద కల్తీ కల్లు విక్రయం చేశారని బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదయిందని పేర్కొన్నారు. వందలాది మంది గీత కార్మికుల పొట్టకొట్టి బడాబుబులకు దోచి పెట్టేలా ఎక్సైజ్ శాఖ అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ, ట్రిబ్యునల్ తీర్పును అమలు పర్చకుండా కాలయాపన చేస్తున్న అధికారుల తీరుపై కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేయిస్తామన్నారు. నిజమైన కల్లుగీత కార్మికులకు న్యాయం చేసేదాకా ఊరుకునేది లేదని హెచ్చరించారు.

నవతెలంగాణ
హైదరాబాద్
HMDA
11
శనివారం | మార్చి 29, 2025 | www.navatelangana.com

భార్య మృతికి కారణమైన కేసులో భర్తకు జీవిత ఖైదు



నవతెలంగాణ-సిటీబ్యూరో

చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో అదనపు కట్నం కోసం భార్యను వేధించి, ఆమె మృతికి కారణమైన కేసులో శుక్రవారం ఎల్బీనగర్ కోర్టు నిందితుడికి జీవిత ఖైదు విధించింది. చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన కలిమెర ఆనంద్ కుమార్ ప్రయివేట్ ఉద్యోగం చేస్తున్నాడు. 2017లో పెండ్లి చేసుకున్నాడు. పెళ్లి జరిగిన మరుసటి రోజు నుంచే అదనపు కట్నం కోసం భార్యని వేధిస్తూ, తరచుగా భౌతిక దాడులకు పాల్పడేవాడు. ఆనంద్ కుమార్ వేధింపులు తాళలేక ఆయన భార్య ఆత్మహత్య చేసుకుంది. ఆమె మృతికి కారణం కావడంతో ఆనంద్‌తోపాటు ఆయన తల్లిపై కేసు నమోదు చేసిన పోలీసులు, ఛార్జ్‌షీట్‌ను కోర్టులో సమర్పించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ఎల్బీనగర్ కోర్టు వారిని దోషులుగా నిర్ధారించారు. ఈ కేసులో ఆనంద్‌కు జీవిత ఖైదు శిక్ష విధించారు. ఆయన తల్లికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధించారు.

దరఖాస్తుకు చివరి తేదీ మే 31

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి వినోద్ కుమార్

నవతెలంగాణ-సిటీబ్యూరో

2024-25 విద్యా సంవత్సరం జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ) విద్యార్థినీ విద్యార్థుల ఉపకార వేతనాల నమోదును (ఫ్రెషర్స్, రెన్యువల్) కోసం మే 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి వినోద్ కుమార్ తెలిపారు. అర్హత గల విద్యార్థినీ విద్యార్థులు tgepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అలాగే సంబంధిత ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలల యాజమాన్యం, ప్రిన్సిపాల్స్ తమ కాలేజీలో అర్హత గల ఎస్సీ విద్యార్థులందరినీ పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకునేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

రాజీవ్ ఆరోగ్యశ్రీ ఎంప్యానెల్‌మెంట్‌పై ఓరియంటేషన్ సమావేశం

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం, రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సహకారంతో రాజీవ్ ఆరోగ్యశ్రీ ఎంపానెల్‌మెంట్‌పై శుక్రవారం సికింద్రాబాద్ గాంధీ హాస్పిటల్ పూర్వ విద్యార్థుల సమావేశ మందిరంలో ముందస్తు ఓరియంటేషన్ సమావేశం నిర్వహించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఎంప్యానెల్‌మెంట్ ప్రక్రియపై స్పష్టత అందించే లక్ష్యంతో హైదరాబాద్‌లోని నమోదు చేయబడిన ప్రయివేటు హాస్పిటల్స్ (30 పడకలు అంతకంటే ఎక్కువ) నుంచి ప్రతినిధులు ఈ సెషన్‌కు హాజరయ్యారు. ఆరోగ్యశ్రీ ఎంప్యానెల్‌మెంట్ ప్రక్రియ అవలోకనం, హాస్పిటల్స్ కోసం అర్హత ప్రమాణాలు, మార్గదర్శకాలు, డాక్యుమెంటేషన్, సమ్మతి అవసరాలు, పాల్గొనేవారి ప్రశ్నలను పరిష్కరించడానికి ఇంటరాక్టివ్ సెషన్‌పై చర్చించారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి వచ్చేలా ఆరోగ్యశ్రీ పథకంలో క్రమబద్ధమైన హాస్పిటల్ భాగస్వామ్యం ప్రాముఖ్యతను ఈ సమావేశం నొక్కి చెప్పింది. ఎంప్యానెల్‌మెంట్ ప్రక్రియను సులభతరం చేయడానికి అన్ని హాస్పిటల్స్ నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూడాలని అధికారులు కోరారు. మరిన్ని వివరాలు, సందేహాల కోసం హాస్పిటల్స్ ఆర్గనైజింగ్ అధికారులను సంప్రదించాలని సూచించారు.



'నీలోఫర్ సుప్రీం టీ పౌడర్" విడుదల



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రసిద్ధి చెందిన టీ కేఫ్ అయిన కేఫ్ నీలోఫర్, హైటెక్ సిటీలోని తమ శాఖలో తమ తాజా ఆఫర్ "నీలోఫర్ సుప్రీం టీ పౌడర్"ను శుక్రవారం విడుదల చేసింది. "కేవలం చాయ్ కాదు, ఛార్జర్" అనే తమ ప్రచార నినాదానికి అనుగుణంగా ఈ టీ పౌడర్‌ను తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా వ్యవస్థాపకులు, చైర్మెన్ అనుముల బాబురావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఆదర్శవంతమైన టీని తయారు చేయడంపైనే తమ లక్ష్యం ఎల్లప్పుడూ కేంద్రీకతమై ఉందన్నారు. నీలోఫర్ సుప్రీం టీ పౌడర్‌ను తమ సిగ్నేచర్ బ్లెండ్లైన ప్లాటినం డబుల్ డిలైట్‌తో పాటు అందించటం ద్వారా తమ కస్టమర్ల విభిన్న అభిరుచులను తీర్చడమే లక్ష్యం అని తెలిపారు. తాను బ్లెండింగ్ ప్రక్రియను వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తుంటాననీ, ప్రీమియం అస్సాం టీ తోటల నుంచి ఎంపిక చేసిన తేయాకు మాత్రమే ఉపయోగిస్తామనీ, ప్రతి దశలోనూ కఠినమైన నాణ్యత పరీక్షలను ఈ టీ పౌడర్ ఎదుర్కొంటుందన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ అనుముల శశాంక్ మాట్లాడుతూ ప్రతి ఇంటికీ తమదైన ప్రత్యేక రుచి, ప్రాధాన్యతలుంటాయని గుర్తించామని తెలిపారు. నీలోఫర్ సుప్రీం టీ వైవిధ్యత కోసం రూపొందించబడిందనీ, ప్రతి తెలుగు కుటుంబం అభిరుచులకు నుగుణంగా ఉంటుందని చెప్పారు. ఆంధ్ర. తెలంగాణల్లో విస్తృత స్థాయి పంపిణీ నెట్‌వర్క్ అనీ, రెండు రాష్ట్రాల్లో ఎఫ్ఎంసిజీ రంగంలోకి ప్రవేశిస్తున్నట్టు వెల్లడించారు. టీఎస్ఐఐసీ సహకారంతో, చందనవల్లిలో ఆరెకరాల భూమిని టీ, బిస్కెట్ ఉత్పత్తి కోసం కేటాయించినట్టు వెల్లడించారు. ఇది 600 మందికి పైగా ఉద్యోగాలను సృష్టించనుందన్నారు. టీ ఫ్యాక్టరీ కార్యకలాపాలు ఏప్రిల్‌లో ప్రారంభం కానుండగా, బిస్కెట్ ప్లాంట్ జూన్ లేదా జూలై నాటికి ప్రారంభించనున్నట్టు తెలిపారు.

డీ-మార్ట్, రత్నదీప్, రిలయన్స్ మార్ట్ సహా ఇతర కిరాణ దుకాణాలతో సహా ప్రధాన రిటైల్ చైన్‌లో, అమెజాన్ వంటి ఇ-కామర్స్ ఫాట్‌ఫాంలలో, స్విగ్గీ, ఇన్‌స్టమార్ట్, బ్లింకిట్ వంటి శీఘ్ర-కామర్స్ సేవల్లో నీలోఫర్ సుప్రీం టీ అందుబాటులో ఉందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కేఫ్ నీలోఫర్ వైస్ ప్రెసిడెంట్ వేణు గోపాల్, శ్రేయ, త్రిగుణాథ్, తదితరులు పాల్గొన్నారు.

'బ్యూటీ టు ఏ సైన్స్' ఆవిష్కరణ

నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్లోబల్ డెర్మటాలజిస్ట్ సిఫార్సు చేసిన సైన్స్-ఆధారిత స్కిన్‌కేర్ బ్రాండ్ అయిన న్యూట్రోజెనా తన కొత్త బ్రాండ్, ఫిలాసఫీ 'బ్యూటీ టు ఏ సైన్స్'ను ఆవిష్కరించింది. బాలీవుడ్ సూపర్‌స్టార్ శ్రద్ధా కపూర్‌ను భారతదేశంలో తన కొత్త బ్రాండ్ అంబాసిడర్‌గా చేర్చుకుంది. శుక్రవారం ముంబైలో జరిగిన 'బ్యూటీ విత్ నో కాంప్రమైజ్' కార్యక్రమంలో, న్యూట్రోజెనా తన తాజా ఆవిష్కరణ - హైడ్రో బూస్ట్ సన్‌స్క్రీన్, ఎస్‌పీఎఫ్-50ని కూడా ప్రారంభించింది. ఇది బరువులేని సూర్య రక్షణ, లోతైన హైడ్రేషన్‌ను అందిస్తుంది. ఈ సందర్భంగా 'రూల్స్ ఫర్ బ్యూటీ విత్ నో కాంప్రమైజ్' అనే అంశంపై శ్రద్ధా కపూర్, ఎవ్రీథింగ్ స్కిన్ అండ్ హెయిర్ క్లినిక్ చీఫ్ డెర్మటాలజిస్ట్ డాక్టర్ పునీత్ సరోగి, కెన్వ్యూలోని ఆర్అండ్‌డీ స్కిన్ హెల్త్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ పద్వీలతో ఆకర్షణీయమైన ప్యానెల్ చర్చ జరిగింది. ఈ చర్చలో వినియోగదారులు తరచుగా చేసే రోజువారీ చర్మ సంరక్షణ రాజీలపై లోతుగా చర్చించారు. పదార్థాల కంటే శాస్త్రీయ సూత్రీకరణల ప్రాముఖ్యతను, సౌందర్యం కంటే సమర్థతను, సామాజిక ధోరణుల కంటే సైన్స్, చర్మ-ఆధారిత పరిష్కారాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరాన్ని హైలైట్ చేశారు.

రైతాంగ సమస్యలపై పోరాటం చేస్తా

నవతెలంగాణ - జవహర్ నగర్

మేడ్చల్ జిల్లా రైతాంగ సమస్యలపై పోరాటం చేస్తానని రైతు సంఘం రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ నిమ్మల నర్సింహా అన్నారు. నిజామాబాద్‌లో 25, 26, 27 వ తేదీలలో జరిగిన రాష్ట్ర రైతు సంఘం 3వ, మహాసభలు నిర్వహించారు. ఈ మహాసభలో వివిధ జిల్లాల నాయకులను పరిశీలించి సభ్యత్వం , పోరాటాలు ఉద్యమాలు చూసి రాష్ట్ర స్థాయిలో బాధ్యతలను అప్పగించారు. రైతు సంఘం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్న నిమ్మల నరసింహులును రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా అవకాశం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రైతు సంఘం నాయకత్వానికి, రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ లకు విప్లవ అభినందనలు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
శనివారం | మార్చి 29, 2025 | www.navatelangana.com

బ్రాహ్మణ సంక్షేమానికి రూ.100 కోట్లు ఇవ్వడం హర్షం



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు రూ. 100 కోట్లు ప్రభుత్వం విడుదల చేయడం హర్షనీయమని, బ్రాహ్మణుల పట్ల సీఎం రేవంత్ రెడ్డి ఇస్తున్న ప్రేమ పట్ల బ్రాహ్మణ అర్చక లోకం హర్షిస్తుందని అర్చక ఉద్యోగ సంఘం అధ్యక్షులు కాండూరి కృష్ణమాచారి అన్నారు. మంత్రి శ్రీధర్ బాబు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యా ప్రతి సమస్య పరిష్కారం చేయాలనే దిశగా వ్యవహరిస్తున్న తీరు ఇవన్నీ కూడా బ్రాహ్మణ లోకాని అర్చక లోకానికి మంచి రోజు ఇలానే భావిస్తున్నామ న్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఈమధ్య ప్రవేశపెట్టిన బడ్జెట్ అద్భుతమైనది అన్నారు. ప్రభుత్వానికి జేఏసీ చైర్మెన్ గంగు ఉపేంద్ర శర్మ , సిహెచ్ బద్రీనాథ్ పరాశరం రవీంద్రాచార్యులు, అగ్నిహోత్ర చంద్రశేఖర శర్మ కాండూరి రామ్మోహన్ రావు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

టెన్త్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నరసింహా రెడ్డి

- జీజీహెచ్ఎస్ మహబూబియా సెంటర్‌లో ఏర్పాట్లపై సంతృప్తి

నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లాలో పదవ తరగతి వార్షిక పరీక్షలు సజావుగా జరిగేలా సంబంధిత అధికారులు పటిష్ఠ చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో శుక్రవారం పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈ.వి.నరసింహ రెడ్డి గన్‌ఫౌండ్రీలోని మహబూబియా ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. పరీక్ష నిర్వహణ సరళిని పరిశీలించారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగ కుండా తీసుకున్నా ఏర్పాట్లతో పాటు పరీక్షా కేంద్రాలోని అన్ని ఏర్పాట్లు బాగున్నాయని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. డైరెక్టర్ వెంట ప్రభుత్వ పరీక్షల సంచాలకులు కృష్ణారావు, జిల్లా విద్యాశాఖాధికారిణి ఆర్.రోహిణీ ఉన్నారు.



పగిలిన డ్రయినేజీ పైప్‌లైన్ పనులను పూర్తి చేయాలి

- సీపీఐ(ఎం) కార్యదర్శి సి.మల్లేష్



నవతెలంగాణ-మెహిదీపట్నం

శివాజీనగర్ బోజగుట్ట బస్తీలో డ్రయినేజీ పైప్‌లు పగిలినవి వెంటనే కొత్త పైప్‌లైన్‌లు వేయాలని సీపీఐ(ఎం) నాంపల్లి జోన్ కార్యదర్శి సి.మల్లేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన స్థానిక సమస్యల సర్వేలో భాగంగాశివాజీ నగర్ బస్తీలో స్థానిక సమస్యలపై సర్వే చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికంగా గత 30 సంవత్సరాల క్రితం వేసినటువంటి డ్రయినేజీ పైప్‌లైన్‌లు వర్షాల కారణంగా పగిలిపోయి డ్రయినేజీ మొత్తం ఇండ్ల ముందు పారుతుందని దీంతో దుర్వాసనతో ప్రజలు చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారని తెలిపారు. వెంటనే ఈ పైప్‌లైన్‌ను మార్చి కొత్త పైపులైన్ వేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు సుధాకర్, జనార్ధన్, అజ్మత్, కాసింబి, జుబేర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు .

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందాలి

- విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు
- మౌలిక వసతులు కల్పనకు ప్రతిపాదనలు అందించాలి
- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రభుత్వ ఆస్పత్రులలో మెరుగైన వైద్య సేవలు అందించాలని అనుదీప్ దురిశెట్టి వైద్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో వైద్య విధాన పరిషత్ పరిధిలో గల వివిధ ఆస్పత్రుల సూపర్‌టెండెంట్లు, స్పెషలిస్ట్ డాక్టర్లు, వైద్యాధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో డీసీహెచ్ డాక్టర్ రాజేంద్రనాథ్‌తో కలిసి పాల్గొన్నారు. జనరల్ మెడిసన్ , ఆర్థోపెటిక్, జర్నర్ సర్జరీలు, ఆరోగ్యశ్రీ, డయాలసిస్ కేసులపై డీసీహెచ్‌తో కలిసి ఆస్పత్రుల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందనీ, వాటిల్లో మెరుగైన వైద్య సేవలు అందాలని ఆదేశించారు. అన్ని ఆస్పత్రులలో ఓపి శాతం ఎక్కువగా ఉండాలని ఆయన సూచించారు. ప్రసూతి వైద్యులు ఎక్కువగా సాధారణ కాన్పులకు ప్రాధాన్యత ఇవ్వాలనీ, వైద్యాధికారులు సమయపాలన తప్పక పాటించాలని సూచించారు. జిల్లాలోని తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఆస్పత్రులలో మౌలిక వస్తువుల కల్పన, ఖాళీల వివరాలు, వైద్యుల కొరత చేపట్టవలసిన అంశాలపై జిల్లా కలెక్టర్ నిర్దేశం చేశారు. ప్రతి మాసంలో వైద్యాధికారులు సిబ్బంది సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వైద్యాధికారులపై చర్యలు తప్పవన్నారు. పిల్లల విభాగాల్లో ఎక్కువగా ఓపి శాతం పెరగాలని ఆ దిశగా చికిత్సలు అందించాలనీ, ప్రతి ఆస్పత్రిలోనూ మందులు కొరత లేకుండా చూడాలని సూచించారు. ఎండ తీవ్రత రోజురోజుకు పెరుగుతున్నందున తాగునీటి ఇబ్బంది లేకుండా ఇష్ట చర్యలు చేపట్టాలని వైద్య అధికారులను ఆదేశించారు. ఆస్పత్రులలో అవసరమైన వైద్య పరికరాలు కొనుగోలుకు ప్రతిపాదనలు పంపాలనీ, కాంట్రాక్ట్ వైద్యాధికారుల ఖాళీల వివరాలు అందించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ ఆస్పత్రుల సూపర్‌టెండెంట్లు, వైద్యాధికారులు, తదితరులున్నారు.

ప్రజలు దళారులను నమ్మొద్దు..

- బహదూర్‌పురా నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి పి. రాజేశ్ కుమార్



నవతెలంగాణ-ధూల్‌పేట్

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం పొందేందుకు ప్రజలు దళారులను నమ్మొద్దని బహదూర్‌పురా నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి పులిపాటి రాజేశ్ కుమార్ అన్నారు. ప్రజల ధృవీకరణ పత్రాల జారిలో జాప్యం చెయ్యొద్దని బహదూర్‌పుర మండల తహసీల్దార్ చంద్ర శేఖర్ గౌడ్‌ని ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజీవ్ యువ వికాసం పథకం పొందేం దుకు కావాల్సిన ధృవీకరణ పత్రాల, లోన్ దరాఖస్తుకై ప్రజలు దళారులను ఆశ్రయించవద్దన్నారు. ప్రభుత్వ పథకం పొందే లబ్ధిదారులకు కావాల్సిన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం జారీ చేయడంలో కొంత ఆలస్యం అవుతున్నదని ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదు మేరకు తహసీల్దార్‌ను కలిసి మాట్లాడని తెలిపారు. ఏ జ్యాపం లేకుండా తొందరగా కుల, ఆదాయ ధ్రువీకరణ పాత్రలు జారీ చేయాలని కోరామన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు సుమారు 3500 అప్లికేషన్స్ వచ్చాయని అందులో 2500 కుల, ఆదా య ధ్రువీకరణ పాత్రలని జారీ చేశామని చెప్పారు. ప్రజలు ఆన్‌లైన్ సెంటర్లలో, మీ సేవ కేంద్రాలలో అధిక డబ్బులు చెల్లించొద్దని కోరారు. తహసీల్దార్‌ని కలిసిన వారిలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు జి.కన్నయ్య లాల్, అబేద్ అలీ, అలీ షాన్, ప్రశాంత్, శ్రీకాంత్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణ పత్రాలు వెంటనే ఇవ్వాలి



- డీవైఎఫ్ఐ సౌత్ జిల్లా కార్యదర్శి కృష్ణ నాయక్

నవతెలంగాణ-ధూల్‌పేట్

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కుల ధ్రువీకరణపత్రాలు వెంటనే ఇవ్వాలని డీవైఎఫ్ఐ సౌత్ జిల్లా కార్యదర్శి కృష్ణ నాయక్ డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బండ్లగూడ డిప్యూటీ ఎమ్మార్వో రాధిక కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ మధ్యకాలంలో రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన కొత్త పథకం రాజీవ్ యువ వికాసం పథకం నిరుద్యోగ యువకులకు, ఉపాధి లేని వారికి దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం నుంచి ఆ కాస్త సహకారం అందుతుందని ఆశతో పెట్టుకుటున్న రాజీవ్ యువ వికాసం ఆన్‌లైన్ దరఖాస్తుల కోసం ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ కులానికి చెందిన వారికి కుల ధ్రువపత్రాలు వెంటనే ఇవ్వాలన్నారు. వాటిని జాప్యం చేయడంతో అర్హులైన వారు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారన్నారని దీనిని దృష్టి ఉంచి సర్టిఫికెట్స్ అందేలా సహకార చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆకట్టుకున్న కల్చరల్ ఫెస్ట్



నవతెలంగాణ-ముషీరాబాద్

ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్సీఐ) తార్నాకా డివిజన్ ఆఫీసు ఆధ్వర్యంలో శుక్రవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రం ప్రారంభమైన ఇంటర్ డివిజనల్ కల్చరల్ ఫెస్ట్ 2025 విశేషంగా ఆకట్టుకుంది. 7 జిల్లాల ఉద్యోగులతో పాటు ఒక కేంద్ర కార్యాలయం సిబ్బంది ఈ కల్చరల్ ఫెస్‌లో పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాలలో భాగస్వాములు అయ్యారు. నాటికలు, ఏకపాత్రాభినయాలు, నృత్యాలతోపాటు చిన్న చిన్న ఆటలు ఆడి సభికులను ఎంతగానో అలరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీజీఎం ఎస్.కె. చౌదరి మాట్లాడుతూ... ఉద్యోగుల్లో మానసిక ఉల్లాసాన్ని, చైతన్యాన్ని కలిగించడానికి ఈ కల్చరల్ ఫెస్ట్ ఎంతగానో దోహదం చేస్తదని అన్నారు. అంతేకాకుండా వివిద ప్రాంతాలలో పనిచేస్తున్న ఉద్యోగులంతా ఒకే చోటికి రావడం వల్ల వారి మధ్య సస సంబంధాలు పెరుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగులు తాము చేస్తున్న డ్యూటీ, అధికారులతో మాట్లాడే విధానాలు, ఉద్యోగులు ప్రవర్తించే తీరుపై ప్రదర్శించిన నాటిక ఎంతగానో ఆకటుకుంది. ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ తార్నాకా మృత్యుంజయ కుమార్, ఏజీఎంలు గజానంద్, నీరజన్ కుమార్ , డాక్టర్ రాజన్, రామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటు, కార్పొరేట్ వైద్యంపై నియంత్రణ కమిటీ వేయాలి

- పీ.వై.ఎల్, పీ.ఓ.డబ్ల్యు చర్చా వేదికలో ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాం



నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణలో ఉన్న ప్రయివేట్, కార్పొరేట్ ఆస్పత్రుల ఫీజుల పై ప్రభుత్వ నియంతనం ఉండాలని, దాని కొరకు నియంతన కమిటీ వేసి, సమర్థవంతంగా పనిచేయాలని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ప్రభుత్వ ఆస్పత్రులకు నిధులు కేటాయించి బలోపేతం చేయాలన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పీ.వై.ఎల్, పీ.ఓ.డబ్ల్యు ఆధ్వర్యంలో ప్రయివేట్ ఆస్పత్రుల ఫీజులపై, ప్రభుత్వ ఆస్పత్రి బలోపేతం చేయాలని అంశంపై వేదిక నిర్వహించారు. దీనికి సంఘం అధ్యక్షులు కేఎస్ ప్రదీప్, డి. స్వరూప అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ హైదరాబాదులో ఏ హాస్పిటల్స్, హోటల్స్‌కి వెళ్ళిన ఇన్ఫెక్షన్ వచ్చేలా ఉంటుందని, అంత అపరిశుభ్రంగా ఉంటున్నాయన్నారు. ఫార్మా కంపెనీలు వదిలిన కలుషితం వలన, ప్రతిదీ కలుషితమైందన్నారు.ప్రజలకి ప్రభుత్వమే మెరుగైన వైద్యం అందించాలని ఆయన ఆకాంక్షించారు. గత ప్రభుత్వాలు కూలిపోయే ఆలస్యం ప్రాజెక్టుకి వేలకోట్ల కేటాయించి, విద్య వైద్యాన్ని గాలికి వదిలా రన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల బలోపేతం కోసం అందరూ కలిసి ప్రభుత్వాన్ని అడగాలన్నారు. హైదరాబాద్ డీఎంహెచ్వో జుమ్మిడి వెంకటి మాటాడుతూ ప్రభుత్వ హాస్పిటల్స్ మంచి వైద్యం అంది స్తున్నామని, ప్రయివేట్ హాస్పిటల్స్‌లో వెళ్లి ఎవరు మోసపోవద్ద న్నారు. ఫీజులు ఎక్కువ తీసుకున్నారని ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ చర్చ వేదికలు కార్పొరేట్ హాస్పిటల్లో అడ్మిట్ అయి ఫీజుల దోపిడీకి గురైన బాధితులు పాల్గొని వాళ్ళ ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీ.వై.ఎల్, పీ.ఓ.డబ్ల్యు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.ఎస్ ప్రదీప్, వి.అజయ్, డి.స్వరూప, సీహెచ్ శిరోమణి, సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ సెక్రటేరియట్ సభ్యులు ఎం.హన్మేష్, టీయుసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ ఎల్ పద్మ, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర, చైతన్య మహిళా సంఘం శ్రీదేవి, పీడీఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. అనిల్, పీ.వై.ఎల్, పీ.ఓ.డబ్ల్యు నాయకులు కల్పన, ఝాన్సీ, మంగ తాయి, రేణుక, లక్ష్మి, లక్ష్మీబాయి, సావిత్రి, దుర్గ, కోడిపుంజుల లక్ష్మి, సరోజినీ, ఎం రవికుమార్, ఎన్ వి రాకేష్, ఈశ్వర్, భరత్, దేవ, బిఎస్ కృష్ణ, పెండ్యాల రమేష్, ప్రేమ్ సింగ్, నవీన్, కుంభోజి కిరణ్, కొల్లూరు భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఏప్రిల్ 21న మధ్యప్రదేశ్‌లో అఖిల భారత యాదవ మహాసభలు'



నవతెలంగాణ-హిమాయత్ నగర్

అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్21న యాదవ మహాసభలను మధ్యప్రదేశ్‌లోని ఓర్చా, జూన్ మాసంలో హైదరాబాద్ లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో ఘనంగా నిర్వహించనున్నట్లు యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో యాదవ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి జగదీష్ యాదవ్ తో కలిసి శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ యాదవ యువతకు ఉపాధితో పాటు మహిళా సాధికారత కోసం ఈ మహా సభలను నిర్వహిస్తున్నామన్నారు. యాదవ మహాసభ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఉగాది నుంచి ఇంటర్, డిగ్రీ, పీజీ చదువుకునే యాదవ కుల విద్యార్థులకు, యువతకు ఉచిత స్కిల్ డెవలప్మెంట్, స్పోకెన్ ఇంగ్లీష్ నందు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. యాదవ యువతకు స్టార్టప్ కింద రూ.25 లక్షలు ఆర్థిక సాయం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. యాదవ పిల్లలకు హైందవ విద్యా సంస్థల్లో ఉచిత భోదన అందించనున్నట్లు తెలిపారు. అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించినందుకు మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి జగదీష్ యాదవ్ కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ సమావేశంలో యాదవ సంఘాల ప్రతినిధులు మేకల లలిత, నీలం శ్రీనివాస్, సురేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై అధికారులు దృష్టి సారించాలి

- కార్పొరేటర్ ఇ. విజయ్ కుమార్ గౌడ్



నవతెలంగాణ-అంబర్‌పేట

వేసవి కాలం దృష్టిలో ఉంచుకొని తాగునీటి సమస్యపై అధికారులు ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించి నీటి కొరత లేకుండా చూడాలని అంబర్‌పేట కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్‌గౌడ్ అన్నారు. శుక్రవారం అంబర్‌పేట డివిజన్ పరిధిలోని స్థానిక ప్రజలతో కలిసి ఎంసిహెచ్ కాలనీలో అంబర్‌పేట కార్పొరేటర్ మార్నింగ్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ స్థానిక కాలనీ ప్రజలతో కాలనీలో పర్యటించి లోప్రెషర్ తో మంచినీరు సరఫరా అవుతుండడం వల్ల, స్థానిక కాలనీ నాయకులతో కలిసి డీడీ కాలనీలోని జలమండలి ఆఫీసులో డీజీఎంని కలిసి సమస్యను వివరించి, వేసవి కాలం కావడం ఉగాది, రంజాన్ పండుగలు కూడా ఉండడంతో డివిజన్ లోని అన్ని ప్రాంతాల్లో కూడా మంచినీరు లో ప్రెషర్ లేకుండా చూడాలని, ప్రజలకు తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేయాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రంగు సతీష్ గౌడ్, సూరజ్ ముదిరాజ్, సంతోష్ చారి, స్థానిక బస్తీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో బీసీల కోసం ప్రత్యేక బిల్లు ప్రవేశపెట్టాలి



- పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

నవతెలంగాణ-అంబర్‌పేట

పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే దీని ఆమోదించి బీసీల రిజర్వేషన్లు పెంచే విధంగా కృషి చేయాలని పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే శ్రీరామ్ భద్రయ్య లేబర్ బోర్డ్ మాజీ వైస్ చైర్మెన్ నాగభూషణం, కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణ గౌడ్, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం బీసీ బిల్లును ఆమోదించిన పక్షంలో దీనిపై ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కేంద్ర ప్రభుత్వ వైఖరి బీసీ బిల్లు పై పార్లమెంటు ప్రవేశపెట్టే విధంగా తెచ్చే విధంగా నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం

- కవాడిగూడ కార్పొరేటర్ రచన శ్రీ



నవతెలంగాణ-ముషీరాబాద్

స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న సేవలు అభినందనీయమని కవడి గూడ కార్పొరేటర్ రచన శ్రీ అన్నారు. అప్స స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కవడిగూడ డివిజన్ లోని శెట్టి బలిజ సంక్షేమ భవన్‌లో మహిళా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ రచన శ్రీ హాజరై మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాలలో పురుషులకు సమానంగా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. జాతీయ యువజన అవార్డు గ్రహీత చెక్కిలి మధు మాట్లాడుతూ తల్లి దండ్రులు ఆడ పిల్లల పై లింగ వివక్షణ చూపరాద్దన్నారు. ప్రతి ఒక్కరూ ఆడ మగ తేడా లేకుండా సమానంగా చూడాలని తెలిపారు. అప్స సంస్థ సామాజిక కార్యాకర్త బొట్టు రమేశ్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ముందుకు వెళ్ళాలంటే సాధన ఎంతైనా అవసరం తాము సాధించిన విజయాలు ముందు తరాలకు ఆదర్శంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమానికి అప్స స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు శ్రావణి, లావణ్య, మల్లికా ,ఇందిర బీజేపీ నాయకులు వెంకటేష్ , కుమార్ గౌడ్ , ఏఎన్ఐఎం ఆశా వర్కర్స్ సరస్వతి బస్తీలోని మహిళలు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలు పర్యావరణ పరిరక్షణ అంశాన్ని ప్రధాన ఏజెండాగా చేర్చుకోవాలి

- ప్రపంచ పర్యావరణ సంస్థ జాతీయ అధ్యక్షులు, సామాజిక తత్వవేత్త డా.సి.హెచ్.భద్ర



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

అన్ని రాజకీయ పార్టీలు పర్యావరణ పరిరక్షణ అంశాన్ని తమ ప్రధాన ఏజెండాగా చేర్చుకోవాలని ప్రపంచ పర్యావరణ సంస్థ జాతీయ అధ్యక్షులు, సామాజిక తత్వవేత్త డా.సి. హెచ్.భద్ర సూచించారు. ఈ మేరకు శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బహుజన ఉద్యమకారుడు, ప్రపంచ పర్యావరణ సంస్థ జాతీయ కార్యవర్గ సభ్యులు, బీఎస్పీ పార్టీ తెలంగాణ రాష్ట్ర సెంట్రల్ కో-ఆర్డినేటర్‌గా నియమితులైన దాగిళ్ళ దయానంద్ రావుకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను జ్ఞాపిక, శాలువాతో సత్కరించి పలువురు అభినందించారు. అనంతరం సంస్థ సలహాదారులు గ్రాండ్ మాస్టర్ గల్లా ప్రకాష్ తో కలిసి భద్ర మాట్లాడుతూ దేశంలో బహుజనవాదం బలపడుతున్న తరుణంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆశయా సాధన కోసం మాన్యశ్రీ కాన్షిరామ్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో బహుజన రాజ్యాన్ని స్థాపించారన్నారు. అనంతరం దాగిళ్ళ దయా నంద్ రావు మాట్లాడుతూ కులం మతం, ప్రాంతంతో సంబంధం లేకుండా మహనీయుల ఆశయాల కోసం కృషి చేస్తానన్నారు. వివిధ ప్రజా సంఘాల నాయకులు పెద్ద పెద్ద ఎత్తున పాల్గొని దయానంద్ రావును అభినందించారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ వేత్తలు నిఖిల్, రిజ్వాన్, శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్టు లక్ష్మీ నారాయణ, రాజేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆరెకటికలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



- ఆరెకటిక అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షులు భుంపల్లి అశోక్ కుమార్

నవతెలంగాణ-ముషీరాబాద్

ప్రభుత్వం ఆరెకటికలకు ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేయాలని ఆరెకటిక అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షులు భుంపల్లి అశోక్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆరెకటికల అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షులు భుంపల్లి అశోక్‌కుమార్ హాజరై మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్న రాష్ట్రంలో ఆరెకటికలకు న్యాయం జరగడం లేదన్నారు. రాష్ట్రంలో నాలుగు శాతానికి పైగా జనాభా ఉందని 11 కులాలను రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని గత జూన్ నెలలో ప్రకటించిందని మా కులం పేరు ఆ లిస్టులో లేదు ఇది అన్యాయమన్నారు. దీనిపై బీసీ మంత్రి పొన్నం ప్రభాకర్ ను విన్నవించిన ఇంతవరకు అసెంబ్లీలో ప్రస్తావించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో మటన్ మార్కెట్ ఏర్పాటు చేయాలని అందుకు నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ధర్మ వ్యాధుడి విగ్రహా న్ని ప్రభుత్వం ట్యాంక్ బాండ్ పై ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ నాగేష్ జనరల్ సెక్రెటరీ నందీశ్వర్, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్ తదితర నాయకులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం పథకం రాజకీయాలకు అతీతంగా ఉండాలి

- తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం



నవతెలంగాణ-ముషీరాబాద్

రాజీవ్ యువ వికాసం పథకం రాజకీయాలకు అతీతంగా ఉండాలని గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చారగొండ వెంకటస్వామి మరియల గోపాల్ అన్నారు. ముషీరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు రాజీవ్ యువ వికాసం అనే పథకం పెట్టడం సంతోషమని అయితే దీన్ని సామాజిక వర్గాల యువత దరఖాస్తులు చేసుకుంటున్నారని, నిజమైన లబ్ధిదారులను గుర్తించి వారికి ఈ పథకం అమలు అయ్యేటట్లు చూడాలన్నారు. గతంలో గత ప్రభుత్వం లబ్దిదారులు ఎంపిక ఎమ్మెల్యేలకు ఇచ్చిందని దీనివల్ల ఒక పార్టీ వారికే ఎక్కువ అవకాశాలు వచ్చాయని, దీనివల్ల చాలామంది నష్టపోయారని కావున అలాంటిది మళ్లీ పునరావతం కాకుండా లబ్దిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలని, లబ్ధిదారుల ఎంపిక అధికారులకు ఇవ్వాలని, అధికారులు కూడా నిష్పక్షపాతంగా ఎంపిక చేయాలని ఎక్కడా చేతివాటం ప్రదర్శించకుండా ఎంపిక చేయాలని కోరారు. ఈ విధంగా జరిగినట్లయితే రాష్ట్రవ్యాప్తంగా పేద, బడుగు, బలహీన వర్గాలకి అవకాశం దొరుకుతుందని తెలియజేశారు.

పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి



- ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి..

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి అన్నారు. శుక్రవారం బొగ్గుల కుంటలోని తెలంగాణ సారసత పరిషత్ ఆడిటోరియంలో ఉగాది, రంజాన్, శ్రీరామనవమి పండుగల నేపథ్యంలో ఈస్ట్ జోన్ పీస్ కమిటీ సభ్యులు, మైత్రి కమిటీ సభ్యులు, జిహెచ్ఎంసి, విద్యుత్ శాఖ, ఆర్ అండ్‌బి శాఖ, వాటర్ బోర్డ్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రానున్న ఉగాది, రంజాన్, శ్రీరామనవమి పండుగలను ప్రశాంత వాతావరణంలో ప్రజలందరూ జరుపుకోవాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలు నమ్మవద్దని, ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని అడిషనల్ డీసీపీ నరసయ్య సూచించారు. పోలీస్ అనుమతులు లేకుండా స్టేజీలు నిర్మించవద్దని సూచిం చారు. పీస్ కమిటీ సభ్యులు మైత్రి కమిటీ సభ్యులు సహకరించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఈస్ట్ జోన్ వివిధ డివిజన్ల ఏసీపీలు శంకర్, జైపాల్, జగన్, సుల్తాన్ బార్ ఇన్ స్పెక్టర్ శ్రీనివాసచారి, అఫ్జల్ గంజ్ ఇన్ స్పెక్టర్ రవి నాయక్, లాలాగూడ ఇన్ స్పెక్టర్ రఘుబాబు, గోషామహల్ సర్కిల్ -14 ఇంజనీరింగ్ సుధాకర్, ట్రూప్ బజార్ విద్యుత్ సబ్ డివిజన్ జీ. శిరీష, పుత్లిబౌలి ఏఈ ప్రణవిద్, సుల్తాన్ బజార్ ఏఈ విశాలాక్ష్మి, గౌలిగూడ జలమండలి మేనేజర్ బి సందీప్, ఈస్ట్ జన్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్ లో ఇన్ స్పెక్టర్ లు, ఎస్ఐలు, ఈస్ట్ జోన్ పీస్ కమిటీ అధ్యక్షులు నారా యణరెడ్డి, ఉపాధ్యక్షులు ఫైరుద్దీన్, మహిళా సభ్యులు బాసంతి కౌర్, ఆర్‌కె.సత్యనారాయణ, పెద్ద ఎత్తున పీస్ కమిటీ సభ్యులు మైత్రి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నూతన మంచినీటి పైప్‌లైన్ పనుల పరిశీలన

- కార్పొరేటర్ ఎ.పావనీ వినయ్ కుమార్



నవతెలంగాణ-ముషీరాబాద్

నూతన మంచినీటి పైప్ లైన్ పనులను కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ పరిశీలించారు. శుక్రవారం గాంధీనగర్ డివిజన్ అభివృద్ధిలో భాగంగా చిక్కడపల్లి, సంజీవయ్య నగర్ బస్తీలో ఇటీవల ప్రారంభించిన నూతన మంచినీటి పైప్‌లైన్ పనులను కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్, బీజేపీ శ్రేణులు బస్తీ వాసులతో కలిసి పర్యవేక్షించారు. అనంతరం మాట్లాడుతూ బస్తీలో వున్న రెండు వీధుల్లో ఇదివరకే ఒక వీధిలో పైప్ లైన్ పనులు పూర్తి అయ్యాయని,పెండింగ్‌లో ఉన్న మరో వీధి పనులకు ప్రత్యేక చర్యలు చేపట్టి, జలమండలి అధికారులపై ఒత్తిడి పెంచి మంజూరు చేయించామన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీ నర్ శ్రీ ఎ.వినయ్ కుమార్, డివిజన్ అధ్యక్షులు వి.నవీన్ కుమార్, సీనియర్ నేతలు రత్న సాయి చంద్, శ్రీకాంత్, ఎం.ఉమేష్, మధన్మోహన్, డి. కుమార్,జ్ఞానేశ్వర్, సాయి కుమార్, ఆనంద్ రావు,అరుణ్ కుమార్, నీరజ్, ప్రశాంత్, రాజ్‌కుమార్, బస్తీ నాయకులు రమేష్, రాజయ్య పి.అనిల్, విజయ్, చింటూ, లావణ్య లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ కాదు జాలి మాత్రమే

యువతీ యువకుల మధ్య ప్రేమ పుట్టడం సహజం. అయితే ప్రేమించుకున్న వారందరూ జీవితాంతం కలిసి వుండటం అనేది అందరి విషయంలో సాధ్యం కాదు. అనేక కారణాలతో కొందరు మధ్యలోనే విడిపోవాల్సి వస్తుంది. ఒకరిని ప్రేమించి పరిస్థితుల వల్ల మరొకరిని పెండ్లి చేసుకునేవారు ఎంతో మంది ఉంటారు. అయితే పెండ్లి తర్వాత పాత ప్రేమలను కొనసాగిస్తే మాత్రం అనేక ఇబ్బందులు వస్తాయి. అలాంటి ఓ సమస్యే ఈవారం ఐద్వా అదాలత్‌లో...



దివ్యకు 30 ఏండ్లు ఉంటాయి. ఐదేండ్ల కిందట విజయ్‌తో పెండ్లి జరిగింది. పెద్దలు కుదిర్చిన వివాహం. ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. మూడేండ్ల పాపతో హైదరాబాద్‌లోనే ఉంటున్నారు. చాలా సంతోషంగా సాగిపోతున్న సంసారం వీరిది. విజయ్ ఉద్యోగ రీత్యా అప్పుడప్పుడు ఇతర ప్రాంతాలకు వెళ్లివస్తుంటాడు.

తొమ్మిది నెలల నుండి విజయ్‌లో ఏదో మార్పు కనిపిస్తుంది. ఇంతకు ముందు ఇంటి పని, వంట పనిలో దివ్యకు సహాయం చేసే వాడు కాదు. ఇప్పుడు అన్ని విషయాల్లో దివ్యకు సహాయం చేస్తున్నాడు. రాత్రి సమయంలో వర్క్ చేస్తూనే పాపను చూసుకుంటున్నాడు. అంతేకాదు టీ, కాఫీ కూడా పెట్టి ఇస్తున్నాడు. ఎప్పుడైనా ఉదయం దివ్యకు కుదరకపోతే అతనే బ్రేక్‌ఫాస్ట్ కూడా చేసి పెడుతున్నాడు. సమయం దొరికినప్పుడల్లా దివ్యతో సమయం గడుపుతున్నాడు. ఇదంతా దివ్యకు చాలా సంతోషంగా అనిపించింది. ఇంతకంటే జీవితంలో ఇంకేం కావాలి అనుకునేది దివ్య.

అయితే దివ్య ఉంటున్న అపార్ట్‌మెంట్‌లోకి కొత్తగా రక్ష వచ్చింది. అప్పటి నుండి విజయ్ ఎందుకో తెలియదు గానీ ఎప్పుడూ బాధపడుతూ, టెన్షన్ పడుతూ కనిపిస్తున్నాడు. ఆమెతో మాట్లాడటానికి కూడా ఇష్టపడటం లేదు. 'మనం ఇక్కడి నుండి దూరంగా ఎక్కడికైనా వెళదాం' అంటాడు. 'పాప స్కూల్‌కి, మన ఆఫీస్‌కి దగ్గరగా ఉంటుందనీ, అన్నీ చూసుకొనే ఈ ఇల్లు తీసుకున్నాం. దానిపై ఇంకా అప్పు ఉంది. ఈ సమయంలో ఇల్లు వదిలి వేరే చోటికి ఎందుకు' అని దివ్య ఒప్పుకోలేదు.

> **రక్ష తన భర్త వల్ల పడ్డ ఇబ్బందులతో మా ప్రేమను గుర్తు చేసుకొని మరింత బాధపడుతుంది. భర్త నుండి విడాకులు తీసుకొని హైదరాబాద్ వచ్చేసింది. ఆమె ఇక్కడకు వచ్చే వరకు నాకు ఆ విషయం తెలియదు. కానీ వచ్చినప్పటి నుండి దివ్యకు విడాకులిచ్చి తనను పెండ్లి చేసుకోమంటూ ఒత్తిడి చేస్తుంది. కానీ ప్రస్తుతం నా జీవితంలో దివ్యతో పాటు పాప కూడా ఉంది.**

ఇలాంటి పరిస్థితుల్లో దివ్యకు పదిహేను రోజుల కిందట తెలిసిన విషయం ఏమిటంటే రక్ష, విజయ్ ఇద్దరూ కాలేజీ రోజుల్లో ప్రేమికులు. ఏవో కారణాల వల్ల విడిపోయారు. విజయ్ దివ్యను పెండ్లి చేసుకున్నాడు. అలాగే రక్ష వేరే వ్యక్తిని పెండ్లి చేసుకుంది. కానీ ఆమె భర్త నుండి విడాకులు తీసుకొని హైదరాబాద్‌లో విజయ్ వుండే అపార్ట్‌మెంట్‌కు వచ్చింది. ఆ విషయం తెలియగానే దివ్య ఐద్వా ఆఫీస్‌కు వచ్చింది.

'ఒకప్పుడు వారిద్దరూ ప్రేమికులే కావొచ్చు. కానీ ఇప్పుడు విజయ్ నా భర్త. అతను ఇంకో అమ్మాయితో మాట్లాడినా, సంబంధం పెట్టుకున్నా చూస్తూ ఊరుకోను. ఇప్పుడు నేనేం చేయాలో మీరే చెప్పండి' అంటూ కన్నీళ్లు పెట్టుకుంది. మేము విజయ్‌కు ఫోన్ చేసి పిలిపించాము. అతను వస్తూనే 'మహిళా సంఘం వాళ్లతో మాకు ఎలాంటి పని లేదు. మేము చాలా సంతోషంగా ఉన్నాము. దివ్యను, పాపను నేను ఎంతో ప్రేమగా చూసుకుంటున్నాను. ఏం కావాలన్నా అన్నీ తెచ్చిపెడతాను. ఈ మధ్య అయితే ఇంటి పనిలో కూడా సాయం చేస్తున్నాను. ఇక మా మధ్య సమస్య ఏముంది. అసలు దివ్య మీ దగ్గరకు ఎందుకు వచ్చింది? ఒక వేళ నా తప్పు ఏమైనా ఉంటే సరిచేసుకుంటాను' అన్నాడు.

'ఇది మీ ఇద్దరి మధ్య సమస్య కాదు. మీరెందుకో రెండు నెలల నుండి టెన్షన్‌గా కనిపిస్తున్నారని దివ్య బాధపడుతుంది. రక్ష అనే అమ్మాయి మీ అపార్ట్‌మెంట్‌లోకి వచ్చినప్పటి నుండే మీరు ఇలా ఉంటున్నారని ఆమె అంటుంది. కాలేజీ రోజుల్లో మీరిద్దరూ ప్రేమించుకున్నారని కూడా ఆమెకు తెలిసింది. దాంతో ఆమెలో భయం మొదలయింది. మీరే ఆమెను మీ అపార్ట్‌మెంట్‌కు తీసుకొచ్చారని అనుకుంటుంది' అన్నాము.

> **నేను హైదరాబాద్ వచ్చినప్పటి నుండి విజయ్‌లో చాలా మార్పు వచ్చింది. నా నుండి దూరంగా ఉండేందుకు ప్రయత్నిస్తున్నాడు. నాతో మాట్లాడటానికే భయపడుతున్నాడు. అలాంటి వ్యక్తి కోసం నేను ఇక్కడ ఉండటం కూడా అనవసరం. పైగా వాళ్ల సంసారంలో నేను గొడవలు పెట్టిన దాన్ని అవుతాను. నేనే ఇక్కడి నుండి వెళ్లిపోతాను. విజయ్ సంతోషంగా ఉంటే చాలు' అని వెళ్లిపోయింది.**

'నేనూ రక్ష కాలేజీ రోజుల్లో ప్రేమించుకున్నాము. కానీ కొన్ని కారణాల వల్ల విడిపోయాము. నేను దివ్యను పెండ్లి చేసుకొని సంతోషంగా ఉంటున్నాను. అయితే రక్ష పరిస్థితి బాగోలేదు. ఆమె భర్త ఆమెను సరిగ్గా చూసుకోవడం లేదు. సైకోలా ప్రవర్తిస్తున్నాడు. ఈ విషయం నాకు ఈ మధ్యనే తెలిసింది. నేను ఆఫీస్ పని మీద వారం రోజులు బెంగుళూరు వెళ్లాను. అక్కడే రక్ష నాతో ఈ విషయం చెప్పింది. పెండ్లి తర్వాత ఓ భార్య భర్త నుండి ఏం కోరుకుంటుందో ఆమె వల్లనే నాకు తెలిసింది. అందుకే తిరిగి వచ్చినప్పటి నుండి దివ్యను ఇంకా బాగా చూసుకుంటున్నాను.

అయితే రక్ష తన భర్త వల్ల పడ్డ ఇబ్బందులతో మా ప్రేమను గుర్తు చేసుకొని మరింత బాధపడుతుంది. భర్త నుండి విడాకులు తీసుకొని హైదరాబాద్ వచ్చేసింది. ఆమె ఇక్కడకు వచ్చే వరకు నాకు ఆ విషయం తెలియదు. కానీ వచ్చినప్పటి నుండి దివ్యకు విడాకులిచ్చి తనను పెండ్లి చేసుకోమంటూ ఒత్తిడి చేస్తుంది. కానీ ప్రస్తుతం నా జీవితంలో దివ్యతో పాటు పాప కూడా ఉంది.

ఒకప్పుడు రక్షను నేను ప్రాణంగా ప్రేమించిన మాట వాస్తవం. కానీ ఇప్పుడు నాకు దివ్య, నా పాపనే ముఖ్యం. ఈ విషయం ఆమెకు కూడా చెప్పాను. కానీ రక్ష వినడం లేదు. ఇప్పుడు నాకు ఏం చేయాలో అర్థం కావడం లేదు. అందుకే టెన్షన్‌గా ఉంటున్నాను.

ఇదంతా భరించలేక ఇక్కడి నుండి దూరంగా వెళదామంటే దివ్య వినడం లేదు. ఒక పక్క రక్ష నేను నో అన్నందుకు ఏమైనా చూసుకుంటుందేమో అనే భయం. అసలు విషయం దివ్యకు తెలిస్తే తట్టుకోలేదని మరో భయం. దీని వల్ల నాకు నిద్ర లేకుండా పోయింది. తనే ఎలాగో ఇక్కడి వరకు వచ్చింది. ఇప్పుడు మీరే దివ్యకు ఎలాగైనా చెప్పి ఆ అపార్ట్‌మెంట్ ఖాళీ చేసి వెళ్లటానికి ఒప్పించండి. అప్పుడు మాకు ఎలాంటి సమస్యా వుండదు' అన్నాడు.

అతను చెప్పింది మొత్తం విన్న తర్వాత దివ్యను పిలిచి 'ఒకప్పుడు వారిద్దరూ ప్రేమికులే కావొచ్చు. కానీ ఇప్పుడు నీ భర్త నిన్నే ఇష్టపడతున్నాడు. నువ్వు అనవసరమైన భయాలు పెట్టుకొని కంగారు పడకు. అవసరమైతే మేము రక్షతో మాట్లాడతాము' అని చెప్పి రక్షను ఆఫీస్‌కు పిలిపించి...

'చూడు రక్షా.. విజయ్‌తో నీ బంధం కాలేజీ రోజుల్లోనే తెగిపోయింది. ఇప్పుడు అతనికి ఓ కుటుంబం ఉంది. తన కుటుంబంతో సంతోషంగా ఉండాలనుకుంటున్నాడు. మీ భర్త వల్ల మీరు పడ్డ బాధల వల్ల ఇప్పుడు విజయ్ పట్ల అభిమానం పెంచుకున్నారు. అంతే కానీ మీది ప్రేమ కాదు. భార్యను వదిలేసి మీతో ఉండమని అతన్ని ఇబ్బంది పెడుతున్నారు. అది సరైనది కాదు. విజయ్ ఓ స్నేహితురాలిగా మీపై జాలి చూపిస్తున్నాడు దాన్ని అర్థం చేసుకోండి. పెండ్లయిన విజయ్ వెంట పడటం సరైన పద్ధతి కాదు. మీ జీవితంలోకి కూడా ఓ మంచి వ్యక్తి వస్తాడు. మీ వల్ల చక్కని విజయ్ సంసారంలో గొడవలు వచ్చే అవకాశం ఉంది. మీరే ఆలోచించండి' అని చెప్పాము.

దానికి ఆమె 'మీరు చెప్పింది నిజమే. నేను హైదరాబాద్ వచ్చినప్పటి నుండి విజయ్‌లో చాలా మార్పు వచ్చింది. నా నుండి దూరంగా ఉండేందుకు ప్రయత్నిస్తున్నాడు. నాతో మాట్లాడటానికే భయపడుతున్నాడు. అలాంటి వ్యక్తి కోసం నేను ఇక్కడ ఉండటం కూడా అనవసరం. పైగా వాళ్ల సంసారంలో నేను గొడవలు పెట్టిన దాన్ని అవుతాను. నేనే ఇక్కడి నుండి వెళ్లిపోతాను. విజయ్ సంతోషంగా ఉంటే చాలు' అని వెళ్లిపోయింది.

- వై వరలక్ష్మి
9948794051

ఈ జాగ్రత్తలు తీసుకుందాం...

ఎండలో ఎక్కువగా తిరగడం వల్ల ట్యాన్ పెరిగిపోతుంది. ముఖంపై మొటిమలు, మచ్చలు వస్తుంటాయి. అంతేకాకుండా, ముఖంపై రకరకాల సమస్యలొస్తాయి. వీటిని తగ్గించాలంటే చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. అందులో ముఖ్యంగా సన్‌స్క్రీన్ వాడడం. సన్‌స్క్రీన్స్ చాలా రకాలు ఉంటాయి. అందులో రకరకాల లోషన్స్, స్ప్రేలు,



జెల్స్ ఉన్నాయి. ఇందులో ఏది స్కిన్‌కి మంచిదో తెలుసుకోవాలి. మీరు ఎంచుకున్న సన్‌స్క్రీన్ రకాన్ని బట్టి కూడా మీ చర్మాన్ని కాపాడుకోవచ్చు. ఎలా వాడితే సన్‌స్క్రీన్ బాగా పనిచేస్తుంది. ముఖంపై సమస్యలు తగ్గుతాయో చూద్దాం..

మనం వాడే సన్‌స్క్రీన్ UVA, UVB ప్రొటెక్షన్ ఉందో లేదో చూసుకోవాలి. దీనివల్ల స్కిన్‌ని సన్‌బర్న్, చర్మ సమస్యలకి కారణమయ్యే అతినీలలోహిత యూవీబీ కిరణాల నుండి కాపాడుకోవచ్చు. మీరు ఎంచుకున్న సన్‌స్క్రీన్‌లో జింక్ ఆక్సైడ్, టైటానియం డయాక్సైడ్ ఉండేలా చూసుకోండి. ఈ పదార్థాలు UVA, UVB కిరణాల నుండి మన చర్మాన్ని కాపాడతాయి.

ప్రతి రెండు గంటలకి ఓసారి


సన్‌స్క్రీన్ రాసి రోజంతా ఉండడం కాదు. ప్రతి రెండుగంటలకి ఓసారి కచ్చితంగా సన్‌స్క్రీన్ రాయండి. దీనికోసం మీరు స్ప్రే సన్‌స్క్రీన్‌ని కూడా వాడొచ్చు. ఇది వాడటం ఈజీ కూడా.

ముందుగానే అప్లై చేయడం

సన్‌స్క్రీన్‌ని స్కిన్ అబ్జార్బ్ చేసుకోవడానికి అరగంట టైమ్ పడుతుంది. కాబట్టి, బయటికెళ్లే 30 నిమిషాల ముందే సన్‌స్క్రీన్ అప్లై చేయండి. స్కిన్‌కి ఎక్స్‌పోజ్ అయ్యే ప్రతి భాగానికి సన్‌స్క్రీన్‌ని అప్లై చేయాలి. అందులో చెవులు, పాదాలు, మెడ వెనుక భాగం కూడా ఉన్నాయి.

సన్‌స్క్రీన్ మాత్రమే కాకుండా

బయటకు వెళ్ళినప్పుడు తప్పనిసరిగా యూవీ ప్రొటెక్షన్ సన్ గ్లాసెస్ వాడాలి. చర్మాన్ని పూర్తిగా కవర్ చేసేలా కాటన్ బట్టలు వేసుకోవాలి. ■



కునాల్ కమ్రాకు ముందస్తు బెయిల్

చెన్నై : స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రాకు శుక్రవారం మద్రాస్ హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది.అంతర్రాష్ట్ర ముందస్తు బెయిల్ కోరుతూ కమ్రా మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. జస్టిస్ సుందర్ మోహన్ ధర్మాసనం ఎదుట అత్యవసర విచారణ కోరుతూ కమ్రా తరఫున న్యాయవాది వి. సురేష్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. గురువారం రాత్రి ఈ-ఫైలింగ్ ద్వారా ఈ పిటిషన్ దాఖలు చేయగా, శుక్రవారం విచారణ చేపట్టిన కోర్టు ఏప్రిల్ 7 వరకు మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసు రాజకీయ ప్రేరేపితమని, భావ ప్రకటనా స్వేచ్ఛను అడ్డుకునే యత్నమని పేర్కొన్నారు. తాను నిర్దోషినని, ఒక కళాకారుడిని వేధించడం, అడ్డుకోవడం లక్ష్యంగా పనికిరాని ఫిర్యాదుతో కేసులో ఇరికించారని కమ్రా పిటిషన్‌లో పేర్కొన్నారు. తన భద్రత, రానున్న ప్రభుత్వ సెలవుల ఆందోళనల దృష్ట్యా అంతర్రాష్ట్ర ముందస్తు బెయిల్ కోరుతున్నట్టు తెలిపారు. ముంబయిలో పుట్టిపెరిగినప్పటికీ భద్రత కోసం 2021లో తన నివాసాన్ని తమిళనాడు విల్లుపురానికి మార్చుకున్నట్టు తెలిపారు. 'నయాభారత్ ' అనే తన తాజా షోలో ఎవరినీ ముఖ్యంగా మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిండే పేరును పేర్కొనలేదని కోర్టుకు తెలిపారు. ఇప్పటికీ తనకు బెదిరింపులు వస్తున్నాయని అన్నారు. అంధేరీ తూర్పు ఎమ్మెల్యే ముర్జీ కాజీ పటేల్ దాఖలు చేసిన ఫిర్యాదు మేరకు ముంబయిలోని ఖార్ పోలీస్ స్టేషన్‌లో తనపై కేసు నమోదైందని పేర్కొన్నారు. ఈ కేసులో బాంబే హైకోర్టును ఆశ్రయించి ముందస్తు బెయిల్ పొందే వరకు తనకు అంతర్రాష్ట్ర ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరారు.

డబ్ల్యూటీఓకు ట్రంప్ షాక్

(మొదటిపేజీ తరువాయి)

కార్యవర్గం అనుసరిస్తున్న వ్యాపార రక్షణాత్మక వైఖరిని మరింత బలోపేతం చేసుకోవడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకొన్నారు.ట్రంప్ అధికారంలోకి వచ్చింది మొదలు ప్రపంచస్థాయి వేదికల నుంచి అమెరికాను పక్కకు తప్పిస్తున్నారు. ఈక్రమంలో ఆయన ఇప్పటికే ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) నుంచి అమెరికా వైదొలిగినట్టు ప్రకటించారు. తాజాగా డబ్ల్యూటీవోకు నిధులను నిలిపివేశారు. దీంతోపాటు అనేక దేశాలకు అందించే విదేశీ సాయాన్ని కూడా ఆయన నిలిపివేశారు. వాస్తవానికి 2019లోనే ట్రంప్ డబ్ల్యూటీవోను బలహీన పర్చారు. అప్పుడే ఆ సంస్థలో న్యాయమూర్తుల నియామకాలను ఆయన నిలిపివేశారు. దీంతో ఆ సంస్థ వివాద పరిష్కార వేదిక విభాగం బలహీన పడిపోయింది. ఇది తరచూ తన పరిధిని దాటి మరీ తీర్పులు ఇస్తోందని ఎప్పటినుంచో వాషింగ్టన్ ఆరోపిస్తోంది. 2024లో డబ్ల్యూటీవో నిర్వహణకు 232 మిలియన్ డాలర్లు ఖర్చయ్యాయి. ప్రపంచ వాణిజ్యం ప్రతిదేశం వాటా ఆధారంగా ఈ సంస్థకు నిధులు సమకూరుస్తారు. ఇక అమెరికా నుంచి దీనికి దాదాపు 11శాతం అందుతాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన అదనపు సుంకాలు ఏప్రిల్ 2వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. మరోవైపు ఈ వారమే అమెరికా దిగుమతి చేసుకొనే కార్లపై 25శాతం సుంకాలను ప్రకటించారు. ఈనేపథ్యంలో ఆయన అమెరికాను డబ్ల్యూటీవో నుంచి పక్కకు తెస్తారనే ప్రచారం జోరందుకొంది. అక్టోబర్ 2 నుంచి ట్రంప్ లిబరేషన్ డే అని అభివర్ణిస్తున్నారు. కొత్త పన్నుల నుంచి అమెరికా ప్రభుత్వానికి 100 బిలియన్ డాలర్ల ఆదాయం రానుందని శ్వేతసౌధం వర్గాలు అంచనా వేశాయి. కాకపోతే ఈ నిర్ణయాలు ప్రపంచ పంపిణీ వ్యవస్థలను తీవ్రంగా ప్రభావితం చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికే అమెరికా నిర్ణయాలను డబ్ల్యూటీవోలో సవాలు చేస్తామని చైనా వెల్లడించింది.

కేంద్ర ఉద్యోగులకు డీఏ 2 శాతం

(మొదటిపేజీ తరువాయి)

అలవెన్స్ (డీఏ) రేటు 53 శాతం నుంచి 55 శాతానికి పెరిగింది. కేంద్రం నిర్ణయంతో ప్రభుత్వ ఖజానాపై ప్రతి సంవత్సరం రూ. 6,614.04 కోట్ల మేరకు భారం పడుతుంది. కేంద్ర ప్రభుత్వంలోని సుమారు 48.66 లక్షల మంది ఉద్యోగులకు, 66.55 లక్షల మంది పింఛనుదారులకు ప్రయోజనం చేకూరుతుంది. ఏడో వేతన సంఘం ఆమోదించిన సూత్రానికి అనుగుణంగా ఈ పెంపు నిర్ణయాన్ని తీసుకున్నారు.ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పోషక ఆధారిత పీఅండ్‌కే ఎరువులకు సబ్సిడీ మంజూరు చేస్తూ కేంద్ర మంత్రి వర్గం నిర్ణయం తీసుకుంది. రూ.37,216 కోట్లు మంజూరు చేయనుంది. న్యూట్రియంట్ బేస్డ్ సబ్సిడీ పథకం కింద 28 రకాల పోషక ఆధారిత ఎరువుల గరిష్ట చిల్లర ధరను తయారీదారులు, దిగుమతిదారులు తగినంత స్థాయిలో నిర్ణయించేందుకు అనుమతి ఇచ్చింది. 2025 ఖరీఫ్ సీజన్‌లో (2025 ఏప్రిల్ 1 నుంచి 2025 సెప్టెంబర్ 30 వరకు) ఫాస్ఫరస్ అండ్ పొటాషియం (పీఅండ్‌కే) ఎరువులపై పోషక ఆధారిత సబ్సిడీ (ఎన్‌బీఎస్) రేట్లను మంత్రివర్గం ఆమోదించింది. ఎలక్ట్రానిక్స్ సరఫరా గొలుసులో దేశాన్ని ఆత్మనిర్భర్‌గా మార్చడానికి ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్ తయారీ పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఎలక్ట్రానిక్స్ భాగాల తయారీ వ్యవస్థలో భారీ పెట్టుబడులను (ప్రపంచ/దేశీయ) ఆకర్షించడంతో బలమైన వ్యవస్థను అభివృద్ధి చేయడంలో సహాయపడే పథకమని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. రూ.59,350 కోట్ల పెట్టుబడులను ఆకర్షించడంతో రూ.4,56,500 కోట్ల విలువైన ఉత్పత్తుల ఉత్పత్తికి అవకాశం ఉంటుందని పేర్కొంది. 91,600 మందికి ప్రత్యక్ష ఉపాధి కల్పన జరుగుతుందని తెలిపింది.

బీహార్‌లో హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హెచ్ఎఎం)లో 4-లేన్ గ్రీన్‌ఫీల్డ్, బ్రౌన్‌ఫీల్డ్ పాట్నా-అర్రా-ససారాం కారిడార్ (ఎన్‌హెచ్-119ఎ) (120.10 కిలో మీటర్ల) నిర్మాణానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. బీహార్‌లోని కోసి మెచి ఇంట్రా-స్టేట్ లింక్ ప్రాజెక్ట్‌ను ప్రధాని కృషి సించాయి యోజన- యాక్సిలరేటెడ్ ఇరిగేషన్ బెనిఫిట్స్ ప్రోగ్రామ్ (పీఎంకెఎస్‌వై-ఏఐబీపీ) కింద చేర్చడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.6,282.32 కోట్లు, ఇందులో బీహార్‌కు కేంద్ర సహాయం రూ.3,652.56 కోట్లు ఉంటుంది. ఈ ప్రాజెక్టు మార్చి 2029 నాటికి పూర్తి కానుంది.

ఆరోపణలు నిరాధారం

(మొదటిపేజీ తరువాయి)

కుమార్తెకు గతంలో కోర్టు నోటీసులు జారీ చేసింది.

సీఎంఆర్‌ఎల్-ఎక్సలాజిక్ లావాదేవీలపై దర్యాప్తు కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను ప్రత్యేక కోర్టు నిఘా , అవినీతి నిరోధక బ్యూరో (వీఏసీబీ) కొట్టివేసింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ కాంగ్రెస్ ఎమ్మెల్యే కేరళ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎక్సలాజిక్‌కు సీఎంఆర్‌ఎల్ రూ.1.72 కోట్లు చెల్లించడంపై దర్యాప్తు చేయాలని వీఏసీబీకి దాఖలు చేసిన తన పిటిషన్‌లో ఆయన ఆరోపించారు. తోటపల్లి స్పిల్‌వే నుంచి ఖనిజ ఇసుకను కేరళ మినరల్స్ అండ్ మెటల్స్ లిమిటెడ్ వెలికితీసిందని, ఈ సేకరణను సులభతరం చేయడానికి సీఎంఆర్‌ఎల్ చెల్లింపులు చేసినట్టు ఆరోపించారు. అయితే వీఏసీబీ ఈ పిటిషన్‌ను తిరస్కరించింది. కేరళ హైకోర్టుకు .. తన పిటిషన్‌లో వీఏసీబీ కేసును తప్పుగా అంచనా వేసి ఆదేశాలు జారీ చేసిందని కుజల్నాదన్ పేర్కొన్నారు.

భూ ప్రళయం

(మొదటిపేజీ తరువాయి)

వ్యక్తమవుతున్నాయి. భూకంపం ధాటికి నిర్మాణంలో ఉన్న పలు అంతస్తుల భవనం చిగురుటాకులా కంపిస్తూ కుప్పకూలడంతో పెద్ద ఎత్తున దుమ్ము మేఘాలు ఏర్పడ్డాయి. పైగా ఆ అంతస్తుల పైన క్రేన్ కూడా వుండడంతో ప్రజలు భయంతో కేకలు వేస్తూ రోడ్లపై పరుగులు పెడుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. భవనాలపై గల స్విమ్మింగ్ పూల్స్‌లోని నీరు అంత ఎత్తు నుండి జలపాతాల్లా కిందకు కారుతుండడం వీడియోల్లో కనిపిస్తోంది. భూ ప్రకంపనలు మరిన్ని రావచ్చనే భయంతో బ్యాంకాక్‌లోని ప్రజలు భవనాలు ఖాళీ చేసి రోడ్లపైనే మకాం వేశారు. మయన్మార్‌లోని సాగింగా నగరానికి వాయవ్యంగా భూమిలో 10 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం ఉందని అమెరికా, జర్మనీ జియోలాజికల్ సర్వే సెంటర్లు తెలిపాయి. దేశంలోని దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ ఈ భూకంపం ప్రభావం ఉందని థాయిలాండ్ విపత్తు నిర్వహణా విభాగం తెలిపింది. పరిస్థితులను అంచనా వేసేందుకు ప్రధాని షినవత్ర అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు.



కూలిన మసీదు.. 20 మంది మృతి?

మయన్మార్ ప్రాచీన రాజధాని నగరమైన ఈ మాండలాయ్‌లో భూకంపం ధాటికి రాజభవనంలో కొంత భాగం, పలు ఇతర భవంతులు కూలిపోయాయి. ఇక్కడ మసీదు కూలిపోవడంతో శుక్రవారం ప్రార్థనలు చేస్తున్న వారిలో దాదాపు 20 మంది చనిపోయారని వార్తలు అందుతున్నాయి. ఈ ప్రాంతం భూకంపాలు తరచుగా సంభవించే ప్రాంతమైనందున సాధారణంగానే ఇక్కడ ప్రజలు తక్కువగా నివసిస్తుంటారు. పైగా పెద్ద పెద్ద ఎత్తైన భవనాలు ఉండవు. ఈ నగరానికి సమీపంలో 90 ఏండ్ల నాటి వంతెన ఒకటి కుప్పకూలింది. మరో ప్రధాన నగరమైన యాంగాన్‌తో మాండలాయ్‌ను కలుపుతున్న హైవేలో కొంత భాగం కూడా దెబ్బతింది. రాజధాని నెపిడాలో పలు ఆలయాల శిఖరాలు నేలమట్టమయ్యాయి. హెటెట్ నయాంగ్ నగరంలో టీ దుకాణం జనాలతో చాలా రద్దీగా ఉందనీ, ఒక్కసారి ఆ దుకాణం కుప్పకూలిపోయిందనీ, అక్కడి పరిస్థితి చాలా భయంకరంగా ఉందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

భారత్, చైనాలోనూ...

ఈ భూకంపాల ప్రభావం పొరుగు దేశాలైన భారత్, చైనా, కంబోడియా, బంగ్లాదేశ్‌లలోనూ కనిపించింది. భారత్‌లోని కోల్‌కతా, ఇంఫాల్, మేఘాలయల్లో ప్రకంపనలు నమోదయ్యాయి. భయాందోళనలతో ప్రజలు రోడ్లపైకి పరుగులు తీశారు. మేఘాలయలోని ఈస్ట్‌గారో హిల్స్‌లో ప్రకంపనలు తీవ్రత 4గా నమోదవగా, బంగ్లాదేశ్‌లో 7.3గా నమోదైంది. చైనాలోని యునాన్, సిచువాన్ ప్రావిన్స్‌ల్లో కూడా భూకంపం ప్రభావం కనిపించింది. మయన్మార్‌తో గల సరిహద్దులోని రులీ నగరంలో ఇండ్లు దెబ్బతిన్నాయి. కొందరికి గాయాలయ్యాయని చైనా మీడియా వార్తలు తెలిపాయి.

సాయమందించండి

ఈ భారీ విపత్తు వేళ అంతర్జాతీయ సమాజం చేయూతనందించాలని మయన్మార్ సైనిక పాలకులు విజ్ఞప్తి చేశారు. నెపిడాలో భూకంప బాధితులకు వైద్య సాయం అందిస్తున్న ఆస్పత్రిని మిలటరీ చీఫ్ మిన్ ఆంగ్‌లయాంగ్ సందర్శించారు.

నెపిడా ఆస్పత్రిలో అంతులేని విషాదం

మయన్మార్ రాజధాని నెపిడాలో వేయి పడకల ఆస్పత్రి భవనం పూర్తిగా నేలమట్టమైంది. ఈ శిథిలాల కింద డజన్ల సంఖ్యలో చిక్కుకుని ఉండవచ్చని అనుమానిస్తున్నారు. అక్కడ పరిస్థితి వర్ణించేందుకు కూడా మాటలు చాలడం లేదని అంతర్జాతీయ మీడియా ప్రతినిధులు తమ కథనాల్లో పేర్కొన్నారు. ఆస్పత్రి వెలుపల వరుసగా క్షతగాత్రులను నేలపైనే పడుకోబెట్టి చికిత్సలు అందిస్తున్నారు. ఈ ఆస్పత్రిని కొత్తగా నిర్మించారు. దీంతో ఇక్కడ మృతుల సంఖ్య అధికంగా ఉండొచ్చుననే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మయన్మార్‌లో రెండో అతిపెద్ద నగరమైన మాండలాయ్ భూకంప కేంద్రానికి సమీపంగా ఉంది.

సీపీఐ భూములను రియల్ ఎస్టేట్‌గా మార్చే కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

రియల్ ఎస్టేట్ చేసి రూ.కోట్లు సంపాదించాలనే కుట్ర జరుగుతోందని వ్యాఖ్యానించారు. సీసీఐని తెరిపించేందుకు స్థానిక బీజేపీ ప్రజాప్రతినిధులు కృషి చేయాలని, లేదంటే పదవులకు రాజీనామా చేసి ఉద్యమంలో కలిసి రావాలని హితవు పలికారు. గతంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సైతం ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే ఈ పరిశ్రమను తెరిపిస్తామని హామీనిచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. సీసీఐని తెరిపించేందుకు ఇక్కడ అన్ని అనుకూలతలూ ఉన్నాయని, జాతీయ రహదారితోపాటు వందేండ్లకు సరిపడా ముడి సరుకు నిల్వలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ పరిశ్రమను తెరిపించేందుకు కృషిచేయాలని కోరారు.దేశ సంపద కొద్దిమంది చేతుల్లోనే పోగవుతోందని, ఫలితంగా నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం కుల, మత ఘర్షణలు సృష్టిస్తూ శ్రామికవర్గ పోరాటాలను పక్కదారి పట్టిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దోపిడీ విధానాలపై కార్పొరేట్ వ్యతిరేక శక్తులన్నీ కలిసి ఐక్య ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బండారు రవికుమార్, సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు శ్రీనివాస్, సీసీఐ సాధన కమిటీ కోకన్వీనర్ విజ్జగిరి నారాయణ, సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, నంది రామయ్య, అలాల అజయ్, గుడిపెల్లి నగేష్, సాజిద్‌ఖాన్, బండి దత్తాత్రి, బొల్లు ఈశ్వర్‌దాస్, వెంకట్ నారాయణ, దాసరి రమేష్ పాల్గొన్నారు.

కీలక రంగాల మందగమనం

(మొదటిపేజీ తరువాయి)

ఫిబ్రవరిలో 7.1 శాతం వృద్ధి నమోదయ్యింది. వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ శుక్రవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. ఏడాదికేడాదితో పోల్చితే గడిచిన ఫిబ్రవరి మాసంలో బొగ్గు (1.7 శాతం), రిఫైనరీ ఉత్పత్తులు (0.8 శాతం), ఉక్కు (5.6 శాతం), విద్యుత్ (2.8 శాతం) వంటి రంగాల్లో ఉత్పత్తి క్షీణించింది. మరోవైపు ఎరువులు, సిమెంట్ రంగాలు వరుసగా 10.2 శాతం, 10.5 శాతం చొప్పున వృద్ధితో మెరుగైన పనితీరును కనరబ్చాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి ఫిబ్రవరి కాలంలో కీలక రంగాల ఉత్పత్తి 4.4 శాతానికి పరిమితమయ్యింది. ఇంతక్రితం ఏడాది ఇదే సమయంలో 7.8 శాతం రికార్డ్ వృద్ధి చోటు చేసుకుంది. ఈ ఎనిమిది రంగాలు మొత్తం దేశ పారిశ్రామిక ఉత్పత్తి సూచీలో 40.27 శాతం వాటాను కలిగి ఉన్నాయి. అధిక ధరలు, నిరుద్యోగం, ప్రజల ఆదాయాలు తగ్గడం తదితర పరిణామాలు వస్తు డిమాండ్‌ను దెబ్బతీస్తున్నాయి. దీంతో కొనుగోళ్లు తగ్గుతున్నాయి. ఈ ప్రభావం కీలక మౌలిక వసతుల రంగాల ఉత్పత్తిపై ప్రభావం చూపుతుతున్నాయని తెలుస్తోంది. పరిస్థితులు ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో పరిశ్రమలు, ఉపాధి మరింత దెబ్బతినే అవకాశాలున్నాయి.

భావ ప్రకటనా స్వేచ్ఛ ప్రజాస్వామ్యంలో అంతర్భాగం

(మొదటిపేజీ తరువాయి)

కీలక వ్యాఖ్యలు చేసింది."కవిత్వం, సినిమా, నాటకం, కళలు, సాహిత్యం, వ్యంగ్యం వంటి అంశాలు మనుషుల జీవితాలను ఎంతో ప్రభావితం చేస్తాయి. ఆలోచనలు, అభిప్రాయాలను వెల్లడించే స్వేచ్ఛలేనప్పుడు ఆర్టికల్ 21 ప్రకారం గౌరప్రదమైన జీవితాన్ని గడపడం ఎలా సాధ్యం అవుతుంది?. ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్య వ్యవస్థలో విభిన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతాయి. అలాంటప్పుడు ప్రతి వాదనలతో వాటిని ఎదుర్కోవాలి. అంతేతప్ప అణచివేయాలని చూడకూడదు. ఒకవేళ ఈ వ్యాఖ్యలపై ఆంక్షలు విధిస్తే.. అవి సహేతుకంగా ఉండాలి. అంతేతప్ప ఊహాజనితంగా కాదు. ఓ వ్యక్తి వెలిబుచ్చే అభిప్రాయాలను ఎంతమంది వ్యతిరేకించినా సరే.. ఆవ్యక్తి భావ ప్రటనా హక్కును తప్పనిసరిగా గౌరవించాల్సిందే. వాక్ స్వాతంత్ర్యం అనేది ప్రజాస్వామ్యంలో అంతర్భాగం. ప్రజలకు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను కాపాడటం న్యాయస్థానాల విధి. పోలీసులు రాజ్యాంగ ఆదర్శాలను కట్టుబడి ఉండాలి. అంతిమంగా ఆర్టికల్ 19(1)ను కాపాడాల్సిన బాధ్యత న్యాయమూర్తులదే" అని ధర్మాసనం స్పష్టం చేసింది. అంతేకాక ఎంపీపై గుజరాత్ పోలీసులు దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టి వేసింది.

నిర్బంధాలు, నిషేధాలు, ఆంక్షలు, అవరోధాలు, కారాగారాలు, అజ్ఞాత వాసాలు, దుష్ప్రచారాలు, వయోభారాలు అణుమాత్రం లక్ష్యపెట్టక ఆశయ సాధనకై నిలబడ్డ వీరులు వీరు. జైళ్లే వీరికి విశ్రాంతి మందిరాలయ్యాయి. అజ్ఞాత వాసాలే అధ్యయన కేంద్రాలయ్యాయి. అశేష జన శ్రేయస్సుకు జీవితాన్ని అంకితం చేసిన త్యాగధనులే ఈ నవరత్నాలు. భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమం అనేక సవాళ్లను అధిగమించింది. నికరమైన మార్క్సిజం-లెనినిజం బాటలో పయనించే క్రమంలో సీపీఐ(ఎం)గా ఆవిర్భవించింది. ఈ పార్టీ స్థాపనలో ప్రముఖ పాత్ర వహించి, సుదీర్ఘ కాలం సేవలందించిన ఈ తొలి పొలిట్‌బ్యూరో నేతలను మార్క్సిస్టు నవరత్నాలుగా పిలుచుకుంటారు. ఇటు దేశంలో పాలక వర్గాల దాడితో పాటు, రివిజనిం, దుందుడుకు వాదుల విచ్ఛిన్నాలు, బయట యూఎస్ఎస్ఆర్, చైనా కమ్యూనిస్టు పార్టీ సైద్ధాంతిక దాడిని ఎదిరించి సీపీఐ(ఎం)ను సమున్నత శిఖరాలపైకి చేర్చిన వారే ఈ నవరత్నాలు. ఏప్రిల్ 2 నుండి సీపీఐ(ఎం) 24వ అఖిల భారత మహాసభలకు తమిళనాడులోని మధురై నగరం వేదిక కాబోతున్న సందర్భంలో ఆ మార్క్సిస్టు మహోన్నతులను ఒకసారి స్మరించుకుందాం...




నవరత్నాలు

మహోన్నత శిఖరం పుచ్చలపల్లి సుందరయ్య...



భూస్వామ్య కుటుంబంలో పుట్టి భూస్వామ్య వ్యవస్థపై పోరాటానికి నడుం కట్టారు. స్వాతంత్ర్యోద్యమంతో ఉత్తేజితులై దేశం కోసం చదువు వదిలిపెట్టి, ప్రజల కోసం కమ్యూనిస్టుగా మారారు. కులతత్వాన్ని వ్యతిరేకిస్తూ తన పేరు వెనకున్న రెడ్డిని తొలగించి సుందరయ్యగా ప్రజల గుండెల్లో నిలిచిపోయారు. దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి సారథ్యం వహించారు. ఆ అనుభవంతో భారత విప్లవ సాధనకు చేపట్టాల్సిన పోరాట మార్గాన్ని రూపొందించడంలో అగ్రభాగాన నిలిచారు. ప్రతి విషయాన్ని సునిశితంగా పరిశీలించే అధ్యయన శీలి. క్రమశిక్షణకు మారు పేరు. నమ్మిన విషయాన్ని చెప్పడం, చెప్పిన విషయాన్ని ఆచరించడం వంటి సుందరయ్య జీవనశైలి ఎందరినో ఉత్తేజ పరిచింది. తన వాటాగా వచ్చిన యావదాస్తినీ పార్టీకిచ్చిన ధన్యజీవి. పార్లమెంటులో, శాసనసభలో ఆయన కృషి మరువలేనిది. లక్ష్య సాధనలో ఆయనో విప్లవ సేనాని. పార్లమెంటుకు సైకిల్‌పై వెళ్ళిన నిరాడంబరత ఆయన ఆస్తి. విప్లవ పథాన్వేషణ ఆయన శ్వాస. అరణ్య వాసాలూ, అజ్ఞాతవాసాలూ ఆయన జీవితంలో నిత్యకృత్యాలు. విప్లవం కోసం ఆయన విరామమెరుగని ప్రయాణికుడే కాదు, అందుకు వేల మందిని తయారు చేసి నడిపించిన రథ సారథి.

మేధో సముద్రం ఇఎంఎస్ నంబూద్రిపాద్...




నిద్రలేచింది మొదలు దేవుడు, భక్తి అంటూ నిత్యం పూజలు చేసే కుటుంబంలో పుట్టారు. ఆయన బాల్యం మొత్తం కూడా పూజలతోనే గడిచింది. అలాంటి వ్యక్తి తర్వాతి కాలంలో తాను పెరిగిన వ్యవస్థపైనే తిరుగుబాటు చేశారు. 1977 నుండి 1992 వరకు సీపీ(ఐ)ఎంకు సారథ్యం వహించారు. సాంఘిక, ఆర్థిక దురన్యాయాలకు వ్యతిరేకంగా తన కలాన్నీ, గళాన్నీ, శక్తినీ, యుక్తినీ ధారపోశారు. తన అపార మేధస్సుతో ఈ దేశంలో కమ్యూనిస్టు భావజాల వ్యాప్తికి విరామమెరుగక శ్రమించారు. దోపిడీ, పీడనా లేని భౌతిక ప్రపంచం కోసం జీవితాన్నే ధారపోసిన మహనీయుడు. తాను జన్మించిన కేరళ ప్రాంతలో ప్రగతిశీల భావాలనూ, బలమైన కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించారు. ఎన్నికల ద్వారా తన రాష్ట్రానికి తొలి కమ్యూనిస్టు ముఖ్యమంత్రిగా ప్రపంచ చరిత్ర సృష్టించి విప్లవ ప్రజానాయుకుడిగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా మన్నలందుకున్న కమ్యూనిస్టు ఉద్యమ నేత.

మేటి సిద్ధాంతవేత్త మాకినేని బసవపున్నయ్య...



మార్క్సిస్టు సిద్ధాంతవేత్త. మార్క్సిజం-లెనినిజాలకు తుదికంటా కట్టుబడి పీడిత ప్రజల విముక్తి కోసం విశిష్టమైన సేవలందించారు. భారతదేశంలోనూ అంతర్జాతీయ కమ్యూ నిస్టు ఉద్యమంలోనూ వచ్చిన వక్రీకరణలకు వ్యతిరేకంగా ఆయన నిరంతర పోరాటం సాగించారు. 'నిర్దిష్ట పరిస్థితులలో నిర్దిష్ట విశ్లేషణ'ను చేస్తూ మార్క్సిజం-లెనినిజం అనే సజీవ సిద్ధాంత పతాకాన్ని సమోన్నతంగా నిలిపేందుకు కృషి చేశారు. సిద్ధాంతంతో ఆచరణను సమ్మిళితం చేసి సాగించిన మహత్తర తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటంలో ప్రముఖ పాత్ర వహించిన నాయకులలో ఈయన కూడా ఒకరు. 'తెలంగాణ పోరాటం-వాస్తవాలు' పేరిట అప్పటి డాక్యుమెంట్లను పుస్తక రూపంలో తీసుకొచ్చారు. భారతదేశంలో విప్లవసాధనకు అనుసరించాల్సిన వ్యూహం, ఎత్తుగడలపై ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో అంతర్గత చర్చలు ప్రారంభించిన వారిలో ఒకరు. ఆ చర్చలకనుగుణంగా ప్రత్యామ్నాయ డాక్యుమెంటును తయారు చేసే పనిని ఆయన తన భుజాలకెత్తుకున్నారు. దేశంలో జాతుల సమస్యపై కూడా సమగ్ర అధ్యయనం చేశారు. భారత కమ్యూనిస్టు ఉద్యమంలో సిద్ధాంతపరంగా తీవ్రస్థాయిలో చర్చలు సాగిన కాలంలో ఈ అంశంపై అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ నాయకులతో చర్చలు జరిపే బాధ్యతను కేంద్ర కమిటీ అప్పగించిన నలుగురిలో ఎంబీ ఒకరు. కమ్యూనిస్టు సిద్ధాంతంపై ఆయనకున్న పట్టుకు ఇది ఓ నిదర్శనం. 14 ఏండ్ల పాటు రాజ్యసభ సభ్యుడిగా తన గళాన్ని వినిపించారు. తన రాజకీయ జీవితంలో ఆరేండ్లు రహస్య జీవనం సాగించారు.

రాజీలేని యోధుడు బి.టి.రణదివె...



క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ఆస్పత్రి బెడ్‌పై ఉండి మృత్యువుతో పోరాడుతూ కూడా కర్తవ్యాన్ని మరవని నేత. అటువంటి పరిస్థితుల్లోనూ పత్రికలలో వచ్చిన ఆనాటి తూర్పుయూరప్ దేశాల పరిణామాలను విశ్లేషిస్తూ ఒక డాక్యుమెంట్‌ను స్వయంగా టైప్ చేసిన నిబద్ధత ఆయనిది బ్రిటిష్ కాలంలోనే ఎంఏ ఎకనామిక్స్‌లో గోల్డ్‌మెడల్ అందుకున్న ఘనత ఈయన సొంతం. ఆర్థిక క్రమశిక్షణ లోపిస్తే కమ్యూనిస్టు కమ్యూనిస్టుగా మిగలడన్న విషయాన్ని ఆచరింప చేయడమే కాదు, వ్యక్తిగత జీవితంలోనూ కఠినంగా పాటించిన వ్యక్తి. 1948లో ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీకి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఒక సారి ప్రారంభించిన పోరాటం విజయం సాధించే వరకూ ఎన్ని ఒడిదుడుకులెదురైనా మధ్యలో మడమతిప్పేవారు కాదు. కమ్యూనిస్టు పార్టీకి అఖిలభారత కేంద్రం ఏర్పడకముందే ఆయన పార్టీ సభ్యుడయ్యారు. 62 ఏండ్ల పాటు విరామం లేకుండా కమ్యూనిస్టు, కార్మికోద్యమాల అభివృద్ధికి కృషి చేశారు. ఆయన రాజకీయ జీవితంలో 9 ఏండ్లు జైళ్లలో, ఐదున్న రేండ్లు అజ్ఞాతంలో గడిపారు. సీఐటీయూ ఏర్పాటులో ప్రాధాన భూమిక పోషించారు.

నిర్మాణ రథసారథి ప్రమోదాస్ గుప్తా...



పశ్చిమ బెంగాల్ వామపక్ష సంఘటనను పలుమార్లు విజయపథంలో నడిపించిన నిర్మాణసారథి. దేశ వ్యాప్తంగా వామపక్ష ఉద్యమాన్ని ఉత్తేజపరిచిన అగ్ర నాయకులలో ప్రముఖులు. పార్టీ నాయకుడిగానే కాక, వ్యక్తిగా ఆయన నిరాడంబర జీవనశైలి, అణుకువ, వ్యూహరచనా నైపుణ్యాలతో దేశ వ్యాపితంగా గౌరవాభిమానాలు అందుకున్నారు. ఈయన పేరు వింటే ముందుగా స్ఫురణకొచ్చేది నిర్మాణ దక్షత. సామాన్యులను సైతం నిర్మాణ రంగంలో తీర్చి దిద్దిన ఘనత ఆయనది. విద్యార్థి దశలోనే ఆయన అనుశీలన్ సమితి అనే విప్లవ గ్రూపులో సభ్యునిగా చేరారు. 19 ఏండ్ల వయసులో మచువా బజార్ బాంబు కేసులో బ్రిటిష్ ప్రభుత్వంచే అరెస్టు అయ్యి ఎనిమిదేండ్లు జైలు జీవితం గడిపారు. విడుదలైన తర్వాత పార్టీ సభ్యుడయ్యారు. బెంగాల్ పార్టీ పునర్నిర్మాణంలో, స్వాధీనత దినపత్రిక పునఃప్రారంభంలో కీలకపాత్ర పోషించారు. 1960లో ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు చూశారు. 1964లో మార్క్సిస్టు పార్టీ ఏర్పడిన నాటి నుండి పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా, పొలిట్ బ్యూరో సభ్యులుగా వుండి నిర్మాణ విషయాలలో రాజీ లేని వైఖరిని కొనసాగించారు.

కార్మికోద్యమ నేత పి.రామమూర్తి...




13 ఏండ్ల వయసులోనే దేశం కోసం తపించారు. గాంధీజీ సహాయ నిరాకరణోద్య మానికి ఆకర్షితులయ్యారు. సైమన్ కమిషన్ వ్యతిరేక ఉద్యమంలో పాల్గొని జైలుకెళ్లారు. విడుదలైన తర్వాత 22 ఏండ్ల వయసులో అఖిల భారత కాంగ్రెస్ కమిటీలో సభ్యుడ య్యారు. తర్వాత కాలంలో కాంగ్రెస్ సోషలిస్టుగా కొనసాగి కమ్యూనిజం వైపు ఆకర్షితులయ్యారు. అలా తమిళనాడు కమ్యూనిస్టు ఉద్యమ ప్రారంభకులుగా నిలిచారు. కాంగ్రెస్ సోషలిస్టులందరినీ కమ్యూనిస్టు పార్టీ సభ్యులుగా మార్చడంలో నిర్విరామ కృషి చేశారు. తన దృష్టిని కార్మికుల సమస్యలపై కేంద్రీకరించారు. కల్లుగీత, ట్రామ్‌వే కార్మికుల సమస్యలపై పగలూ రాత్రి శ్రమించారు. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో ఆయనపై మద్రాసు కుట్రకేసు, 1946లో మధురై కుట్రకేసులు బనాయించారు. ఇలా ఎన్నోసార్లు దేశమాత శృంఖాలాలు తెంచేందుకు జైలుకెళ్లారు. జైలు నుండే పోటీ చేసి ఆయన శాసనసభ సభ్యుడిగా గెలుపొందడం ఆనాడు సంచలనం. మద్రాసు శాసనసభలో ప్రతిపక్ష నాయకుడుగా వ్యవహరించారు. సీఐటీయూ ఆవిర్భావం తర్వాత వ్యవస్థాపక కార్యదర్శిగా ఉన్నారు. కార్మికులే చోదకశక్తి అని నమ్మిన ఆయన ఆయా తరగతులను సమస్యలపై సంఘటితం చేశారు. తమిళనాడులోని పేదలకు తలలో నాలుకలా మారారు.

ప్రజా పోరాట ధీరుడు ఎకె గోపాలన్...




సమస్యలెక్కడ ఉంటాయో ఆయన అక్కడుంటారు. ప్రజలెక్కడ వాటిపై ఆందోళన చెందుతుంటారో అక్కడ నిలబడతారు. కోర్కెల సాధనకు పోరాటాలెక్కడ జరుగుతుంటాయో అక్కడ ప్రత్యక్షమవుతారు. ఉపాధ్యాయ వృత్తితో ఆయన తన జీవన సమరాన్ని ప్రారంభించారు. బడిపంతు లంటే పిల్లలకు అక్షరాలు నేర్పడమే కాదు, గ్రామస్తుల సమస్యలకు పరిష్కారాలు చూపే నాయ కుడని ఆచరించి చూపిన మహోన్నతుడు. ఇలా తన 16వ ఏట ప్రజాహిత కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. తర్వాత స్వతంత్ర్య సమర యోధునిగా ముందుకురికారు. కేరళలో కాంగ్రెస్ పార్టీని నిర్మించిన ప్రముఖుల్లో ఒకరు. కృష్ణ పిళ్ళై, ఇఎంఎస్‌లతో కలిసి కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ నిర్మాణానికి బీజాలు వేశారు. అది పెరిగి పెద్దదయ్యేటప్పుడు మొత్తంగా దానిని కమ్యూనిస్టు పార్టీగా రూపాంతరం చెందించడానికి వారే సంధాన కర్తలయ్యారు. ప్రజాందోళన ఆయన కార్యక్రమంగా మారింది. పోరాటాలు ఆయన ఊపిరిగా సాగాయి. నిరాహార దీక్షలు, అరెస్టులు, జైలు జీవితం ఆయనకు నిత్యకృత్యాలయ్యాయి. బయట ఉంటే కష్ట జీవులూ, కర్షకుల కోసం, జైల్లో ఉంటే ఖైదీల హక్కుల కోసం, పార్లమెంటులో ఉంటే ప్రజాపోరాట వాణిని వినిపించడం కోసం, ప్రజా సమస్యలను ఎలుగెత్తి చాటడం కోసం అహరహం పరితపించిన యోధుడు ఆయన. పాతికేండ్లు ప్రతిపక్ష నేతగా ఉండి ప్రజాసమస్యల ప్రతిధ్వనికి పార్లమెంటునూ ఓ పోరాట సాధనంగా మలుచుకున్నారు.

రాజకీయ వ్యూహ నిపుణుడు హరికిషన్ సింగ్ సూర్జిత్...



భగత్ సింగ్ ఏర్పాటు చేసిన నవజవాన్ భారత్ సభలో పదిహేనేండ్ల వయసులో చేరారు. పదహారేండ్ల వయసులో హోషియార్‌పూర్ కోర్టు వద్ద భారత త్రివర్ణ పతాకాన్ని ఎగరేశారు. దీనిపై ఆగ్రహించిన పోలీసులు కాల్పులకు తెగబడ్డారు. సూర్జిత్‌ను అరెస్ట్ చేసి బాల నేరస్థుల పాఠశాలకు పంపారు. విడుదలైన తర్వాత పంజాబ్ రాజకీయాలలో ప్రవేశించారు. 18 ఏండ్ల వయసులో కమ్యూనిజంతో మమేకమయ్యారు. 1934లో ఉమ్మడిపార్టీ సభ్యుడయ్యారు. దేశ విభజన సమయంలో హింసతో అట్టుడికిపోయిన పంజాబ్‌లో మత సామరస్యం కోసం అవిశ్రాంత కృషి చేశారు. 1954లో జరిగిన సీపీఐ మూడవ జాతీయ మహాసభలలో కేంద్ర కమిటీకి, పొలిట్‌బ్యూరోకు ఎన్నికయ్యారు. సీపీఐ నుండి విడిపోయి సీపీఐ(ఎం)ను ఏర్పాటు చేసిన తొమ్మిది మంది నాయకులలో సూర్జిత్ ఒకరు. చట్టసభల్లోనూ ప్రజావాణి వినిపించారు. సూర్జిత్ జీవితం సామ్రాజ్యవాద వ్యతిరేక, జాతీయవాద ఉద్యమ విలువలతో ముడిపడింది. దేశ ఐక్యతకు సంబంధించిన అంశాలన్నింటినీ ప్రజాస్వామిక, లౌకిక కోణం నుండే చూశారు. మతతత్వానికి వ్యతిరేకంగా జీవితాంతం పోరాడారు. దేశ లౌకిక సూత్రాలకు మతతత్వ శక్తుల నుండి ముప్పు పొంచి ఉన్నదని గుర్తించిన తొలి తరం నేతలలో సూర్జిత్ ఒకరు. 1989, 1996, 2004లో రాజకీయ కూటముల ఆవిర్భావంలోనూ, ప్రభుత్వాల ఏర్పాటులోనూ కీలక పాత్ర పోషించారు. పార్టీ ప్రధాన కార్యదర్శిగా దేశంలోని వామపక్ష, ప్రజాస్వామ్య శక్తులకు అధీకృత ప్రతినిధిగా పనిచేశారు.

పరిపాలనాదక్షుడు జ్యోతిబసు...



సమకాలీన రాజకీయాలలో సమున్నత శిఖరం. స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని, సామ్యవాద ఆశయ దీప్తిని తనలో నింపుకుని పోరాటాలలోనూ, పరిపాలనలోనూ రాటుదేలిన సవ్యసాచి. మేరునగధీరుడు, అచంచల యోధుడు, పరిపాలనా దక్షత, పోరాట దీక్షల మేలు కలయిక. కమ్యూనిస్టేతర ప్రపంచంలో చాలా దేశాలకన్నా ఎక్కువ జనాభా కలిగిన పశ్చిమ బెంగాల్‌కు అవిచ్ఛిన్నంగా సారథ్యం వహించారు. ఆ రాష్ట్రానికి 23 ఏండ్లు 137 రోజుల పాటు ముఖ్యమంత్రిగా పని చేసి ప్రపంచ రికార్డు సృష్టించారు. ఒక్క మాటలో చెప్పాలంటే జ్యోతిబసు ఒక చరిత్ర. అనుభవాల సంపుటి. కొంత మంది ఈయనను కరుడు గట్టిన కమ్యూనిస్టు అంటే మరికొందరు కాలం చెల్లిన సిద్ధాంతాలను పట్టుకున్న మొండిఘటం అనేవారు.

ఎవరేమనుకున్నా సరే జ్యోతిబసు లేని భారత దేశ రాజకీయ చిత్రం అసంపూర్ణం. చరిత్రలో తనకంటూ ఓ పేజీ సృష్టించుకున్న మహానేత. అశేష జన శ్రేయస్సుకు అంకితమై అరుణారుణ ప్రస్థానం సాగించిన కమ్యూనిస్టు యోధుడు. మార్క్సిస్టు మహారథుడు.



మహాసభలకు రండి

సీఎం స్టాలిన్‌కు సీపీఐ(ఎం) 24వ అఖిల భారత మహాసభల ఆహ్వాన పత్రికను అందజేసిన తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం.

చెన్నై : తమిళనాడు ముఖ్యమంత్రి ఎం. కె. స్టాలిన్‌ను ఆ రాష్ట్ర సీపీఐ(ఎం) కార్యదర్శి షణ్ముగం మర్యాద పూర్వకంగా కలిశారు ఏప్రిల్ 2-6 తేదీలలో మధురైలో జరిగే సీపీఐ(ఎం)24వ అఖిల భారత మహాసభలకు రావాలంటూ ముఖ్యమంత్రికి ఆహ్వాన పత్రికను అందజేశారు. సీఎంను కలిసిన వారిలో సీపీఐ(ఎం) ఎమ్మెల్యే నాగై మాలి, కామ్రేడ్ ఎం. చిన్నదురైలు ఉన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

రైతుల జీవితాల్లో రోడ్డు చిచ్చు

పంట భూముల్లో.. గ్రీన్ ఫీల్డ్ రహదారి • మా భూములు లాక్కోవద్దు..! • మూడింతల భూమి ఇవ్వాల్సిందే..

- మా బతుకులకు ఇవే ఆధారం
- ప్రభుత్వ ధర ప్రకారం పరిహారం మాకొద్దు
- గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతుల ఆవేదన




నవతెలంగాణ- రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

'పెద్దల విలాసాల కోసం.. మా పేదల భూములే కావాల్సి వచ్చిందా.. ఉన్న ఎకరా, అద్దెకరా లాక్కుంటే మేమేట్లా బతకాలి. మా పిల్లలను సాదేదెట్లా.. ఉన్న భూమి పోతే ఏం చేసి బతకాలి.. మా తాతల కాలం నుంచి ఈ భూమినే నమ్ముకుని జీనవం సాగిస్తున్నాం. ఏమైనా ఉద్యోగం చేద్దామంటే చదువు రాకపాయే.. ఉన్న 2 ఎకరాల 17 గుంటల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ, పశువులను పెంచుకుంటూ బతుకుతున్నాం. ఉన్న పళంగా ఒక ఎకరం 31 గంటల భూమిని రోడ్డు పేరుతో ప్రభుత్వం తీసుకుంటే ఎలా.. గ్రీన్ ఫీల్డ్ రోడ్డు మా జీవితాలను ఆగం చేస్తోంది. పంట భూముల్లో రోడ్డు వేసుడేంది. ఈ ముచ్చట కూడా మాకు చెప్పనే లేదు. ప్రభుత్వం ఇచ్చే పరిహారం మాకొద్దు. మా భూమే కావాలంటే దీనికి మూడింతల భూమి మాకు ఇవ్వాల్సిందే.. లేదంటే మాకు చావే శరణ్యం..' అని గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణంలో భాగంగా భూమి కోల్పోతున్న రావిరాల గ్రామానికి చెందిన రైతు సుధాకర్ తమ గోడును నవతెలంగాణతో వెల్లబోసుకున్నారు. ఇది సుధాకర్ ఒక్కడి గోసేనే కాదు. రోడ్డు నిర్మాణంలో భూమిని కోల్పోతున్న ప్రతి రైతుదీ ఇదే బాధ. గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులు కష్టాలపై కథనం. రంగారెడ్డి జిల్లాలో ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రీజనల్ రింగ్ రోడ్డు వరకు 41.5 కి.మీ మేర గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. దీని నిర్మాణానికి సుమారు రూ.4 వేల కోట్లతో టెండర్లు పిలిచింది.

అయితే ఈ నిర్మాణంలో భాగంగా 1004.22 ఎకరాల భూ సేకరణ చేయాల్సి ఉండగా.. మొత్తం 4,725 మంది రైతుల నుంచి దీన్ని సేకరించనున్నట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఆయా సర్వే నంబర్లలో భూ క్రయ విక్రయాలు, ఆస్తుల రిజిస్ట్రేషన్లు, అభివృద్ధి పనులను నిషేధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బహిరంగ నోటిఫికేషన్లు ఇచ్చింది. కానీ ఇప్పటి వరకు భూములు కోల్పోతున్న రైతులకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు. రోడ్డు నిర్మాణానికి సంబంధించి రైతుల భూముల్లో మార్కింగ్ చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కనీసం సమాచారం కూడా ఇవ్వకుండా రెవెన్యూ అధికారులు దౌర్జన్యంగా పోలీసు బందోబస్తుతో రైతుల భూముల్లో మార్కింగ్ చేయడం, భూములు విక్రయించకుండా ఆ సర్వే నెంబర్లను నిషేధిత జాబితాలో పెట్టడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల తమ భూములు లాక్కోవద్దని బాధిత రైతులు రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ఆత్మహత్యయత్నం కూడా చేశారు. ఈ సందర్భంగా రైతులకు న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కొంగరకుర్దు (బి) రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 13లో సుమారు 15 ఎకరాల వరకు పట్టా భూమి గ్రీన్ ఫిల్డ్ రోడ్డు నిర్మాణంలో పోయే ప్రమాదం ఉంది. భూ సేకరణ అధికారులు హద్దురాళ్ల కూడా పెట్టడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

అయితే ఇప్పటికీ ఈ భూములకు సంబంధించిన రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. మొదటి విడతలో ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కందుకూరు మండలాల పరిధిలో తొమ్మిది గ్రామాల మీదుగా 20 కిలోమీటర్ల దూరం చేపట్టనున్న రోడ్డుకు 449.27 ఎకరాల మార్కింగ్ ప్రక్రియను కూడా పూర్తి చేసింది. రెండో విడతలో యాచారం, కడ్తాల్, ఆమనగల్ మండలాల పరిధిలోని ఐదు గ్రామాల పరిధిలో 21.5 కిలోమీటర్లు చేపట్టనుంది. ఈ రోడ్డుకు 554.35 ఎకరాల భూ సేకరణకు నోటిఫికేషన్ జారీ చేసింది. రావిర్యాల ఎగ్జిట్ 13 నుంచి ఆర్ఆర్ఆర్ వరకు 41.5 కిలోమీటర్ల పరిధిలోని ఈ రోడ్డు పనులను రెండు విడతల్లో చేపట్టనుంది. రోడ్డు నిర్మాణ పనుల కోసం రూ.4 వేల కోట్లు మంజూరు చేసింది. భూ సేకరణ ప్రక్రియ పూర్తయిన వెంటనే టెండర్లు పిలిచి పనులను ప్రారంభించే అవకాశం ఉంది. అయితే తమకు సమాచారం కూడా ఇవ్వకుండా ప్రభుత్వం తమ భూములను లాక్కోవడం సరికాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే పరిహారం కాకుండా తమ భూమికి మూడింతల భూమిని ఇవ్వాల్సిందేనని రైతులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో తమ భూముల జోలికి రావొద్దని.. గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరుతున్నారు.



రాష్ట్రంలో 5 డీఏలు పెండింగ్

- విడుదల కోసం ఉద్యోగుల ఎదురుచూపు • ఆర్థిక పరిస్థితి పేరు చెప్పి కాలయాపన చేస్తున్న ప్రభుత్వం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు కరువు భత్యం (డీఏ) విడుదల కోసం ఎదురుచూస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం శుక్రవారం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఈ ఏడాది జనవరికి సంబంధించి రెండు శాతం డీఏను ప్రకటించింది. దీంతో రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న డీఏల సంఖ్య ఐదుకు చేరింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ 53 శాతం నుంచి 55 శాతానికి పెరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ 26.39 శాతం ఉన్నది. 2023 జనవరి నుంచి పెండింగ్‌లో ఉన్నది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే మూడు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. అంటే 2022, జులై 3.64 శాతం, 2023 జనవరి 3.64 శాతం, జులై 3.64 శాతం మూడు డీఏలను పెండింగ్‌లో ఉంచింది. 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాత 2024 జనవరి 3.64 శాతం, జులై 2.73 శాతం, ఈ ఏడాది జనవరి 2.73 శాతం డీఏ పెండింగ్‌లో ఉన్నాయి. అయితే 2022 జులైకి సంబంధించిన 3.64 శాతం డీఏను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రస్తుతం ఐదు డీఏలు కలిపి 16.38 శాతం పెండింగ్‌లో ఉన్నది. వాటిని రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడు విడుదల చేస్తుందోనని ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి పేరు చెప్పి కాలయాపన చేస్తున్నది. ఇంకోవైపు ఉద్యోగులకు సంబంధించి వివిధ రకాల బిల్లులు సుమారు రూ.ఎనిమిది వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని వచ్చేనెల నుంచి నెలకు రూ.500 కోట్ల నుంచి రూ.600 కోట్ల వరకు విడుదల చేస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. 2023, జులై ఒకటి నుంచి పీఆర్సీ అమల్లోకి రావాల్సి ఉన్నది. పీఆర్సీ కమిటీ నివేదికను కూడా రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించలేదు. ఒకవైపు డీఏలు, ఇంకోవైపు పెండింగ్ బిల్లులు, మరోవైపు పీఆర్సీ అమలు కాకపోవడంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు.



టన్నెల్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు

సహాయక బృందాల ఉన్నతాధికారులతో ప్రత్యేక అధికారి సమీక్ష

నవతెలంగాణ- మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ లోపల సహాయక చర్యలపై సహాయక బృందాలు ఉన్నతాధికారులతో ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ లోపల చిక్కుకున్న వారి ఆచూకీ తెలుసుకునేందుకు నిరంతరాయంగా సహాయక బృందాలు పనిచేస్తున్నాయి. రెట్టింపు వేగంతో సహాయక చర్యలను కొనసాగించాలని అధికారులకు సూచించారు. ప్రమాద ప్రదేశం నుంచి 30 మీటర్ల వరకూ భారీ కేడింగ్ చేసినట్టు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధికారులు తెలిపారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నిరంతరం పర్యవేక్షణ జరుపుతున్నట్టు వివరించారు. సొరంగంలో మట్టి తవ్వకాలకు అడ్డంకిగా ఉన్న స్టీల్‌ను తొలగిస్తూ ఎప్పటికప్పుడూ ఊట నీటిని పంపుల ద్వారా బయటకు తరలిస్తున్నట్టు వివరించారు. మట్టి కింద ఉన్న లోకో ట్రైన్ క్యాబిన్లను తొలగించి లోకో ఇంజిన్ బయటకు తీసే పనులు సాగుతున్నాయన్నారు. పెద్ద బండ రాళ్లను ఎస్కవేటర్ ద్వారా తొలగిస్తూ, టీబీఎం భాగాలను అల్ట్రా థర్మల్ కట్టర్ ద్వారా కట్ చేస్తూ వాటి భాగాలను లోకో ట్రైన్ ద్వారా బయటకు తీసుకోస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, ఆర్మీ అధికారులు వికాస్ సింగ్, విజయ్ కుమార్, సింగరేణి మైన్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య, కల్వకుర్తి ఆర్డీవో శ్రీనివాసులు, ఎన్డీఆర్ఎఫ్ అధికారి కిరణ్‌కుమార్, ఎస్డీఆర్ఎఫ్ అధికారి గిరిధర్ రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే అధికారి నేతి చంద్ర, జీఎస్ఐ అధికారి పంకజ్ తిరుగున్, హైడ్రా అధికారి యజ్ఞ నారాయణ, జేపీ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏటీఎం వైపు వెళ్లారో.. బాదుడే

- పరిమితి మించితే రూ.23 భారం



ముంబయి : బ్యాకింగ్ వినియోగదారులపై మరో భారం పడనుంది. నగదు ఉపసంహరణ లేదా ఇతర సేవల కోసం ఇక నుంచి పరిమితి మించి ఏటీఎం వినియోగిస్తే ఒకొక్క లావాదేవీపై రూ.23 చొప్పున భారం పడనుంది. ఈ మేరకు వినియోగదారులపై ఛార్జీల బాదుడుకు బ్యాంకులు ప్రతిపాదించగా అందుకు భారత రిజర్వుబ్యాంకు అనుమతులిచ్చింది. వచ్చే మే నెల 1వ తేదీ నుంచి పెరిగిన ఛార్జీలు అమల్లోకి రానున్నాయి. సాధారణంగా కస్టమర్లకు ఒక నెలలో సొంత బ్యాంకు ఏటీఎం నుంచి ఐదు లావాదేవీలు (నగదు, బ్యాలెన్స్ ఎంక్వైరీ, మినీ స్టేట్‌మెంట్) ఉచితంగా పొందొచ్చు. అదే వేరే బ్యాంకు ఏటీఎం నుంచి అయితే మెట్రో ప్రాంతాల్లో 5 లావాదేవీలు, ఇతర ప్రాంతాల్లో 3 లావాదేవీలకు అనుమతిస్తారు. ఈ పరిమితి దాటితే లావాదేవీ రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఒక్కో లావాదేవీకి రూ.21 చొప్పున ఖాతాదారుల నుంచి రుసుము వసూలు చేస్తున్నారు. ఆర్‌బిఐ తాజాగా అనుమతించిన నేపథ్యంలో ఆ మొత్తం రూ.23కి పెరగనుంది. బ్యాంకింగ్ సేవల్లో ఒకప్పుడు విప్లవాత్మకంగా భావించిన ఏటీఎంలు.. డిజిటల్ చెల్లింపుల పెరుగుదలతో సవాళ్లను ఎదుర్కొంటున్నా యి. అయితే గ్రామీణ ప్రాంతాల్లోనూ, ఇంటర్నెట్ సేవలందని ప్రాంతాల్లోనూ నేటికీ ఎటిఎంలే కీలకం. తాజా ఫీజు పెంపు నేపథ్యంలో గ్రామీణ ప్రజలపై అధిక భారం పడనుంది.



గల్ఫ్ బాధిత కుటుంబాలకు రూ.3.3 కోట్ల ఎక్స్‌గ్రేషియా విడుదల

ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ చైర్మెన్ అనిల్ ఈరవత్రి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

గల్ఫ్‌దేశాల్లో మరణించిన 66 మంది బాధితుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున రూ.3.30 కోట్ల ఎక్స్‌గ్రేషియాను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని రాష్ట్ర ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ చైర్మెన్ అనిల్ ఈరవత్రి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సూచన మేరకు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావుతో తాను సమన్వయం చేసినట్టు తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో 28 మంది, జగిత్యాలలో 19, కామారెడ్డిలో 9, నిర్మల్‌లో 7, మెదక్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లో ఒక్కొక్కరికి చొప్పున బాధితుల ఖాతాల్లో డబ్బులు జమ చేసినట్టు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 103 మందికి రూ.5.15 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు.

వచ్చే ఎన్నికల్లో హరీశ్, కేటీఆర్‌కు ఓటమి తప్పదు : ఫిషర్మెన్ కార్పొరేషన్ చైర్మెన్ మెట్టు సాయికుమార్ హెచ్చరిక

మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ బడ్జెట్‌పై అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు మాట్లాడారని ఫిషర్మెన్ కార్పొరేషన్ చైర్మెన్ మెట్టు సాయికుమార్ హెచ్చరించారు. రానున్న ఎన్నికల్లో సిద్ధిపేట్, సిరిసిల్ల ప్రజలే వారిని ఘోరంగా ఓడిస్తారని ఒక ప్రకటనలో హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకులు ఎన్ని అబద్ధాలు మాట్లాడినా అవి నిజాలు కాబోవని తెలిపారు. ప్రజలను మోసాలు చేస్తూ మీసాలు మెలేస్తున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ చెప్పే ప్రతి అపద్ధపు మాటను బీఆర్ఎస్ సోషల్ మీడియా నిజం చేసేందుకు అష్టకష్టాలు పడుతున్నదని తెలిపారు.

బడ్జెట్, లిక్కర్ లెక్కలతో గందరగోళ పడుతున్నారు : ఎమ్మెల్సీ కవితపై బల్మూరి వెంకట్ సెటైర్

బడ్జెట్ లెక్కలు, లిక్కర్ దందా లెక్కలతో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత గందరగోళపడుతున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సెటైర్లు వేశారు. అభివృద్ధిని అడ్డుకుంటే ప్రజలే రాళ్లతో కొడతారని హెచ్చరించారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలన, కాంగ్రెస్ పదినెలల పాలనపై చర్చకు సిద్ధమా? అని కవితకు సవాల్ విసిరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈసారి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు చారిత్రాత్మకంగా కొనసాగాయని వివరించారు. వాస్తవ పరిస్థితులను ప్రజలకు చెప్పే ప్రయత్నం చేశామని తెలిపారు. బడ్జెట్‌పై విమర్శలు చేస్తున్న ఎమ్మెల్సీ కవిత అసలు లెక్కలు మర్చిపోయారని ఎద్దేవా చేశారు. గత బీఆర్ఎస్ 11 సార్లు ప్రవేశ పెట్టిన బడ్జెట్లలో ఆదాయానికి, ఖర్చులకు పొంతన లేకుండా పోయాయని విమర్శించారు.

అప్పులపై కాంగ్రెస్‌ది తప్పుడు ప్రచారం

- పార్లమెంటు సాక్షిగా బయటపడ్డ బండారం : బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత విమర్శ
- పార్టీ రజతోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని వెల్లడి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అప్పులపై అధికార కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. పార్లమెంటు సాక్షిగా ఇది బట్టబయలైందని ఆమె దుయ్యబట్టారు. శుక్రవారం హైదరాబాద్‌లోని శాసనమండలి ఆవరణలో కవిత మీడియాతో మాట్లాడారు. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్... ఇప్పటికైనా నిజాలు చెప్పాలంటూ ఆమె హితవు పలికారు. కాళేశ్వరం బ్యారేజీలు కూలిపోతున్నాయనే వాదనలో వాస్తవం లేదంటూ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి శాసనసభలో చెప్పారని గుర్తు చేశారు. అలాంటప్పుడు ఆ ప్రాజెక్టును ఉపయోగించుకుని పొలాలకు నీళ్ల ఎందుకివ్వటం లేదని ప్రశ్నించారు. పంటలు ఎండిపోతున్నా పట్టించుకోకుండా కాంగ్రెస్ సర్కారు పంతానికి పోయి రైతులకు కన్నీరు మిగులుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

తమ పార్టీ రజతోత్సవ వేడుకలను ఏప్రిల్ 27న హన్మకొండ జిల్లాలోని ఎల్కతుర్తిలో నిర్వహిస్తున్నామని కవిత ఈ సందర్భంగా తెలిపారు. మహా కుంభమేళా తరహాలో ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని అన్నారు.

శాసన మండలిలో బీఆర్ఎస్ ప్రజల గొంతుకగా వ్యవహరించిందని తెలిపారు. సమన్వయంతో అన్ని అవకాశాలను వాడుకుని తమ సభ్యులు ప్రభుత్వాన్ని అడుగడుగునా నిలదీశారని వివరించారు. అన్ని రకాల చర్చల్లో పాల్గొని సర్కారు వైఫల్యాలను ఎండగట్టారని తెలిపారు. ప్రజలు, రైతులు, మహిళలు వంటి అన్ని సమస్యలపై గళమెత్తామని చెప్పారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుపై ప్రతీ రోజూ వినూత్న రీతిలో నిరసనలు తెలిపామని గుర్తు చేశారు. తమ అధినేత కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్ చేసిన అనుచిత వ్యాఖ్యలను కూడా సభలో ఖండించామని చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై తాము చేసిన పోరాటానికి సర్కారు దిగొచ్చిందని అన్నారు. ఎప్పటికప్పుడు నిధులను విడుదల చేస్తామని మండలి సాక్షిగా ముఖ్యమంత్రి ప్రకటించారని తెలిపారు. అది అమలయ్యే వరకూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని కవిత ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు

ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు



న్యూఢిల్లీ : వక్ఫ్ సవరణ బిల్లు 2024ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా నిరసన తెలియజేయాలని అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఎఐఎంపిఎల్‌బి) పిలుపునిచ్చింది. రంజాన్ చివరి శుక్రవారం (అల్విదా జుమా)నాడు దేశవ్యాప్తంగా ఉన్న ముస్లింలు చేతికి నల్లటి బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ బిల్లుపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ ఎఐఎంపిఎల్‌బి శుక్రవారం ఎక్స్‌లో ఒక లేఖను పోస్ట్ చేసింది. వక్ఫ్ బిల్లు ముస్లింల మసీదులు, ఈద్గాలు, మదర్సాలు, దర్గాలు, ఖాన్ఖాలు, స్మశానవాటికలు, ధార్మిక సంస్థలను లాక్కునేందుకు ఉద్దేశించిన కపట కుట్రగా పేర్కొంది. ఈ బిల్లుని వ్యతిరేకించడం దేశంలోని ప్రతి ముస్లిం బాధ్యత అని, జుముఅతుల్ విదా నాడు మసీదుకు వచ్చే సమయంలో ముస్లిలందరూ చేతికి నల్లటి బ్యాండ్ ధరించారు, శాంతియుతంగా, మౌనంగా నిరసన తెలిపారని ఎఐఎంపిఎల్‌బి పేర్కొంది.

బిజినెస్



జియోహాట్‌స్టార్‌కు 10 కోట్ల చందాదారులు

న్యూఢిల్లీ : ప్రముఖ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ జియోహాట్‌స్టార్ 10 కోట్ల చందాదారుల మైలురాయిని అధిగమించినట్టు ప్రకటించింది. దేశంలోని విభిన్న ప్రేక్షకులను అర్థం చేసుకోవడంలో తమ సంస్థ అచంచలమైన నిబద్ధతకు ఇది అద్భుత నిదర్శనమని జియోహాట్‌స్టార్ డిజిటల్ సీఈఓ కిరణ్ మణి పేర్కొన్నారు. ఈ మైలురాయి భారతదేశ సామర్థ్యాన్ని నొక్కి చెప్పడమే కాకుండా, అపూర్వమైన స్థాయిలో కేటగిరీ ఫస్ట్ అనుభవాలను అందించాలనే తమ నిబద్ధతను మరింతగా వెల్లడిస్తోందన్నారు.

ఎనిమిదో నెలలోనూ రుణాలు తగ్గాయ్

ముంబయి : వరుసగా ఎనిమిదో నెలలోనూ రుణాల జారీలో తగ్గుదల చోటు చేసుకుంది. ఫిబ్రవరి 21తో ముగిసిన పక్షంలో రుణాల జారీలో 12 శాతం మాత్రమే పెరుగుదల నమోదయ్యిందని ఆర్‌బీఐ ఓ నివేదికలో వెల్లడించింది. గతేడాది ఇదే సమయంలో ఏకంగా 16.6 శాతం వృద్ధి చోటు చేసుకుంది. ఈ ఏడాది జనవరిలోనూ రుణాల జారీలో 12.5 శాతం పెరుగుదల నమోదయ్యింది. సర్వీసెస్ రంగంలో రుణాల జారీ పెరుగుదల 21.4 శాతం నుంచి 13 శాతానికి తగ్గాయి. గత నెలలో పరిశ్రమల రుణాల జారీ ఏకంగా 7.3 శాతానికి పరిమితమయ్యింది. వ్యవసాయ రంగ రుణాల జారీలో 11.4 శాతం పెరుగుదల ఉండగా.. గతేడాది ఇందులో 20 శాతం వృద్ధి నమోదయ్యింది.

బ్యాంక్‌ల్లో సోమవారం ప్రత్యేక క్లియరింగ్ సెషన్

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) ముగింపు నేపథ్యంలో మార్చి 31 సోమవారం నాడు ప్రత్యేక క్లియరింగ్ సెషన్‌ను నిర్వహించాలని బ్యాంక్‌లకు రిజర్వ్ బ్యాంక్ ఆదేశాలు జారీ చేసింది. ప్రత్యేక క్లియరింగ్ కార్యకలా పాల్లో అన్ని బ్యాంకులు తప్పనిసరిగా పాల్గొనాలని సూచించింది. ఆర్థిక సంవత్సరం ముగింపు రోజే ప్రభుత్వ ఆదాయం, చెల్లింపులు పూర్తికావాల్సి ఉన్నందున వాటి లావాదేవీలు నిర్వహించే బ్యాంకులు కార్యకలాపాలను నిర్వర్తించేలా ఆర్‌బిఐ నిర్ణయం తీసుకుంది. బ్యాంక్‌లతో పాటుగా ఐటి శా, సిజిఎస్‌టి కార్యాలయాలు ఈ నెల 29, 30, 31వ తేదీల్లో పని చేయనున్నాయి. ఈ నెల 31న రంజాన్ ఉన్నప్పటికీ ఆయా కార్యాలయాలు పని చేయనున్నాయి.

చివరి రోజు మార్కెట్లకు నష్టాలు

వరుసగా మూడు రోజులు సెలవు

ముంబయి : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి ట్రేడింగ్ సెషన్‌లో దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాలను చవి చూశాయి. అమ్మకాల ఒత్తిడితో శుక్రవారం సెన్సెక్స్ 191 పాయింట్ల నష్టంతో 77,415 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 72.60 పాయింట్ల తగ్గుదలతో 23,519కు చేరింది. ఏప్రిల్ 2న భారత్‌పై సుంకాలపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటన చేయనున్న నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించి.. అమ్మకాలకు మొగ్గు చూపారు. ముఖ్యంగా ఐటీ, ఆటోమొబైల్ షేర్లలో ప్రతికూలత చోటు చేసుకుంది. సెన్సెక్స్ 30 సూచీలో ఇండస్ ఇండ్ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, మారుతీ సుజుకీ, ఇన్ఫోసిస్ షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. మరోవైపు కోటక్ మహీంద్రా బ్యాంక్, హిందుస్థాన్ యూనిలీవర్, ఐసిఐసిఐ బ్యాంక్, టాటా మోటార్స్, నెస్లే ఇండియా షేర్లు లాభపడ్డాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) స్థూలంగా మార్కెట్లు 5 శాతానికి పైగా పెరిగాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 7.48 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 5.4 శాతం చొప్పున లాభాలను నమోదు చేశాయి. శని, ఆదివారాలు సాధారణ సెలవులు కావడంతో పాటుగా సోమవారం రంజాన్ నేపథ్యంలో మార్కెట్లకు వరుసగా మూడు రోజులు సెలవులు రానున్నాయి.

నిఫ్టీ నెక్ట్స్ 50లోకి హ్యుందాయ్

హ్యుందాయ్ మోటార్ ఇండియా (హెచ్ఎంఐఎల్) నిఫ్టీ నెక్ట్స్ 50, నిఫ్టీ 100, నిఫ్టీ 500, బిఎస్ఇ 500లోకి చేరినట్లు వెల్లడించింది. 2024 అక్టోబర్ 22న లిస్టింగ్ అయిన ఈ కంపెనీ అనాతి కాలంలోనే మార్కెట్‌లో దూసుకెళ్లింది. దీంతో తాము మరో కీలక మైలురాయిని దాటామని హెచ్ఎంఐఎల్ ఎండి అన్సూ కిమ్ పేర్కొన్నారు. భారత స్టాక్ ఎక్స్ఛేంజీల్లో హెచ్ఎంఐఎల్ స్థానాన్ని బలోపేతం చేశామన్నారు.

ఎఫియాసాఫ్ట్‌లో జాగల్‌కు 51 శాతం వాటా

హైదరాబాద్ : జాగల్ ప్రీపెయిడ్ ఒసియన్ సర్వీసెస్ లిమిటెడ్ మరో కంపెనీలో కీలక వాటాను స్వాధీనం చేసుకుంది. తాజాగా ఎఫియాసాఫ్ట్ ప్రయివేటు లిమిటెడ్‌లోని 51 శాతం మెజారిటీ వాటాను కొనుగోలు చేసినట్లు జాగల్ శుక్రవారం వెల్లడించింది. ప్రస్తుత వాటాదారులు కౌశిక్ షీ, క్రిష్ణారావు అకూలకు చెందిన 45.33 శాతం వాటాను రూ.36.72 కోట్లతో దక్కించుకుంది. మరో 5.67 శాతం వాటాను అదే వాటాదారుల నుంచి రూ.4.59 కోట్లకు పొందనున్నట్టు వెల్లడించింది. మొబిల్‌వేర్ టెక్నాలజీస్‌లో 38 శాతం వాటానుయ రూ.22.85 కోట్లతో స్వాధీనం చేసుకున్నట్టు జాగల్ ఇంతక్రితం రోజు ప్రకటించిన విషయం తెలిసిందే.

ఎంజి నుంచి కొత్త ఆస్టర్ 'బ్లాక్ బస్టర్ ఎస్‌యువి'



న్యూఢిల్లీ : సరికొత్తగా ఎంజి ఆస్టర్‌ను మై 2025 ఎడిషన్‌తో బ్లాక్ బస్టర్ ఎస్‌యువిని విడుదల చేసినట్లు జెఎస్‌డబ్ల్యు ఎంజి మోటార్ ఇండియా తెలిపింది. దీని కొత్త షైన్ వేరియంట్ ఎక్స్‌షోరూం ధరను రూ.12.5 లక్షలుగా నిర్ణయించింది. తమ శ్రేణీలో ఏకైక ఎస్‌యువిగా నిలిచిందని తెలిపింది. ఇది ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, 1.5 లీటర్, 1.3 టర్బో ఇంజీన్ తదితర 50కి పైగా ఫీచర్లతో లభిస్తుందని పేర్కొంది.

జిన్‌పింగ్‌తో యూనస్ భేటీ



బీజింగ్ : బంగ్లాదేశ్ ప్రభుత్వ ప్రధాన సలహాదారు ముహమ్మద్ యూనస్ చైనా అధ్యక్షులు జి జిన్‌పింగ్‌తో శుక్రవారం సమావేశమయ్యారు. చైనా అందించే రుణాలపై వడ్డీ రేట్లను 3 శాతం నుండి 1-2 శాతానికి తగ్గించాలని, చైనా నిధులతో కూడిన ప్రాజెక్టులపై కమిట్‌మెంట్ రుసుమును రద్దు చేయాలని బంగ్లాదేశ్ ప్రభుత్వం భావిస్తోంది. నాలుగు రోజుల పర్యటన కోసం గురువారం యూనస్ చైనా చేరుకున్న సంగతి తెలిసిందే. విమానాశ్రయంలో యూనస్‌కు చైనా ఉప విదేశాంగ మంత్రి సన్ వీడాంగ్ స్వాగతం పలికారు. అనంతరం హైనాన్‌లో జరిగిన బోవో ఫోరం ఫర్ ఆసియా వార్షిక సదస్సులో యూనస్ పాల్గొన్నారు. ఈ సదస్సులో చైనా ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రీమియర్ డింగ్ జుయెక్సి యాంగ్‌తో సమావేశమయ్యారు. బంగ్లాదేశ్‌లోని పలు అభివృద్ధి ప్రాజెక్టులలో చైనా మద్దతును కోరినట్లు బంగ్లాదేశ్ మీడియా తెలిపింది. రెడీమెడ్ దుస్తులు, ఎలక్ట్రిక్ వాహనాలు, తేలికపాటి యంత్రాలు, హైటెక్ ఎలక్ట్రానిక్స్, చిప్ తయారీ, సోలార్ ప్యానెల్ పరిశ్రమలు సహా చైనా తయారీ పరిశ్రమల తరలింపు సులభతరం చేయడంలో మద్దతు అందించాల్సిందిగా జుయెక్సిని కోరినట్లు పేర్కొంది. ఈ సదస్సులో యూనస్ రష్యా ఉప ప్రధాని అలెక్సీ ఓవర్‌చుక్‌తో కూడా సమావేశమయ్యారు.

ఉగాది తర్వాత "ఏఐ సిటీ"కి భూమి పూజ

- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉగాది తర్వాత మహేశ్వరంలో "ఏఐ సిటీ" నిర్మాణానికి భూమి పూజ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు తెలిపారు. హైటెక్ సిటీలోని ఐటీసీ కోహినూర్‌లో శుక్రవారం "క్లియర్ టెల్లిజెన్స్" ఇండియా డెలివరీ అండ్ ఆపరేషన్స్ సెంటర్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావితరాల అవసరాలకు అనుగుణంగా ఏఐ సిటీని నిర్మిస్తామని చెప్పారు. ఇందులో పెట్టుబడులు పెట్టేందుకు ఇప్పటికే దిగ్గజ సంస్థలు ఆసక్తి వ్యక్తం చేశాయని పేర్కొన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాలకు ధీటుగా ఎమర్జింగ్ టెక్నాలజీస్‌లో తెలంగాణ హబ్‌గా మారుతుందన్నారు. డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ లాంటి సాంకేతిక కేంద్రాలను ప్రారంభించామనీ, త్వరలోనే "క్వాంటం కంప్యూటింగ్" సెంటర్లను కూడా ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చే పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అన్ని రకాల సహాయ, సహకారాలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో "క్లియర్ టెల్లిజెన్స్" సీఈవో ఓవెన్ ఫ్రివోడ్, మేనేజింగ్ పార్ట్ నర్ అనిల్ భరాద్వా, డైరెక్టర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

626 మంది టీచర్లకు పరస్పర బదిలీలు

- ఉత్తర్వులు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 317 జీవో బాధిత ఉపాధ్యాయులకు సంబంధించి 626 మంది టీచర్లకు పరస్పర బదిలీలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా శుక్రవారం ఉత్తర్వులను జారీ చేశారు. రాష్ట్రంలో 317 జీవో వల్ల స్థానికతను కోల్పోయిన బాధిత ఉద్యోగులు, ఉపాధ్యాయులకు న్యాయం చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. మంత్రివర్గ ఉపసంఘం సిఫారసు మేరకు రాష్ట్రంలో స్పౌజ్ (భార్యాభర్తలు), మ్యూచువల్ (పరస్పర), హెల్త్ (ఆరోగ్యం) కారణాలున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులను బదిలీ చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. అందులో భాగంగానే 626 మంది ఉపాధ్యాయులకు పరస్పర బదిలీలను పూర్తి చేశామని ఆమె తెలిపారు. రాష్ట్రంలో పదో తరగతి పరీక్షలు జరుగుతున్నాయనీ, ఇతర తరగతుల విద్యార్థులకు త్వరలో ప్రారంభమవుతాయని వివరించారు. ఈ నేపథ్యంలో ఈనెల 31న ఉద్యోగ విరమణ పొందుతున్న ఉపాధ్యాయుల బదిలీలను వెంటనే చేపట్టాలని డీఈవోలను ఆదేశించారు. మిగిలిన ఉపాధ్యాయులను వచ్చేనెల 23న బదిలీ చేయాలని కోరారు. ఆ ఉపాధ్యాయులు ప్రస్తుతం పనిచేస్తున్న జిల్లాలో స్థానికతను కోల్పోయి బదిలీ అయి జిల్లా స్థానికులుగా మారతరని స్పష్టం చేశారు.

పోలీసుల విచారణకు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

- భూ కబ్జా కేసులో 3గంటల పాటు విచారించిన మోకిలా పోలీసులు
- నేను ఏ భూమీ కబ్జా చేయలేదు : జీవన్‌రెడ్డి



నవతెలంగాణ-శంకర్‌పల్లి

భూ కబ్జా కేసులో బీఆర్ఎస్ ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పోలీసుల విచారణకు హాజరయ్యారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం మోకిలా పోలీసులు జీవన్‌రెడ్డిని విచారించారు. టంగుటూరు భూ వివాదం కేసులో ఏసీపీ రమణగౌడ్ ఆధ్వర్యంలో జీవన్‌రెడ్డిని మోకిలా సీఐ వీరబాబు 3 గంటలపాటు విచారించారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. టంగుటూరులోని తన సొంత భూమి సుమారు 56 ఎకరాలను మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డితో పాటు ఆయన కుటుంబీకులు కబ్జా చేశారని సామ దామోదర్‌రెడ్డి 2024 మే 27వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. సామ దామోదర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు జీవన్‌రెడ్డితో పాటు ఆయన భార్య రజిత, తల్లిపై కేసు నమోదు చేశారు. అయితే ఇటీవలే జీవన్‌రెడ్డి భార్య రజిత, తల్లికి హైకోర్టులో ఊరట లభించింది. కానీ జీవన్‌రెడ్డికి ఊరట లభించకపోవడంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు జీవన్‌రెడ్డిని అరెస్టు నుంచి మినహాయింపు ఇస్తూ కేసు విషయంలో పోలీసులకు సహకరించాలని ఆదేశాలు జారీ చేసింది. దాంతో జీవన్‌రెడ్డి సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఆర్డర్ కాపీతో మోకిలా పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. పోలీసులు ఆయన్ను సుమారుగా మూడు గంటల పాటు విచారించారు. సామ దామోదర్‌రెడ్డికి చెందిన 170 ఎకరాల్లో ఎంత భూమిని కొనుగోలు చేశారు? ఏ సంవత్సరంలో ఎవరెవరిపై ఎంత భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు..? ఎక్కడ భూమిని ఎంత రేటుకు కొనుగోలు చేశారు..? అనే విషయాలపై జీవన్‌రెడ్డిని పోలీసులు ఆరా తీసినట్టు సమాచారం. ఇద్దరి మధ్య ఏర్పడిన వివాదం, తదితర విషయాలపై జీవన్‌రెడ్డిని పోలీసులు ప్రశ్నించారు. ఈ విషయంలో అవసరమైనప్పుడు విచారణకు హాజరుకావాలని, పోలీసులకు సహకరించాలని పోలీసులు జీవన్‌రెడ్డికి తెలిపారు.

నేను ఏ భూమినీ కబ్జా చేయలేదు : మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి

తాను ఏ భూమిని కబ్జా చేయలేదని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పోలీసులకు సహకరించేందుకే తాను పోలీస్ స్టేషన్‌కు వచ్చినట్టు మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి తెలిపారు. విచారణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.. సుప్రీంకోర్టు ఆర్డర్ కాపీతో పోలీస్ స్టేషన్‌కు వచ్చినట్టు తెలిపారు. రాజకీయ వేధింపులతోనే, తనపై కేసు నమోదు అయిందని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులే భూములను కబ్జా చేస్తారని ఆరోపించారు. విచారణ విషయంలో పోలీసులు ఎన్నిసార్లు పిలిచినా సహకరిస్తానని ఆయన తెలిపారు.

కూతుర్ని ప్రేమించాడని దారుణ హత్య

- యువకుడిని గొడ్డలితో నరికి చంపిన యువతి తండ్రి
- పెద్దపల్లి జిల్లా ముప్పిరితోటలో విషాదం



నవతెలంగాణ - ఎలిగేడు

పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం ముప్పిరితోటలో గురువారం రాత్రి ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. తన కూతుర్ని ప్రేమిస్తున్నాడని, పెండ్లి చేసుకునేందుకు సిద్ధం అవుతున్నాడనే కోపంతో ఓ వ్యక్తి గ్రామ నడిబొడ్డున యువకున్ని గొడ్డలితో విచక్షణారహితంగా నరికి హత్య చేశాడు. తన పుట్టిన రోజు వేడుకల్లో ఆనందంగా గడిపిన యువకుడు రాత్రికి విగతజీవిగా మారడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.ఎస్ఐ సిహెచ్. సనత్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ముప్పిరితోటకు చెందిన పూరెల్ల సాయికుమార్(20), అదే గ్రామానికి చెందిన ఓ యువతి రెండేండ్లుగా ప్రేమలో ఉన్నారు. ఇద్దరు బీసీ సామాజిక తరగతికి చెందినవారే అయినప్పటికీ వేర్వేరు ఉపకులాలు కావడంతో అమ్మాయి తల్లిదండ్రులు వారి ప్రేమను నిరాకరించారు. పలుమార్లు సాయిని మందలించారు. అయినా, ఇద్దరూ పెండ్లికి సిద్ధం కావడంతో ఇరు కుటుంబాల మధ్య గొడవలు జరిగాయి. సాయికుమార్‌పై యువతి తండ్రి కోపం పెంచుకున్నాడు. ఈ క్రమంలో సాయికుమార్ గురువారం తన పుట్టినరోజు కావడంతో అమ్మాయి ఇంటి సమీపంలోని వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద వేడుకలు నిర్వహించుకున్నాడు. ఇదే అదనుగా భావించిన యువతి తండ్రి సదయ్య అక్కడికి వెళ్లి గొడ్డలితో సాయి మెడపై వేటువేశాడు. తీవ్ర గాయాలతో సాయి పారిపోయేందుకు ప్రయత్నించి కొద్దిదూరంలో పడిపోయాడు. కింద పడిన వెంటనే మళ్లీ పలుమార్లు విచక్షణారహితంగా నరికి ప్రాణం పోయిందని నిర్ధారించుకున్నాక సదయ్య అక్కడి నుంచి పరారయ్యాడు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. పరారీలో ఉన్న సదయ్యను శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ దారుణం బాధిత కుటుంబాన్ని, గ్రామస్తులను కన్నీటిలో ముంచెత్తింది. గ్రామంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ

ఎఐ, డీప్ టెక్నాలజీ కేంద్రంగా ఏపీ

చెన్నై సెమినార్లో చంద్రబాబు



అమరావతి : ఐఐటీ మద్రాస్ సహకారంతో అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. చెన్నైలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మద్రాస్‌లో శుక్రవారం జరిగిన ఆలిండియా రీసెర్చ్ స్కాలర్స్ సమ్మిట్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఎఐ, డీప్ టెక్నాలజీకి కేంద్ర బిందువుగా మార్చనున్నట్లు చెప్పారు. దేశంలో 65 శాతం మంది ఎఐని వాడు తున్నారని, ఇది ప్రపంచ సగటు 30 శాతం కన్నా అధికమని తెలిపారు. ఎఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి కొత్త సాంకేతికతలో విద్యార్థులు ముందుం డాలని సూచించారు. మద్రాస్ ఐఐటి చాలా విషయాల్లో మొదటిస్థానంలో ఉందని, వివిధ రకాల ఆన్‌లైన్ కోర్సులు కూడా అందిస్తోందని పేర్కొన్నారు. నూతన పరిశోధనలు దేశాన్ని అంతరిక్షం, సెమీ కండక్టర్ల రంగాల్లో ముందుండేలా చేస్తున్నాయని వివరించారు. ఇక్కడి స్టార్టప్‌లు దాదాపు 80 శాతం సక్సెస్ అయ్యాయని వివరించారు.1995లో బిల్‌గేట్స్‌తో మాట్లాడి హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ స్థాపించాలని కోరానని, ఇప్పుడు సిఇఓగా సత్య నాదెళ్ల ఉన్నారని అన్నారు. 2014లో దేశం పదో ఆర్థిక వ్యవస్థగా ఉంటే ఇప్పుడు ఐదోస్థానానికి ఎదబాకిందని పేర్కొన్నారు. అందరూ కలిసి కృషిచేస్తే ప్రపంచంలో మొదటి స్థానానికి చేరుకుంటామని పేర్కొన్నారు. అమెరికాలో ఎక్కువ తలసరి ఆదాయం తెలుగువారి దేనని, అక్కడి ధనిక ప్రాంతాల్లో తెలుగు, తమిళులే ఎక్కువ ఉంది ఉంటారని వివరించారు. సాంకేతికతను అందిపుచ్చుకోవడంతో తెలుగువారు ముందుం టారని, సిలికాన్ వ్యాలీ, నాసా, వాల్‌స్ట్రీట్‌లో భారతీ యులు ఆధిపత్యాన్ని సాధిస్తున్నారని పేర్కొన్నారు. ఎనర్జీ రంగంలో ఏపీ ముందుందని వివరించారు. భవిష్యత్‌లో రెండు రూపాయలకే యూనిట్ విద్యుత్ ఉత్పత్తి చేస్తామని వివరించారు. ఏపీని ఇన్నోవేషన్‌కు కేంద్రంగా మారుస్తామని చెప్పారు. ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.కామకోటి మాట్లాడుతూ సైబరా బాద్ అభివృద్ధిలో చంద్రబాబు మార్గదర్శకుడని అన్నారు.

ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు



న్యూఢిల్లీ: ఆమ్‌ఆద్మీ పార్టీ అధినేత కేజ్రీవాల్ పై ఎఫ్ఐఆర్ నమోదైంది. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారనే ఆరోపణలపై పిటిషన్ దాఖలైన నేపథ్యంలో ఆయనపై కేసు నమోదు చేయాలని ఇటీవల ఢిల్లీ కోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఇందులోభాగంగా ఢిల్లీ పోలీసులు మాజీ సీఎం కేజ్రీవాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈమేరకు పోలీసులు న్యాయస్థానానికి నివేదికను సమర్పించారు. ఈ కేసుకు సంబంధించిన విచారణ జరుగుతోందని, మరింత సమయం కావాలని కోర్టును అభ్యర్థించారు. దీంతో తదుపరి విచారణను ఏప్రిల్ 18కి కోర్టు వాయిదా వేసింది. 2019లో ద్వారకలో భారీ హోర్డింగ్‌లు ఏర్పాటుచేయడానికి ప్రజానిధులు దుర్వినియోగం చేశారని ఆరోపిస్తూ ఢిల్లీ రౌజ్‌అవెన్యూ కోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ వ్యవహారంలో కేజ్రీవాల్ సహ ఇతరులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసేలా ఆదేశాలు ఇవ్వాలంటూ పిటిషనర్ న్యాయస్థానాన్ని కోరారు. ఆ అభ్యర్థనను ఢిల్లీ కోర్టు అంగీకరించింది.

లక్షన్నర కోర్టు ధిక్కార కేసుల పెండింగ్

కేంద్రం వెల్లడి

న్యూఢిల్లీ: దేశంలోని పలు న్యాయస్థానాల్లో దాదాపు లక్షన్నర కోర్టు ధిక్కార నేరాలకు సంబంధించిన కేసులు పెండింగ్‌లో ఉన్నట్టు కేంద్రం వెల్లడిం చింది. సుప్రీంకోర్టు లో 1,852 కేసులు, వివిధ హైకోర్టుల్లో మరో 1.43 లక్షల కోర్టు ధిక్కార సంబంధిత కేసులు పెండింగ్‌లో ఉన్నాయని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ తెలిపారు. ఈ మేరకు లోక్‌సభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానంలో వివరాలను పేర్కొన్నారు. నేషనల్ జ్యుడీషియల్ డేటా గ్రిడ్ గణాంకాల ప్రకారం.. మార్చి 20 నాటికి సుప్రీంకోర్టులో 1,852 కేసులు పెండింగ్‌లో ఉండగా.. మార్చి 24 నాటికి వివిధ హైకోర్టుల్లో 1,43,573 ధిక్కార నేరాలకు సంబంధించిన కేసులు పెండింగ్‌లో ఉన్నట్టు తెలిపారు.ఆయా కోర్టుల ముందు ఉన్న ధిక్కార కేసుల్లో ఆదేశాలను పాటించకపోవడానికి గల కారణాలేంటో ప్రభుత్వం వద్ద అందుబాటులో లేవని మంత్రి పేర్కొన్నారు.

రెస్టారెంట్లలో సర్వీస్ చార్జీలా..?

ఢిల్లీ హైకోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ: హోటళ్లు, రెస్టారంట్లు ఆహార బిల్లులలో సర్వీస్ చార్జీలను కలిపి వసూలు చేస్తుండడంపై ఢిల్లీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సర్వీస్ ఛార్జీలను వినియోగదారులు కచ్చితంగా చెల్లించేలా బిల్లులో వాటిని కలిపి ఇవ్వడం వారి హక్కులను ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొంది. రకరకాల పేర్లతో చార్జీలు వసూలు చేయడం అన్యాయమైన వ్యాపార విధానాలతో సమానమని మండిపడింది. సర్వీస్ చార్జీలు చెల్లించాలా.. వద్దా..? అనే విషయాన్ని కస్టమర్ల విచక్షణకే వదిలేయాలని సూచించింది.ఈ విధంగా వినియోగదారులపై అదనపు చార్జీలను విధించే రెస్టారంట్లపై తగిన చర్యలు తీసుకోవాలని వినియోగదారుల రక్షణ ప్రాధికార సంస్థకు సూచించింది. హోటళ్ల బిల్లులలో సర్వీస్ చార్జీలు వసూలు చేయడాన్ని నిషేధిస్తూ వినియోగదారుల రక్షణ ప్రాధికార సంస్థ (సీసీపీఏ) గతంలో చేసిన మార్గదర్శకాలను సవాలు చేస్తూ పలు రెస్టారెంట్ సంస్థలు దాఖలు చేసిన పిటిషన్లను కోర్టు కొట్టివేసింది.

నేను మలయాళం నేర్చుకుంటున్నా

వాయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ



వాయనాడ్: తాను మలయాళం నేర్చుకుంటున్నానని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. వాయనాడ్ ఎన్నికల ప్రచారం సమయంలో మాజీ సీఎం ఏకే ఆంటోనీ తనకు ఓ సూచన చేశారని అన్నారు. వాయనాడ్ ప్రజలకు దగ్గరవ్వాలన్నా.. వారి కష్టాలు తెలుసుకోవాలన్నా.. అక్కడి ప్రజల మాత ృభాష నేర్చుకోవాలని ఆయన చెప్పారన్నారు. నాటి నుంచి ఓ టీచర్‌ను పెట్టుకొని మరీ తాను మలయాళం నేర్చుకుంటున్నానని.. ప్రస్తుతం కొంత వరకు మాట్లాడగలుగుతున్నానని తెలిపారు .వాయనాడ్‌లోని వడక్కనాడ్ ప్రాంతంలోని గిరిజన స్థావరంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆమె పాల్గొని, ప్రసంగించారు. తన నానమ్మ, దివంగత ప్రధాని ఇందిరా గాంధీకి గిరిజన సమాజం పట్ల ఎంతో గౌరవం ఉండేదని గుర్తు చేసుకున్నారు. గిరిజనలు పాటించే సామరస్య జీవన విధానం, అడవికి ఇచ్చే గౌరవం గురించి ఆమె తరచూ తమకు చెప్పేవారన్నారు. గిరిజనులను కలిసినప్పుడు వారు ఏదైనా బహుమతి ఇస్తే.. దాన్ని ఎంతో జాగ్రత్తగా ఆమె దాచుకునే వారని చెప్పారు. ప్రస్తుతం మ్యూజియంగా ఉన్న ఆమె ఇంటిని సందర్శిస్తే నేటికీ అటువంటి ఎన్నో వస్తువులను అక్కడ చూడొచ్చని పేర్కొన్నారు. వాయనాడ్ ప్రజలు ప్రధానంగా ఎదుర్కొంటున్న తాగునీరు, రోడ్డు సమస్యలను పరిష్కరించడానికి నిధులు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నానని ప్రియాంక అన్నారు. ఈ సమస్యలపై మరోసారి సంబంధిత మంత్రులను కలిసి సమస్య పరిష్కారానికి క ృషి చేస్తానని హామీ ఇచ్చారు. 2024 డిసెంబర్‌లో లోక్‌సభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో వాయనాడ్ నుంచి ఆమె భారీ మెజారిటీతో విజయం సాధించిన విషయం తెలిసిందే.

సర్దుబాటు చార్జీలు, స్మార్ట్ మీటర్లపై జనాగ్రహం

రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, నిరసనలు

విద్యుత్ బిల్లుల దహనం

విద్యుత్ సంస్కరణలను రద్దు చేయాలి : వి శ్రీనివాసరావు



విజయవాడ: విద్యుత్ స్మార్ట్ మీటర్లు, ట్రూఅప్ చార్జీలపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు సీపీఐ(ఎం)ఏపీ ఆధ్వర్యాన విద్యుత్ సబ్‌స్టేషన్లు, గ్రామ, వార్డు, సచివాలయాల ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. విద్యుత్ బిల్లులను దహనం చేసి నిరసన తెలిపారు. అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం పేరూరు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నాలో సీపీఐ(ఎం)ఏపీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల ద్వారా అదనపు బిల్లులు వేసే ప్రమాదకరమైన విధానాన్ని తీసుకొస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యుత్ చట్టానికి సవరణలు చేసి విద్యుత్ రంగాన్ని అదాని, మరికొంత మంది కార్పొరేట్లకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వమూ కార్పొరేట్లకు పూర్తిగా లొంగిపోయిందన్నారు. భవిష్యత్తులో విద్యుత్ రంగం పూర్తిగా కార్పొరేట్ల కబంధ హస్తాల్లోకి వెళ్లిపోనుందని, దీనివల్ల విద్యుత్ చార్జీలు మరింతగా భారమయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రమాదకరమైన విద్యుత్ సంస్కరణలను రద్దు చేయాలని, విద్యుత్ రంగం ప్రయివేటీకరణను ఆపాలని, విద్యుత్ చట్ట సవరణ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ప్రమాదకర విధానాలపై ప్రజలందరూ ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరామ్, రాష్ట్ర కమిటీ సభ్యులు అంద్ర మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని విద్యుత్ భవన్ వద్ద ధర్నా చేశారు. సెకీ ఒప్పందం రద్దు చేయాలని నినదించారు. కర్నూలులోని విద్యుత్ సౌధ వద్ద ధర్నాలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ట్రూ అప్ సర్దుబాటు పేరుతో వేస్తున్న భారాలను ఆపకపోతే మరో విద్యుత్ పోరాటాన్ని చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రజలపై భారాలు మోపిన, అవినీతికరమైన సెకీ ఒప్పందాన్ని కొనసాగించడం శోచనీయమన్నారు. ఆదోని, కౌతాళం, హాలహర్వి పత్తికొండలలో నిరసన తెలిపారు. నంద్యాల, ఆత్మకూరు, నందికొట్కూరు, డోన్‌లో ధర్నా చేశారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో విద్యుత్ భవన్ వద్ద నిరసన తెలిపారు. అనంత పురంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసనలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల పెంపుపై ఎన్నికల ముందు ఒకలా, అధికారంలోకి వచ్చాక మరోలా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో తహశీల్దార్ కార్యాలయాలు, విద్యుత్ కార్యాలయాల వద్ద ధర్నా చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలం కన్నయ్యగూడ గ్రామంలో విద్యుత్తు బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ ప్రజలపై భారాలు వేయబోమని నమ్మించి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ట్రూఅప్ చార్జీల పేరిట భారాలు వేస్తున్నారని వివరించారు. సాలూరు, పాలకొండ, బలిజిపేట, విజయనగరంలోని ప్రాంతీయ విద్యుత్తు కార్యాలయం వద్ద, చీపురుపల్లిలో సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిరసన తెలిపారు. అనకాపల్లిలో ఆర్‌టిసి కాంప్లెక్స్ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందార్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లోనే రూ.15,485 కోట్ల విద్యుత్ భారాలను ప్రజలపై మోపిందన్నారు. అల్లూరి జిల్లా అరకులోయలో విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. విశాఖ జిల్లాలో మల్కాపురం, కంచరపాలెం, సీతమ్మధార, గాజువాక, పెదగంట్యాడ, పెందుర్తి, తగరపువలస, ఆరిలోవ, మధురవాడ, జగదాంబ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద విద్యుత్ బిల్లులను దహనం చేశారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేశారు. తాడేపల్లిగూడెం, ఉండి, గణపవరం, వీరవాసరం, తణుకు మండలం వేల్పూరు, పాలకోడేరు, మొగల్లు, విస్సాకోడేరుల్లో సచివాలయాల వద్ద, నరసాపురం, పాలకొల్లు, యలమంచిలి, ఆకివీడు, ఆచంట, కాళ్ల, ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో సబ్‌స్టేషన్ల వద్ద నిరసన తెలిపారు.

గుంటూరులోని గుజ్జనగుండ్ల విద్యుత్ ఎఇ కార్యాలయం వద్ద; మంగళగిరిలో ఎడిఎ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. తాడేపల్లి; నరసరావుపేట; తెనాలిల్లో విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద, నిరసన తెలిపారు. వైఎస్ఆర్ జిల్లా కడపలో విద్యుత్ భవన్ ఎదుట, అన్నమయ్య జిల్లా మదనపల్లెలో విద్యుత్ ఇఇ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. తిరుపతి జిల్లా రేణిగుంటలో విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి విద్యుత్ బిల్లులను దహనం చేశారు. వెంకటగిరిలో సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. కృష్ణా జిల్లా మచిలీపట్నం, ఉయ్యూరు, అవనిగడ్డ, గుడివాడ, మొవ్వ, గూడూరు, గన్నవరం, చల్లపల్లి, కంకిపాడు, మోపిదేవి మండలాల్లో, ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట, విసన్నపేట, మైలవరం, రెడ్డిగూడెం, తిరువూరు మండలాల్లో నిరసనలు తెలిపారు. నెల్లూరు జిల్లా గుడ్లూరులో విద్యుత్ కార్యాలయం, శ్రీకాకుళం జిల్లాలో శ్రీకాకుళం, ఎచ్చెర్ల, టెక్కలి, కొత్తూరు మండలాల్లో విద్యుత్ కార్యాలయాల వద్ద ధర్నా చేశారు.

నేడు టీజీసెట్ ఫలితాలు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ గురుకుల కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (టీజీసెట్) ఫలితాలను శనివారం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయనుంది. ఈ మేరకు టీజీసెట్ చీఫ్ కన్వీనర్ వీఎస్ అలుగు వర్షిణీ ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో (టీజీడబ్ల్యూఆర్ఈఐఎస్, టీజీటీడబ్ల్యూఆర్ఈఐఎస్, టీజీఎంజేబీపీడబ్ల్యూఆర్ఈఐఎస్, టీజీఆర్ఈఎస్) ఐదో తరగతిలో ప్రవేశం కోసం గతనెల 23న రాష్ట్ర వ్యాప్తంగా ప్రవేశ పరీక్షను నిర్వహించామని పేర్కొన్నారు. ఇందులో ప్రత్యేక కేటగిరీకి చెందిన వికలాంగులు (పీహెచ్‌సీ), ఆర్ఫన్ (అనాథలు), ఫిషర్‌మన్ (మత్స్య కార్మికులు) మైనార్టీ, సీఏపీ, ఈడబ్ల్యూఎస్, ఏఈక్యూ, ఏజెన్సీ ప్రాంతం, ఎంబీసీ కేటగిరీకి చెందిన ప్రవేశ పరీక్షా ఫలితాలను శనివారం సాయంత్రం విడుదల చేస్తామని తెలిపారు. మిగతా కేటగిరీలకు చెందిన ఫలితాలను వచ్చేనెల ఐదో తేదీలోపు వెల్లడిస్తామని వివరించారు.

టెన్త్ పరీక్షల్లో ఐదుగురు ఇన్విజిలేటర్ల తొలగింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పదోతరగతి వార్షిక పరీక్షల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన సైన్స్ పార్ట్-1 (ఫిజికల్ సైన్స్) సబ్జెక్టు పరీక్షను నిర్వహించామని ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 4,97,867 మంది రెగ్యులర్ విద్యార్థులు దరఖాస్తు చేశారనీ, 4,96,576 (99.74 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. రెగ్యులర్ విద్యార్థుల్లో 1,291 (0.26 శాతం) మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. ప్రయివేటు విద్యార్థులు 6,958 మంది దరఖాస్తు చేశారనీ, 6,026 మంది పరీక్ష రాశారని తెలిపారు. 932 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. రెగ్యులర్, ప్రయివేటు విద్యార్థులు కలిపి 2,223 మంది పరీక్షకు హాజరు కాలేదని వివరించారు. రాష్ట్రంలో ఒక్క విద్యార్థిపై కూడా మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఐదుగురు ఇన్విజిలేటర్లను విధుల నుంచి తొలగించామని పేర్కొన్నారు. ఈ పరీక్షను ప్రశాంతంగా నిర్వహించామని తెలిపారు.

23 జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక

వచ్చే మూడ్రోజులు 2 నుంచి డిగ్రీల ఉష్ణోగ్రత పెరుగుదల

40 నుంచి 44 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో 23 జిల్లాలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఆరెంజ్ హెచ్చరికను జారీ చేసింది. రాష్ట్రంలో వచ్చే మూడు రోజుల పాటు పగటిపూట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు అధికంగా పెరిగే సూచనలున్నాయనీ, గరిష్ట ఉష్ణోగ్రతలు 40 నుంచి 44 డిగ్రీల మేర నమోదయ్యే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న ప్రకటించారు. ఆరెంజ్ హెచ్చరిక జాబితాలో ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, నిర్మల్, కొమ్రంభీమ్ అసిఫాబాద్, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్, రాజన్నసిరిసిల్ల, సిద్దిపేట, జయశంకర్‌భూపాలపల్లి, ములుగు, వరంగల్, హన్మకొండ, జనగామ, జోగులాంబ గద్వాల, ఖమ్మం, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నల్లగొండ, నారాయణపేట, సూర్యాపేట, వనపర్తి ఉన్నాయి.

ఆదిలాబాద్	41 డిగ్రీలు
నిజామాబాద్	40.6 డిగ్రీలు
రామగుండం	40.2 డిగ్రీలు
భద్రాచలం	40.2 డిగ్రీలు
మహబూబ్‌నగర్	40.0 డిగ్రీలు
ఖమ్మం	39.5 డిగ్రీలు

అమీన్‌పూర్‌లో దారుణం

పెరుగు అన్నం తిని ముగ్గురు పిల్లలు మృతి

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తల్లి

ఫుడ్ పాయిజనా..? విష ప్రయోగమా?

దర్యాప్తు చేస్తున్న పోలీసులు



నవతెలంగాణ-అమీన్‌పూర్

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో దారుణం జరిగింది. పెరుగుతో అన్నం తిని ముగ్గురు పిల్లలు మృతి చెందగా.. వారి తల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నది. అయితే కుటుంబ కలహాలతో ఆ తల్లే విషం కలిపిందా..? లేక ఫుడ్ పాయిజన్ అయిందా..? లేదా మరేమైనా కారణం ఉందా తెలియాల్సి ఉంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లోని రాఘవేంద్రకాలనీలో చెన్నయ్య, రజిత దంపతులు అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. చెన్నయ్య వాటర్ ట్యాంకర్ నడుపుతుండగా, రజిత ప్రయివేటు స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తోంది.

వీరికి కూతుర్లు, ఒక కొడుకు సాయికృష్ణ (12), మధుప్రియ (10), గౌతమ్ (8) ఉన్నారు. అయితే గురువారం రాత్రి రజిత, ముగ్గురు పిల్లలు పెరుగన్నం తినగా.. భర్త చెన్నయ్య పప్పన్నంతో భోజనం చేసి వాటర్ ట్యాంక్ ట్రాక్టర్‌తో చందానగర్‌కు వెళ్లాడు. రాత్రి 11 గంటలకు తిరిగి ఇంటికొచ్చేసరికి ముగ్గురు పిల్లలు, భార్య పడుకొని ఉన్నారు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో రజిత తీవ్ర కడుపు నొప్పితో బాధపడుతుండటంతో.. చెన్నయ్య వెంటనే ఇరుగుపొరుగు వారిని పిలిచి స్థానికంగా ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. ఇంట్లో పిల్లల గురించి ఆరా తీయగా, ముగ్గురు పిల్లలు అప్పటికే మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసకుని దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న రజిత పోలీసులకు వాంగ్మూలం ఇచ్చింది. ఇంటికి సమీపంలో ఉన్న దుకాణంలో కొనుగోలు చేసిన పెరుగు కలుపుకుని అన్నం తింటుండగా స్పృహ కోల్పోయినట్టు పోలీసులకు తెలిపింది. తర్వాత ఏమి జరిగిందో తెలియదని చెప్పడంతో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. రజిత ఆత్మహత్యాయత్నం చేసిందా, ఏదైనా కుట్ర ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఘటనా స్థలాన్ని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరతోష్ పంకజ్ పరిశీలించారు. ఆయన వెంట పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీఐ నరేష్ ఉన్నారు.

మహిళను హతమార్చి.. డిక్కీలో కుక్కి

కాలువలో పడేసేందుకు వెళ్తుండగా.. పట్టుకున్న పోలీసులు

నిజామాబాద్‌లో ఘటన



నవతెలంగాణ-కంఠేశ్వర్

ఓ మహిళను దారుణంగా హతమార్చి.. కారు డిక్కీలో కుక్కి కాలువలో పడేసేందుకు వెళ్తుండగా.. పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన నిజామాబాద్ నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ వద్ద శుక్రవారం జరిగింది. నిజామాబాద్ రూరల్ ప్రాంతానికి చెందిన కమలను(50).. కంఠేశ్వర్ బైపాస్ రోడ్డులోని డీమార్ట్ షాపింగ్‌మాల్ వెనుక హతమార్చినట్టు సమాచారం. ఆ తర్వాత మహిళ మృతదేహాన్ని నగర శివారులోని దాస్‌నగర్ వద్ద ఉన్న కాలువలో పడేసేందుకు కారు డిక్కీలో వేసుకొని వెళ్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు వాహన తనిఖీ చేపట్టగా.. కారు ఆపకుండా తప్పించుకొని వెళ్ళారు. అనంతరం ఆ మృతదేహాన్ని కాలువలో పడేసే క్రమంలో పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. ఘటనా స్థలానికి సౌత్ రూరల్ సీఐ సురేష్ కుమార్, ఎస్ఐ ఆరీఫ్ చేరుకొని విచారణ చేపట్టారు. హత్యకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. లైంగికదాడి చేసి హత్య చేశారా..? ఇంకేదైనా కారణమా..? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వస్పత్రికి తరలించారు. కాగా విచారణ పూర్తయిన అనంతరం వివరాలు వెల్లడిస్తామని పోలీసులు చెబుతున్నారు.